www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
పేజీలు: 18 + 28

శుక్రవారం | 16-3-2018 | వెల: రూ.5.00 | సంపుటి: 58 సంచిక: 330 | శ్రీహేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: చతుర్దశి సా. 6.18 తదుపరి అమావాస్య; నక్షత్రం: శతభిషం రా. 6.45 తదుపరి పూర్వాభాద్ర; వర్జ్యం: రా. 1.24-3.04; దుర్ముహూర్తం: ఉ. 8.50-9.38, మ. 12.48-1.36; అమృతఘడియలు: ఉ. 11.05-12.47; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.27; సూర్యాస్తమయం: 6.22 | హైదరాబాద్ సిటీ

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai

ఈటల వారి పద్దు పొడుపు

అసెంబ్లీ ఎన్నికలకు ఏడాది ముందు టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆఖరు పూర్తి స్థాయి బడ్జెట్ - సకల జనుల ఆశలు, ఆకాంక్షలకు చాలా వరకు అద్దం పట్టింది. ముఖ్యంగా రాష్ట్ర రైతు లోకానికి ఇది సరికొత్త 'పద్దు' పొడుపు. సాగు, నీటిపారుదల, విద్యుత్తు రంగాలకు కేటాయింపులను భారీగా పెంచడం ద్వారా రైతన్నల బతుకుల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం ప్రయత్నించింది. కేసీఆర్ ఎత్తుకున్న సంక్షేమ అజెండాకు కొరత రానీయకుండా... అదే సమయంలో అభివృద్ధి చక్రం ఆగకుండా... గురువారం శాసనసభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ ఈ అవధానంలో విజయం సాధించారు. 1.74 లక్షల కోట్ల బడ్జెట్లో ప్రగతి పద్దుకు ఏకంగా 1.04 లక్షల కోట్లు కేటాయించారు. అందులో రూ.45 వేల కోట్లు రైతులకు సంబంధించినవే. వ్యవసాయానికి రూ.15 వేల కోట్లు, సాగునీటికి రూ.25 వేల కోట్లు, విద్యుత్తుకు రూ.5650 కోట్లు ఇచ్చారు. రైతులకు పెట్టుబడి సాయం కోసం 12 వేల కోట్లు, 5 లక్షల బీమా కోసం రూ.500 కోట్లు కేటాయించారు.

ప్రత్యేక కథనాలు 13, 14, 15 పేజీల్లో..

రైతుకు ఉగాది

షడ్రుచులు!

తీపి
సేద్యానికి రూ.15,061 కోట్లు
చరిత్రలో తొలిసారి అత్యధిక కేటాయింపు

చేదు
విద్యకు రూ.13,278 కోట్లు
జీతభత్యాలు, నిర్వహణకే సరి.

పులుపు
బీసీలకు రూ.5,920 కోట్లు
ప్రత్యేక ప్రగతి నిధి ప్రస్తావనే లేదు

కారం
పన్ను పిండుడు 73,752 కోట్లు
నాలుగేళ్లలో రెట్టింపైన వసూళ్లు

వగరు
అప్పు 1.80 లక్షల కోట్లు
మే బాకీ రూ.51,145

ఉప్పు
మహిళా, శిశు సంక్షేమానికి రూ.1,890 కోట్లు
కేటాయింపు పెరగలేదు
అంగన్వాడీలకు
మొండిచేయి



సంక్షేమానికీ పండుగ

రూ.1,74,453 కోట్లతో రాష్ట్ర బడ్జెట్

నాలుగో వంతు సాగుకే

వ్యవసాయం, సాగునీరు, విద్యుత్తుకు రూ.45 వేల కోట్లు

పెట్టుబడికి 12 వేల కోట్లు.. రైతు బీమాకు రూ.500 కోట్లు

సంక్షేమానికి రూ.45,479 కోట్లు

» ఆర్థిక సర్వే ఏం చెప్పిందంటే...

పూర్తయిన డబుల్ బెడ్‌రూంలు 5,824
2.72 లక్షల ఇళ్లు మంజూరు.. ఈసారి బడ్జెట్‌లో రూ. 2,643 కోట్లు

తలసరిలో రారాజు రంగారెడ్డి!
ఆ తర్వాతే హైదరాబాద్ జిల్లా.. తెలంగాణ ఆదాయం పెరుగుతోంది

దూసుకుపోతున్న పారిశ్రామికం
ఎంఎస్ఎంఈల్లో లక్షల మందికి ఉపాధి.. 40 వేల కోట్ల ఎగుమతులు

ఆహార ధాన్యాల సాగు తగ్గుతోంది
నూనె గింజల దిగుబడి కూడా.. పెరిగిన పత్తి విస్తీర్ణం, దిగుబడి

- మిషన్ కాకతీయతో పల్లె బతుకులు ఎంతో బాగుపడ్డాయి
- ఆరోగ్యంపై శ్రద్ధ బాగుంది!.. ముందే రోగాలను గుర్తిస్తున్నారు
- 1,10,012 ఉద్యోగాలు ఖాళీ.. భర్తీ చేసినవి 27,588

మిషన్ ఇరిగేషన్: ప్రాజెక్టులకు 25 వేల కోట్లు కేటాయింపు

మిషన్ ఆలయం: దేవాలయాల అభివృద్ధికి 550 కోట్లు

మిషన్ ప్రజారోగ్యం: 7,375 కోట్లు.. ఆరోగ్యశ్రీకి 530 కోట్లు

మిషన్ కేసీఆర్: ఎస్డీఎఫ్ మూడింతలు.. సీఎం వద్ద 2,264 కోట్లు

మిషన్ కల్యాణం: 1450 కోట్లు.. ఎన్నడూ లేనంత కేటాయింపు

మిషన్ దళితులు: ఎస్సీ, ఎస్టీల కోసం 45 వేల కోట్లు

ఐదోసారి బడ్జెట్ ప్రవేశపెట్టిన మంత్రి ఈటల

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఏరువాకకు వెళ్లే ముందు పెట్టుబడి సాయం! ఆ వెంటనే విత్తనాలు, ఎరువులు సిద్ధం! పంట దారి పట్టేందుకు చెరువుల్లో నీరు.. ప్రాజెక్టులకు నిధులు! పంట పండిన తర్వాత మార్కెటింగ్‌కు ఏర్పాట్లు! ఎన్నికల ముందు, చివరి, ఐదో బడ్జెట్లో తెలంగాణ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేసింది. పెట్టుబడి సాయం పేరిట సాగుకు భరోసా కల్పించింది. దురదృష్టకర పరిస్థితులు ఎదురైతే బీమా పేరిట ధీమా నింపింది. కూలీల కొరతను

మిగతా 2వ పేజీలో...



బడ్జెట్ సూట్‌కేసుతో సీఎం కేసీఆర్, ఆర్థిక మంత్రి ఈటల

సంక్షేమ, సమగ్రాభివృద్ధి బడ్జెట్

బడ్జెట్ అన్నివర్గాల సంక్షేమం, సమగ్రాభివృద్ధి మేళవింపుగా ఉంది. నీటిపారుదల, పంట పెట్టుబడి సహాయ పథకం, విద్యుత్ సబ్సిడీలకు గల భారీ కేటాయింపులతో వ్యవసాయ రంగం మరింత పురోగమిస్తుంది.

-ముఖ్యమంత్రి కేసీఆర్

ఎన్నో మైలు రాళ్లు

45 నెలల స్వల్ప కాలంలోనే ఎన్నో అద్భుతాలను ఆవిష్కరించాం. చీకట్ల నుంచి వెలుగులోకి.. అపనమ్మక స్థితి నుంచి ఆత్మవిశ్వాసంతో తొణికిసలాడే స్థాయికి.. అణగారిన స్థితి నుంచి అభ్యున్నతిలోకి... వలసల నుంచి సాగులో ప్రగతి పథం దిశగా ఎన్నో మైలు రాళ్లను దాటాం.

-ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్

బ్యాంక్ పూచీకత్తు 10%కి తగ్గింపు! 5
మార్కెట్లలో 50 వేల పూచీకత్తు

మోదీ... మీకు భయపడాలా?

ఇవ్వాల్సినవి అడిగితే దాడి చేస్తారా?: బాబు



మీ ఆటలు మా దగ్గర సాగవు.. తమిళనాడులా జోక్యమా?

రెచ్చగొట్టి పంపిస్తారా?.. కేసులున్న వాళ్లే మీ చెప్పుచేతల్లోకి

ఎన్డీయే సర్కారుకు ఇదే హెచ్చరిక.. భయపడం... రెచ్చిపోతాం

వైసీపీని నమ్మితే తాకట్టే.. వారివి నాటకాలు, చీకటి ఒప్పందాలు

పవన్.. నాపై విమర్శలా?.. అవినీతి ఇప్పుడే కనిపించిందా?

మాపై మహా కుట్ర జరుగుతోంది.. ఏపీ సీఎం నిప్పులు

అమరావతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆటలు ఇకసాగవని ముఖ్యమంత్రి చంద్రబాబు తేల్చి చెప్పారు. తనకు నలభై ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని... ప్రజల అండ ఉన్నంత వరకూ ఎవ్వరికీ భయపడాల్సిన అవసరమే లేదని ఉద్ఘాటించారు. మోదీకీ, కేంద్ర ప్రభుత్వానికి భయపడే ప్రసక్తే లేదని తెలిపారు. మొట్టమొదటిసారిగా బహిరంగ వేదికపై నుంచి మోదీపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గురువారం ఆయన విజయవాడలో 'ఆదరణ' పథకాన్ని ప్రారంభించారు. బీసీల అభ్యున్నతి

మిగతా 16వ పేజీలో...


కోమటిరెడ్డి, సంపత్ దీక్ష విరమణ

మా సభ్యత్వాల రద్దు రాజ్యాంగ విరుద్ధం

గవర్నర్ ప్రసంగం వేరు- సభా వ్యవహారాలు వేరు

చర్య తీసుకొనే హక్కు అసలు స్పీకర్‌కు లేదు

గెజిట్ నోటిఫికేషన్ జారీ ఎన్నడూ లేనిది 2

వివరణ తీసుకోకుండానే చర్యతో హక్కులకు భంగం

హైకోర్టును ఆశ్రయించిన కోమటిరెడ్డి, సంపత్



కోటా పెంపునకు మా మద్దతు ఉంది 5

పెంచే అధికారం రాష్ట్రాలకు ఇవ్వవచ్చు

కేంద్ర మంత్రి విజయ్ సాంప్లా వెల్లడి

రాష్ట్రానికి కేంద్ర గిరిజన శాఖ బాసట

9వ రోజూ టీఆర్ఎస్ ఎంపీల ఆందోళన

రిజర్వేషన్ అంశంపై దద్దరిల్లిన లోక్‌సభ

స్పీకర్ మైక్ వద్దకు వెళ్లి కవిత నినాదాలు

ఈహెచ్ఎస్ యథాతథం 2

ఆరోగ్యశ్రీలో కలపాలన్న ఆలోచనే లేదు

ఉద్యోగ, జర్నలిస్టులకు ఆందోళన వద్దు

వదంతులను నమ్మవద్దు: మంత్రి లక్ష్మారెడ్డి

కేబినెట్లో అలాంటి నిర్ణయమే జరగలేదు

సిబ్బంది నియామకంపైనే చర్చ: సీఎంవో

యూపీఏ.. కొత్తగా!


శరద్‌పవార్‌తో రాహుల్ (ఫైల్)

సంధానకర్తగా మారిన శరద్ పవార్

ఆయనతో రాహుల్‌గాంధీ మంతనాలు

తదుపరి మమతా బెనర్జీతో సమావేశం

రాష్ట్రాల వారీగా కాంగ్రెస్ ఒప్పందాలు

28న పవార్ సారథ్యంలో విపక్షాల భేటీ

కేసీఆర్‌నూ పిలుస్తాం: ఎన్సీపీ వర్గాలు

న్యూఢిల్లీ, మార్చి 15: ఉత్తరప్రదేశ్, బిహార్ ఉప ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్‌లో ఆశలను పెంచాయి. అందుకే ఈ ఎన్నికల్లో తమ అభ్యర్థులు ధరావత్తును కోల్పోయారన్న వాస్తవాన్ని పక్కనపెట్టి, జాతీయ స్థాయిలో బీజేపీకి వ్యతిరేకంగా కూటమి నిర్మాణాన్ని వేగవంతం చేయాలని నిశ్చయించింది. ఈ దిశగా సోనియాగాంధీ ఇటీవల నిర్వహించిన విందు సమావేశానికి ఎవరెవరు వచ్చారు, ఎలా స్పందించారన్నది స్పష్టంగా అవగతమయ్యాక కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ రంగంలోకి దిగారు. ఉపఎన్నికల ఫలితాలు వెలువడిన కొద్ది గంటలకే ఆయన నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) చీఫ్

మిగతా 2వ పేజీలో...

చంద్రబాబు సారథ్యంలో ఫెడరల్ ఫ్రంట్?

రిపబ్లిక్ టీవీ కథనాలు

పార్లమెంటులో ఎంపీల చర్చ

ఎన్డీయే నుంచి నేడు బయటకు



కమలం వాడింది పొగరు అణిగింది 2

కాంగ్రెస్‌తో పొత్తు మేలే!

కానీ ఇప్పుడే చెప్పలేం: అఖిలేశ్

ముందస్తు వస్తుందేమో: మాయ

బీజేపీ మునుగుతోంది: నవీన్



సీత నోట 'నేతి' మాట

పరమాత్మ మనసుకు, మాటలకు అందనివాడు. 'యం వర్ణయితుం సాక్షాత్ శ్రుతిరపి మూకేవ మౌనమాచరతి' అన్నారు ఆదిశంకరులు. అనగా వేదం కూడా పరమాత్మని ప్రత్యక్షంగా వర్ణించలేక మూగదానివలె మౌనం వహించిందట. అయినా, పరోక్షంగా నిరూపించి నిర్వచించే ప్రయత్నం చేసింది. ఈ పద్ధతికి 'అతద్వ్యా వృత్తి' అని పేరు. బంగారు గనుల్లో స్వర్ణ రేణువులు రాయిరప్పలతో ఇతర ధాతువులతో కలిసి ఉంటాయి. ఆ రాళ్లను అగ్నిలో పుటం పెట్టి కరిగించి స్వర్ణకారులు దానిలోంచి బంగారం వేరు చేస్తారు. అదే పద్ధతిలో.. 'నేతి నేతి (న ఇతి-న ఇతి..)'.. అంటే 'ఇది ఆత్మ కాదు.. ఇది ఆత్మ కాదు' అని వేరు చేస్తూ దేహ, ఇంద్రియాది సర్వ జడ (దృశ్య) పదార్థాలనూ నిషేధించగా శేషించే చైతన్యమే సత్యమైన ఆత్మవస్తువు. రామచరిత్రలో వనవాసకాలంలో జరిగిన ఘటన 'అతద్వ్యా వృత్తి'కి సరసమైన, సుగమమైన దృష్టాంతం. రామచంద్రుడు సీతాలక్ష్మణ సమేతుడై దండకారణ్యంలో ప్రవేశించాడు. ఎందరో మహర్షులు శ్రద్ధాభక్తులతో ఆయన్ను స్వాగతించారు. తాపస రూపంలో ఉన్న సోదరులిద్దరూ మహర్షుల వెంట నడవగా.. సీత రుషి పత్నులతో ఆశ్రమానికి వచ్చింది. ఇంతలో ఒక పెద్ద ముత్తైదువ రామదర్శనానికి అక్కడికి వచ్చి సీత వద్దకు చేరుకుని ఆతురతతో.. 'అమ్మా, ఈ రుషులలో నీ భర్త ఎవరో చెప్పవా' అని కోరింది. జానకి చెప్పడానికి సిగ్గపడగా.. ఒక్కొక్క రుషినీ చూపుతూ ఆయనేనా రాముడు? ఆయనేనా? అని అడుగుతూ వచ్చింది. సీత ఒక్కొక్కరినీ చూసి 'నేతి నేతి (కాదు.. కాదు)' అంటూ వచ్చింది. చివరికి ఆమె... "పక్కనే కూర్చున్న దూర్వాదళ శ్యాముడా నీ దేవుడు' అని ప్రశ్నించగా తల వంచి ఓరచూపులతో చెప్పకనే చెప్పింది సీతమ్మ తల్లి.

-తంగిరాల రాజేంద్రప్రసాద్ శర్మ



Paramjyothi పరంజ్యోతి

కమలం వాడింది.. పొగరు అణిగింది

- కాంగ్రెస్‌తో పొత్తు మేలేగానీ.. ఇప్పుడే చెప్పలేం: అఖిలేశ్
- బీజేపీ వేగంగా మునుగుతోంది: నవీన్ పట్నాయక్



ముంబై, లఖ్‌నవ్, పట్నా, మార్చి15: 'యూపీ, బిహార్ ఉప ఎన్నికల ఫలితాలతో కమలం వాడిపోయింది.. ఆ పార్టీ పొగరు పూర్తిగా అణిగింది' అని సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ వ్యాఖ్యానించారు. గోరఖ్‌పూర్, ఫుల్‌పూర్ ఉప ఎన్నికల్లో విజయాలతో జోరుమీదున్న ఆయన పలు అంశాలపై మాట్లాడారు. దేశంలో ముమ్మందు చోటుచేసుకునే రాజకీయపరిణామాలపరంగా ఈ ఫలితాలు గొప్ప సందేశాన్ని ఇచ్చాయని.. ప్రజల తీర్పుతో బీజేపీ భాషలోనూ మార్పు వస్తుందని పేర్కొన్నారు. పాలక బీజేపీపై ప్రజాగ్రహాన్ని ఈవీఎంలు పూర్తిగా చాటలేదని, వాటిలో కొన్నింటిలో లోపాలు బయటపడ్డాయని అఖిలేశ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. బ్యాలెట్ పత్రాలతో పోల్స్ నిర్వహిస్తే.. ఎస్పీ విజయం మరింత గొప్పగా ఉండేదన్నారు. కాంగ్రెస్‌తో పొత్తును కొనసాగించడం తమకు మేలు చేస్తుందని, అయితే.. 2019 ఎన్నికల కోసం ఆ పార్టీతో పొత్తు ఉంటుందా లేదా అనే విషయాన్ని ఇప్పుడే చెప్పలేమన్నారు. బీఎస్పీతో గతంలో ఉన్న బేధాభిప్రాయాలను తొలగించుకొని ముందుకు సాగాల్సి ఉంటుందన్నారు. మరోవైపు.. బీజేపీ చాలా వేగంగా మునిగిపోతోందని ఒడిశా సీఎం, బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్ వ్యాఖ్యానించారు. ఇక, 2019 ఎన్నికలకు సిద్ధమవుతున్న వేళ బీజేపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలిందని శివసేన తమ పత్రిక 'సామ్నా'లో పేర్కొంది. అధికార పార్టీపై ఉన్న భ్రమల నుంచి ప్రజలు బయటపడుతున్నారని, తాము మోసపోయామనే వాస్తవాన్ని వారు గ్రహిస్తున్నారని రాసింది. రాహుల్‌గాంధీ చరిష్మా ముమ్మందు పెరగవచ్చునని అభిప్రాయపడింది. 2019 ఎన్నికల తర్వాత ప్రధాని రేసులో శరద్ పవార్, మమతా బెనర్జీ, మాయావతి ఉంటారని పేర్కొంది. యూపీ ఉప ఎన్నికల ఫలితాలతో కంగుతిన్న బీజేపీ.. గడువుకన్నా ముందే సార్వత్రిక ఎన్నికలకు వెళుతుందేమోనని బీఎస్పీ అధినేత్రి మాయావతి వ్యాఖ్యానించారు. కాగా బిహార్ ఉప ఎన్నికల్లో జేడీయూ-బీజేపీ కూటమి ఓటమి పాలైనందున ముఖ్యమంత్రి పదవికి నితీశ్‌కుమార్ రాజీనామా చేయాలని ప్రతిపక్ష ఆర్జేడీ డిమాండ్ చేసింది. మరోవైపు యూపీలో జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ ఓటమిపాలైనా.. 2019 పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ సత్తా చాటుతుందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అన్నారు. ఈ ఫలితాలు తమకు ఓ గుణపాఠమన్నారు.

యూపీఏ.. కొత్తగా!

(మొదటిపేజీ తరువాయి..)

శరద్ పవార్‌ను కలిశారు. ఆయన కుమార్తె, ఎంపీ సుప్రియా సూలే ఇంట్లో ఈ భేటీ జరిగింది. ఉప ఎన్నికల ఫలితాలతో పాటు జాతీయ స్థాయిలో బీజేపీకి వ్యతిరేకంగా ఓ ఐక్య కూటమిని కూర్చడానికి తీసుకోవాల్సిన చర్యలపైనా, బీజేపీని రాష్ట్రాలవారీగా అడ్డుకునే వ్యూహంపైనా ఇద్దరూ చర్చించినట్లు సమాచారం. బీజేపీకి ఎదురుగాలి వీస్తోందనడానికి ఉప ఎన్నికల ఫలితాలే సంకేతమని, ఇదే ఊపులో ప్రతిపక్ష పార్టీలన్నీ యునైటెడ్ ఫ్రంట్‌గా ఏకం కావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రాహుల్, పవార్ ఓ అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ మేరకు 28న పవార్ సారథ్యంలో ప్రతిపక్ష పార్టీల సమావేశం జరగనుంది. పవారే దీనికి చొరవచూపడం విశేషం. భావసారూప్యం గల అన్ని పార్టీలనూ పవారే సంప్రదిస్తున్నారు. ఒకరకంగా చెప్పాలంటే.. బీజేపీ-వ్యతిరేక ఫ్రంట్ నిర్మాణానికి ఆయనే కేంద్ర బిందువుగా మారారు. ఎన్సీపీ నేత ప్రఫుల్ పటేల్‌ను మమతా బెనర్జీ దగ్గరకు పంపి 28న భేటికి రావాలని కోరారు. సోనియా మీటింగ్‌కు డుమ్మా కొట్టిన మమత.. ఈ భేటీకి మాత్రం హాజరవుతానని మాటిచ్చారు. టీఆర్ఎస్ అధినేత, తెలంగాణ సీఎం కేసీఆర్‌ను కూడా పవార్ ఆహ్వానించవచ్చని ఎన్సీపీ వర్గాలు తెలిపాయి. ఆ సమావేశంలో ఐక్య కూటమి ఏర్పాటుపై నిర్దిష్ట కార్యాచరణ ఉండాలని రాహుల్-పవార్ భావిస్తున్నారు. అంతేకాక.. ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రంలో వ్యూహాలుండాలని, ప్రాంతీయ పార్టీలను కలుపుకొనిపోవడానికి ఇదే మార్గమని వారు ఓ అభిప్రాయానికొచ్చినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.

మమత కూడా..


ఈ నెల 28న జరిగే ప్రతిపక్షాల సమావేశంలోనే.. టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీతో రాహుల్ భేటీ కానున్నారు. మమత కూడా బీజేపీకి వ్యతిరేకంగా ఓ ఫ్రంట్ ఏర్పడాలన్న ఆలోచనలోనే ఉన్నారు. కాంగ్రెసేతర, బీజేపీయేతర కూటమి నిర్మిస్తానని కేసీఆర్ చెప్పగానే మొదట మద్దతు పలికినది మమతే. కాంగ్రెస్ సారథ్య ఫ్రంట్‌లో చేరడానికి ఆమెకున్న అడ్డంకల్లా అందులో లెఫ్ట్ పార్టీలుండడం. దీన్ని పరిష్కరించడానికే రాహుల్ పవార్‌ను సంప్రదిస్తున్నారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ఫ్రంట్‌లో చేరేందుకు ఇప్పటిదాకా ఆమోదం తెలిపిన పార్టీలు.. ఎస్పీ, బీఎస్పీ, ఎన్సీపీ, వామపక్షాలు. ఇక ఏ కూటమిలోనూ చేరే విషయమై తానేమీ ఆలోచించట్లేదని బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్ చెబుతున్నా.. బీజేపీని మునిగిపోయే పడవగా ఆయన అభివర్ణించడం తమకు సానుకూలమేనని కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి.

శివసేనకు గాలం?

బీజేపీకి చాలా కాలంపాటు మిత్రపక్షంగా శివసేన ఇపుడు బయటికొచ్చింది. బీజేపీపై ఆగ్రహంగా కూడా ఉంది. జరగబోయేది మోదీ వర్సెస్ రాహుల్ సమరమేనని, జాతీయ స్థాయిలో సమీకరణాలు మారతాయని, కాంగ్రెస్ జాగ్రత్తగా పావులు కదిపితే మోదీని దీటుగా ఎదుర్కోవచ్చని సామ్నాలో రాసిన ఎడిటోరియల్‌లో పేర్కొంది. శివసేనలో వచ్చిన ఈ మార్పును సానుకూలంగా మల్చుకోవాలని పవార్-రాహుల్ భావిస్తున్నట్లు సమాచారం. మహారాష్ట్రలో శివసేనను తమతో కలుపుకొని పోగలిగితే విపక్ష ఓట్లు చీలకుండా ఉంటాయని, అప్పుడే లాభమని పవార్, రాహుల్ అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. ఏదేమైనా, ఉప ఎన్నికల ఫలితాలు వెలువడిన కొన్నిగంటల్లోనే రాహుల్ -పవార్ భేటీ కావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

పవార్‌నే ఎందుకు కలిసినట్లు?

పవార్‌నే మొదట కలవడం వెనుక రాహుల్‌కు నిర్దిష్ట కారణాలున్నాయి. 1999లో పదమూడో లోక్‌సభ ఎన్నికల సమయంలో.. 'ఇటాలియన్ అయిన సోనియా గాంధీ ప్రధాని పదవి చేపట్టడానికి వీల్లేద"ంటూ సీడబ్ల్యూసీలో తిరుగుబాటు చేసిన ముగ్గురు నేతల్లో పవార్ ముఖ్యులు. పీఏ సంగ్మా, తారిక్ అన్వర్ మిగతా ఇద్దరు. కాంగ్రెస్ బహిష్కరించాకే ఆయన ఎన్సీపీని స్థాపించారు. ఆ తరువాత 2004లో మన్మోహన్‌సింగ్ కేబినెట్‌లో పవార్ వ్యవసాయ మంత్రిగా చేరారు. అందుకే, పవార్ నుంచి ఎటువంటి అభ్యంతరాలు రాకుండా.. ముందే ఆయనను మంచి చేసుకొనేందుకు రాహుల్ చేసిన ప్రయత్నంగా ఈ భేటీని చెబుతున్నారు. అంతేకాక పవార్ విశేష రాజకీయ అనుభవం ఉన్న నేత.. ప్రాంతీయ సమీకరణాలు బాగా తెలిసిన వ్యక్తి. భావసారూప్యం ఉన్న ఇతర ప్రాంతీయ పార్టీలను కూడా ఒకచోట చేర్చగల సామర్థ్యం ఉన్నవారు. అది కూడా ఒక కారణం.



బాబు సారథ్యంలో ఫెడరల్ ఫ్రంట్

న్యూఢిల్లీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వచ్చే లోక్‌సభ ఎన్నికల నాటికి వివిధ ప్రాంతీయ పార్టీలత కూడిన ఫెడరల్ ఫ్రంట్‌కు ఏపీ సీఎం చంద్రబాబునాయుడు నాయకత్వం వహించే అవకాశాలున్నాయంటూ రిపబ్లిక్ టీవీ గురువారం ఒక కథనాన్ని ప్రసారం చేసింది. విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ.. ఇప్పటికే 7 పార్టీలు టీడీపీకి మద్దతు ప్రకటించాయని, మేలో చంద్రబాబు అధికారికంగా ప్రకటిస్తారని పేర్కొంది. అఖిలేశ్ (ఎస్పీ), మాయావతి (బీఎస్పీ)తో మాట్లాడాక.. ఎన్డీయే నుంచి కూడా వైదొలగనున్నట్లు ప్రకటించే అవకాశం ఉందని తెలిపింది. అయితే, జాతీయ స్థాయిలో కీలకపాత్ర పోషించడంపై తొలుత తెలంగాణ సీఎం కేసీఆర్ సంకేతాలు పంపారని, టీఎంసీ అధినేత్రి మమత కూడా ఈ దిశన ప్రయత్నాలు ప్రారంభించారని గుర్తుచేసింది. మరోవైపు.. ఫెడరల్ ఫ్రంట్‌పై పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో ఎంపీల మధ్య చర్చలు ప్రారంభమయ్యాయి. కూటమి అంటూ ఏర్పడితే చంద్రబాబు తప్ప సారథ్యం వహించగల నాయకుడు మరొకరు లేరని, గతంలోనూ ఇలాంటి కూటమిని విజయవంతంగా నిర్వహించారని గుర్తుచేస్తున్నారు. అకాలీదళ్ నేత నరేశ్ గుజ్రాల్ అయితే టీడీపీ ఎంపీలతో ఎప్పటికప్పుడు చర్చిస్తూ కనపడ్డారు. అయితే, రాష్ట్ర పునర్నిర్మాణ బాధ్యతను తలెత్తుకున్న చంద్రబాబు ఇప్పట్లో జాతీయ రాజకీయాలపై దృష్టి కేంద్రీకరించడం కష్టమని తెలుగుదేశం వర్గాలు అంటున్నాయి.

లోకం తీరు



సర్కస్‌లోనే కాదు.. రాజకీయాల్లో కూడా ఇది సాధ్యమేనన్నమాట!

ఉష్ణోగ్రతలు


కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నిజామాబాద్	39.5	25.3
ఖమ్మం	38.0	24.0
విజయవాడ	35.8	24.8
విశాఖపట్నం	35.4	22.6
హైదరాబాద్	34.8	24.3



రాజకీయాల్లో త్యాగాలు తప్పవు

రాజకీయాల్లోకి వస్తే ఎన్నో త్యాగాలు చేయాల్సి ఉంటుంది. ఆ విషయం నాకూ తెలుసు. అందుకు సిద్ధమవుతున్నాను. సినీనటుడిగా ప్రేక్షకులను వంద శాతం ఆకట్టుకున్నా, సూపర్‌స్టార్ కావడం దేవుడిచ్చిన వరం. అదేరీతిలో రాజకీయాల్లోనూ రాణించి ప్రజలకు సేవలందిస్తాను. 1995 నుంచి వీలుచిక్కినప్పుడల్లా హిమాలయాలకు వస్తున్నాను. గతంలో హిమాలయాల పర్యటనలో నేను స్వేచ్ఛగా సంచరించేవాడిని. ఇప్పుడా పరిస్థితి లేదు. నన్ను వెదుక్కుంటూ నాయకులు, జనాలు వెంటబడుతున్నారు.

- తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్



భారత యువతకు రెడ్ కార్పెట్

భారత్‌లోని యువత, పరిశోధకులు, పారిశ్రామిక వేత్తలకు స్వాగతం. యూరప్‌లో అడుగుపెట్టాలని భావించేవారు ముందుగా ఫ్రాన్స్‌పైపు చూడాలి. భద్రత, ఆర్థిక, శక్తి, పర్యావరణంతో పాటు వివిధ రంగాల్లో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని నిర్ణయించడానికి ఇరు దేశాలూ కృషి చేశాయి. సరికొత్త సాధనలకు ఇదే ఆరంభం.

- ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మెక్రాన్

ఉద్యోగుల ఆరోగ్య పథకం యథాతథం

- ఉద్యోగులు, జర్నలిస్టులు ఆందోళన చెందొద్దు: మంత్రి లక్ష్మారెడ్డి

హైదరాబాద్/బర్కత్‌పుర, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, పింఛన్‌దారులు, జర్నలిస్టుల ఆరోగ్య పథకం(ఈహెచ్ఎస్) యథాతథంగా కొనసాగుతుందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.లక్ష్మారెడ్డి తెలిపారు. వెల్‌నెస్ కేంద్రాలు కూడా ఎప్పటిలాగే ఉంటాయన్నారు. ఈ విషయంలో వదంతులను నమ్మవద్దని; ఉద్యోగులు, జర్నలిస్టులు ఆందోళన చెందవద్దని సూచించారు. ఈహెచ్ఎస్‌ను ఆరోగ్యశ్రీలో కలపనున్నట్లు, దీనికి రాష్ట్ర కేబినెట్ కూడా ఆమోదముద్ర వేసినట్లు కొన్ని పత్రికల్లో (ఆంధ్రజ్యోతి కాదు) కథనాలు ప్రచురితమైన నేపథ్యంలో మంత్రి స్పందించారు. ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) కూడా దీనిని ఖండించింది. కేబినెట్ భేటీలో ఇటువంటి నిర్ణయమేదీ జరగలేదని, ఈహెచ్ఎస్‌లో పనిచేసేందుకు ఉద్యోగులను నియమించాలన్న నిర్ణయమే జరిగిందని పేర్కొంది. కాగా ఆరోగ్యశ్రీలో కలిపే ఉద్దేశమే లేదని, ఈ విషయాన్ని సీఎం కేసీఆర్ స్వయంగా తనతో చెప్పారని టీజీవోఏ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్యే వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం సీఎంను కలిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. అయితే ఆరోగ్యశ్రీలో విలీనం చేస్తున్నట్లు వచ్చిన వార్తలతో ఉద్యోగులు ఆందోళనకు గురయ్యారు. ప్రభుత్వ నిర్ణయాన్ని పునరాలోచించుకోవాల్సిందిగా కోరేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసేందుకు ఉద్యోగ, పింఛనుదారుల సంఘాలు సిద్ధమయ్యాయి. మరోవైపు.. ప్రభుత్వం ఈహెచ్ఎస్‌ను ఆరోగ్యశ్రీలో కలిపితే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) ప్రకటించింది. ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకురావడమంటే పథకానికి స్వస్తి పలికినట్లేనని టీయూడబ్ల్యూజే సలహాదారు కె.శ్రీనివాసరెడ్డి, అధ్యక్షుడు నగునూరి శేఖర్, ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఐటీ ఎగుమతుల్లో 13.85% వృద్ధి

జాతీయ సగటును మించి నమోదు.. ద్వితీయ శ్రేణి నగరాలకూ ఐటీ విస్తరణ

- బడ్జెట్‌లో ఐటీ రంగానికి రూ.289 కోట్లు
- పరిశ్రమల శాఖకు 1285.72 కోట్లు కేటాయింపు



హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఐటీ ఎగుమతుల్లో రాష్ట్రం.. కేంద్ర ప్రభుత్వం కన్నా ఎంతో ముందంజలో ఉందని ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. వరుసగా మూడేళ్లపాటు జాతీయ సగటును మించి వృద్ధి నమోదు చేసిందని తెలిపారు. గత ఏడాది జాతీయ సగటు వృద్ధి 10 శాతం ఉంటే.. రాష్ట్రం 13.85 శాతం సాధించిందన్నారు. ఐటీ రంగాన్ని హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని ద్వితీయ శ్రేణి నగరాలకు విస్తరించడం ప్రభుత్వ ప్రాధాన్యాంశమని తెలిపారు. ఈ దిశగా ఇప్పటికే వరంగల్, కరీంనగర్, ఖమ్మంలో ఐటీ హబ్ విస్తరణకు ముమ్మరంగా కృషి చేస్తున్నామన్నారు. వరంగల్‌లో ఐటీ సెజ్ ఏర్పాటుకు 45 ఎకరాలు కేటాయించామని, అంకుర సంస్థలను ప్రోత్సహించేందుకు 15 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో భవన నిర్మాణాన్ని చేపట్టామని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో కూడా సాఫ్ట్‌వేర్ అభివృద్ధి సంస్థలు, బీపీవో సంస్థల స్థాపనను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, ఇందులో భాగంగా జనగామ, కరీంనగర్, ఖమ్మంలో కొన్ని సాఫ్ట్‌వేర్ సంస్థలు తమ కార్యకలాపాలను ప్రారంభించాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన ఐటీ విధానంతో అనేక అంతర్జాతీయ సంస్థలు తమ కార్యాలయాలను హైదరాబాద్‌లో నెలకొల్పుతున్నాయన్నారు. టీ-హబ్ ద్వారా 200 అంకుర సంస్థలు ప్రేరణ పొందాయని, జీఈఎస్‌లో ప్రకటించినట్లుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజు మహిళా స్టార్టప్‌ల కోసం ప్రత్యేకంగా వీ-హబ్ ప్రారంభించామని వెల్లడించారు. వీ-హబ్ ప్రారంభ పెట్టుబడిగా రూ.15 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఇక 2018-19 బడ్జెట్‌లో ఐటీ రంగానికి ప్రభుత్వం రూ.289 కోట్లు ప్రతిపాదించింది. పరిశ్రమల శాఖకు రూ.1285.72 కోట్లు కేటాయించింది. ఇక ప్రగతి పద్దులో రూ.1106.41 కోట్ల అంచనాలతో బడ్జెట్‌ను రూపొందించిన ప్రభుత్వం.. గ్రామీణ, చిన్నతరహా పరిశ్రమల ప్రోత్సాహానికి రూ.334.37 కోట్లు వ్యయం చేయనుంది.

ఐటీ, పరిశ్రమల శాఖకు కేటాయింపులు ఇలా..

శాఖ	2017-18లో కేటాయింపు	2018-19లో కేటాయింపు
ఐటీ రంగం	254 కోట్లు	289 కోట్లు
పరిశ్రమల శాఖ	765.46 కోట్లు	1285.72 కోట్లు
భారీ, మధ్య తరహా పరిశ్రమలకు	508 కోట్లు	717 కోట్లు
మౌలిక వసతుల కల్పనకు	19 కోట్లు	104 కోట్లు
చక్కెర పరిశ్రమల అభివృద్ధికి	15.73 కోట్లు	17.62 కోట్లు

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.76.74	పాత ధర 68.28
కొత్త ధర రూ.76.64	కొత్త ధర 68.24
తగ్గుదల: 10 పైసలు	తగ్గుదల: 4 పైసలు

మా శాసన సభ్యత్వాల రద్దు రాజ్యాంగ విరుద్ధం

- గవర్నర్ ప్రసంగం - సభా వ్యవహారాలు వేర్వేరు
- ఇది కేసీఆర్ రాజకీయ కక్ష సాధింపు
- హైకోర్టును ఆశ్రయించిన కోమటిరెడ్డి, సంపత్

హైదరాబాద్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): శాసనసభ నుంచి బహిష్కృతులైన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎస్ సంపత్ గురువారం హైదరాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. గవర్నర్ ప్రసంగం వేరు, అసెంబ్లీ వ్యవహారాలు వేరు అంటూ తమపై చర్య తీసుకొనే అధికారం అసలు స్పీకర్‌కు లేదని తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. కనీసం నోటీసు ఇవ్వకుండా, వివరణ తీసుకోకుండానే తమను సస్పెండ్ చేయడం ఏకపక్షమని, నల్గొండ, అలంపూర్ స్థానాలను ఖాళీగా చూపిస్తూ అసెంబ్లీ ప్రకటించాలని, ఈ రెండు నియోజకవర్గాలకు ఎన్నికలు నిర్వహించకుండా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరారు. ఈ పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని వీరి తరఫు న్యాయవాది అభ్యర్థించగా... శుక్రవారం వాదనలు వింటామని జడ్జి జస్టిస్ బి.శివశంకర్‌రావు చెప్పారు. ఈ పిటిషన్‌లో తెలంగాణ ప్రభుత్వ న్యాయ, శాసన వ్యవహారాల శాఖ కార్యదర్శిని, అసెంబ్లీ కార్యదర్శితోపాటు కేంద్ర ఎన్నికల సంఘాన్ని ప్రతివాదులుగా చేర్చారు.

సభావ్యవహారాల కిందకు రావు....

"బడ్జెట్ సమావేశాల సందర్భంగా గవర్నర్ ప్రసంగించే సమయంలో ఆటంకం కల్గించడం సభా వ్యవహారాలను అడ్డుకోవడమే అంటూ మాపై చర్య తీసుకున్నారు. రాష్ట్రపతి, గవర్నర్ ప్రసంగాలు సభా వ్యవహారాల కిందకు రావు. ఆ సమయంలో వారే సభలకు నేతృత్వం వహిస్తారు. స్పీకర్‌కు ఎటువంటి అధికారాలు ఉండవు. సభా వ్యవహారాలకు సంబంధంలేని సంఘటనను చూపుతూ మా సభ్యత్వాన్ని రద్దు చేయడం నిబంధనలకు విరుద్ధం. కనీసం మాకు నోటీసులు ఇవ్వలేదు.. వివరణ కూడా తీసుకోలేదు. ఏకపక్షంగా తీసుకున్న ఈ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధం" అని పిటిషన్‌లో పేర్కొన్నారు.

వీడియో ఫుటేజీ సమర్పించేలా ఆదేశించండి...

"తమ సస్పెన్షన్‌కు కారణంగా చెబుతున్న సంఘటనకు సంబంధించిన వీడియో ఫుటేజీని న్యాయస్థానానికి సమర్పించేలా ఆదేశించాలి. ఇప్పటి వరకు వీడియో ఫుటేజీని బయటపెట్టలేదు. ఇయర్‌ఫోన్ తగిలిన తర్వాత కూడా మండలి చైర్మన్ సరదాగా గడిపారు. అసెంబ్లీ నుంచి గవర్నర్ వెళ్తున్న సమయంలో ఆయనను కారు దగ్గరికి వెళ్లి సాగనంపారు. ఆ తర్వాతే తన కంటికి గాయమైందని ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై మాకు అనుమానాలు ఉన్నాయి. అందుకే వీడియో ఫుటేజీ అడిగాం" అని పిటిషన్‌లో కోరారు.

కేసీఆర్ టార్గెట్ చేశారు...

తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై తాము పోరాడుతుండడం వల్ల, అసెంబ్లీలో చర్చను లేవనెత్తి, సవాళ్లను విసురుతుండడం వల్ల ముఖ్యమంత్రి కేసీఆర్ తమపై వ్యక్తిగతంగా కక్ష పెంచుకున్నారని కోమటిరెడ్డి, సంపత్ తమ పిటిషన్‌లో పేర్కొన్నారు.

ఈసీకి టీపీసీసీ వినతి

న్యూఢిల్లీ: రెండు తెలుగు రాష్ట్రాల ఉమ్మడి గవర్నర్ సమక్షంలో జరిగిన ఉభయ సభల సమావేశంలో పాల్గొన్న సభ్యుల సభ్యత్వాన్ని రద్దు చేసే అధికారం అసెంబ్లీ స్పీకర్‌కు లేదని, అంచేత ఆ సభ్యుల స్థానాల్లో ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ ఇవ్వొద్దని కాంగ్రెస్ నాయకులు ఎలక్షన్ కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మర్రిశశిధర్‌రెడ్డి, వి.హనుమంతరావు, నంది ఎల్లయ్యలతో కూడిన ఓ బృందం గురువారం కేంద్ర ఎన్నికల సంఘం అధికారులను కలిసి - కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌రెడ్డిలపై చర్యలు తీసుకునే అధికారం అసెంబ్లీకి సాంకేతికంగా లేదని తెలిపారు. వీరు ఈ నెల 23న రాజ్యసభ అభ్యర్థులకు జరిగే ఓటింగ్‌లో పాల్గొనాల్సి ఉందని తెలియజేశారు. కాంగ్రెస్ అభ్యర్థిని ప్రతిపాదించిన వారిలో ఈ శాసనసభ్యులు కూడా ఉన్నారని వివరించారు.

రైతుకు ఉగాది

(మొదటిపేజీ తరువాయి..)

అధిగమించేందుకు యంత్రీకరణకు పెద్దపీట వేసింది. అంతేనా.. వ్యవసాయానికి అత్యంత కీలకమైన సాగునీటి ప్రాజెక్టుల ప్రాధాన్యాన్ని కొనసాగించింది. వ్యవసాయం.. సాగునీరు.. విద్యుత్తు! సాగుకు అనుబంధ రంగాలివి! ప్రభుత్వం ఎత్తుపీట వేసిన రంగాలు కూడా ఇవే! మొత్తం బడ్జెట్లో నాలుగో వంతు నిధులను కూడా ఈ రంగాలకే కేటాయించింది. వ్యవసాయానికి మొత్తంగా ఈసారి దాదాపు రూ.15 వేల కోట్ల వరకు కేటాయిస్తే.. సాగునీటికి ఎప్పట్లాగే రూ.25 వేల కోట్లను కేటాయించింది. ఇక, విద్యుత్తు శాఖకు రూ.5650 కోట్లు కేటాయించింది. తద్వారా, రైతుకే బడ్జెట్ కిరీటం పెట్టినట్లు స్పష్టం చేసింది. అలాగే, చివరి బడ్జెట్లో దళితులు, గిరిజనులకు పెద్దపీట వేసింది. ప్రభుత్వ ప్రాధాన్య పథకాలైన కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, ఆరోగ్యలక్ష్మి వంటి పథకాలకు కేటాయింపులు పెంచింది. వెరసి, ఉగాది పండుగకు రెండు రోజుల ముందు షడ్రుచుల సమ్మేళనంగా రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ 2018-19 బడ్జెట్‌ను గురువారం శాసనసభలో ప్రవేశపెట్టారు. 'ప్రతి ఇంటికీ సంక్షేమం.. ప్రతి ముఖంలో సంతోషం' లక్ష్యంగా బడ్జెట్ పద్దును తీర్చిదిద్దారు. పట్టణాభివృద్ధికి లేదనకుండా నిధులిచ్చి సమతుల్యత సాధించారు. రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాలన్నింటికీ అభివృద్ధి కోసం భారీగా నిధులు కేటాయించారు. ఇప్పటికే కొనసాగుతున్న సంక్షేమ పథకాలకు ఒక్కదానికి కూడా కోత పెట్టకుండా నిధులివ్వడం ఈ బడ్జెట్ ప్రత్యేకత. భారీగా పెరిగిన పన్నుల ఆదాయం తెలంగాణ సర్కారుకు బడ్జెట్ రూపకల్పనలో తగినంత వెసులుబాటునిచ్చింది. అయితే, పెద్ద పెద్ద ప్రణాళికలతో తెచ్చిన వేల కోట్ల రూపాయల అప్పులు మాత్రం భవిష్యత్తును భయపెట్టే విధంగానే ఉన్నాయి. బీసీలు బడ్జెట్ కేటాయింపులు తమ ఆశలను ప్రతిబింబించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంబీసీలకు గత ఏడాది ఖర్చు పెట్టకుండా వదిలేసిన వెయ్యి కోట్లే మళ్లీ కేటాయించారు. గత ఏడాది బడ్జెట్‌తో పోలిస్తే ఇది 16.57 శాతం (రూ.24,807 కోట్లు) ఎక్కువ. బడ్జెట్ ప్రవేశపెడుతూ.. "చీకటి నుంచి వెలుగులోకి, అప నమ్మకం నుంచి ఆత్మ విశ్వాసంలోకి, అణగారిన స్థితి నుంచి అభ్యున్నతిలోకి, వలస బతుకుల నుంచి వ్యవసాయ ప్రగతి వైపు ప్రజలను నడిపిస్తున్నాం" అని ఈటల స్పష్టం చేశారు. ఈ ప్రస్థానంలో పేదలకు సంక్షేమం, అభివృద్ధి ఫలాలను అందించాలన్నదే లక్ష్యంగా బడ్జెట్‌ను రూపొందించామని తెలిపారు. కాగా, శాసన మండలిలో డిప్యూటీ సీఎం కడియం బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.



వాటర్ బాటిళ్లలో ప్లాస్టిక్ కణాలు!

న్యూయార్క్, మార్చి 15: ప్లాస్టిక్ బాటిళ్లలో నీటిని తాగుతున్నారా? అయితే జాగ్రత్త! ఇప్పటికే ప్లాస్టిక్ బాటిల్ నీటిలో పలు రకాల రసాయనాలు కలుస్తున్నాయని.. అవి ప్రమాదకరమని శాస్త్రవేత్తలు చెబుతున్న సంగతి తెలిసిందే. బాటిల్ నీటిలో ప్లాస్టిక్ రేణువులు ఉంటున్నాయని తాజా పరిశోధనల్లో తేలింది. 9 దేశాల్లో అమ్ముడవుతున్న 11 బ్రాండ్లకు చెందిన 259 వాటర్ బాటిళ్లను పరీక్షించిన ఫ్రెడోనియాలోని స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ న్యూయార్క్, స్వచ్ఛంద జర్నలిజం సంస్థ ఓఆర్బీ మీడియా పరిశోధకులు ఈ విషయాన్ని గుర్తించారు. ప్రతి బాటిల్ నీటిలోనూ మైక్రోప్లాస్టిక్ ఉంటుందని.. లీటరు నీటిలో 10,390 ప్లాస్టిక్ రేణువులు ఉంటున్నాయని పరిశోధకులు వెల్లడించారు. వీటిలో 65శాతం ప్లాస్టిక్ రేణువులు.. బాటిళ్లు, మూతలకు సంబంధించిన అణువులేనని స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ న్యూయార్క్ పరిశోధకులు షెర్రీ మాసన్ తెలిపారు. అయితే ప్లాస్టిక్ వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలపై కావాల్సినంత సమాచారం లేదని.. దీనివల్ల ఈ బాటిళ్లలోని మైక్రోప్లాస్టిక్ ప్రమాదకరం అవునో! కాదో! స్పష్టంగా చెప్పలేమన్నారు.

తెలంగాణకు పట్టిన శని కేసీఆర్

అసెంబ్లీని ప్రగతి భవన్‌లోనే జరుపుకోండి.. టీఆర్ఎస్‌కు ఇవే చివరి ఎన్నికలు : ఉత్తమ్

- దమ్ముంటే నాపై పోటీ చేయండి: కోమటిరెడ్డి
- కాంగ్రెస్ జెండాతోనే ప్రాణం విడుస్తా: సంపత్
- గాంధీభవన్‌లో దీక్ష విరమించిన నేతలు



గాంధీభవన్‌లో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సంపత్ కుమార్‌తో (ప్రజాస్వామ్య పరిరక్షణ) దీక్షను విరమింపజేస్తున్న ఉత్తమ్, జానారెడ్డి తదితరులు

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : కేసీఆర్ అధికార మదంతో కాంగ్రెస్‌ను విలన్ అంటున్నారని, వాస్తవానికి ఆయనే తెలంగాణకు పట్టిన శని అని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చి, తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన పార్టీని విలన్ అనడానికి సిగ్గుండాలని వ్యాఖ్యానించారు. గాంధీభవన్‌లో ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌కుమార్ చేపట్టిన ప్రజాస్వామ్య పరిరక్షణ నిరాహార దీక్ష గురువారం సాయంత్రం ముగిసింది. వారికి ఉత్తమ్, జానారెడ్డి, గీతారెడ్డి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. అంతకుముందు ఉత్తమ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజల ఇబ్బందులను పట్టించుకోకుండా ప్రాజెక్టుల పేరుతో వేల కోట్ల రూపాయలు దండుకుంటున్న కేసీఆర్‌కు కాంగ్రెస్‌ను విమర్శించే హక్కు లేదన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో నెహ్రూ 11 నెలలు జైల్లో ఉన్నారని, తెలంగాణ కోసం కేసీఆర్ 11 రోజులైనా జైల్లో ఉన్నారా అని నిలదీశారు. తెలంగాణ కోసం పోరాడిన కోదండరాం, గద్దర్, విమలక్క, మంద కృష్ణ ఇప్పుడు ద్రోహులయ్యారని, మెగా కృష్ణారెడ్డి, తలసాని, తుమ్మల వంటి వారు పోరాట యోధులయ్యారని ఎద్దేవా చేశారు. ప్రజా సమస్యలపై నిలదీస్తామన్న ఉద్దేశంతోనే కుట్రపూరితంగా తమను సస్పెండ్ చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకుడు బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్య విషయాన్ని అసెంబ్లీలో ప్రశ్నిస్తారన్న భయంతోనే కోమటిరెడ్డిని బహిష్కరించారని విమర్శించారు. అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్షం లేకుండా బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఇలాంటి సమావేశాలు అసెంబ్లీలో పెట్టుకోవాల్సిన అవసరం లేదని, ప్రగతి భవన్‌లోనో, ఫాంహౌస్‌లోనో ఏర్పాటు చేసుకుంటే సరిపోతుందని వ్యాఖ్యానించారు. టీఆర్ఎస్‌కు ఇవే చివరి ఎన్నికలని తేల్చిచెప్పారు. దీక్షకు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన టీజేఏసీ చైర్మన్ కోదండరాం మాట్లాడుతూ కాంగ్రెస్ సభ్యులపై ఏకపక్షంగా చర్యలు తీసుకోవడం సబబు కాదన్నారు. ఇద్దరు కాంగ్రెస్ సభ్యులను బహిష్కరించి కేసీఆర్ పైశాచిక ఆనందం పొందుతున్నారని ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి ఆరోపించారు.బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్యకేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే వీరేశంపై వేటు వేయాలని డిమాండ్ చేశారు. స్వామిగౌడ్‌కు గాయం.. కేసీఆర్ ఆడుతున్న డ్రామాగా అభివర్ణించారు. అలంపూర్,నల్లగొండలో కేసీఆర్ అడుగుపెడితే ప్రజలు రాళ్లతో కొడతారని పేర్కొన్నారు.

కేసీఆర్ నియంతృత్వం తాండవిస్తోంది: జైపాల్

న్యూఢిల్లీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నియంతృత్వం విలయ తాండవం చేస్తోందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జైపాల్‌రెడ్డి విమర్శించారు. లోక్‌సభలోని కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. కేసీఆర్ లాంటి వారు సీఎంలుగా ఉంటే ప్రజాస్వామ్యం మనుగడ కష్టసాధ్యమన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులను అడ్డగోలుగా రద్దు చేయడానికి ఆయన ఎవరని ప్రశ్నించారు. తెలంగాణలో ఏం జరుగుతుందో జాతీయ స్థాయిలో ఎవరికీ తెలియదన్నారు. మూడో కూటమి, ఇతర అంశాలపై తెలుగు వాళ్లేకే కానీ.. దేశ వ్యాప్తంగా చర్చలేదని చెప్పారు.

టీఆర్ఎస్‌ను గద్దె దింపే వరకూ పోరు

ప్రజాస్వామ్యయుతంగా ఆందోళన చేసినా టీఆర్ఎస్ ప్రభుత్వం తమను సస్పెండ్ చేసిందని సంపత్ కుమార్ ఆరోపించారు. ఫిరాయింపుల కేసు ఉపసంహరించుకోవాలంటూ గతంలో తనపై ఒత్తిడి తెచ్చారని తెలిపారు. టీఆర్ఎస్‌లో చేరితే కోట్ల రూపాయలు ఇస్తామని ఆఫర్ ఇచ్చారని పేర్కొన్నారు. తాను వినకపోవడంతోనే ఇలా కక్ష సాధింపు చర్యకు పాల్పడ్డారని మండిపడ్డారు. టీఆర్ఎస్‌పై యుద్ధం ప్రకటిస్తున్నామని, ఆ పార్టీని గద్దె దింపే వరకూ తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. తన ప్రాణమున్నంత వరకూ కాంగ్రెస్‌లోనే ఉంటానని, తాను మరణిస్తే కాంగ్రెస్ జెండా కప్పాలని కోరుకుంటున్నానని ఉద్వేగంగా ప్రసంగించారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్‌కు ఒక సామాజిక వర్గం తప్ప.. మిగతా తెలంగాణ సమాజం పట్టదని విమర్శించారు. తాను ఇటీవల గజ్వేల్‌లో పర్యటించానని, అప్పటి నుంచి తనపై కక్ష కట్టారని ఆరోపించారు. కేసీఆర్‌కు రోజులు దగ్గర పడ్డాయని, వచ్చే ఎన్నికల్లో ఆయన ఓటమి ఖాయమని జోస్యం చెప్పారు. దమ్ముంటే కేసీఆర్ కుటుంబ సభ్యుల్లో ఒకరు నల్లగొండ నుంచి పోటీకి దిగాలని సవాల్ విసిరారు. తాను ఓడిపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ విలన్ అన్న సీఎం కేసీఆర్ వ్యాఖ్యలపై ఎమ్మెల్యే చిన్నారెడ్డి స్పందిస్తూ కాంగ్రెస్ విలన్ అయితే తెలంగాణ వచ్చేదా..? అని ప్రశ్నించారు. మంత్రి హరీశ్‌రావు టీఆర్ఎస్‌ను ఎక్కడ చీలుస్తారన్న భయంతో పార్టీ ఫిరాయింపులను కేసీఆర్ ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్‌కు బీజేపీతో మంచి దోస్తానా ఉందని, ఆయన ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు చేసే అవకాశమే లేదన్నారు. సీఎల్పీ నేత జానారెడ్డి, మండలి విపక్ష నేత షబ్బీర్ అలీ, భట్టి విక్రమార్క, గీతారెడ్డి, డీకే అరుణ, వంశీచంద్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, బలరాంనాయక్ దీక్షకు సంఘీభావం ప్రకటించారు.

చిన్న వాక్యం ఆధారంగా ప్రశ్నలు

- భిన్నంగా 'పది' తెలుగు పరీక్ష

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి)/స్టడీడెస్క్ : ఈసారి పదో తరగతి తెలుగు (మొదటి పేపర్) పరీక్ష భిన్నంగా వచ్చినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా గురువారం పదోతరగతి తెలుగు పరీక్ష జరిగింది. పాఠ్యాభాగంలో ఎక్కడో ఒక వాక్యాన్ని ఆధారంగా చేసుకొని, దానిని వివరించాలంటూ ప్రశ్నలు ఇచ్చారని.. ఇలాంటి వాటికి సాధారణ విద్యార్థులు సులువుగా సమాధానాలు రాయలేకపోయారని ఉపాధ్యాయులు తెలిపారు. బట్టీ విధానంలో చదివిన విద్యార్థులకు ఈ పరీక్ష కఠినంగా ఉందని.. పాఠ్యాంశాలను విశ్లేషణాత్మకంగా చదివినవారికి మాత్రం సులభమేనని వారు వివరించారు.

వెబ్‌సైట్‌లో స్టాఫ్ నర్స్ పరీక్షల ప్రిలిమినరీ కీ

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): స్టాఫ్ నర్స్ పోస్టుల భర్తీ పరీక్షల ప్రిలిమినరీ కీని శుక్రవారం వెబ్‌సైట్‌లో పొందుపరచనున్నట్లు టీఎస్‌పీఎస్సీ సెక్రటరీ వాణీప్రసాద్ తెలిపారు. కీపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 20 నుంచి 26 వరకు ఆన్‌లైన్‌లో తెలపవచ్చని పేర్కొన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలోని ఏఈఈ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 16 నుంచి 18వ వరకు తప్పులు సవరించుకోవచ్చన్నారు.

ఎన్ఎస్‌టీఎస్ఈ ఫలితాల్లో 'నారాయణ' హవా

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : యూనిఫైడ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే నేషనల్ సైన్స్ టాలెంట్ సెర్చ్ (ఎన్ఎస్‌టీఎస్ఈ)-2018 ఫలితాల్లో నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు సత్తాచాటారు. 2, 4, 7వ తరగతుల్లో ఆల్ ఇండియా మొదటి ర్యాంకుతో పాటు 4, 5, 6, 7, 8, 10 ర్యాంకులను కైవసం చేసుకున్నారని ఆ విద్యాసంస్థల ఎండీ సింధూర నారాయణ తెలిపారు. అదే విధంగా టాప్ 10 లోపు 29 ర్యాంకులు, టాప్-50 లోపు 189 ర్యాంకులు, టాప్-100 లోపు 387 ర్యాంకులు సాధించారని తెలిపారు. జాతీయస్థాయి పరీక్షల్లో తమ విద్యార్థులు సత్తా చాటేలా సీవో స్పార్క్, ఒలింపియాడ్, ఈ-టెక్నో, మెడిస్పార్క్ వంటి కార్యక్రమాలతో ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డులో 'శ్రీచైతన్య'

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): చెన్నై, బెంగళూరులోని శ్రీచైతన్య స్కూల్ క్యాంపస్‌లో స్టార్ మెవర్లిక్ ఎర్లీ ఎడ్యుకేషన్ నిర్వహించిన కార్యక్రమంలో శ్రీచైతన్య పాఠశాలకు చెందిన 100 మందికిపైగా విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించారు. ఈ పోటీలో పాల్గొన్న విద్యార్థులంతా 3 నుంచి 5 ఏళ్ల వయసులోపు వారే. ఈ విద్యార్థులు 100 దేశాల పేర్లను, వాటి రాజధానులను చిత్రపటాలను గుర్తించి ఈ ఘనత సాధించారు. వీరిని విద్యాసంస్థల అకాడమిక్ డైరెక్టర్ సీమ, చైర్మన్ బీఎస్ రావు అభినందించారు.

జర్నలిస్టులకు ఆన్‌లైన్‌లో అక్రిడిటేషన్ కార్డులు

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డులను ఆన్‌లైన్‌లో జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గురువారం సమాచారభవన్‌లో సమాచార, పౌరసంబంధాల శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆశాఖ కమిషనర్ అర్వింద్‌కుమార్ ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ సమాచారశాఖకు సంబంధించిన సమస్త కార్యకలాపాలు ఆన్‌లైన్‌లోనే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. డిజిటలైజేషన్, ఆధునికీకరణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని సూచించారు.

పంచాయతీలపై ఎమ్మెల్యేలతో మంత్రుల భేటీ

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే పీఆర్ చట్ట సవరణ బిల్లును ఆమోదించుకోవాలని ప్రభుత్వం భావిస్తున్న క్రమంలో జిల్లాలవారీగా టీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో మంత్రులు గురువారం భేటీ అయ్యారు. అసెంబ్లీ సోమవారానికి వాయిదా పడిన తదుపరి జరిగిన ఈ సమావేశాల్లో ఇప్పటికే ప్రతిపాదించిన కొత్త పంచాయతీలు, పట్టణాల్లో విలీనమయ్యే గ్రామాల వివరాలను మరోసారి పరిశీలించారు.

కోలుకున్న స్వామిగౌడ్

- కంటి గాయం పూర్తిగా నయమైందన్న డాక్టర్లు



విలేకరులతో మాట్లాడుతున్న మండలి చైర్మన్ స్వామిగౌడ్

మెహిదీపట్నం/హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : కంటికి గాయమై సరోజిని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్ నాలుగు రోజుల అనంతరం గురువారం డిశ్చార్జ్ అయ్యారు. అసెంబ్లీలో గవర్నర్‌కు ధన్యవాదాలు చెప్పే కార్యక్రమంలో కాంగ్రెస్ సభ్యుడు విసిరిన హెడ్‌సెట్ తగిలి స్వామిగౌడ్ కుడి కంటికి గాయమైన విషయం తెలిసిందే. డాక్టర్ల పర్యవేక్షణలో గాయం కారణంగా దెబ్బతిన్న కార్నియా నయమైనట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ రవీందర్‌గౌడ్‌తో కూడిన డాక్టర్ల బృందం విలేకరులకు తెలిపింది. అయితే, కొన్ని రోజుల వరకు మందులు వేసుకోవాలని డాక్టర్లు సూచించారు. వారం రోజుల తర్వాత మళ్లీ పరీక్షలు నిర్వహిస్తామని వారు వివరించారు.

ఏదీ శాశ్వతం కాదు

- యూపీ, బిహార్ ఉప ఎన్నికల ఫలితాలు ఆసక్తికరం
- జనానికి కావాల్సిందే కేసీఆర్ అజెండా: కేటీఆర్



హైదరాబాద్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఏదీ శాశ్వతం కాదనే సందేశాన్ని యూపీ ఉప ఎన్నికల ఫలితాలు ఇచ్చాయని మంత్రి కేటీఆర్ అన్నారు. కేంద్రంలో బీజేపీకి అధికారం కట్టబెట్టడంలో ముఖ్యపాత్ర పోషించిన యూపీలో సీఎం, డిప్యూటీ సీఎం రాజీనామాలతో ఖాళీ అయిన లోక్‌సభ స్థానాల ఉప ఎన్నికల ఫలితాలు ఆసక్తికరంగా ఉన్నాయన్నారు. పేరుకే జాతీయ పార్టీ అయిన మరో పార్టీ డిపాజిట్లు కోల్పోయిందని కాంగ్రెస్‌ను ఉద్దేశించి కేటీఆర్ గురువారం ట్వీట్ చేశారు. అంతకుముందు ఆయన అసెంబ్లీ లాబీల్లో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ.. "జనానికి ఏది కావాలో అదే కేసీఆర్ అజెండా. రాష్ట్ర అజెండాను రూపొందించినట్లుగానే దేశానికి కావాల్సిన అజెండానూ ఆయన సిద్ధం చేస్తున్నారు. తెలంగాణ బిడ్డగా కేసీఆర్ రాష్ట్రాన్ని సాధించారు. ఇక్కడి ప్రజల రుణం తీర్చుకున్నారు. దేశ పౌరుడిగా దేశ రాజకీయాల్లో మార్పులు తేనున్నారు. కొత్త ఫ్రంట్ ఏర్పాటు చేసి దేశ ప్రజల రుణం తీర్చుకుంటారు" అన్నారు. "మోదీ, రాహుల్, సోనియా ఎంపీలుగా ప్రాతినిధ్యం వహిస్తున్న యూపీలోనే బీజేపీ, కాంగ్రెస్ ఓడిపోయాయి. యూపీ, బిహార్ ఉప ఎన్నికల ఫలితాలతో ప్రజలు ప్రాంతీయ పార్టీల వైపు మొగ్గు చూపుతున్నారని తేలింది. తెలంగాణ సీఎం కేసీఆర్ కోరుకుంటున్న గుణాత్మక మార్పునకు యూపీ, బిహార్ ఉప ఎన్నికల ఫలితాలే నిదర్శనం" అని విశ్లేషించారు. యూపీ మాజీ సీఎం, ఎస్పీ నేత అఖిలేశ్‌యాదవ్‌కు శుభాకాంక్షలు ఎప్పుడు చెప్పాలో అప్పుడే చెప్తానన్నారు. పొరుగు రాష్ట్రం ఏపీ రాజకీయాలు, అక్కడి మంత్రి లోకేశ్ స్కాంలు తమకు అవసరంలేదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో హరీశ్‌రావు తెలంగాణ సాధన కోసం ఆందోళన చేశారని చెప్పారు. ప్రజా స్పందన తమ వైపు ఉండటం వల్లే నాటి కాంగ్రెస్ ప్రభుత్వం తమపై వేటు వేసే ఆలోచన కూడా చేయలేకపోయిందన్నారు. ఇప్పుడు ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేల సభ్యత్వాన్ని రద్దు చేసినా ప్రజలు పట్టించుకోవటం లేదన్నారు.

ప్రీ ఫైనల్ గెలవలేనోళ్లు.. ఫైనల్‌లో గెలుస్తారా?

- ప్రజాక్షేత్రానికని కోర్టుకెందుకెళ్లారు?: జగదీశ్
- దమ్ముంటే ఎన్నికల్లో పోటీ చేసి గెలు: వీరేశం



హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): 'ప్రీఫైనల్ గెలవలేనోళ్లు.. ఫైనల్‌లో గెలుస్తారా?'అని కాంగ్రెస్ నేతలను ఉద్దేశించి మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. ఇద్దరు ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దుపై ప్రజాక్షేత్రానికి వెళ్లి తేల్చుకుంటామన్న కాంగ్రెస్ నేతలు.. న్యాయస్థానాన్ని ఎందుకు ఆశ్రయించారని ప్రశ్నించారు. గురువారం ఇక్కడ టీఆర్ఎస్ఎల్పీలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేతలు ఎక్కడికి అయినా వెళ్లొచ్చన్నారు. 2019 ఎన్నికల తర్వాత అసెంబ్లీలో రెండే పార్టీలుంటాయని, అవి టీఆర్ఎస్, ఎంఐఎం మాత్రమే అన్నారు. కొత్త ఫ్రంట్ గురించి సీఎం కేసీఆర్ స్పష్టంగా చెప్పారని, కొన్ని పార్టీలతో కూటమి ఏర్పాటు చేయడమనేది ఆయన ప్రధాన ఉద్దేశం కాదన్నారు. ప్రజల్ని జాతీయ పార్టీ ద్వారా సంఘటితం చేయాలా? మరో విధంగానా? అనేది కేసీఆరే నిర్ణయిస్తారని పేర్కొన్నారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డికి దమ్ముంటే, ప్రజాదరణ ఉందని భావిస్తే మళ్లీ ఎన్నికల్లో పోటీ చేసి గెలవాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సవాల్ విసిరారు. ఆయనను ఓడించేందుకు సీఎం రావాల్సి న అవసరం లేదని, టీఆర్ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా నేతలు చాలని వ్యాఖ్యానించారు.

ఇంటింటికీ 'తెలంగాణ తెలుగు'

- పంపిణీకి సాంస్కృతిక కరదీపిక సిద్ధం
- కలెక్టర్లకు పంపిణీ బాధ్యతలు

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): 'తీయనైన తెలుగు - తెలంగాణ వెలుగు' పేరుతో సాంస్కృతిక కరదీపికను రాష్ట్రంలోని ప్రతి ఇంటికి చేరవేసేందుకు భాష, సాంస్కృతిక శాఖ చర్యలు చేపట్టింది. ఈ మేరకు 1.10కోట్ల కరదీపికలను పంపిణీ చేసేందుకు పుస్తకాలు రూపొందించారు. 68 పేజీలతో కూడిన కర దీపికలో తెలంగాణ భౌగోళిక పరిస్థితులు, తిథులు, వారాలు, నక్షత్రాలు, రాశులు, వర్ణమాల, కార్తెలు, ప్రాచీన కాలగమనం, రాష్ట్ర చిహ్నాలు, కళలు, పండుగలు, పాటలు, ఆటలు, నీతి పద్యాలు ఇలా 20 రకాల అంశాలతో కూడిన కర దీపికను దేశపతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిద్ధం చేశారు. ఉగాది పండగ సందర్భంగా ఈ నెల 18 కల్లా కరదీపికను ప్రతి ఇంటికి చేరవేయటమే లక్ష్యంగా ప్రణాళిక సిద్ధం చేశారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్లకు 80 లక్షల పుస్తకాలను పంపించినట్లు భాష, సంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తెలిపారు. మిగతా 30లక్షల పుస్తకాలను స్థానికంగా జిల్లా స్థాయిలో ముద్రించుకోవాలని ప్రభుత్వం జిల్లా కలెక్టర్లను ఆదేశించినట్లు చెప్పారు. పుస్తకాల పంపిణీ బాధ్యతలు సైతం జిల్లా కలెక్టర్లకే అప్పగించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, మహిళాశిశు సంక్షేమ సిబ్బంది ద్వారా ప్రతి మండలం, ప్రతి గ్రామంలోని ప్రతి గడపకూ చేరవేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తెలుగు మహాసభల సందర్భంగా కేసీఆర్ చేసిన సూచన మేరకు తెలంగాణ తెలుగును పరిచయం చేసే కోణంలో కరదీపిక సిద్ధం చేశారు.

మా సమస్యలు పరిష్కరించండి

- సీఎంకు మాజీ ఎమ్మెల్యేల విజ్ఞప్తి

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కారించాలని మాజీ ఎమ్మెల్యేల ప్రతినిధి బృందం సీఎం కేసీఆర్‌ను కోరింది. ఈ మేరకు రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజేశం గౌడ్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యేలు గురువారం అసెంబ్లీ లాబీలో కేసీఆర్‌ను కలిశారు. పింఛన్ల మొత్తం పెంచాలని, మెరుగైన వైద్య సదుపాయం కల్పించాలని కోరుతూ కేసీఆర్‌కు వినతిపత్రం అందజేసినట్లు రాజేశంగౌడ్ తెలిపారు.

ఉప ప్రకంపనలు

ఉత్తరప్రదేశ్, బిహార్ రాష్ట్రాల ఉప ఎన్నికల్లో బీజేపీ పరాజయం విపక్షాలకు ఎన్నడూ లేనంత శక్తినిచ్చింది. ఉత్తరప్రదేశ్‌లో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఖాళీచేసిన స్థానాలనే తిరిగి దక్కించుకోలేకపోవడం ఆ పార్టీకి తీసిపారేయగలిగే పరాభవమేమీ కాదు. ఇరవైయేళ్ళుగా ఏలుతూ వచ్చిన గోరఖ్‌పూర్ ఏడాదిలోనే శత్రువుల వశం కావడం ఆదిత్యనాథ్‌కు అత్యంత అవమానకరం. గోరఖ్‌పూర్ మఠాధిపతిగా తన కారణంగానే మొన్నటి యూపీ ఎన్నికల్లో బీజేపీ అత్యధికస్థానాలు నెగ్గగలిగిందని చెప్పుకున్న ఆయనకు ఈ ఓటమి వ్యక్తిగతంగా పెద్ద దెబ్బ. ఆగర్భశత్రువులైన సమాజ్‌వాదీ పార్టీ, బహుజన్ సమాజ్ పార్టీలు తాత్కాలికంగా చేతులు కలపడంతోనే ఇంతటి అద్భుత విజయాలు దఖలుపడటం కచ్చితంగా విపక్షాల్లో ఐక్యతను పెంచుతుంది. బిహార్‌లో మహాకూటమిని చీల్చి, లాలూను దెబ్బతీసి, నితీష్‌కుమార్‌నైతే బీజేపీ తనవైపు తిప్పుకోగలిగింది కానీ, ప్రజలు జైలులో ఉన్న ఆర్జేడీ అధినేత పక్షానే నిలిచివున్నారని వాదించేందుకు ఆరియా ఫలితం ఊతాన్నిస్తుంది.

సాధారణంగా ఉప ఎన్నికల్లో ఒకటిరెండు స్థానాలు కోల్పోయినంత మాత్రాన అధికారపక్షానికి వచ్చే నష్టమూ ఉండదు, ప్రజలకంత పట్టింపూ ఉండదు. కానీ, యూపీ ఫలితాలు రాజకీయంగా పెద్ద దుమారాన్నే సృష్టించాయి. మోదీ అనే ఓ మహాబలవంతుడు, రేపోమాపో ఆయనకు ధీటుగా ఎదుగుతారని అంతా అనుకుంటున్న ఓ యోగి ఇలా చతికిలబడిపోతారని ఎవరూ ఊహించలేదు. ఎంతోమందికి ఆశ్చర్యాన్నీ, విపక్షాలకు అమితానందాన్నీ కలిగించిన ఈ పరిణామానికి మాయావతి ఆఖరునిముషంలో సంకల్పించిన రాజకీయ ప్రయోగం మూల కారణం. మోదీ–యోగీలు రాష్ట్రంలోకి అడుగుపెట్టేవరకూ పరస్పరం కత్తులు దూసుకున్న ఎస్పీ, బీఎస్పీలు ఒక్కసారిగా చేతులు కలిపితే దానికి ప్రభావం క్షేత్రస్థాయిలో ఏమేరకు ఉంటుందన్నది ఆమె ఈ ఎన్నికల్లో పరీక్షించారు. కేవలం వారం ముందు తీసుకున్న నిర్ణయంగా చెబుతున్నప్పటికీ, ఇరుపక్షాల నేతల్లోనూ ఎప్పటినుంచో ఈ ఆలోచన, దాని అవసరం, తమ దుస్థితిపై అవగాహన ఉన్నమాట నిజం. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఒంటరిగా యుద్ధంచేసి విజయం సాధించగలిగే స్థితిలో రెండు పార్టీలూ లేవన్నది నిర్వివాదాంశం. అధినేతల ఆలోచనలకు అనుగుణంగా క్షేత్రస్థాయి నాయకులు పనిచేయడమూ, మాయావతిమాటకు సై అని దళిత ఓటర్లు ఎస్పీ అభ్యర్థికి జై కొట్టడం విశేషమైన మార్పు. చాలా ఎన్నికల్లో అత్యున్నతస్థాయి అవగాహనలు, ఒప్పందాలు ప్రజాక్షేత్రంలో పనికిరాకుండా కొట్టుకుపోతుంటాయి. అధినాయకులు అకస్మాత్తుగా కత్తులు దించినంతమాత్రాన ఓటర్లు దీర్ఘకాలిక వైరాన్ని తక్షణమే పక్కనబెట్టలేరు. వరదలో చిక్కిన పాము ముంగిసల సహకారంగా ఆదిత్యనాథ్ దీనిని పోల్చినప్పటికీ, విపత్తును నాయకులతో పాటు ప్రజలు కూడా గుర్తించడంలోనే విశేషమున్నది. ఈ కలయిక ఇంతటి విపత్తు తెస్తుందనీ, తన పరువు తీయడంతో పాటు, వరుస మఠాధిపతులందరూ ఆ ప్రాంతంలో పాదుకొలిపినట్టుగా చెబుతున్న ప్రతిష్ఠను కూడా బలహీనపరుస్తుందని యోగి ఊహించలేదు. కేవలం ఓట్ల లెక్కతోనో, కూడికలూ తీసివేతలతోనో ఈ రెండు స్థానాల్లో వచ్చిన మార్పును విశ్లేషించడం కష్టం. మొన్నటి ఎన్నికల్లో ఎస్పీ–బీఎస్పీలకు వచ్చిన ఓట్లను కూడి, బీజేపీ ఓట్లతో తూకం వేస్తే ఈ ఫలితం రాదు. రెండు ప్రత్యర్థిశక్తుల కలయిక సృష్టించిన ఒక కొత్త ఉత్సాహం, కొత్త గాలి ఈ ఫలితానికి కారణమైంది. రేపో మాపో తమ పార్టీలు విలీనం కాబోతున్నాయంటూ దిగువస్థాయి నాయకులంతా అనుకోవడం, ఆశించడం ఇప్పటికే ఆరంభమైంది. సమాజ్‌వాదీ పార్టీ ఇప్పుడు మాయావతి బద్ధశత్రువు ములాయం సింగ్ చేతిలో లేదు. మిగతా సామాజికవర్గాలను కూడా దగ్గర చేర్చుకొని యాదవులపార్టీగా ఉన్న పేరును తుడిచేసే పనిలో ఉన్నారు అఖిలేష్. వృద్ధనాయకులందరినీ దూరంపెట్టి, కొత్త ఆలోచనలతో, వ్యూహాలతో సాగుతున్న ఈ యువకుడితో చేతులు కలపడం తలుచుకుంటే మాయావతికి కష్టమేమీ కాదు.

బిహార్‌లో ఆర్జేడీ విజయం జైల్లో ఉన్న లాలూకు ఎంతో ఉపశమనాన్నిచ్చివుంటుంది. యూపీ మాదిరిగా ఇక్కడి ఫలితాలు రాజకీయ సమీకరణలను మార్చేంతవి కాకపోయినా, లాలూ కుమారుడు తేజస్వి యాదవ్ నాయకత్వానికి గుర్తింపునిచ్చాయి. నితీశ్–మోదీ అపవిత్ర కలయికను ప్రజలు ఆమోదించలేదనీ, లాలూను వీరిద్దరూ కుట్రపూర్వకంగా జైలుపాల్జేసినట్టు ప్రజలు భావిస్తున్నారనీ చెప్పుకోవడానికి ఉపకరిస్తుంది. నితీశ్ వెన్నుపోటు నుంచి తేరుకోవడానికీ, లాలూ పార్టీ రాష్ట్రంలో బలంగా ఉన్నదని చాటిచెప్పుకోవడానికీ, కాంగ్రెస్‌తో చేతులు కలిపి సాగడానికీ మార్గం సుగమమవుతుంది. ఈశాన్యం సహా అనేక రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయాలు సాధిస్తూ, పొత్తులు ఎత్తులతో కొన్ని పీఠాలను వశం చేసుకుంటూ రాగలుగుతున్న బీజేపీ మొన్న రాజస్థాన్‌లోనూ, ఇప్పుడు యూపీలోనూ చతికిలబడటం ఆశ్చర్యకరమైన పరిణామమే. మిగతా పార్టీలో దిగువస్థాయి నాయకుల మధ్య ఉన్న వైరాలు, వైషమ్యాలు అపజయాలకు కారణాలవుతాయనీ, బీజేపీలో మోదీ–అమిత్‌షాలు తలుచుకున్నప్పుడే వ్యతిరేక ఫలితాలు వస్తాయని కొందరి నమ్మకం. మొన్న మొండిఘటం వసుంధరను, ఇప్పుడు ధిక్కారానికీ, తలబిరుసుకూ మారుపేరైన యోగినీ ఇలా లొంగదీసుకొని సార్వత్రిక ఎన్నికల నాటికి తమమాటకు తిరుగులేకుండా చేసుకోవడమే అసలు లక్ష్యమని వారి వాదన. నిజానిజాలు అటుంచితే, ఈ ఫలితాలు అటు ఢిల్లీలోనూ ఇటు రాష్ట్రాల్లోనూ విపక్షాలకు ఎనలేని ఉత్సాహాన్నిచ్చి, చేయీచేయీ కలిపి పరుగు తీసే అవకాశాన్ని ఇచ్చినమాట వాస్తవం.

విశ్వాన్వేషి



బలమైన శరీరాల
దుర్బల మనస్కులకి
అష్టైశ్వర్యాలున్నా అలమటించే అల్పులకి

పరిగెత్తగలిగినా పడకకే
పరిమితమయ్యే సోమరులకి
తన జీవితాన్నే
వ్యక్తిత్వ వికాస పాఠం చేసినవాడు
సహాయ నిరాకరణలో శరీరం
సానుభూతి కోరని దృక్పథం
జీవితంతో నిరంతర పోరాటం
లోక క్షేమం కోసం ఆరాటం
విశ్వాంతరాళాల శోధనం
విధినే ధిక్కరించిన ధైర్యం
ప్రత్యక్ష జ్ఞానానికే పీఠం
పరోక్ష దైవానికి స్థానం లేదన్న స్థైర్యం

పొంచి ఉన్న మృత్యువుని సైతం
వేచి ఉండేలా చేసిన సంకల్ప బలం
అననుకూల స్థితిని
అనుకూలంగా మార్చుకోవడమెలాగో
ఓటమి ఎదురొస్తుందన్నా
పోరాటపటిమను ప్రదర్శించడమెలాగో
అనంతమైన ఆత్మవిశ్వాసాన్ని
అలవరచుకోవడమెలాగో
జగతికి నేర్పినవాడు
కనుబొమలనో
కండరాలనో
వేలి కొసలనో
కదిలించగలిగినా చాలు
అనంత గగన రహస్య ఛేదనం
సమున్నత జ్ఞాన శిఖరారోహణం
సాధ్యమేనని చాటి చెప్పిన
మేధా సంపన్నుడు


(ఆత్మశక్తికి ప్రతీక స్టీఫెన్ హాకింగ్‌కు అశ్రుతాంజలి)

■ నల్లపనేని విజయలక్ష్మి

ప్రజాహిత బడ్జెట్లు

ఈ ఆర్థిక సంవత్సరం(2018–19) బడ్జెట్ ప్రవేశ పెట్టిన నేపథ్యంలో ఒక్కసారి రాష్ట్ర ఆవిర్భావం నుంచి ఈ సంవత్సరం వరకు ప్రవేశ పెట్టిన బడ్జెట్ల తీరు తెన్నులను, ఇప్పటివరకు చోటు చేసుకున్న అభివృద్ధి, సంక్షేమ అంశాలను పరిశీలిస్తే ఆసక్తికర అంశాలు తెలుస్తాయి. రాష్ట్రం ఏర్పాటైన తొలిరోజుల్లో ప్రభుత్వం అనేక సవాళ్ళను ఎదుర్కోవాల్సి వచ్చింది. తీవ్ర విద్యుత్ సంక్షోభంతో, విద్యుత్ కోతలతో సతమయ్యే రాష్ట్రాన్ని, వ్యవసాయరంగానికి కూడా 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేసే దిశగా తీసుకెళ్లడం ఆషామాషీ విషయం కాదు. రైతు దగ్గర నుంచి వ్యవసాయ శిస్తు వసూలుచేసే పరిస్థితి నుంచి, వ్యవసాయానికి ఎకరాకు రూ.8000 పెట్టుబడి మద్దతు పథకాన్ని ప్రభుత్వం వేశపెట్టడం ఒక అద్భుతమైన చర్య. అసంఘటిత వ్యవసాయ రంగాన్ని పూర్తిస్థాయిలో సంఘటితం చేసే దిశగా రాష్ట్రవ్యాప్తంగా రైతు సమన్వయ సమితులను ఏర్పాటుచేయడం పెద్ద సవాలు. యాదవులకు, కురుమలకు సబ్సిడీ మీద గొర్రెల పంపకం, బెస్తలకు, ఇతర మత్స్యకారులకు చేపల పంపకం కేసీఆర్ నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన అనేక పథకాల్లో మచ్చుకు కొన్ని మాత్రమే!

ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొట్టమొదటి (2014–15) సంవత్సరానికి బడ్జెట్ రూపొందించడం కేసీఆర్ ప్రభుత్వానికి పెద్ద సవాల్. రాష్ట్ర ఆదాయ వనరుల విషయంలో కానీ, వ్యయానికి సంబంధించి కానీ, ఏ మాత్రం అంచనా ప్రభుత్వం దగ్గర లేదు. ప్రజల ఆశయాలకు, ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వ విధానాల కల్పనకు దర్పణం పట్టే విధంగా బడ్జెట్ ప్రతిపాదనలు వుండాలి కానీ, కేవలం ఆదాయ వ్యయ లెక్కల పట్టికగా ఉండరాదని ప్రభుత్వ ఉన్నతాధికారులకు స్పష్టం చేసారు ముఖ్యమంత్రి కేసీఆర్. అన్ని రంగాలలో సమధర్మ న్యాయసమ్మతమైన అభివృద్ధిని చేకూర్చి, సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధికి బాటలు వేయడం నాటి ప్రభుత్వం ముందున్న సవాలు. ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం, వికేంద్రీకరణ నమూనా అభివృద్ధికి పీట వేసి, 'మన ఊరు–మన ప్రణాళిక' కార్యక్రమం ద్వారా, గ్రామీణ స్థాయిలో అట్టడుగు వర్గాల ప్రజల అవసరాలెలా ఉంటాయన్న విషయంలో సూచనలు, సలహాలు రాబట్టింది. దేశంలో, ప్రపంచంలో ఎక్కడా అంతవరకు జరగని రీతిలో, ఆగస్ట్ 19, 2014న, ఒకే ఒక్క రోజున రాష్ట్రవ్యాప్తంగా 'సమగ్ర కుటుంబ సర్వే' చేపట్టి పూర్తి చేసింది. బడ్జెట్ తయారీకొరకు, ఒక్కో రంగంలో ప్రాధాన్యతాంశాలను గుర్తించడానికి, వనరుల సమీకరణకు అవలంబించాల్సిన విధానాల రూపకల్పనకూ, సూచనలు సలహాలు ఇచ్చేందుకు 14 టాస్క్ బృందాలను ఏర్పాటు చేసింది కేసీఆర్ ప్రభుత్వం. వీటన్నింటి నేపథ్యంలో, టాస్క్ బృందాల సిఫార్సుల మేరకు, మొట్టమొదటి తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌ను నవంబర్ 5, 2015న రాష్ట్ర శాసనసభకు సమర్పించడం జరిగింది. ఆ విధంగా, రాష్ట్ర ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన సమగ్ర సమాచారం సరిగ్గా లేకుండానే, గతం కంటే



రాష్ట్ర శాసనసభలో ఈ ఏడాది ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గత 45 నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం రూపకల్పన చేసి అమలు పరుస్తున్న కార్యక్రమాలను ఏ విధంగా ఏ విధంగా స్థిరపర్చవచ్చు, ఏ విధంగా పటిష్టం చేసుకోవచ్చు అనే విషయాలు స్పష్టంగా కనిపిస్తాయి. రాష్ట్ర స్థూల ఆర్థిక పరిస్థితి ఎలా మెరుగుపడిందో తెలియచేస్తుందీ బడ్జెట్. జీఎస్టీ అమలు, పెద్దనోట్ల రద్దు తదనంతర పరిణామాల తర్వాత కూడా రాష్ట్రం సాధించిన ఆర్థికాభివృద్ధిని ఈ బడ్జెట్ స్పష్టం చేసింది.

పూర్తి భిన్నంగా, అందుబాటులో వున్న అంశాల ఆధారంగా, మొట్టమొదటి తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ రూపొందించడం జరిగింది. 2014–15 బడ్జెట్ వాస్తవానికి రాష్ట్ర ఏర్పాటుకు పూర్వం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శాసనసభకు సమర్పించిన వోట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌కు కొనసాగింపు మాత్రమే. అంటే, ఆ ఏడాది 12 నెలల ఆదాయ–వ్యయ వివరాల అంచనాలు పూర్తిస్థాయిలో లేని నేపథ్యంలో ఆ తరువాతి సంవత్సరం అంటే 2015–16 బడ్జెట్ తయారుచేయాల్సి వచ్చింది. 2015–20 మధ్యన ఐదేళ్ళ కాలానికి 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు కేంద్ర పన్నుల డివిజిబుల్ పూల్ కింద రాష్ట్రాల వాటాను 32 శాతం నుండి 42 శాతానికి పెంచినప్పటికీ, ఆ లాభం తెలంగాణకు చేకూరలేదు. దీనికి కారణం జాతీయ సగటు తలసరి ఆదాయం కంటే తెలంగాణ తలసరి సగటు ఆదాయం ఎక్కువగా వుండడమే! తలసరి ఆదాయానికి సంబంధించి జిల్లా జిల్లాకు మధ్యనున్న భారీ వ్యత్యాసాలు కూడా రాష్ట్ర తలసరి సగటు ఆదాయంలో భాగమే. కేంద్ర పన్నుల్లోనుంచి రాష్ట్రానికి రావాల్సిన వాటా తగ్గినప్పటికీ (2014–15లో వాటాగా ఇచ్చిన 2.893శాతం నుంచి 2015–20 మధ్య ఐదేళ్ళ కాలంలో 2.437శాతానికి తగ్గుదల) రాష్ట్రం విత్త సంబంధమైన ప్రమాణాలను పటిష్టంగా నిలబెట్టుకోగలటమే కాకుండా, అదనంగా జీఎస్డీపీ మీద 0.5శాతం ఎఫ్ఆర్బీఎం పొందగలిగి, అప్పుతెచ్చుకోగల సామర్థ్యం సంపాదించుకోగలిగింది. 2016–17 బడ్జెట్ రూపొందించుకునే సమయానికల్లా, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై, ప్రభుత్వానికి ఒక సమగ్రమైన అవగాహన వచ్చింది. 31 మార్చ్ 2015 నుండి 31 మార్చ్ 2016 వరకు, ప్రణాళిక, ప్రణాళికేతర పథకాల కింద ఆదాయవ్యయ లెక్కలు ఖచ్చితంగా తెలవడంతో, తెలంగాణ బడ్జెట్ రూపకల్పనకు అసలుసిసలైన ప్రాతిపదిక దొరికింది. 2016–17 సంవత్సరం శాసనసభకు సమర్పించిన బడ్జెట్ మూడో బడ్జెట్ అయినప్పటికీ, వాస్తవంగా ఆలోచిస్తే, ఒక సమగ్ర అవగాహనతో, పూర్తి స్థాయి సమీక్ష ఆధారంగా, అన్ని రకాల ఆదాయవ్యయాల వాస్తవ అంచనాల ప్రాతిపదికగా తయారుచేసిన మొదటి బడ్జెట్ అనాలి.

2015–16 సంవత్సరంతో పోల్చి చూస్తే, 2016–17లో రాష్ట్ర స్వయం పన్నుల రెవెన్యూలో 21.1% వృద్ధిరేటు సాధించగలిగింది. ఇది దేశంలోని మిగతా అన్ని రాష్ట్రాలకంటే అధికం. ఈ క్రమంలో, గత ఏడాది (2017–18)లో రాష్ట్రం ప్రవేశపెట్టిన బడ్జెట్, ఏ విధంగా చూసినా స్ఫూర్తిదాయకం. ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా సమాజంలోని అన్ని వర్గాలకు, కులవృత్తుల వారికి, అన్ని మతాల వారికి, వివిధ రంగాలలో నిమగ్నమై వున్న వారికి, అభివృద్ధిసంక్షేమ కార్యక్రమాలను అమలుచేసే అన్ని ప్రభుత్వ శాఖల వారికి, అల్పాదాయ మధ్య తరగతి వారికి, సమాజంలో వారూవీరూ అనే తేడా లేకుండా అందరికీ చేరువయ్యే విధంగా బడ్జెట్ రూపకల్పన జరిగింది.

2014లో రాష్ట్ర ఆవిర్భావానంతరం తెలంగాణ ఆర్థిక పరిస్థితిలో, ఆర్థిక గమనంలో గణనీయమైన అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తున్నది. రాష్ట్ర ఏర్పాటుకు ముందు రెండేళ్ళ కాలంలో (2012–14) రాష్ట్ర జీఎస్డీపీ సగటు వార్షిక వృద్ధి రేటు 4.2శాతం మాత్రమే ఉండగా, తదనంతరం మూడేళ్ళ కాలంలో (2014–17) అది 9.5శాతానికి చేరుకోవడం గమనించాల్సిన అంశం. ఇంతే కాకుండా 2015–16తో పోల్చి చూస్తే, 2016–17లో రాష్ట్ర స్వయం పన్నుల రెవెన్యూలో 21.10శాతం వృద్ధి రేటుతో, దేశంలోని మిగతా అన్ని రాష్ట్రాలకంటే అగ్రస్థానంలో నిలిచింది. 2017–18 ఆర్థిక సంవత్సరానికి గాను, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నివేదిక ప్రకారం, రెవెన్యూలో 17.82శాతం వృద్ధితో తెలంగాణ అగ్రభాగాన ఉంది. అణగారిన, పేద వర్గాల కనీస అవసరాలను తీర్చడానికి నిధులు సమకూర్చడానికి, ఖర్చు చేయడానికి, పూర్తి సంసిద్ధతతో వుంది. ఆ విధంగా ప్రభుత్వ నిధుల్లో గణనీయమైన భాగం మానవ వనరుల అభివృద్ధికి దోహదపడే రంగాలకు, తద్వారా మరింత ఉత్పాదకత దిశగా అడుగులేసేందుకు వెచ్చిస్తోంది.

ఈ ఏడాది ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గత 45 నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం రూపకల్పన చేసి అమలు పరుస్తున్న కార్యక్రమాలను ఏ విధంగా ఏ విధంగా స్థిరపర్చవచ్చు, ఏ విధంగా పటిష్టం చేసుకోవచ్చు అనే విషయాలు స్పష్టంగా కనిపిస్తాయి. రాష్ట్ర స్థూల ఆర్థిక పరిస్థితి ఎలా మెరుగుపడిందో తెలియచేస్తుందీ బడ్జెట్. జీఎస్టీ అమలు, పెద్ద నోట్ల రద్దు తదనంతర పరిణామాల తర్వాత కూడా రాష్ట్రం సాధించిన ఆర్థికాభివృద్ధిని ఈ బడ్జెట్ స్పష్టం చేసింది. 2017–18 ఆర్థిక సంవత్సరంలో రూపకల్పన చేసిన పథకాలను భవిష్యత్‌లో ఎలా అమలు చేయబోతున్నారన్న విషయాలు కూడా ఈ బడ్జెట్లో స్పష్టం చేయడం జరిగింది. ప్రజల ఆశయాలను, ఆకాంక్షలను, కోరికలను ప్రతిబింబించే అసలుసిసలైన బడ్జెట్‌గా ఈ బడ్జెట్‌ను భావించవచ్చు.

■ వనం జ్వాలా నరసింహారావు

ప్రాంతీయ విజేతలే నిర్ణేతలు



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

బీజేపీయేతర, కాంగ్రెసేతర 'తృతీయ ఫ్రంట్' ప్రభుత్వ ఏర్పాటు ఒక ప్రశస్త ఆలోచనే. అయితే అది ఆచరణలో సాధ్యమేనా? 1990వ దశకం మధ్య సంవత్సరాల్లో అటువంటి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ చాలా ప్రయత్నించారు. అయితే ఒక 'కిచిడీ' ప్రభుత్వం వల్ల దేశానికి మేలు జరుగుతుందా? అని ఆ మాజీ ప్రధాన మంత్రిని ప్రశ్నించాము. 'బీజేపీయేతర, కాంగ్రెసేతర తృతీయ ఫ్రంట్ ప్రభుత్వం ఆక్షేపణీయమా అనేది నాకు తెలియదు. అయితే అది ఏర్పడడం అనివార్యం' అని వీపీసింగ్ స్పష్టంగా సమాధానమిచ్చారు తృతీయ ఫ్రంట్ రాజకీయాల తొలి చిహ్నం విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్. 1989లో నేషనల్ ఫ్రంట్‌ను నిర్మించి, ఆశ్చర్య జనకంగా బయటినుంచి బీజేపీ, వామపక్షాల మద్దతుతో ఆయన ప్రధానమంత్రి పదవిని అధిష్టించారు. రాజీవ్ గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తొలగించడమే నేషనల్ ఫ్రంట్ ఏకాంశ ఎజెండాగా ఉండేది. ఇప్పుడు వీస్తున్న రాజకీయ పవనాల్లో విన్పిస్తున్న ప్రశ్న ఏమిటంటే 2019లో మోదీకి వ్యతిరేకంగా అటువంటి రాజకీయ కూటమి ఆవిర్భవిస్తుందా?

ఉత్తరప్రదేశ్‌లో రెండు లోక్‌సభా స్థానాలకు ఇటీవల జరిగిన ఉపఎన్నికల ఫలితాలు భావి రాజకీయాలకు సూచకంగా ఉన్నాయి. బద్ధ శత్రువులైన సమాజ్‌వాదీ పార్టీ, బహుజన్ సమాజ్ వాదీ పార్టీలు ఈ ఉప ఎన్నికలలో చేతులు కలిపాయి. ఎస్‌పి అభ్యర్థులకు బిఎస్‌పి బేషరతు మద్దతునివ్వడం వల్లే మోదీ ప్రత్యర్థులకు ఈ అపూర్వ విజయం సాధ్యమయింది. దేశంలో కెల్లా అత్యధిక జనాభా, అత్యధిక లోక్‌సభా స్థానాలు గల ఉత్తరప్రదేశ్‌లో మోదీ మహాశక్తిని అడ్డుకోవడంలో ఎస్‌పి, బిఎస్‌పిలు సఫలమయ్యాయి. ప్రాంతీయ పార్టీల 'ఫెడరల్ ఫ్రంట్' నేర్పాటు చేయాలన్న తన ఆకాంక్షను బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఇప్పటికే బాహాటంగా వ్యక్తం చేశారు. ఒడిషా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బిజూ జనతాదళ్ తో సహా ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాలలోని పలు ప్రాంతీయ పార్టీలతో ఒక ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు మమత లక్ష్యంగా ఉన్నది. తెలంగాణలో ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు కూడా ఒక ప్రాంతీయ కూటమిని నిర్మించాలని ప్రగాఢంగా ఆకాంక్షిస్తున్నారు. గతంలో తృతీయ ఫ్రంట్ రాజకీయాల పతాక ధారిగా వెలుగొందిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ఇటువంటి ఆలోచనల్లోనే ఉన్నారు. మోదీ ప్రభుత్వం నుంచి తెలుగుదేశం పార్టీ మంత్రులు వైదొలిగారు. భావి కార్యాచరణకు అనుసరించాల్సిన మార్గాల గురించి చంద్రబాబు నిశితంగా పరిశీలిస్తున్నారు. ఇదిలావుండగా దేశంలో రాజకీయ పరిస్థితులు వేగంగా మారిపోతోన్న నేపథ్యంలో యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ రంగంలోకి దిగి మోదీని వ్యతిరేకిస్తున్న పార్టీల నాయకులకు ఇటీవల ఒక విందు నిచ్చారు.

1989లో కాంగ్రెస్ పట్ల తీవ్ర వ్యతిరేకతే అటు మితవాద పక్షాలను, ఇటు వామపక్షాలను ఒక సమైక్య వేదిక మీదకి తీసుకువచ్చాయి. ఇప్పుడు బీజేపీ పట్ల వ్యతిరేకత గాక, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పట్ల తీవ్ర వ్యతిరేకతే వివిధ రాజకీయపక్షాలను ఏకీకరిస్తోంది. ఇది ఎవరూ కొట్టివేయలేని వాస్తవం. దేశ రాజకీయాలలో ప్రధాని మోదీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షాల గుత్తాధిపత్యం అంతకంతకూ పెరిగిపోతుండడం బీజేపీయేతర రాజకీయ పక్షాలను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తోంది. ఈ కారణంగానే అవి ఏకమవుతున్నాయి. ఏకం కానిపక్షంలో తమకు మనుగడ ఉండదని అవి భయపడుతున్నాయి. 1996లో 13 రోజుల వాజపేయి ప్రభుత్వం లోక్‌సభ విశ్వాసాన్ని పొందలేక పతనమయింది. బాబ్రీ మసీదు కూల్చివేత అనంతరం బీజేపీ 'మతతత్వ రాజకీయాల'ను వివిధ రాజకీయ పక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఆ పార్టీతో ఎటువంటి సంబంధాలు కలిగివున్నా తమకు నష్టం జరగగలదని అవి భావించాయి. ఇప్పుడు అవి బీజేపీని హిందూత్వ పార్టీ అయినందువల్ల వ్యతిరేకించడం లేదు. మోదీ–షాల నాయకత్వంలోని బీజేపీ ఎన్నికల వ్యూహాల నెదుర్కొని మనుగడ సాగించలేమని ప్రతి రాజకీయ పార్టీ భయపడుతోంది. ఈ భయమే ప్రతిపక్షాలను ఏకం చేస్తోంది. ఇటువంటి భయం విపక్షాల్లోనేగాకుండా బీజేపీ మిత్రపక్షాల్లో కూడా ఉన్నదనేది గమనార్హం.

శివసేనే ఇందుకొక తార్కాణం. హిందూత్వ విషయంలో భావ సారూప్యత ఉన్నందునే శివసేనను, మరే పార్టీ కంటే ముందుగా బీజేపీకి సన్నిహితం చేశాయి. ఇప్పుడు బీజేపీ నాయకత్వాన్ని శివసేన తీవ్రంగా విమర్శిస్తోంది. వ్యక్తులను కేంద్రంగా చేసుకొని ఆ విమర్శలు సాగుతున్నాయి. శివసేన–బీజేపీ మధ్య విభేదాలు భావజాలపరమైనవి కావనేది స్పష్టం. కేంద్రంలోని అధికార పార్టీ తమ ప్రయోజనాలను ప్రాధాన్యమివ్వడం లేదని మహారాష్ట్ర మాజీ అధికార పక్షం భావిస్తోంది. సరే, మమతా బెనర్జీ, నవీన్ పట్నాయక్, కేసీఆర్ నాయకత్వంలోని పార్టీలు ఒకప్పుడు బీజేపీకి మిత్రపక్షాలుగా ఉన్నాయి. 1990ల్లో బీజేపీని ప్రతి రాజకీయ పక్షమూ ఒక 'అంటరాని పార్టీ'గా పరిగణించింది. అటువంటి 'అస్పృశ్యత' సిలువ భారాన్ని బీజేపీ ఇంకెంత మాత్రం మోయడం లేదు. ఈ ప్రాంతీయ పార్టీలకు చెందిన ప్రతి ముఖ్యమంత్రీ బీజేపీ ఎన్నికల యంత్రాంగపు శక్తిసామర్థ్యాలకు భయపడుతున్నారు. మోదీ–షా రాజకీయ ఆకాంక్షలు వారిని మరింతగా భయపెడుతున్నాయి. దేశవ్యాప్తంగా 21 రాష్ట్రాలలో బీజేపీ అధికార కేతనం ఎగురవేయడం వెనుక ఈ నాయక ద్వయం అనుసరించిన వ్యూహాలే కారణమన్న వాస్తవాన్ని ఈ రాజకీయ పార్టీలు విస్మరించలేవు. ఉత్తరప్రదేశ్‌లో అఖిలేశ్ యాదవ్, మాయావతిలు ఎట్టకేలకు చేతులు కలపడానికి కారణం మనుగడ కోసం ఆరాటమే. మోదీని అడ్డుకోకపోతే తమ పార్టీలకు అస్తిత్వముండబోదని గుర్తించడం వల్లే ఇటీవలి ఉప ఎన్నికలలో వారు కలసికట్టుగా పనిచేసి విజయం సాధించారు. మోదీని ఓడించి తీరాలన్న ప్రతిపక్షాల ప్రగాఢ కోరిక ఫలిస్తుందా? దేశ రాజకీయాలను మార్చివేయగలుగుతుందా? వివిధ రాజకీయపక్షాలకు వచ్చిన ఓట్లను ప్రాతిపదికగా తీసుకొంటే ఈ ప్రశ్నకు సానుకూల సమాధానం లభిస్తుంది. 2014 సార్వత్రిక ఎన్నికలలో బీజేపీకి 31 శాతం ఓట్లు వచ్చాయి. ఈ ఓట్లలో అత్యధిక భాగం ఉత్తర, పశ్చిమ భారత రాష్ట్రాలలో లభించినవే. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీకి 19శాతం ఓట్లు దక్కాయి. మరింత స్పష్టంగా చెప్పాలంటే బీజేపీ, కాంగ్రెస్‌లు పోలయిన మొత్తం ఓట్లలో సగం ఓట్లను గెలుచుకున్నాయి. దీన్నిబట్టి ఇతర రాజకీయపక్షాలకు లభించిన ఓట్ల వాటా గణనీయమైనదేనని చెప్పక తప్పదు. వ్యూహాత్మక పొత్తుల సహాయంతో మరింత అధిక సంఖ్యలో సీట్లను గెలుచుకోవడానికి ఆస్కారమున్నది. 2014లో ఎస్‌పి, బీఎస్‌పిల మధ్య పొత్తు ఉన్నట్లయితే ఉత్తరప్రదేశ్‌లో బీజేపీకి దాదాపు 35 సీట్లు తగ్గివుండేవని స్పష్టంగాచెప్పవచ్చు.



2019 సార్వత్రిక ఎన్నికల అనంతరం భారతీయ జనతా పార్టీ ప్రాబల్య 'జాతీయ' రాజకీయ శక్తిగా ఉండగలుగుతుంది. అయితే ప్రధాన రాజకీయ చర్చ మాత్రం తమ తమ స్వరాష్ట్రాలలో విజయాన్ని సాధించిన ప్రాంతీయ పార్టీల మీదే జరుగుతుంది!

చట్టసభల్లో సంఖ్యాబలం పెంచుకోవడానికి ఎన్నికల పొత్తులు తోడ్పడతాయి. అయితే నాయకుల పట్ల ప్రజలు చూపించే ఆదరాభిమానాలు కూడా రాజకీయాలలో నిర్ణయాత్మక ప్రభావాన్ని చూపుతాయి. మోదీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఏకం కావడాన్ని ప్రజలు సానుకూలంగా చూడవలసివున్నది. విపక్షాల స్వార్థ రాజకీయాలకు మోదీ బలి అవుతున్నారన్న భావం ప్రజల్లో కలగకుండా ఉండాలి. 1971లో ప్రతిపక్షాల ఐక్యతను ఇందిరాగాంధీ చాలా చతురంగా తనకు అనుకూలంగా ఉపయోగించుకున్నారు. అభివృద్ధి నిరోధక శక్తులు తాను అమలపరుస్తున్న ప్రగతిశీల విధానాలను వ్యతిరేకిస్తున్నాయని ఆమె ఆరోపించారు. ఆనాటి ప్రతిపక్షాల ఐక్యతపై తన ఆక్షేపణను ఆమె ఒక శక్తిమంతమైన నినాదం రూపంలో వ్యక్తం చేశారు: 'వో కెహ్తే హై ఇందిరా హటావో, మే కెహ్తే హూ గరీబీ హటావో'. ఈ 'గరీబీ హటావో' నినాదం ప్రజలను విశేషంగా ఆకట్టుకొంది. ఆసేతుహిమాచలం అసంఖ్యాక ఓటర్లు ఆమెకు మద్దతుగా ఓటు వేశారు. మరి ఇందిర చాణక్య రాజకీయాలకు మోదీనే నిజమైన వారసుడని చెప్పవచ్చు.

ఇక మరో ముఖ్యమైన విషయం మోదీ నియంతృత్వ వ్యవహార శైలికి ఎంతగా భయపడుతున్నప్పటికీ బీజేపీని వ్యతిరేకిస్తున్న రాజకీయ పక్షాలేవీ కాంగ్రెస్ పార్టీని విశ్వసించడం లేదు. ఈ కారణంగానే రాహుల్ నాయకత్వంలో ఒక జాతీయ స్థాయి సంకీర్ణాన్ని ఏర్పాటు చేయడం కాంగ్రెస్‌కు కష్టమైపోతోంది. రాహుల్ నాయకత్వాన్ని ఒక మమతా బెనర్జీ, ఒక శరద్ పవార్ ఆమోదించే అవకాశం లేదు. ప్రధానమంత్రి పదవికి తమ ఉమ్మడి అభ్యర్థిగా ఏ ఒక్క నాయకుడిపైనా ప్రతిపక్షాలకు ఏకాభిప్రాయం లేదు. మోదీకి ఇప్పటికీ మరే నాయకుడికి లేని ప్రజాదరణ ఉన్నదనేది విపక్షాలు విస్మరించలేని వాస్తవం. ప్రజాబలం విషయంలో మోదీకి సమానుడైన నాయకుడు ఏ పార్టీలోనూ లేడు. మరి ఇటువంటి పరిస్థితుల్లో నిస్సహాయ ప్రతిపక్షాలకు మార్గాంతరమేమిటి? ప్రాంతీయ స్థాయిలో అంటే ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రంలో బలంగా ఉన్న రాజకీయపక్షం బీజేపీ, మోదీతో సమర్థంగా తలపడాలి. కాంగ్రెస్ సైతం పరిమిత సంఖ్యలో మాత్రమే రాష్ట్రాలపై దృష్టిని కేంద్రీకరించాలి. 2019 సార్వత్రిక ఎన్నికల అనంతరం బీజేపీ ప్రాబల్య 'జాతీయ' రాజకీయ శక్తిగా ఉండగలుగుతుంది. అయితే ప్రధాన రాజకీయ చర్చ మాత్రం తమ తమ స్వరాష్ట్రాలలో విజయాన్ని సాధించిన ప్రాంతీయ పార్టీల మీదే జరుగుతుంది!

తాజా కలం: ఇటీవల ఒక కార్పొరేట్ సమావేశంలో ఒక పారిశ్రామిక వేత్త ఇలా అనడం విన్పించింది: 'మేము ఏ ప్రభుత్వాన్ని అయినా ఆమోదిస్తాము గానీ తృతీయ ఫ్రంట్ ప్రభుత్వాన్ని అంగీకరించలేము. అలా అంగీకరించడమంటే భారత్ పురోభివృద్ధి కథముగియడమే అవుతుంది'. కొన్ని వారాలక్రితం ఈ పారిశ్రామికవేత్తే కోల్‌కతాలో బెంగాల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌లో మాట్లాడుతూ భావి భారతనాయకురాలిగా మమతా బెనర్జీ విశిష్టతలను ఘనంగా ప్రశంసించారు మరి!

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

నిజంగానే అది చీకటి కాలమా?



■ వి. శ్రీనివాస్

సారాంశం

సింగపూర్‌లో జరిగిన ఒక సదస్సులో కాంగ్రెస్ యువ నేత రాహుల్‌గాంధీ ప్రసంగం తర్వాత సభికుల్లోంచి ప్రసేన్‌జిత్ అనే వ్యక్తి ఒక ప్రశ్న సంధించారు. "మీ కుటుంబసభ్యుల పాలనలో ఉన్నప్పుడు భారత్ తలసరి రాబడిలో వృద్ధి ప్రపంచ సగటు కంటే తక్కువగా ఎందుకుంది? మీ కుటుంబ సభ్యులు భారత ప్రధాని పదవి నుంచి తొలిగిపోయిన తర్వాత ప్రపంచ సగటుకంటే భారత్ తలసరి ఆదాయం చాలా ఎక్కువగా ఎందుకు పెరిగింది?" ఈ ప్రశ్న అడిగిన ప్రసేన్‌జిత్ తనను తాను "ఏషియా రీబోర్న్" అనే పుస్తక రచయితగా పరిచయం చేసుకున్నాడు. తన పుస్తకాన్ని యావత్ ఆసియాకు సంబంధించిన సమగ్ర రాజకీయ, ఆర్థిక చరిత్రగా చెప్పుకున్నారు. బసు ప్రశ్నకు రాహుల్ ఉక్కిరిబిక్కిరై, సమాధానం చెప్పుకోలేక తడబడినట్టుగా సోషల్ మీడియాలో వార్తలు, వీడియోలు హోరెత్తాయి. రాహుల్ నిజంగానే తడబడ్డారా? దీటుగా సమాధానం చెప్పలేకపోయారా? తడబడితే అందుకు కారణమేమిటీ? బసు లేవనెత్తిన అంశంలో నిజముందని రాహుల్ భావించారా? నెహ్రూ–గాంధీ హయాంలో కంటే కూడా భారత్ కాంగ్రెసేతర ప్రధానుల హయాంలోనే బాగా అభివృద్ధి చెందిందా? అభివృద్ధిని ఎలా చూడాలి? రాహుల్–బసు ఉదంతం అనేక కొత్త ప్రశ్నలకు ఆస్కారం ఇచ్చింది. ఆ ప్రశ్నలకు సమాధానాలు చెప్పుకోవాల్సి సందర్భాన్నీ కల్పించింది.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలి దశాబ్దాల్లో భారత్‌ను పునర్ నిర్మించడానికి ప్రథమ ప్రధాని నెహ్రూ మిశ్రమార్థిక విధానాలను అనుసరించారు. ఆయన అనుసరించిన ఆర్థిక వ్యూహాలు, అనుసరించిన విలువలు ఆ తర్వాత దశాబ్దాల్లో ఆయన వారసులుగా అధికారంలోకి వచ్చిన ఇందిరా, రాజీవ్‌గాంధీ కొనసాగించారు. ఈ విధానాలే దేశానికి చేటుచేశాయన్నది ప్రస్తుతం సాగుతున్న ప్రచారం. అప్పట్లోనే భారత్ స్వేచ్ఛా ఆర్థిక విధానాలను అనుసరించి ఉంటే దేశం ఇప్పటికే అమెరికా అయిపోయేదన్న ప్రాతిపదిక ఆధారంగా ఈ ప్రచారం సాగుతోంది. తన చరిత్రపై తనకే అవిశ్వాసం కలిగేలా భారత్‌ను నమ్మించడానికి బృహత్ ప్రయత్నాలు జరుగుతున్నాయి. అందులో భాగమే బసు ప్రశ్న.

భారత్ మిశ్రమార్థిక వ్యవస్థను అనుసరించడానికి నెహ్రూ ఆలోచనా విధానం ఎంత కారణమో అప్పటి చారిత్రక వాస్తవ పరిస్థితుల అంతే కారణం. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలోనే ప్రభుత్వం ప్రైవేట్ కాపిటల్‌కు పెద్ద పీట వేసే అవకాశాలు లేవు. దేశంలో భారీ పెట్టుబడులకు ప్రైవేట్ వ్యక్తులు సిద్ధంగా లేరు. ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు గుమ్మరించి చేపట్టిన ప్రాజెక్టులు, మౌలికవసతుల కల్పన, పబ్లిక్ సెక్టార్ సంస్థల ఏర్పాటు.. ఆ తర్వాత కాలంలో బలమైన పెట్టుబడిదారు వర్గం తయారయ్యేందుకు కూడా దోహదం చేసింది. ఈ రోజు కుబేరుల జాబితాలో వెలిగిపోతున్న అనేక కుటుంబాలు ఈ నేపథ్యంలో లబ్దిపొందినవే. నెహ్రూ మిశ్రమార్థిక విధానాల్లో సోషలిజం మొగ్గ ఎక్కువగా ఉంది. ఇది విస్తృత ప్రజానీకం అభివృద్ధికి కూడా ఉపయోగపడింది. ప్రపంచంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా, అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థగా భారత్‌కు ఈ రోజు ప్రపంచంలో ఉన్న గుర్తింపునకు కారణం గత పాతికేళ్ల ఆర్థిక చరిత్రలో లేదు. స్వాతంత్ర్యం వచ్చిన తొలి మూడునాలుగు దశాబ్దాల్లో దీనికి బీజం పడింది. భవిష్యత్ అవకాశాలను అందుకోవడానికి వీలుగా అతిపెద్ద మధ్య తరగతి వర్గం విస్తరించి సన్నద్ధం కావడానికి దోహదం చేసిన సమయం అది. అతికొద్ది మందికి, స్వల్ప వర్గాలకు మాత్రమే పరిమితమైన సామాజిక, ఆర్థిక, రాజకీయ మూలధనాన్ని విస్తృత శ్రేణి ప్రజలకు సమకూర్చేందుకు దోహదం చేసిన కాలం అది. 1990 తర్వాత ఆర్థిక రంగంలో వచ్చిన మార్పులను అందిపుచ్చుకున్న మధ్య తరగతి ఎగువ మధ్య తరగతి వర్గాలన్నీ నెహ్రూ–గాంధీ హయాంలో రూపుదిద్దుకున్నవే. ఆర్థిక విధానాలు మాత్రమే కాదు, వందల సంవత్సరాలపాటు వలసపాలనలో ఉన్న దేశంలో ప్రజల్లో స్వతంత్ర భావనలు, లౌకిక, ప్రజాస్వామ్య విలువల పట్ల అవగాహన పెరిగేందుకు అవసరమైన వాతావరణ నిర్మాణం కోసం కూడా నెహ్రూ–గాంధీ ప్రయత్నించారు.

దేశ అభివృద్ధికి కొలమానం తలసరి ఆదాయం ఒకటే అయితే అధిక వృద్ధి రేటు సంపద పంపిణీలో ప్రతిఫలిస్తుందా అన్నది కూడా ప్రశ్న. తలసరి ఆదాయం అనేది గణాంకాల మాయ. 100 మందిలో ఏడాదికి కోటి రూపాయలున్నవారు 10 మంది. కేవలం లక్ష రూపాయలనున్నవారు 90 మంది ఉంటే తలసరి రాబడి 10.90 లక్షల రూపాయలకు చేరుతుంది. 90 మంది సామాన్యుల రాబడి కాగితాలపై పది రెట్లు పెరిగిపోతుంది.



స్వాతంత్ర్యం వచ్చిన తొలి నాళ్లలో రూపుదిద్దుకున్న విధానాల్లో ప్రభుత్వాల ప్రమేయం ఉంది. నాయకుల పాత్ర ఉంది. చట్టసభలు, మేధావుల వాటా ఉంది. అర్థవంతమైన చర్చలు జరిగాయి. పారిశ్రామికవేత్తలు స్వయంగా విధానాల రూపకల్పనలో భాగం పంచుకోవడం మొదలైన తర్వాత అన్ని రకాల నైతికవిలువలను మార్కెట్ తొక్కిపారేసింది. సంక్షేమం అనేది నిషిద్ధ పదంగా మారింది. అందుకే నెహ్రూ ఈ కాలానికి సరిపడని వారయ్యారు.

వాస్తవిక జీవితం అధ్వాన్నంగానే ఉంటుంది. అధిక వృద్ధి రేటుతో భారత్ దూసుకుపోతున్న గతకొన్నేళ్లలోనే దేశంలో ఆర్థిక అసమానతలు అసాధారణంగా పెరిగిపోయాయి. కుబేరుల సంఖ్య కంటే రెట్టింపు పేదల సంఖ్య పెరుగుతోంది. అధిక వృద్ధి రేటుకు భారత్ చెల్లిస్తున్న మూల్యం కూడా భారీగానే ఉంది. బ్యాంకుల్లో పేరుకుపోయిన దాదాపు 10 లక్షల కోట్ల రూపాయల మొండి పద్దులు గాలికి ఆవిరైపోలేదు. ప్రైవేట్ ఆస్తులుగా ఘనీభవించి ఉన్నాయి.

ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోని ప్రజల కష్టార్జితం, ప్రభుత్వ ఖజానా, పబ్లిక్ సెక్టార్‌లోని అమూల్యమైన ఖనిజ వనరులు.. వీటన్నింటినీ ముడుపుకడుతున్నాం. నెహ్రూ హయాంలో వృద్ధి రేటు అతి తక్కువగానే ఉండొచ్చు. సంపద పంపిణీలో అసాధారణ అంతరాలు లేవు. క్రోనీ కాపిటలిజం కంటే ప్రభుత్వ నియంత్రణలోని ఆర్థిక వ్యవస్థ ఏమాత్రం అభివృద్ధి నిరోధకం కాదు.

ప్రణాళిక బద్ధమైన అభివృద్ధే ఆహారధాన్యాల్లో భారత్ స్వయం సమృద్ధికి దోహదం చేసింది. తలసరి ఆహారధాన్యాల లభ్యత నెహ్రూ–గాంధీల హయంతో పోలిస్తే ఇప్పుడు తగ్గింది. పౌష్టికాహార లోపం అతిపెద్ద శాపంగా మారి లక్షలాది కుటుంబాలను వెన్నాడుతోంది. అవకాశాలు ఎంతలా పెరిగిపోయాయో వాటిని అందుకోలేనంత దూరానికి అసంఖ్యాక ప్రజలను నెట్టేస్తున్నారు. వ్యవసాయం సంక్షోభంలో పడింది. రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. అనాలోచితమైన పెద్ద నోట్ల రద్దు దెబ్బతో అవ్యవస్థీకృత రంగంలోని లక్షాలది మంది ఉపాధి కోల్పోయారు. ఆర్థిక వృద్ధికి అత్యంతకీలకంగా చెబుతున్న జిఎస్‌టిని ప్రపంచ బ్యాంకే అత్యంత క్లిష్టమైన వ్యవస్థ అని ఈసడిస్తోంది. నెహ్రూ లేకుండా ఉంటే నీరవ్ మోదీలు, చోక్సీలు, విజయ్‌మాల్యాలు నాలుగు దశాబ్దాల క్రితమే తయారయ్యేవారు. కొత్త ఆర్థిక విధానాలు ప్రభుత్వ ఆస్తులను అభివృద్ధి పేరుతో ప్రైవేట్ సంస్థలు వ్యక్తులకు దఖలు పరుస్తుంటే నిరసనల్లేవు.

ప్రభుత్వ నియంత్రణ ఆర్థిక వృద్ధికి అవరోధమైతే చైనా అభివృద్ధిని ఏ విధంగా వ్యాఖ్యానిస్తారు? ప్రపంచాన్ని ఈ రోజు చైనా శాసిస్తోంది. ఆ దేశంలోని కీలకమైన ఉత్పత్తి సంస్థలన్నీ ప్రభుత్వ రంగంలోనే ఉన్నాయి. చైనా ప్రపంచ శక్తిగా ఎదగడంలో పబ్లిక్ సెక్టార్‌దే కీలకపాత్ర. ఆ దేశంలో కుబేరుల సంఖ్య అమెరికాను మించి ఉండటంలో కూడా పబ్లిక్ సెక్టార్ పాత్ర ఉంది. నిజానికి భారత్ 1990లో అనుసరించిన విధానాలకు ప్రభుత్వాలతో నిమిత్తం లేదు. నాయకులతో ప్రమేయం లేదు. ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకు బోర్డు రూముల్లో తయారైన విధానాలు, వారి ఖార్ఖానాల్లో తయారైన మేనేజర్లు దేశానికి దిశానిర్దేశం చేశారు. వారే దేశాన్ని నడిపించడం మొదలెట్టారు. లాభాపేక్ష మాత్రమే ఉన్న వ్యాపారులు చట్టసభల్లోకి ప్రవేశించి విధానకర్తల అవతారం ఎత్తిన సమయం ఇది. స్వాతంత్ర్యం వచ్చిన తొలి నాళ్లలో రూపుదిద్దుకున్న విధానాల్లో ప్రభుత్వాల ప్రమేయం ఉంది. నాయకుల పాత్ర ఉంది. చట్టసభలు, మేధావుల వాటా ఉంది. అర్థవంతమైన చర్చలు జరిగాయి. పారిశ్రామికవేత్తలు స్వయంగా విధానాల రూపకల్పనలో భాగం పంచుకోవడం మొదలైన తర్వాత అన్ని రకాల నైతికవిలువలను మార్కెట్ తొక్కిపారేసింది. సంక్షేమం అనేది నిషిద్ధ పదంగా మారింది. అందుకే నెహ్రూ ఈ కాలానికి సరిపడని వారయ్యారు. ■

తెలంగాణలో మూడు రాజ్యసభ స్థానాల కోసం నిర్వహిస్తున్న ఎన్నికల్లో చివరికి నలుగురు అభ్యర్థులు మిగిలారు. అందులో ముగ్గురు టీఆర్ఎస్ అభ్యర్థులు కాగా, కాంగ్రెస్ నుంచి ఒకరు బరిలో ఉన్నారు. గురువారం నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం ముగిసింది. షెడ్యూల్ ప్రకారం ఈనెల 23న పోలింగ్ జరగనుంది.

అరాచకంపై వేటేశాం!

» **అసెంబ్లీ పరిణామాలపై గవర్నర్‌కు సీఎం వివరణ**

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్ సమావేశాల ప్రారంభోత్సవం రోజున గవర్నర్ ప్రసంగానికి అంతరాయం కలిగించిన ఇద్దరు కాంగ్రెస్ సభ్యుల సభ్యత్వాన్ని రద్దు చేశామని, మరో 11 మందిపై సమావేశాలు ముగిసేదాకా సస్పెన్షన్ విధించామని గవర్నర్ నరసింహన్‌కు సీఎం కేసీఆర్ చెప్పారు. గురువారం ఆయన రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయ్యారు. శాసనసభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన అనంతరం మర్యాదపూర్వకంగా కలిసి సభలో చోటుచేసుకున్న పరిణామాలను వివరించారు. కాంగ్రెస్ చేపట్టిన బస్సు యాత్రకు ప్రజల్లో ఆదరణ లేకపోవడం, సభలో ప్రతి అంశాన్నీ చర్చించడానికి అంగీకరించడంతోనే ఉద్దేశపూర్వకంగా ఆ పార్టీ బడ్జెట్ సమావేశాల ప్రారంభోత్సవం రోజున అరాచకం సృష్టించిందని మండలి చైర్మన్ స్వామిగౌడ్‌కు కంటికి గాయమైందని, గురువారమే ఆయన ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారని నివేదించారు. దాడి ఘటనపై పశ్చాత్తాపం వ్యక్తం చేయకుండా.. గవర్నర్‌పై దాడి చేయాలనుకున్నామని, అయితే మండలి చైర్మన్‌కు మైక్ తగిలిందని నిస్సిగ్గుగా కాంగ్రెస్ నేతలు ప్రకటించారని ఆక్షేపించారు. రాష్ట్రంలో ప్రాజెక్టులను అడ్డుకోవడానికి కాంగ్రెస్ పార్టీ 200 కేసులు వేసిందన్నారు. తెలంగాణకు కాంగ్రెస్ విలన్‌లా తయారయిందని గవర్నర్‌కు తెలిపారు. శాసనసభ బడ్జెట్ సమావేశాలు సజావుగా జరిగేలా, ప్రజా సమస్యలపై విస్తృతంగా చర్చించేలా సమావేశాలు నిర్వహిస్తున్నామని, సభలో అరాచకాలకు తావు ఇవ్వబోమని వివరణ ఇచ్చారు.



రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఎం కేసీఆర్

బ్యాంక్ పూచీకత్తు 10%కి తగ్గింపు!

వ్యవసాయ మార్కెట్లలో ఇక రూ.50 వేల పూచీకత్తు.. హరీశ్‌తో రైస్, జిన్నింగ్ మిల్లుల యజమానుల భేటీ

» **కంది రైతులకు బకాయిలు వెంటనే చెల్లించాలని ఆదేశం**
» **మిషన్ భగీరథపై స్పెషల్ డ్రైవ్: మంత్రి హరీశ్**

హైదరాబాద్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్లలో ట్రేడర్లు, కమీషన్ ఏజెంట్లకు వ్యాపార టర్నోవర్‌ను బట్టి నిర్ణయించిన బ్యాంకు పూచీకత్తును 10 శాతానికి తగ్గించేందుకు ఆ శాఖ మంత్రి హరీశ్‌రావు అంగీకరించారు. జిన్నింగ్, రైస్ మిల్లుల యజమానుల సంఘాల ప్రతినిధులతో వేర్వేరుగా గురువారం మంత్రి సమావేశమయ్యారు. రూ.కోటి వరకు టర్నోవర్ ఉన్న వ్యాపారుల బ్యాంకు పూచీకత్తును రూ.5 లక్షల నుంచి రూ.50 వేలకు తగ్గించారు. రూ.కోటికి పైగా టర్నోవర్‌కు రూ.10 లక్షల పూచీకత్తును రూ.లక్షకు, రూ.5 కోట్లకుపైగా టర్నోవర్‌కు పూచీకత్తును రూ.2 లక్షలకు తగ్గించేందుకు మంత్రి సానుకూలత వ్యక్తం చేశారు. అయితే దీనికి సంబంధించిన జీవోపై కోర్టులో వేసిన కేసును ఉపసంహరించుకోవాలని షరతు విధించారు. కేసును వెనక్కి తీసుకునేందుకు ట్రేడర్లు, కమిషన్ ఏజెంట్లు అంగీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వ్యవసాయ మార్కెట్లలో ట్రేడర్లు, కమిషన్ ఏజెంట్లు ఎక్కువ కమిషన్ వసూలు చేస్తూ రైతులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వసూళ్లు చేసే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా.. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తమకు మంచి రోజులు వచ్చాయని మిల్లర్ల సంఘం నేతలు అన్నారు. కాగా, మద్దతు ధరకు పంటల సేకరణపై వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డితో కలిసి సమావేశం నిర్వహించిన హరీశ్ కంది రైతుల బకాయిలు చెల్లింపునకు వెంటనే చర్యలు తీసుకోవాలని మార్క్‌ఫెడ్, హాకా, నాఫెడ్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో 2,58,347 టన్నుల కందుల సేకరణ జరిగిందని, కేంద్రం అనుమతించిన 75,300 టన్నులు పోను మిగిలిన 1.83లక్షల టన్నుల కందులను రాష్ట్రమే కొనుగోలు చేసిందని అధికారులు వివరించారు.



సమీక్షలో మంత్రులు పోచారం, హరీశ్

ఉమ్మడి మెదక్ జిల్లాలో 5 కొత్త మునిసిపాలిటీలు

ఉమ్మడి మెదక్ జిల్లాలో నర్సాపూర్, నారాయణఖేడ్, తూప్రాన్, రామాయంపేట, చేర్యాల కొత్త మునిసిపాలిటీలుగా ఏర్పడతాయని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమీక్షిస్తూ.. రైతుబజార్ల నిర్మాణ పనులను సత్వరం పూర్తి చేయాలని, ప్రతి మునిసిపాలిటీలో వైకుంఠధామమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. పంచాయతీ చట్ట సవరణ బిల్లును ఈ బడ్జెట్ సమావేశాల్లోనే ఆమోదించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. జిల్లాకు వెయ్యి ఎకరాల చొప్పున సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో దళితులకు 3 వేల ఎకరాలు వెంటనే పంపిణీ చేయాలన్నారు.

సీపీఎం మహాసభలకు విస్తృత ప్రచారం

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్‌లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న సీపీఎం 22వ జాతీయ మహాసభలపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని పార్టీ రాష్ట్ర ప్రచారకమిటీ నిర్ణయించింది. గురువారం మాజీ ఎమ్మెల్యే జూలకంటి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ తదితరులు పాల్గొని మహాసభల ప్రచార కార్యక్రమంపై సమీక్షించారు.

రైతులకు 180 కోట్లు వెంటనే ఇవ్వండి

» **కేంద్ర మంత్రి రాధామోహన్ సింగ్‌ను కోరిన హరీశ్‌రావు**
» **రివర్ నేవిగేషన్ ప్రాజెక్టుపై గడ్కరీని కలసిన రాష్ట్రమంత్రి**

న్యూఢిల్లీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి కేంద్రం కొనుగోలు చేసిన కందుల సొమ్ము రూ.180 కోట్లు వెంటనే విడుదల చేయాలని కేంద్ర వ్యవసాయ మంత్రి రాధామోహన్ సింగ్‌ను రాష్ట్రమంత్రి హరీశ్‌రావు కోరారు. కొనుగోళ్లు పూర్తై 45 రోజులు గడుస్తున్నా నేటికీ డబ్బులు చెల్లించకపోవడంతో రైతులు ధర్నాకు దిగుతున్నారని గురువారం ఢిల్లీలోని కృషిభవన్‌లో కేంద్రమంత్రి దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా హరీశ్ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో భారీ దిగుబడి వచ్చిన కందులను రూ.1400 కోట్లతో కొనుగోలు చేశామన్నారు. దీంట్లో కేంద్రం రూ.400 కోట్ల కందులే కొనుగోలు చేసి రూ.220 కోట్లే ఇవ్వడంతో సమస్య ఉత్పన్నమైందన్నారు. 2.55 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని రాష్ట్రం కోరితే కేంద్రం 75 వేల మెట్రిక్ టన్నులే కొన్నదన్నారు. మిగిలినవి రాష్ట్రమే కొనుగోలు చేసి రైతులను ఆదుకుందన్నారు. ఆ కొద్ది మొత్తం కూడా రైతులకు చెల్లించడంలో కేంద్రం జాప్యాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లానన్నారు. సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి నిధులను 3 రోజుల్లో విడుదల చేస్తామని హామీ ఇచ్చినట్లు హరీశ్ తెలిపారు. మరోవైపు రబీలో పెసలు, పొద్దుతిరుగుడు, మినుముల పంట చేతికొచ్చినా కొనుగోలు కేంద్రాలు ఇంకా ఏర్పాటు చేయలేదని కేంద్రం దృష్టికి తీసుకెళ్లానని, మద్దతు ధరను ప్రకటించి కొనుగోళ్లు ప్రారంభించాలని కోరానన్నారు. మద్దతు ధరలు ఒక్క రోజులో ప్రకటిస్తామని కేంద్రమంత్రి హామీ ఇచ్చారన్నారు. కేంద్ర జలవనరుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కూడా కలిశానని, కాళేశ్వరం నుంచి గోదావరి ప్రాణహిత, మహారాష్ట్రలో విదర్భ నుంచి సముద్ర ప్రయాణానికి సంబంధించి రివర్ నేవిగేషన్ ఏర్పాటుపై చర్చించామని హరీశ్ తెలిపారు. మిషన్ కాకతీయలో భాగంగా రూ.185 కోట్లతో 175 చెరువులకు ప్రతిపాదనలు సిద్ధంచేశామని, వాటికి సంబంధించిన నిధులు మంజూరు చేయాలని కోరామన్నారు. ఏఐబీపీ ప్రాజెక్టులో దేవాదుల ప్రాజెక్టుకు ఆగిపోయిన నిధుల విడుదల కోసం విజ్ఞప్తి చేశామన్నారు. హరీశ్‌తోపాటు ఎంపీలు జితేందర్‌రెడ్డి, కొత్త ప్రభాకర్, బీబీ పాటిల్ ఉన్నారు. రాష్ట్రంలో ఓ వైపు అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం గురువారం బడ్జెట్ కూడా ప్రవేశపెట్టింది. మరోవైపు కాంగ్రెస్ సభ్యుల సభ్యత్వాల రద్దు అంశం రగులుతున్న తరుణంలో అసెంబ్లీ వ్యవహారాల మంత్రిగా హరీశ్ చాలా బిజీగా ఉన్నారు. అయినా రైతులకు సొమ్ములు చేతికి అందించాలనే ఉద్దేశంతో ఢిల్లీలో సుడిగాలి పర్యటన చేశారు. విమానాశ్రయం నుంచి నేరుగా కృషి భవన్‌లో కేంద్రమంత్రిని కలిశారు.



పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో నిరసన తెలుపుతున్న టీఆర్ఎస్ ఎంపీలు

కోటా పెంపునకు మా మద్దతు ఉంది

» **పెంచే అధికారం రాష్ట్రాలకు ఇవ్వవచ్చు**
» **కేంద్ర మంత్రి విజయ్ సంప్లా వెల్లడి**
» **రాష్ట్రానికి కేంద్ర గిరిజన శాఖ బాసట**
» **9వ రోజూ టీఆర్ఎస్ ఎంపీల ఆందోళన**
» **రిజర్వేషన్ అంశంపై దద్దరిల్లిన లోక్‌సభ**
» **స్పీకర్ మైక్ దగ్గరగా వెళ్లి కవిత నినాదాలు**

న్యూఢిల్లీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో గిరిజనులకు 4 శాతం ఉన్న రిజర్వేషన్లను 10 శాతానికి పెంచాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మద్దతు ప్రకటించింది. కోటా పెంపునకు తమ మద్దతు ఉందని కేంద్ర సామాజిక న్యాయ శాఖ సహాయ మంత్రి విజయ్ సంప్లా వెల్లడించారు. ఆర్టికల్ 16(4) ప్రకారం ఎస్సీలు, ఎస్టీలు, ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించే అధికారాన్ని రాష్ట్రాలకు ఇవ్వవచ్చని తెలిపారు. అయితే సరైన ప్రాతినిధ్యం ప్రకారమే రిజర్వేషన్లు కల్పించాలని, జనాభా నిష్పత్తి ప్రకారం కాదని నిబంధనలు చెబుతున్నాయని వివరించారు. ఈ మేరకు రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ ఎంఏ ఖాన్ అడిగిన ఓ ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 'తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ (విద్యాసంస్థల్లో, నియామకాల్లో రిజర్వేషన్లు) బిల్లు-2017' ఆమోదానికై కేంద్ర హోం శాఖకు తెలంగాణ ప్రభుత్వం పంపిందని.. దానిని అన్ని శాఖల అభిప్రాయం కోసం పంపినట్లు ఆయన వివరించారు. మరోవైపు రిజర్వేషన్ల పెంపు కోసం టీఆర్ఎస్ ఎంపీలు లోక్‌సభలో గురువారం వరుసగా తొమ్మిదో రోజూ ఆందోళన కొనసాగించారు. సుప్రీం కోర్టు ఆదేశాలను చూపుతూ రిజర్వేషన్ల విషయంలో రాష్ట్రాల స్వేచ్ఛను కేంద్రం హరిస్తోందని ధ్వజమెత్తారు. రాజ్యాంగ సవరణ చేసి స్థానిక పరిస్థితులకు అనుగుణంగా రిజర్వేషన్లు కల్పించే హక్కు రాష్ట్రాలకే ఇవ్వాలని పెద్ద ఎత్తున నినాదాలతో వరుసగా తొమ్మిదో రోజూ సభా కార్యకలాపాలను స్తంభింపజేశారు. 'ఒక దేశం ఒకే నీతి' అవలంబించాలని టీఆర్ఎస్ ఎంపీలు జితేందర్‌రెడ్డి, వినోద్‌కుమార్, కల్వకుంట్ల కవిత, సీతారామ్‌నాయక్, బూర నర్సయ్యగౌడ్, దయాకర్, మల్లారెడ్డి, కొండా విశ్వేశ్వరరెడ్డి, కొత్త ప్రభాకర్, బాల్క సుమన్, బీబీ పాటిల్ ప్లకార్డులు పట్టుకుని వెల్‌లో ఆందోళనకు దిగారు. వారితోపాటు ఏపీకి ప్రత్యేక హోదాపై టీడీపీ, వైసీపీ ఎంపీలు, కావేరి నీటి యాజమాన్య బోర్డు ఏర్పాటుపై అన్నా డీఎంకే ఎంపీలు, నీరవ్ మోదీ అంశంపై తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు స్పీకర్ పోడియం వద్దకు చేరుకుని నినాదాలిచ్చారు. దీంతో గందరగోళం నెలకొనడంతో ప్రశ్నోత్తరాలను రద్దు చేసిన స్పీకర్ వెంటనే సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. తిరిగి సమావేశమయ్యాక కూడా ఆయా పార్టీలు ఆందోళన కొనసాగించాయి. కేంద్రం రెండు బిల్లులకు ఆమోదం తెలిపే ఉద్దేశంతో ఉండటంతో నిరసనల మధ్యే సభా కార్యక్రమాలను స్పీకర్ కొనసాగించారు. మొదట 199 లోక్‌సభ నిబంధన ప్రకారం మంత్రి పదవికి రాజీనామా చేసిన అశోక్ గజపతి రాజుకు మాట్లాడేందుకు అవకాశం ఇచ్చారు. వెల్‌లో ఉన్న అన్నాడీఎంకే, తృణమూల్, టీఆర్ఎస్, వైసీపీ ఎంపీలు ఆందోళన చేయకుండా నిశ్శబ్దంగా నిలబడి మద్దతు తెలిపారు. ఈ సమయంలో కాంగ్రెస్ సభ్యులు అశోక్ ప్రసంగానికి అడ్డుతగిలారు. వారి నినాదాల మధ్యే అశోక్ ప్రసంగాన్ని ముగించారు. అనంతరం ప్రభుత్వం కేంద్ర గ్రాట్యుటీ చెల్లింపు చట్టం సవరణ బిల్లు, నిర్దిష్ట ఉపశమన సవరణ బిల్లును ప్రవేశపెట్టింది. మూజువాణి ఓటుతో వాటికి ఆమోదం లభించింది. అనంతరం సభను శుక్రవారానికి వాయిదా వేశారు.

విపక్షాలను ఏకం చేసిన కవిత

ఎంపీ కవిత ఇచ్చిన నినాదాలతో లోక్‌సభ దద్దరిల్లింది. పోడియంకు అతి దగ్గరగా వెళ్లి స్పీకర్ మాట్లాడే మైక్ దగ్గరలోకి వచ్చి ఆమె నినాదాలు చేశారు. దాంతో మీడియా గ్యాలరీలో ఉన్నవారు ఒక్కసారిగా తమ సీట్లలోంచి లేచి ఏం జరిగిందోనని స్పీకర్ పోడియంవైపు తొంగిచూశారు. వెల్‌లోకి వచ్చిన ఒక్కో పార్టీ ఒక్కో నినాదం ఇస్తుండగా వారిని ఏకం చేసేందుకు 'వీ వాంట్ జస్టిస్' అని కవిత నినదించారు. దీంతో అన్ని పార్టీల ఎంపీలు గొంతు కలిపారు. ఒకేసారి 80 మందికి పైగా ఎంపీలు ఒకే నినాదమివ్వడంతో సభ మారుమోగింది.

సెంట్రల్ హాల్లో నిరసన

రిజర్వేషన్ల అంశంపై రాష్ట్రాలకు స్వేచ్ఛనివ్వాలని డిమాండ్ చేస్తున్న టీఆర్ఎస్ ఎంపీలు వినూత్నంగా సెంట్రల్ హాలులో తమ నిరసన గళం వినిపించారు. గురువారం మొదటిసారి లోక్‌సభ వాయిదాపడ్డాక ఎంపీలు అందరూ సెంట్రల్ హాల్‌కు చేరుకున్నారు. అక్కడ ప్లకార్డులు చేబూని నినాదాలిచ్చినట్లు ఎంపీ వినోద్ తెలిపారు.



ఇంటర్మీడియెట్.. విద్యార్థి జీవితంలో కీలకమైన దశ. ఇక్కడ తీసుకునే నిర్ణయాలు, వేసే అడుగులు భవిష్యత్ గమ్యాన్ని నిర్దేశిస్తాయి. ఇంజనీరింగ్, మెడిసిన్ వంటి ప్రొఫెషనల్ కోర్సులు చదవాలన్నా, మరేదైనా కెరీర్‌ను లక్ష్యంగా పెట్టుకోవాలన్నా అందుకు ప్రయాణం ఈ దశ నుంచే మొదలవుతుంది. ప్రస్తుత కార్పొరేట్ సంస్కృతిలో ఇంటర్మీడియెట్ విద్య ఖరీదైన వ్యవహారంగా మారింది. ఇటువంటి పరిస్థితులలో కార్పొరేట్ కాలేజీలకు దీటుగా ఉచితంగా నాణ్యమైన విద్యను అందించడంతోపాటు అన్ని రంగాల్లో విద్యార్థి సమగ్ర అభివృద్ధికి బాటలు వేస్తున్నాయి.. రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలు. 2018-19 విద్యా సంవత్సరానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోని రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో సంబంధిత వివరాలను చూద్దాం..

ఆర్‌జేసీ సెట్

ఉచితం... ఉత్తమం
గురుకుల ఇంటర్

ప్రతిభావంతులకు చేయూతనిచ్చే ఉద్దేశంతో రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలకు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా గ్రామీణ, పేద, ప్రతిభావంతులైన విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని ఈ కళాశాలలను ఏర్పాటు చేశారు. ఆశ్రమ తరహాలో ఆహ్లాదకర వాతావరణంలో విద్యార్థులను ఉన్నత శిఖరాల దిశగా నడిపించడమే లక్ష్యంగా ఈ గురుకులాలు సాగుతుంటాయి. ఆయా కాలేజీల్లో ప్రవేశానికి తెలంగాణలో టీఎస్ఆర్‌జేసీ - సెట్, ఆంధ్రప్రదేశ్‌లో ఏపీఆర్‌జేసీ - సెట్ పేరుతో రాత పరీక్షను నిర్వహిస్తారు. అందులో సాధించిన ర్యాంకు ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు. ఇందుకు సంబంధించి రెండు తెలుగు రాష్ట్రాల్లో అర్హత, రాత పరీక్ష వంటి అంశాలు ఒకే విధంగా ఉంటాయి.

అర్హత

2018 మార్చిలో నిర్వహించిన / కొనసాగుతున్న 10వ తరగతి పరీక్షలో మొదటి ప్రయత్నంలో ఉత్తీర్ణులై ఉండాలి. గతంలో ఉత్తీర్ణులైనవారు అనర్హులు. ఓసీ విద్యార్థులు జీపీఏ 6, బీసీ / ఎస్సీ / ఎస్టీ / మైనార్టీ విద్యార్థులు 5 జీపీఏ సాధించి ఉండాలి. అన్ని కేటగిరీల విద్యార్థులు ఇంగ్లీష్ సబ్జెక్ట్‌లో 4 జీపీఏ సాధించి ఉండటం తప్పనిసరి.

రాత పరీక్ష ఇలా

- రాత పరీక్షలో సాధించిన ర్యాంక్ ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో కూడా రాత పరీక్ష ఒకే విధంగా ఉంటుంది. విద్యార్థులు ఎంచుకున్న గ్రూప్‌ను బట్టి రాత పరీక్ష వేర్వేరుగా ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో 150 ప్రశ్నలు ఉంటాయి. వీటికి 150 నిమిషాల్లో సమాధానాలను గుర్తించాలి. అన్ని గ్రూపు పరీక్షల్లోనూ 3 సబ్జెక్టులు ఉంటాయి. ఒక్కో సబ్జెక్టుకు 50 మార్కులు చొప్పున కేటాయించారు. ఏ గ్రూప్‌లో పరీక్ష రాసినప్పటికీ ఇంగ్లీష్ సబ్జెక్టు తప్పనిసరి. ఈ విభాగం ప్రశ్నలన్నీ జనరల్ ఇంగ్లీష్ అంశం నుంచే ఉంటాయి.
- ఎంపీసీ గ్రూప్‌లో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో 50 మార్కులకు మ్యాథ్స్, 50 మార్కులకు ఫిజికల్ సైన్స్, 50 మార్కులకు ఇంగ్లీష్ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలొస్తాయి.
- బైపీసీ విద్యార్థులకైతే ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్, ఇంగ్లీష్ అంశాల్లో ఒక్కో సబ్జెక్టులో 50 చొప్పున ప్రశ్నలు ఉంటాయి.
- ఎంఈసీ, సీఈసీ విద్యార్థులకు మ్యాథ్స్, సోషల్ స్టడీస్, ఇంగ్లీష్ సబ్జెక్టుల్లో 50 చొప్పున ప్రశ్నలడుగుతారు.
- ఈఈటీ, సీజీడీటీ వృత్తి విద్య కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించే రాత పరీక్షలో ఈఈటీకి సంబంధించి 50 మార్కులకు మ్యాథ్స్, 50 మార్కులకు ఫిజికల్ సైన్స్, 50 మార్కులకు ఇంగ్లీష్ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలొస్తాయి.
- సీజీడీటీ పరీక్షలో ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్, ఇంగ్లీష్ సబ్జెక్ట్‌ల్లో 50 చొప్పున ప్రశ్నలు ఉంటాయి.

సన్నద్ధత

- ప్రశ్నపత్రం తెలుగు / ఇంగ్లీష్‌లో ఉంటుంది. 10వ తరగతి సిలబస్ ఆధారంగా ప్రశ్నలు ఉంటాయి.
- వెబ్‌సైట్‌లో మాదిరి ప్రశ్నపత్రాలు అందుబాటులో ఉన్నాయి. వాటి ద్వారా ప్రశ్నల సరళిపై అవగాహన పొందొచ్చు.
- సిలబస్‌ను, గత ప్రశ్నపత్రాలను పరిశీలిస్తూ ప్రిపేర్ కావడం మంచిది.
- అన్ని టాపిక్స్‌ను ఒకేసారి చదవొద్దు. రోజుకో టాపిక్‌ను నేర్చుకోవడం ప్రయోజనకరం.
- ప్రతి పాఠ్యాంశం చివర్లో ఉన్న ముఖ్యాంశాలు, ఖాళీలు, బహుళైచ్ఛిక ప్రశ్నలు, అతి స్వల్ప సమాధాన ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి.
- ముఖ్యమైన అంశాలను నోట్స్ రూపంలో పొందుపరచుకోవడం ప్రయోజనకరం.
- ఇంగ్లీష్‌లో పార్ట్ ఆఫ్ స్పీచెస్, ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్, ఇడియమ్స్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూషన్స్, సినానిమ్స్, యాంటోనిమ్స్ వంటి వ్యాకరణ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- జీవశాస్త్రం, మ్యాథమెటిక్స్‌లో ప్రతి పాఠ్యాంశం నుంచి ప్రశ్నలు రావొచ్చు.

గురుకుల కాలేజీల ప్రత్యేకతలు

- గురుకులాల్లో ప్రవేశం పొందిన వారికి రెండేళ్లపాటు ఉచిత విద్యను అందిస్తారు.
- ఎంసెట్ / నీట్ / జేఈఈ పరీక్షల కోసం ఇంటిగ్రేటెడ్ కోచింగ్ ఉంటుంది. ఉచితంగా స్టడీ మెటీరియల్ అందించడంతోపాటు మోడల్ పరీక్షల ఆధారంగా ప్రిపరేషన్ స్థాయిని తెలుసుకుంటారు.
- ఆర్ట్స్, కామర్స్ విద్యార్థులను సీఏ, ఐసీడబ్ల్యూఏ వంటి కోర్సుల్లో రాణించే తరహాలో శిక్షణనిస్తారు. ఎంఈసీ, సీఈసీ విద్యార్థులకు సీపీటీ మాదిరి పరీక్షలను కూడా నిర్వహిస్తారు.
- ఇంటర్మీడియట్‌లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు లక్ష రూపాయల వరకూ నగదు బహుమతులు అందజేస్తారు.
- చదువుతోపాటు విద్యార్థుల క్రమశిక్షణకు గురుకుల కళాశాలల్లో ప్రాధాన్యం ఇస్తారు.
- రోజువారీ వ్యాయామ విద్యతోపాటు విద్యార్థుల ఆసక్తిని అనుసరించి ఆయా క్రీడల్లో ప్రత్యేక శిక్షణ ఇచ్చి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడానికి ప్రోత్సహిస్తారు. ఈ పోటీల్లో రాణించిన విద్యార్థులకు లభించే సర్టిఫికెట్లు భవిష్యత్తులో ఉన్నత చదువులు, ఉద్యోగాల్లో ఉపయోగపడతాయి.
- ఏటా ఒకసారి విజ్ఞాన, విహార యాత్రకు విద్యార్థులను అధ్యాపకులు తీసుకెళ్తారు. తద్వారా విద్యార్థుల్లో విజ్ఞానం, మనోవికాసం పెంపొందడానికి అవకాశం ఉంటుంది.
- ప్రతి జూనియర్ కళాశాలలో మంచి గ్రంథాలయాలు ఉన్నాయి. పాఠ్యపుస్తకాలతోపాటు జనరల్ స్టడీస్, రిఫరెన్స్ పుస్తకాలు, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు వీటిలో ఉంటాయి.

తెలంగాణ

తెలంగాణలో మొత్తం 8 రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలు ఉన్నాయి. వీటిలో రెండు బాలుర కాలేజీలు, ఆరు బాలికల కాలేజీలు. బోధన మాధ్యమం ఇంగ్లీష్‌లో ఉంటుంది. మొత్తం సీట్లు 840. ఇందులో ఎంపీసీలో 420, బైపీసీలో 360, ఎంఈసీలో 60 సీట్లు ఉన్నాయి. అభ్యర్థులు ఎంపిక చేసుకున్న గ్రూప్‌లోనే ప్రవేశం లభిస్తుంది. కోర్సులో చేరిన తర్వాత గ్రూపులు మారడం సాధ్యం కాదు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 4, 2018.
- పరీక్ష ఫీజు: రూ. 150
- రాత పరీక్ష తేదీ: మే 6, 2018.
- హాల్ టికెట్ల డౌన్‌లోడింగ్: ఏప్రిల్ 28 - మే 2 మధ్య
- వెబ్‌సైట్: http://tsrjdc.cgg.gov.in/

కాలేజీ - గ్రూప్ - సీట్లు

కాలేజీ	కేటగిరీ	ఎంపీసీ	బైపీసీ	ఎంఈసీ
టీఎస్ఆర్ జూనియర్ కాలేజ్ - హసన్‌పర్తి, వరంగల్ జిల్లా.	జనరల్ గర్ల్స్	90	60	30
టీఎస్ఆర్ జూనియర్ కాలేజ్ - సర్వేల్, యాదాద్రి భువనగిరి జిల్లా.	జనరల్ బాయ్స్	90	60	30
టీఎస్ఆర్ స్కూల్ (జూనియర్ కాలేజ్‌గా అప్‌గ్రేడ్) - బాల్‌నగర్, మహబూబ్‌నగర్ జిల్లా.	జనరల్ గర్ల్స్	40	40	-
టీఎస్ఆర్ స్కూల్ (జూనియర్ కాలేజ్‌గా అప్‌గ్రేడ్) వైరా, ఖమ్మం జిల్లా.	జనరల్ గర్ల్స్	40	40	-
టీఎస్ఆర్ స్కూల్ (జూనియర్ కాలేజ్‌గా అప్‌గ్రేడ్) - సిద్ధిపేట.	జనరల్ గర్ల్స్	40	40	-
టీఎస్ఆర్ స్కూల్ (జూనియర్ కాలేజ్‌గా అప్‌గ్రేడ్) - రామన్నపేట, యాదాద్రి భువనగిరి జిల్లా.	జనరల్ గర్ల్స్	40	40	-
టీఎస్ఆర్ స్కూల్ (జూనియర్ కాలేజ్‌గా అప్‌గ్రేడ్) - వికారాబాద్.	జనరల్ గర్ల్స్	40	40	-
టీఎస్ఆర్ స్కూల్ (జూనియర్ కాలేజ్‌గా అప్‌గ్రేడ్) - కీసరగుట్ట, మేడ్చల్ జిల్లా.	జనరల్ బాయ్స్	40	40	-

ఆంధ్రప్రదేశ్

ఆంధ్రప్రదేశ్‌లో 10 రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలు ఉన్నాయి. ఇందులో బాలురకు 4, బాలికలకు 2, మైనార్టీ బాలురకు 2, మైనార్టీ బాలికలకు 1 కేటాయించారు. మిగతా ఒకటి కో ఎడ్యుకేషన్ విధానంలో ఉంటుంది. బోధన మాధ్యమం ఇంగ్లీష్. మైనార్టీ గురుకులాల్లో ఉర్దూ, ఇంగ్లీష్ మీడియంల్లో బోధిస్తారు.

కాలేజీ - గ్రూప్ - సీట్లు

కాలేజీ	కేటగిరి	ఎంపీసీ	బైపీసీ	సీఈసీ	ఎంఈసీ
ఇవి కోస్తా జిల్లాల విద్యార్థులకు మాత్రమే (శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు)					
ఏపీఆర్ జూనియర్ కాలేజీ, తాడిపూడి - విజయనగరం జిల్లా	బాలికలు	60	40	-	30
ఏపీఆర్ జూనియర్ కాలేజీ, విజయపురి సౌత్, నాగార్జునసాగర్, గుంటూరు జిల్లా	బాలురు	68	51	39	42
ఏపీఆర్ జూనియర్ కాలేజీ వెంకటగిరి, నెలూరు జిల్లా	బాలురు	60	40	-	30
ఏపీఆర్ జూనియర్ కాలేజీ, నిమ్మకూరు, కృష్ణా జిల్లా	కో-ఎడ్యుకేషన్	50	30	30	25
ఇవి రాయలసీమ జిల్లాల విద్యార్థులకు మాత్రమే (చిత్తూరు, అనంతపురం, కడప, కర్నూలు)					
ఏపీఆర్ జూనియర్ కాలేజీ, బనవాసి కర్నూలు జిల్లా	బాలికలు	60	40	-	30
ఏపీఆర్ జూనియర్ కాలేజీ, గ్యారంపల్లి - చిత్తూరు జిల్లా	బాలురు	60	40	-	30
ఏపీఆర్ జూనియర్ కాలేజీ, కొడిగెనహళ్లి, అనంతపురం జిల్లా	బాలురు	50	30	30	25
ఏపీఆర్ జూనియర్ కాలేజీ, విజయపురి సౌత్, నాగార్జునసాగర్, గుంటూరు జిల్లా.	బాలురు	12	9	6	3

- ఏపీఆర్ జూనియర్ కాలేజీ, నిమ్మకూరు, కృష్ణా జిల్లా, ఏపీఆర్ జూనియర్ కాలేజీ, విజయపురి సౌత్, నాగార్జునసాగర్ స్టేట్ వైడ్ కాలేజీలు. ఇందులో ఇరు ప్రాంతాల విద్యార్థులకు నిర్దేశించిన కోటాలో సీట్లను కేటాయిస్తారు.
- ఏపీఆర్ జూనియర్ కాలేజీ, నిమ్మకూరులో ఈఈటీ (ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ టెక్నీషియన్), సీజీడీటీ (కమర్షియల్ గార్మెంట్ డిజైన్ మేకింగ్) వృత్తి విద్య కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ కోర్సుల్లో కోస్తా జిల్లా విద్యార్థులకు 21 సీట్లు, రాయలసీమ విద్యార్థులకు 9 సీట్ల చొప్పున కేటాయిస్తారు.

ప్రత్యేక నోటిఫికేషన్

మైనార్టీ బాలబాలికల కోసం ప్రత్యేకంగా కళాశాలలు ఏర్పాటు చేశారు. వీటిలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో మైనార్టీ కళాశాలలోనూ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూప్‌లు ఉన్నాయి. గుంటూరు, కర్నూలుల్లో బాలుర కోసం; వాయల్పాడు (చిత్తూరు జిల్లా)లో బాలికలకు మైనార్టీ జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేశారు. వీటిలో 10వ తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు. ఇందుకోసం ప్రత్యేకంగా నోటిఫికేషన్ విడుదల చేస్తారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 10, 2018.
- పరీక్ష ఫీజు: రూ. 150
- రాత పరీక్ష తేదీ: మే 10, 2018.
- వెబ్‌సైట్: https://aprjdc.apcfss.in/

- ఫిజికల్ సైన్స్‌ను కొంత విశ్లేషణాత్మకంగా ప్రిపేర్ కావాలి. వివిధ భావనలకు సూత్రాలను అన్వయించి సమస్యలను సాధించడం నేర్చుకోవాలి. ప్రతి అధ్యాయంలోని సూత్రాలు, స్థిరాంకాలు, ముఖ్య రసాయన ఫార్ములాలు, వివిధ పట్టికలను నేర్చుకోవాలి.
- సోషల్ స్టడీస్‌లో చరిత్ర, భూగోళశాస్త్రం నుంచి ఎక్కువ ప్రశ్నలు రావచ్చు. చరిత్రలో సంవత్సరాలపై ఆధికంగా దృష్టి సారించాలి. భూగోళశాస్త్రంలో శీతోష్ణస్థితి, క్షేత్రీయ అమరిక సంబంధిత అంశాలను నేర్చుకోవాలి. పౌర శాస్త్రం, ఆర్థిక శాస్త్రంలో అన్ని అంశాలు ముఖ్యమైనవే.

లోకో పేరెంట్ వ్యవస్థ

గురుకులాల్లో 'లోకో పేరెంట్' విధానం అమల్లో ఉంటుంది. దీని ప్రకారం తరగతిలోని ప్రతి 15-20 మంది విద్యార్థులకు ఒక అధ్యాపకుడు 'లోకో పేరెంట్'గా వ్యవహరిస్తూ, ఇటు అధ్యాపకుని పాత్ర, అటు తల్లిదండ్రుల పాత్రను పోషిస్తారు. ఎలాంటి శారీరక, మానసిక రుగ్మతలు రాకుండా ఆరోగ్యానికి, విద్యాభ్యాసంగానికి అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తుంటారు. ఆయా విద్యార్థుల గురించి అన్ని విషయాలనూ శ్రద్ధగా పరిశీలిస్తారు. వారు ఆసక్తిగా చదువుకునేందుకు అవసరమైన వాతావరణాన్ని కల్పిస్తారు.

- గురుకుల విద్యాలయాల్లో విద్యార్థుల దినచర్య ఉదయాన్నే 5 గంటలకు ప్రారంభమవుతుంది. అనుభవజ్ఞులైన ఫిజికల్ డైరెక్టర్ పర్యవేక్షణలో యోగా, మాస్ డ్రిల్, తదితర వ్యాయామ కార్యక్రమాలు నిర్వహిస్తారు. తద్వారా విద్యార్థుల్లో శారీరక దారుఢ్యం, ఏకాగ్రత, మానసిక సామర్థ్యం పెంపొందించడానికి కృషిచేస్తారు. తర్వాత ప్రతిభ, నైపుణ్యం, అనుభవం, అంకితభావం గల అధ్యాపకుల ద్వారా తరగతుల్లో బోధన ఉంటుంది. పరీక్షల్లో వచ్చిన మార్కులను ప్రోగ్రెస్ రిపోర్టు ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులకు లోకో పేరెంట్స్ తెలియజేస్తారు. సంబంధిత అధ్యాపకులు విద్యార్థుల స్థాయిని తెలుసుకుంటూ, అవసరమనుకున్న వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తారు.

జాబ్ కార్నర్

ఈఎస్ఐసీలో ప్రొఫెసర్లు

న్యూఢిల్లీలోని ఎంప్లాయీస్ స్టేట్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) - ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాల భర్తీ కోసం గత ఏడాది (2017) విడుదల చేసిన ప్రకటనలను రద్దు పరచి వాటి స్థానంలో తాజా ప్రకటన చేసింది. రద్దు చేసిన ప్రకటనల వివరాలను వెబ్‌సైట్‌లో చూడవచ్చు. వీటితోపాటు కర్ణాటక గుల్బర్గాలో మరో 35 పోస్టులను కూడా భర్తీ చేయనుంది. గతంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేసుకోనవసరం లేదు.

- మొత్తం ఖాళీలు: **221** (ప్రొఫెసర్ 50, అసోసియేట్ ప్రొఫెసర్ 80, అసిస్టెంట్ ప్రొఫెసర్ 91)
- కేంద్రాలవారీ ఖాళీలు: హైదరాబాద్ 40, కర్ణాటక 50, ఢిల్లీ 15, హర్యానా 56, బెంగళూరు 29, కోల్‌కతా 31
- అర్హత: పోస్టును అనుసరించి డాక్టొరేట్ / ఎండి / ఎంఎస్ / పీజీ / డీఎన్‌బీ పూర్తిచేసి ఉండాలి.
- వయసు: 50 ఏళ్లు మించకూడదు.
- ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
- ఇంటర్వ్యూ కేంద్రాలు: హైదరాబాద్, బెంగళూరు, కోల్‌కతా, ఢిల్లీ
- దరఖాస్తు ఫీజు: రూ.225 (ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ మహిళలకు మినహాయింపు వర్తిస్తుంది)
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఏప్రిల్ 2
- వెబ్‌సైట్: www.esic.nic.in/recruitment

కేంద్రీయ విద్యాలయలో టీచర్లు

కేంద్రీయ విద్యాలయం - విజయవాడ, నెల్లూరు కేంద్రాల్లో ఒప్పంద ప్రాతిపదికన ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- విజయవాడ కేంద్రంలోని ఉద్యోగాలు: ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లు, ప్రైమరీ టీచర్లు, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్లు.
- నెల్లూరు కేంద్రంలోని ఉద్యోగాలు: పీజీటీలు, టీజీటీలు, ప్రైమరీ టీచర్లు, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్, యోగా ఇన్‌స్ట్రక్టర్, కౌన్సిలర్, ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్ (డ్యాన్స్), స్పోర్ట్స్ కోచ్, ఆర్ట్స్ & క్రాఫ్ట్స్ ఇన్‌స్ట్రక్టర్, నర్సులు.
- అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీ / పీజీ / బీఈడీ / డీఈడీ / బీసీఏ / ఎంసీఏ / బీఈ / బీటెక్ / పీజీ డిప్లొమా పూర్తిచేసి ఉండాలి. ఉపాధ్యాయ ఉద్యోగాలకు సీటెట్ అర్హత ఉండాలి.
- ఎంపిక: స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా
- స్క్రీనింగ్ టెస్ట్: విజయవాడలో మార్చి 21న
- ఇంటర్వ్యూలు: విజయవాడలో మార్చి 22, 23న నెల్లూరులో మార్చి 27, 28, 31
- నెలవారీ వేతనం: పీజీటీలకు రూ.27,500 టీజీటీలకు రూ.26,250 పీఆర్‌టీ & ఇతర ఉద్యోగాలకు రూ.21,250 కౌన్సిలర్లకు రూ.25,000 కాగా నర్సులకు రోజుకి రూ.750 చెల్లిస్తారు.
- విజయవాడ ఉద్యోగాల దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 17 (www.kv2vijayawada.edu.in)
- నెల్లూరు ఉద్యోగాల దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 24 (www.kvnellore.ac.in)

ఏపీలో మిడ్ లెవెల్ ప్రొవైడర్లు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ జోన్లవారీగా ఉన్న హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాల్లో 'మిడ్ లెవెల్ ప్రొవైడర్' ఉద్యోగాల భర్తీ కోసం మహిళల నుంచి దరఖాస్తులు కోరుతోంది. ఒప్పంద ప్రాతిపదికన నియామకాలు జరుగనున్నాయి.

- మొత్తం ఖాళీలు: **1500**
- జోన్లవారీ ఖాళీలు: గుంటూరు 345, విశాఖపట్నం 345, రాజమహేంద్రవరం 350, కడప 460
- ఒప్పంద వ్యవధి: ఏడాది.
- అర్హత: బీఎస్సీ (నర్సింగ్) పూర్తిచేసి ఉండాలి. అదనపు అర్హతలకు ప్రాధాన్యం ఉండదు.
- వయసు: జనరల్ అభ్యర్థులకు 35 ఏళ్లు, ఎస్సీ / ఎస్టీ వర్గాలకు 40 ఏళ్లు మించకూడదు.
- ఎంపిక: మెడికల్ ఎగ్జామినేషన్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. ఎంపికైన అభ్యర్థులు కమ్యూనిటీ హెల్త్ విభాగంలో ఆర్నెల్ల బ్రిడ్జి ప్రోగ్రామ్‌ను పూర్తిచేయాల్సి ఉంటుంది. ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ నిర్వహించే ఈ కోర్సు ఖర్చులను పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుంది. కౌన్సిలింగ్, స్టడీ మెటీరియల్ ఫీజులను చెల్లించడమే కాకుండా ఉచిత భోజన, వసతి సౌకర్యాలను కల్పిస్తుంది.
- ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తును జోన్ పరిధిలోని ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకుల కార్యాలయానికి పంపుకోవాలి.
- దరఖాస్తు ఫీజు లేదు.
- దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: మార్చి 27
- వెబ్‌సైట్: cfw.ap.nic.in

విద్యా సమాచారం

బిట్‌శాట్ దరఖాస్తులకు మార్పులు


బిట్‌శాట్ 2018 ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ దరఖాస్తులో సమాచారాన్ని అవసరమైతే మార్చుకోవచ్చు. ఆన్‌లైన్ దరఖాస్తు సమయంలో ఏవైనా పొరపాట్లు దొర్లితే మార్చి 19లోగా వాటిని సవరించుకోవడానికి బిట్స్ అవకాశం కల్పిస్తోంది. పుట్టిన తేదీ, జెండర్, రిజిస్టర్డ్ ఈమెయిల్ ఐడీ మినహా, మిగతా సమాచారంలో మార్పులు చేసుకోవచ్చు.

నీట్ దరఖాస్తులో మార్పులకు అవకాశం

నీట్ యూజీ 2018 ఆన్‌లైన్ దరఖాస్తులకు మార్పులు చేర్పులు చేసుకోవడానికి మార్చి 17 వరకు సమయం ఉంది. ఆన్‌లైన్ దరఖాస్తు సమయంలో ఏవైనా తప్పులు దొర్లితే నీట్ వెబ్‌సైట్ ద్వారా లాగిన్ అయ్యి, మార్పులు చేయవచ్చు. మార్పులు చేసుకోవడానికి ఇదే చివరి అవకాశమని సీబీఎస్ఈ ప్రకటించింది. అభ్యర్థులు ఐడీ సమాచారం, పుట్టిన తేదీ, జెండర్, స్టేట్ కోడ్, కేటగిరీ, డిజెబిలిటీ స్టేటస్, మీడియం, పరీక్ష కేంద్రం, ఇంటర్‌లో సాధించిన మార్కుల శాతం, తల్లిదండ్రుల పేర్లు తదితర సమాచారాన్ని అవసరమైతే మార్చుకోవచ్చు.

జేఈఈ మెయిన్ అడ్మిట్ కార్డులు

జేఈఈ మెయిన్ 2018 పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు jeemain.nic.in వెబ్‌సైట్ ద్వారా అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దేశవ్యాప్తంగా ఉన్న ఎన్ఐటీలు, ఐఐఐటీలు, కేంద్ర ప్రభుత్వ నిధులతో కొనసాగే సంస్థల్లో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి జేఈఈ మెయిన్ ర్యాంకులను పరిగణనలోకి తీసుకుంటారు. జేఈఈ మెయిన్ పరీక్షలు ఏప్రిల్ 8 (పేపర్, పెన్ పరీక్ష), ఏప్రిల్ 15, 16 (కంప్యూటర్ ఆధారిత పరీక్ష) తేదీల్లో జరగనున్నాయి.



ఏపీ ఈసెట్ దరఖాస్తులు ప్రారంభం

ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ ఈసెట్ 2018) దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. sche.ap.gov.in/ecet ద్వారా ఏప్రిల్ 14లోగా దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్షను మే 3న నిర్వహించనున్నారు. లేటరల్ ఎంట్రీ పద్ధతిలో సెకండియర్ ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి ఏపీ ఈసెట్ పరీక్షను నిర్వహిస్తారు.

సొగసు

లంగావోణీ కాదు..
లెహంగా చోళీ

తెలుగు సంవత్సరాదికి స్వాగతం పలికేందుకు తెలుగింటి ఆడపడుచులు సిద్ధమవుతున్నారు. అది కూడా సంప్రదాయ, ఆధునికతలను జోడించి మరీ. ఆ క్రమంలో లంగావోణీలు కాస్తా లెహంగా చోళీలుగా మారాయి. అదెలాగంటారా... ఇదిగో ఇక్కడ కనిపిస్తున్న బుట్టబొమ్మల్లా..



గులాబీ రంగు లెహంగా చోళీకి లేసులతో, రేషమ్ వర్క్‌తో స్పెషల్ లుక్ తెచ్చారు. గులాబీ, నారింజ రంగుల మేళవింపులో... నెట్, సిల్క్, షిఫాన్ మెటీరియల్స్ వాడి డిజైన్ చేశారు. లేస్ బోర్డర్ ఇవ్వడంతో కొత్త కళ వచ్చింది.
ధర: రూ.3,809

పసుపు రంగు ప్యూర్ నెట్ ఫ్యాబ్రిక్‌తో డిజైన్ చేసిన లెహంగా చోళీ ఇది. లోపలి వైపు ప్యూర్ శాంటూన్ ఫ్యాబ్రిక్ వాడారు. బ్లౌజ్‌కు భగల్ పురి జార్జెట్, ప్యూర్ నైలాన్ నెట్ వోణీ ఇచ్చారు.
ధర: రూ.6,099

పింక్ మల్బరీ సిల్క్ లెహంగాకు అదే మెటీరియల్ బ్లౌజ్ కుట్టారు. వోణీగా నెట్ మెటీరియల్ వాడారు. రిచ్ డిజైన్‌తో ఉన్న ఈ లెహంగా చోళీని సంప్రదాయబద్ధంగా పండుగలకి వేసుకోవచ్చు. పార్టీలకు వేసుకున్నా మోడ్రన్ ట్రెడిషనల్ లుక్ మీ సొంతం అవుతుంది.
ధర: రూ.2,849

తెలుపు, గులాబీ రంగుల ఆర్ట్ సిల్క్ డిజైనర్ లెహంగా చోళీ ఇది. దీనికి లోపలి వైపు శాంటూన్, దుపట్టాకు షిఫాన్, లెహంగాకు ఆర్ట్ సిల్క్ ఫ్యాబ్రిక్ వాడారు. బ్లౌజ్‌ను సిల్క్ ఫ్యాబ్రిక్‌తో కుట్టారు.
ధర: రూ.5,400

న్యూస్‌మేకర్



నేపాల్ వేగుచుక్క!

నేపాల్ రాచరికపు పీడన నుంచి ఎగిసిన విప్లవోద్యమంలో వెలుగురేఖ విద్యాదేవీ భండారి. పితృస్వామ్య నేపాల్ రాజకీయాలను తలదన్ని రెండోసారి అధ్యక్షురాలిగా ఎంపికైన తొలి మహిళ ఆమె. నెలసరి సమయంలో మహిళలు ఇంటికే పరిమితమవ్వాలనే పురాతన హిందూ సంప్రదాయాన్ని బహిష్కరించి... వరకట్నానికి వ్యతిరేకంగా చట్టం తీసుకొచ్చి నేపాల్ మహిళలకు ఆశాదీపంగా నిలిచారు. నేపాల్ విప్లవోద్యమంలో చురుగ్గా పాల్గొని, రెండోసారి అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన విద్యాదేవీ భండారి గురించి మరిన్ని ఆసక్తికరమైన విశేషాలు!

భోజ్‌పూర్‌లోని మానె భాంజ్యాంగ్‌లో 1961లో జన్మించిన విద్యాదేవి విద్యార్థి దశలోనే ఉద్యమాలకు నాయకత్వం వహించింది. అతి పిన్న వయసులోనే రాజకీయాల్లోకి ప్రవేశించినా ప్రత్యక్ష రాజకీయాల్లోకి ఆమె ప్రవేశం 1980లో సిపిఎన్(కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్) సభ్యత్వంతో మొదలైంది. ఆ తర్వాత విమెన్ వింగ్‌కు ఛైర్ పర్సన్‌గా ఎంపికైంది. తర్వాత సెంట్రల్ కమిటీ మెంబర్‌గా, పార్టీ వైస్ ఛైర్‌పర్సన్‌గా అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రధాని ఖడ్గా ప్రసాద్‌కు విశ్వాసపాత్రురాలిగా పేరు పొందింది. అప్పట్లో నేపాల్ కమ్యూనిస్ట్ మూవ్‌మెంట్‌కు ఊతమిచ్చి ఓ వెలుగు వెలిగిన కమ్యూనిస్ట్ నేత మదన్ భండారీని విద్యాదేవి పెళ్లాడారు. అయితే 1993లో మదన్ అనుమానాస్పద రీతిలో మరణించారు. భర్త మరణంతో కుంగిపోకుండా ఆమె ప్రజాసేవకే అంకితమయ్యారు. దశాబ్దాల నేపాల్ రాచరిక పాలనలో తనకంటూ ప్రత్యేక పంథా ఏర్పరుచుకుని ముందుకు సాగారు. మహిళా గెరిల్లా దళాలను నడిపించడం దగ్గరి నుంచి, మహిళా రైతుకూలీల్లో చైతన్యం తేచ్చేదాకా ఆమె పోరాటం అనన్య సామాన్యం.

అక్టోబరు 28, 2015న విద్యాదేవి తొలిసారిగా నేపాల్ అధ్యక్షురాలిగా ఎంపికయ్యారు. ఈ ఎన్నికల్లో ఆమె 549 పార్లమెంటరీ ఓట్లలో ఏకంగా 327 ఓట్లు గెలుచుకుని అధ్యక్ష పీఠాన్ని అధిరోహించారు. ఫోర్బ్స్ విడుదల చేసిన 'ప్రపంచంలోని వంద మంది అత్యంత ప్రతిభావంతమైన మహిళల' లిస్టులో 52వ స్థానాన్నీ పొందారు. నేపాల్‌కు తొలి మహిళా అధ్యక్షురాలిగానే కాక, నేపాల్ తొలి మహిళా రక్షణ మంత్రిగా పని చేసిన ఘనత ఆమెది. రెండోసారి కూడా ఆమె భారీ మెజారిటీతో గెలిచి, సరికొత్త అధ్యాయాన్ని సృష్టించారు.

విద్యాదేవికి ఇద్దరు పిల్లలు (ఉషాకిరణ్, నిశాకుసుమ్). 56 ఏళ్ల వయసులో కూడా మహిళల హక్కుల కోసం విద్య నిరంతరంగా కృషి చేస్తున్నారు. 2006లో మావోయిస్టు తిరుగుబాటు అంతమై, నేపాల్ రాజకీయ ముఖచిత్రం కొత్త రూపు సంతరించుకున్న తరుణంలో పార్లమెంటులో మహిళల గొంతు వినిపించటం కోసం ఆమె ఎంతో ప్రయత్నించారు.



సమ్మర్ జ్యూస్

శక్తినిచ్చే గ్రీన్ డ్రింక్

కావలసినవి:

మంచి నీళ్లు - ఒక కప్పు, కీరదోసకాయ (చిన్న ముక్కలుగా తరిగి) - ఒకటి, పాలకూర - కొద్దిగా, నిమ్మకాయలు (రసం) - రెండు, గ్రీన్ యాపిల్స్ (మధ్య భాగాన్ని తీసి, చిన్న ముక్కలుగా తరగాలి) - రెండు, అల్లం (పొట్టు తీసి) - చిన్న ముక్క, పార్స్లీ ఆకులు (కొత్తిమీర ఆకుల్లా ఉంటాయి.) - కొన్ని.

తయారీ:

- జ్యూసర్‌లో గ్రీన్ యాపిల్స్, కీరదోసకాయ, పాలకూర, అల్లం, పార్స్లీ ఆకులు వేసి గ్రైండ్ చేయాలి.
- తరువాత నిమ్మరసం వేసి మరోసారి తిప్పాలి.
- గ్రీన్ జ్యూస్ అనగానే ఆరోగ్యం కోసం అనుకుంటారు. కానీ సమ్మర్‌లో శరీరానికి ఇది చేసే మేలు చాలా ఉంది.
- రుచి కోసం కాస్త మిరియాల పొడి, కొద్దిగా క్రష్డ్ ఐస్ వేసుకుని తాగేయండి.

స్కిన్‌కేర్

ఎండలో బయటకు వెళ్తున్నారా?

మండుతున్న ఎండల్లో మాయిశ్చరైజర్లు, సన్‌స్క్రీన్ లోషన్స్ చర్మానికి రాసుకోకుండా బయటకు అడుగు పెట్టొద్దు అంటున్నారు సౌందర్య నిపుణులు. ఎందుకలాగంటే...

- వేసవిలో చర్మం పొడిబారిపోతుంది. కాబట్టి దాన్ని రీజనరేట్ చేయాలంటే వారానికి రెండు సార్లు ఫేస్ స్క్రబ్, మాస్కులు వేసుకోవాల్సిందే. చర్మ తత్వాన్ని బట్టి వాటిని ఎంపిక చేసుకోవాలి. దీనివల్ల మృతకణాలు పోతాయి. చర్మం ఉత్తేజితమవుతుంది. మాయిశ్చరైజర్లు, టోనర్స్ వల్ల చర్మం పొడిబారకుండా ఉంటుంది.
- ఎస్‌పిఎఫ్ (సన్ ప్రొటెక్షన్ ఫ్యాక్టర్) ఉన్న మాయిశ్చరైజర్లు వాడేముందు ఫేషియల్ ఆయిల్‌ను ఉపయోగించాలి.
- క్వినోవా పొట్టును పేస్టుగా చేసి, శరీరానికి ఎండ తగిలే ప్రాంతంలో రాసుకోవాలి. ఇలా చేస్తే చర్మం పొలుసులుగా అవ్వకుండా ఉంటుంది.
- విటమిన్-సి ఉన్న సీరమ్స్, మాయిశ్చరైజర్లలోని యాంటాక్సిడెంట్లు చర్మాన్ని తాజాగా ఉంచుతాయి.
- రాత్రి పడుకునే ముందు శరీరానికి ప్రైమ్‌రోజ్ ఆయిల్ రాసుకుంటే మంచిది. ఇందులో ఫ్యాటీ యాసిడ్స్ చర్మంలో ఉండే సహజమైన తేమను, సాగే గుణాన్ని కోల్పోకుండా కాపాడతాయి. లావెండర్ ఆయిల్ కూడా చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.
- వేసవిలో చర్మ సంరక్షణకు సంబంధించి విటమిన్-సి సీరమ్స్ తప్పనిసరి. ఇవి చర్మాన్ని వాయుకాలుష్యం బారినపడనీయవు.
- చర్మసౌందర్యంలో తినే ఆహారం పాత్ర కూడా కీలకమే. వేసవి కాలంలో నూనె పదార్థాల జోలికి వెళ్లకూడదు. డెయిరీ ఉత్పత్తులకు దూరంగా ఉండాలి. కేవలం పళ్లు, కూరగాయలే తీసుకోవాలి. ఎక్కువ నీళ్లు తాగడం వల్ల చర్మం డీ-హైడ్రేట్ కాకుండా ఉంటుంది.



పేరెంటచ్

ముందే సిద్ధం చేయాలి!

కొందరు పిల్లలు బాగా చదివినప్పటికీ మొదటి పరీక్ష బాగా రాయలేరు. దాంతో పరీక్ష బాగా రాయలేదని తెగ బాధపడుతుంటారు.

"ఎంత చదివితే మాత్రం ఏముందిలే! బాగా రాయలేనప్పుడు చదివిందంతా వృథాయే కదా! ఆ తర్వాత పరీక్షలు మాత్రం బాగా రాయగలుగుతానన్న గ్యారెంటీ ఏముంది?" అనుకుంటూ లోలోపల కుంగిపోతుంటారు. ఆ దిగులుతో మిగతా పరీక్షలు కూడా బాగా రాయలేకపోతారు. పరీక్ష బాగా రాయలేదన్న విషయాన్ని అమ్మానాన్నలకు చెప్పే ధైర్యమూ ఉండదు. ఆ బాధంతా మనసులో పెట్టుకుని పైకి మామూలుగా కనిపించే ప్రయత్నం చేస్తుంటారు. ఫలితాలు వచ్చాక అమ్మానాన్నలకు ఏం సమాధానం చెప్పాలా? అని ఆలోచిస్తుంటారు. అంతే తప్ప అయిందేదో అయ్యింది, మిగతా పరీక్షలైనా బాగా రాద్దామన్న ఆలోచన వారికి రాదు. ఎవరో ఒకరికి అసలు నిజం చెబితే కదా ధైర్యం చెప్పే ప్రయత్నం చేస్తారు.

సాధారణంగా పిల్లలు పరీక్షల మూడ్‌లో ఉన్నారని వారిని పేరెంట్స్ డిస్టర్బ్ చేయరు. అయితే పిల్లలను నిలదీస్తున్నట్టుగాక, పరీక్ష రాసి వచ్చిన తర్వాత కాసేపు ఎలా రాశారనే విషయాన్ని వారితో చర్చించడం వల్ల పేరెంట్స్‌కు కూడా ఒక అవగాహన వస్తుంది. ఒక పరీక్ష బాగా రాయలేకపోతే, ఆ బాధ నుంచి పిల్లలు వెంటనే బయటకు తీసుకొచ్చి, తర్వాత జరగబోయే పరీక్షకు పిల్లల్ని సంసిద్ధం చేయాలి. దానివల్ల పిల్లలు బెంగపడకుండా ధైర్యంగా ఉంటారు.





నూకాలమ్మ తల్లి

ఉత్తరాంధ్ర కల్పవల్లి

ఉత్తరాంధ్ర జిల్లాల్లో భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా అత్యంత ప్రసిద్ధి గాంచిన అమ్మవారు విశాఖ జిల్లా అనకాపల్లి నూకాంబిక. ప్రతి సంవత్సరం ఫాల్గుణ బహుళ అమావాస్య (సరిగ్గా ఉగాదికి ముందు వచ్చే కొత్త అమావాస్య) సందర్భంగా అమ్మవారి జాతర ప్రారంభం అవుతుంది. నెల రోజులపాటు ఈ ఉత్సవాలు నిర్వహిస్తారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచే కాకుండా, ఉభయ గోదావరి జిల్లాల నుంచి కూడా భక్తులు ఈ ఉత్సవ దినాల్లో విశేష సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. అంతేకాదు, అనకాపల్లి, ఆ చుట్టుపక్క ప్రాంతాలవారు ఉద్యోగ, వ్యాపారాల రీత్యా ఎక్కడ నివసిస్తున్నా, కొత్త అమావాస్య జాతరకు ఇక్కడికి చేరుకుంటారు. ఉత్సవాలు ముగిసిన తరువాత కూడా కనీసం మూడు నెలలపాటు భక్తుల రద్దీ ఆలయంలో కనిపిస్తూ ఉంటుంది.

ఎప్పుడు?: ఈ నెల 16వ తేదీ నుంచి ఏప్రిల్ 14 వరకూ

ఎక్కడ?: విశాఖపట్నం జిల్లా అనకాపల్లిలో

ఎలా వెళ్ళాలి?: తెలుగు రాష్ట్రాల్లోని దాదాపు అన్ని ప్రధాన నగరాలు, పట్టణాల నుంచి అనకాపల్లికి నేరుగా ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులున్నాయి. అలాగే విశాఖపట్నం వెళ్ళే దాదాపు అన్ని రైళ్ళూ అనకాపల్లిలో ఆగుతాయి.

విశేష దినాలు: జాతరలో ఆది, మంగళ, గురువారాలను భక్తులు విశేషమైనవిగా భావిస్తారు. ఆ రోజుల్లో, ముఖ్యంగా ఆదివారాల్లో వేల మంది అమ్మవారిని దర్శించుకోవడానికి వస్తారు.



నవ్య నివేదన

శుక్రవారం16 మార్చి 2018

సందర్భం

ఉగాది పండుగ వచ్చేస్తోంది. కొత్త ఏడాదితో పాటు కొత్త ఉత్సాహం తెచ్చేస్తోంది. అసలేమిటీ ఉగాది? ఎందుకీ పండుగ?

పండగొచ్చింది!

బ్రహ్మ సృష్టిలో ప్రళయం అయిపోయిన తరువాత తిరిగి ఆరంభించే అధ్యాయాన్ని 'బ్రహ్మకల్పం' అని అంటూ ఈ ప్రారంభకాలాన్ని 'కల్పాది' అని వ్యవహరిస్తారు. ప్రతీ కల్పంలోను మొదట వచ్చే 'ఆది' సమయమే 'ఉగాది' పండుగ. దీన్ని గురించి 'సూర్య సిద్ధాంతం' అనే జ్యోతిష గ్రంథంలో స్పష్టంగా చెప్పారు. నాటి నుండి నేటి వరకు ఈ పద్ధతినే అనుసరిస్తూ ప్రతీ తెలుగు సంవత్సర ఆరంభ దినం నాడు మనం ఉగాది పర్వదినం జరుపుకొనే ఆచారం ఏర్పడింది. 'యుగాది' అన్న సంస్కృత పదం ఉచ్ఛారణాభేదం వల్ల 'ఉగాది' అనే తెలుగు మాటగా ఏర్పడింది.

సృష్టి ప్రభవం అయిన ఈ మొదటి సంవత్సరం నుండి చరితార్థంగా 'ప్రభవ' అని నామకరణం చేశారు. అక్కడి నుంచి 'క్షయ' నామ సంవత్సరం క్రమంలో 60 నామాలతో సంవత్సర గమనం సాగుతుంది. కనుకనే మనం జన్మించిన మొదలు ఈ నామ చక్రం మనకు 60 సంవత్సరాల వయస్సుకు చేరినపుడు తిరిగి అదే సంవత్సరంతో పూర్తి అవుతుంది. అప్పుడు షష్టిపూర్తి జరుపుకొంటాం.

వేదాలను హరించిన సోమకుడు అనే రాక్షసుని వధించి శ్రీ మహావిష్ణువు తిరిగి పునరుద్ధరించిన రోజుగా కూడా ఉగాది ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నది. తెలుగు సంవత్సరం చైత్రం నుండి శిశిరం వరకు ఆరు ఋతువులుగా విభజితం అయింది. సంవత్సరం పొడవునా అనేక ఒడుదొడుకులు అనుభవించిన ప్రకృతిలోని చెట్లు శిశిర ఋతువులో ఆకులు రాల్చి జడత్వాన్ని పొందుతాయి. చైత్రమాసంలో క్రొత్త చిగుర్లు తొడిగి చైతన్యవంతంగా కనిపిస్తాయి. ఈ విధంగా ప్రకృతిలో సంభవించే నూతన వత్సరం చైత్రమాసం. అందుకే ఈ మాసారంభానికి ఉగాది అని పేరు వచ్చినదని కూడా చెప్పుకోవచ్చు.

ఉగాది పర్వదినాన 'అభ్యంగనం, పుణ్యకాల సంకల్పం, ఉగాది పచ్చడి సేవనం, ధర్మకుంభం, సృష్టి క్రమ వర్ణన, కల్పాది వైవస్వత మన్వంతర వివరాలతో కూడిన పంచాగ శ్రవణం' అనే ముఖ్యమైను విధులను అనుసరించాలని పెద్దల మాట!

అభ్యంగనం

సూర్యోదయానికి పూర్వమే నువ్వులనూనె తలకి పట్టించి ఉసిరిక, పెసరపిండి, కుంకుళ్ళు, బావంచాలు, కచ్చూరాలు మొదలైన వాటిని ఉపయోగించి శిరస్నానం కుంకుళ్ళతో చేయాలి. ఈ దినం వేడినీటి స్నానం శ్రేష్ఠం. అనంతరం తిలకం దిద్దుకుని, నూతన వస్త్రాలు ధరించి సంకల్పం చెప్పుకోవాలని 'ధర్మసింధువు' తెలియచేస్తోంది.

పుణ్యకాల సంకల్పం

సూర్యోదయానికి ఒక ముహూర్తకాలం (20 నిమిషాలు) మాత్రమే పాడ్యమి ఉన్నా సరే ఆ రోజునే పండుగ సందర్భ నూతన సంకల్పం చెప్పుకొని ప్రారంభించాలి. సూర్యునికి అర్ఘ్యం, దీపం, ధూపం, పుష్పాంజలి సమర్పించాలని శాస్త్ర వచనం.

ధర్మకుంభం

ఉగాది రోజు రానున్న రోజులలో పూర్ణ మనోరథసిద్ధి, సకల సౌభాగ్యాలు కలుగుతాయనే సంకల్ప బలంతో పంచలోహాల పాత్రగాని, మట్టి కుండగాని కలశంగా తీసుకుని సుగంధ జలం, చందనం, పుష్పాక్షతలు వేసి ఆవాహన చేసి, పుణ్యాహ మంత్రాలతో బియ్యం పోసిన ఒక పళ్ళెంలో కలశం ఉంచి నూతన వస్త్రం చుట్టి ఉపరిభాగాన నారికేళం పెట్టాలి. కుంకుమ, పసుపు చందనాలు సమర్పించి పురోహితునకు గానీ, గురువునకు గానీ, లేక గుడిలోని ఇష్ట దైవానికి గానీ దానమిచ్చి వారి ఆశీర్వాదం పొందాలి. దీనినే 'ధర్మఘట దానం' లేక 'ప్రపాదానం' అంటారు. ఈ విధి నేటికీ పల్లెలలో ఆచరిస్తున్నారు.

పంచాంగ శ్రవణం

మహాపర్వదినములైన కల్పాది తిథులు, మన్వంతర తిథులు, దశావతార పుణ్యతిథులు మొదలైన వాటిని పంచాంగంలోని తిథి, వార, నక్షత్ర, యోగ, కరణాలనే అయిదు అంగాల కలయికగా చూపిస్తారు. ఈ విధమైన పంచ అంగాల శ్రవణం వల్ల భవిష్యత్తులో మనకు రానున్న విశేషాలు, పండుగలు, గ్రహణాలు, వర్ష వివరాలు, కాల నిర్ణయాలు మొదలైనవి తెలుసుకోవడం జరుగుతుంది. ఇది ఉగాది రోజున విశేష విధిగా భావించాలి. కనుక హైందవ సాంప్రదాయములో పంచాంగ శ్రవణం ఉగాది తిథి రోజున ప్రాముఖ్యత సంతరించుకుంది.

తిథేశ్చ, శ్రియమాప్నోతి వారాథాయుష్య వర్ధనమ్
నక్షత్రాత్హరతే పాపం, యోగాద్రోగ నివారణమ్
కరణాత్కార్య సిద్ధిస్తు, పంచాంగ ఫలముత్తమమ్
కాల విత్కర్మ కృద్ధీమాన్ దేవతానుగ్రహం భవేత్ !!

తిథి వల్ల సంపద, వారం వల్ల ఆయుష్షు, నక్షత్రం వల్ల పాపపరిహారం, యోగం వల్ల వ్యాధి నివృత్తి, కరణము వల్ల కార్యానుకూలత సిద్ధిస్తాయి. కాలం తెలిసి కర్మం చేసే ఆస్తికులు భగవత్ అనుగ్రహం పొంది సుఖం అనుభవిస్తారు. రామాయణాది పవిత్ర గ్రంథ పఠనం వల్ల వచ్చే విశేష ఫలం ఈ పంచాంగ శ్రవణం వల్ల కూడా పొందవచ్చు.

భూమి, స్వర్ణం, ఏనుగులు, గోవులు, సర్వ లక్షణయుక్తమైన కన్యను ఉత్తముడైన పాత్రునకు దానం చేస్తే కలిగినంత ఫలితంతో సమానం. శాస్త్రవిధిగా పంచాంగ శ్రవణం చేయడం వల్ల సూర్యుని ద్వారా శౌర్య తేజస్సులు, చంద్రుని ద్వారా భాగ్య వైభవాలు, కుజుని ద్వారా సర్వ మంగళాలు, బుధుని ద్వారా బుద్ధి వికాసము, గురుని ద్వారా గురుత్వం, జ్ఞానం, శుక్రుని ద్వారా సుఖం, శని దేవుని ద్వారా దుఃఖ రాహిత్యం, రాహువు ద్వారా ప్రాబల్యము, కేతువు ద్వారా తన వర్గంలో ప్రాముఖ్యత కలుగుతాయని శాస్త్ర వచనం.

● డాక్టర్ దేవులపల్లి పద్మజ



ఉగాది పచ్చడి సేవనం

ఉగాది నాడు అత్యంత ముఖ్యమైన కార్యక్రమం ఉగాది పచ్చడి స్వీకరణ. దీనిని పరగడుపునే స్వీకరించాలి. షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడికి ఎంతో ప్రాముఖ్యం ఉంది.

తీపి, వగరు, చేదు, కారం, పులుపు, ఉప్పు రుచులు కలసిన ఉగాది పచ్చడి మన సొంతం. ప్రతీ మనిషి తన జీవితంలో ఎదుర్కొనే వివిధ అనుభవాలకు ప్రతీకగా దీన్ని భావిస్తారు. ఈ పచ్చడి తయారు చేయడానికి చెరకు, మామిడికాయలు, వేప పువ్వు, అరటి పళ్ళు, లవణం, చింతపండు, బెల్లం, పచ్చి మిరప మొదలైనవి వాడతారు. మామిడి పూత, అశోక చిగురులు కలిపి సేవించే సంప్రదాయం మనకు ఇప్పటికీ కనిపిస్తూ ఉంటుంది.

దైవమార్గం

మన కోసం దేవుడు

"కోరికలు అనంతం, కాని వాటిని తీర్చే వనరులేమో చాలా పరిమితం. అందుకే సమాజంలో ఘర్షణ, అసంతృప్తి!" అంటుంది అర్థశాస్త్రం. పేద, గొప్ప అనే తేడా లేకుండా అందరి జీవితంలోనూ 'చింతించడం' అనేది అంతర్భాగమైన ఆధునిక జీవనశైలి ఈనాడు మనది. ఒక చింత తీరిపోతే, మరో చింత ఆ వెంటనే 'లాగ్ ఆన్' అవుతున్న రోజులివి. ఒక గొప్ప ధనికుడు కేవలం తన చింతలు భరించి, తన బదులు చింతించడానికి పెద్ద జీతంతో ఒకతన్ని కుదుర్చుకున్నాడట. మరునాడు రావడం రావడమే అతను దిగులుగా ఉండడం చూసి, "ఏమిటీ నీ బాధ?" అని అడిగాడు ధనికుడు. "ఇంత జీతం నువ్వసలు నాకిస్తావా లేక ఎగ్గొడతావా? అని చింతగా ఉందన్నా"డట అతను!!



దేవుడు మాత్రం విశ్వాసికి బైబిల్ లో చాలా అనూహ్యమైన వాగ్దానంతో కూడిన 'ఆఫర్' ఇచ్చాడు. "మీ చింతలన్నీ నా మీద వేయండి. నేను మీ కోసం చింతిస్తాను" అన్నాడు దేవుడు (1 పేతురు 5 :7). మనల్ని ఆపదలో కాపాడే వాడు, అవసరాలు తీర్చేవాడు మాత్రమే కాదు, మన బాధలు, భారాలు కూడా వహించి మన కోసం చింతించే దేవుడినంటూ తన అపారమైన ప్రేమలోని ఒక సరికొత్త కోణాన్ని ఈ వాక్యంలో ఆయన ఆవిష్కరించాడు.

'చింతించడం' అనే మానసిక దుఃస్థితికి 'అవిశ్వాసం' అనే ఆత్మీయ దుర్గత మూలకారణమని అర్థం చేసుకోవాలి. దేవుని శక్తికి సంబంధించిన సంపూర్ణమైన అవగాహన లేకపోవడం, మన జీవితాలు దేవుని ప్రణాళికల మేరకు కాకుండా మన అభీష్టాల మేరకు సాగాలన్న స్వార్థం, కనబడని అహంకారమే మన జీవితాన్ని అశాంతికీ, చింతలకూ బానిసను చేస్తున్నాయి. 'ఏమి తినాలి?, ఏమి తాగాలి?' లాంటి ప్రాథమిక విషయాల పైన దృష్టితో కాకుండా దేవుని ప్రణాళికలు తనలో నెరవేరాలన్న అత్యున్నతమైన ఆత్మీయస్థాయిలో జీవించాలి. అదే అశాంతికీ, అనవసరమైన చింతలకూ విరుగుడు!" అని యేసు ప్రభువు బోధించాడు. ఈ లోకంలో ఆయన అలాగే జీవించాడు కూడా (మత్తయి 6:31-34).

తల్లి తన నిత్యావసరాలనూ, నిద్రనూ సైతం మానుకొని మరీ పాలు పట్టడం మొదలు టైం ప్రకారం తన అవసరాలన్నీ తీరుస్తుందని ఒక పసికందు నిబ్బరంగా, చింతలేకుండా ఉంటుంది. సరిగ్గా అదే- విశ్వాసి సొంతం కావాలి. 'నా చింతలు, నా భారమంతా నా తల్లితండ్రులదే!' అన్న ఒక పసికందు విశ్వాసమే దేవుడు మనందరి నుండి కోరుకునే అత్యున్నత స్థాయి విశ్వాసం. ఆయన కృప ద్వారా సమయోచితమైన సహాయం మనకు దొరకడానికి దేవుడు మనల్ని కనికరించాడన్న ధైర్యమే 'విశ్వాస'మని బైబిల్ నిర్వచిస్తోంది (హెబ్రీ 4 :16). భయంకరమైన ఆపదల్లో కూడా ఆ కృపను దావీదు అపారంగా అనుభవించాడు. అందుకే, "ఆయన నన్ను శాంతికరమైన జలాల వద్ద నడిపిస్తా"డంటూ అంతటి శ్రమల్లోనూ దేవుణ్ణి కీర్తించాడు (కీర్తన 23 :2). "నేనున్నానులే! నువ్వు ముందుకెళ్ళు" అన్న దేవుణ్ణి- "కాదు నీ వెంటే ఉన్నాను, నా వెంట రా!" అన్న దేవుని అద్భుత కృపనూ దావీదు అనుభవించాడు. అదే కృపను మనమూ అనుభవించవచ్చు.

● సుశీల్ సందేశ్

నవజీవనవేదం

మనది కర్తవ్యం! ఆయనదే భారం!

ఒక్కొక్కసారి మన జీవితం ఎలా ఉంటుందంటే మన కర్తవ్యం నిర్వర్తించడానికి కూడా కష్టమైపోతుంది. ఏం చేయాలో తెలియదు! కుటుంబంలో, ఉద్యోగ జీవితంలో, సమాజంలో ఎదురయ్యే సమస్యలు ఎలా ఉంటాయంటే ఏది కర్తవ్యమో తెలియదు. అటువంటప్పుడు ఈ ప్రార్థనను నమ్ముకోవాలి.

గీతాచార్యుడు బోధ చేసెనని సాగింపంగ కర్తవ్యము
చేతోవేదన రచ్చకీడ్చెని నను ఈ చింతన్ భరింపంగలేను
ఏతన్మాత్రపు బాధ్యతల్ గడపలేవే నీవు
నా చేతంబున్ భవదీయ నామము వరించెన్ నేను నిస్సంగుడన్

శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతలో చెప్పాడు నిమిత్తమాత్రంగా నువ్వు చేసే పని చేయవయ్యా, మిగతాది నేను చూసుకుంటాను అని. ప్రకృతిపరంగా జరిగేవి జరుగుతూ ఉంటాయి. ఎవరి మనస్సును ఎవరు మారుస్తారు. మన మనసును మనం మార్చుకోవడమే కష్టం. ఇక ఎదుటి వాళ్ల మనసుని ఎలా మారుస్తాం. మార్చడం సాధ్యమా! అందుకని నీ కర్తవ్యమేదో నీవు చేయవయ్యా, మిగిలింది నాకు వదిలేయి అని చెబుతాడు భగవంతుడు. చేసిన పని ఏమవుతుందో ఏమో అని మథనపడుతూ కూర్చోకూడదు. ఈ మథనపడటం మూలంగానే మనిషికి ఆందోళన, అశాంతి పెరుగుతున్నాయి. రకరకాల వ్యాధులకు దారి తీస్తున్నాయి.

మనకు తోచిందే కర్తవ్యం కదా! అందుకే తోచింది చేశాము. ఎందుకంటే అన్ని సమస్యలు అందరితో చెప్పుకోలేం కదా. మన సమస్య వేరు. వాళ్ల సమస్య వేరు. మనమే నిర్ణయం తీసుకోవాలి. మనసుకు వేదన కలుగుతుంది ఏమవుతుందో.... ఏమవుతుందో అని. ఇవన్నీ భరించలేను. సృష్టికర్త భగవంతుడే కదా! ఆయన చూసుకోలేడా ఇవన్నీ. 'మరి నువ్వేం చేస్తావు' అని భగవంతుడు అడిగితే 'నీ నామస్మరణతో గడుపుతా దేనితో సాంగత్యం పెట్టుకోను' అనాలి. దీనికి కట్టుబడి ఉంటే ఆ భగవంతుడే అన్నీ చూసుకుంటాడు.

భగవంతుడు భగవద్గీతలో స్పష్టంగా చెప్పాడు.... 'నన్ను స్మరించండి! నేను చూసుకుంటాను' అని. 'నువ్వు చేయగలిగిందేదో చేయి. నన్ను స్మరించు'. భగవంతుణ్ణి రక్షణ కోరుతున్నామంటే ఆయనింట్లోకి మనం వెళ్లిపోవాలి. ఆయనింట్లోకి మనం వెళ్లిపోవడం అంటే మన మనస్సులోకి ఆయన రావడం! భగవాన్ నామస్మరణ చేస్తూనే వచ్చిన పరిస్థితిని తట్టుకుని నిలబడటం అలవాటు చేసుకోవాలి. తప్పనిసరై ఒక శాపం వల్ల తొండ రూపం ధరించాల్సి వస్తే నేనెందుకు ధరించాలి. వాణ్ణి చంపేస్తా అని అనలేదు నృగమహారాజు. **తస్మాత్ అపరిహార్యే అర్థే నత్వం శోచితుమర్హసి** అని భగవద్గీత రెండో అధ్యాయంలో చెప్పిన విషయాన్ని నృగమహారాజు ఒంటపట్టించుకుని ఆచరించాడు. శాపం వల్ల తొండ రూపం ధరించాల్సి వస్తుందని తెలిసింది. పెద్ద కొడుకుని పిలిచి రాజ్యం అప్పగించాడు. ఊర్వశి నన్ను కాదన్నందుకు నువ్వు నపుంసకుడివి అవుతావు అని అర్జునుడిని శపించింది. ఆ శాపాన్ని అర్జునుడు నర్తనశాలలో ఉపయోగించుకున్నాడు. ఆ శాపం అర్జునుడికి వరం అయింది. రకరకాల పరిస్థితులు కొని తెచ్చుకున్న కర్ణుడికి వరాలు కూడా శాపాలయ్యాయి. దైవభక్తి ఉన్నవాడికి ప్రతికూల పరిస్థితులు కూడా అనుకూల పరిస్థితులుగా మారిపోతాయి.

రోజూ శివ నామాన్ని జపించే వాడి జీవితం ఎలా ఉంటుందంటే మహాకవి 'ధూర్జటి' శ్రీకాళహస్తీశ్వరశతకంలో ఇలా చెబుతున్నాడు.

పవి పుష్పంబగు, నగ్ని మంచగు, నకూపారంబు భూమీస్థలం
బవు, శత్రుండతి మిత్రుడౌ, విషము దివ్యాహారమౌ నెన్నగా
నవనీ మండలి లోపలన్ శివ శివేత్యా భాషణోల్లాసికిన్
శివ! నీ నామము సర్వవశ్యకరమౌ, శ్రీకాళహస్తీశ్వరా!



శివుని నామం జపిస్తే వజ్రం పువ్వులా మెత్తగా, అగ్ని మంచులా చల్లగా, సముద్రం భూమిలా నివాస యోగ్యంగా, శత్రువు మిత్రునిగా మారిపోతాడు. విషం సైతం పరమాన్నంగా మారుతుంది. అందుకే దేవుని స్మరణ మరువద్దు.

● డా. గరికిపాటి నరసింహారావు

ధర్మపథం

రైతుల కోసం యజ్ఞం

మనది వ్యావసాయిక దేశం. రైతు కష్టార్జితం మీద బతికే దేశం. రైతులే దేశానికి వెన్నెముకగా నిలిచిన దేశం. జీవ నదీజలాలు ఉప్పొంగి ప్రవహించే దేశం. రైతు క్షేమమే రాజ్యక్షేమమని భగవాన్ బుద్ధుడు ఎప్పుడో ప్రకటించాడు.

'దీర్ఘనికాయం'లోని 'కూటదంత సూత్రం'లోని మహావిజితుని కథే ఇందుకు నిదర్శనం.

మహావిజితుడు మహాచక్రవర్తి. అఖండ భరత ఖండాన్ని పాలించే రాజు. దేశంలో క్రమంగా కరవు కాటకాలు వచ్చిపడ్డాయి. దొంగలు, బందిపోట్లు చెలరేగి పోయారు. ధనవంతులు అందిన కాడికి ధనాన్ని నేలమాళిగల్లో దాచుకుంటున్నారు. పేదలు, రైతులు ఆకలితో అల్లాడిపోతున్నారు. పంటలు పండక, పండిన పంట పన్నులకు చాలక ఆకలితో చావు దారిపడుతున్నారు. రాజుగారి కోశాగారం ఖాళీ అయింది. ఈ దుర్భర పరిస్థితులు పోవాలంటే మార్గం ఏమిటి? అని రాజు ఆలోచించాడు. యజ్ఞం చేసి వేలాది జంతువుల్ని బలిగా సమర్పిస్తే వర్షాలు పడతాయని పురోహితులు చెప్పారు. రాజు మహాయజ్ఞం కోసం సిద్ధపడ్డాడు. వేలాది జంతువుల్ని సిద్ధం చేశారు.


ఈ విషయం తెలిసి ఒక పండితుడు రాజు దగ్గరకు వెళ్లాడు. "రాజా! దేశం, దేశంలోని రైతులు, ప్రజలు, ధనాగారం సుభిక్షంగా ఉండాలంటే చేయాల్సిన పనులు ఇవి కాదు. పన్నుల భారాన్ని తగ్గించండి. రైతులు రుణాల కింద పడి నలిగిపోతున్నారు. రుణాలన్నీ రద్దు చేయించండి. రైతులకు నాగళ్ళు, పారలు, విత్తనాలు ఉచితంగా అందించండి. పడిన వర్షపు నీరు వృథాపోకుండా చెరువులు తవ్వించి కాల్వల ద్వారా అందించండి. అప్పుడు రైతు కోలుకుంటాడు. పండిన ధాన్యానికి సరైన విలువ కట్టండి. అలాగే చిన్న చిన్న వ్యాపారులకు ఆర్థిక సహాయం అందించండి. మీ దగ్గర పనిచేసే ఉద్యోగులకు నెలనెలా జీతాలు సక్రమంగా చెల్లించండి. ఇలా చేస్తే దేశం సుభిక్షంగా మారుతుంది. మీ ధనాగారం కూడా నిండుతుంది. యజ్ఞం పేరుతో వేలాది పశువుల్ని బలిచేసి, వ్యవసాయాన్ని మరింత కుంటుపరచకండి! రాజా! ఇదీ రాజులు చేయాల్సిన యజ్ఞం!!

ఈ యజ్ఞంలో రక్తం ప్రవహించదు. జంతు సంపద నాశనం కాదు. వేలాది చెట్లు యజ్ఞసమిధలుగా, యూపాలు (స్తంభాలు)గా మారవు. వన రక్షణ జరుగుతుంది" అని చెప్పాడు. మహారాజు బలియజ్ఞాన్ని ఆపి జలయజ్ఞాన్ని ప్రారంభించాడు. రైతు సంక్షేమానికి పూనుకున్నాడు. ఇది కూటదంతునికి బుద్ధుడు చెప్పిన కథ. బుద్ధుడు చెప్పిన ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అశోకుడు ఆచరణలో చూపాడు! బౌద్ధం అంటే ధార్మిక, నైతిక మార్గమే కాదు, సామాజిక వికాస మార్గం కూడా!

● బొర్రా గోవర్ధన్

శ్రీ రమణ కథామృతం

శరణాగతి!



(గత సంచిక తరువాయి)

శ్రీభగవాన్ మౌలిక బోధ ఆత్మవిచారమే. అంటే ఆత్మను స్వయంకృషి వల్ల అనుభవసిద్ధం చేసుకోవడం. అదే జరిగితే, మన సుఖదుఃఖాలకి మూలకారణమైన 'మనస్సు' అణగిపోతుంది. వారు బోధించిన ఈ పద్ధతి అందరికీ సులభసాధ్యం కాదు. సహజంగానే వైరాగ్యమున్న వారికీ, ప్రపంచం పట్ల ఆకర్షణ లేని వారికి మాత్రమే ఇది సాధ్యమవుతుంది ఎంతో అభ్యాసం తరువాత. మరి ఇతరుల మాట ఏమిటి? తనకంటే ఉన్నతమైన శక్తి ఒకటి ఉందని గ్రహించి దానికి బేషరతుగా వశమైపోవడమే ఆ రెండో మార్గం. దీనినే శరణాగతి అంటారు. పైకి ఇది తేలికగానే కనిపిస్తుంది. ఈ విషయమైన శ్రీరమణులు భక్తులకు బోధించిన విషయమిది. (సశేషం)

● పింగళి సూర్యసుందరం

డైలీ సుడోకు - 133

			7		9	4	5	
9				2	6	1		7
4					3		2	
2	7						4	1
	9		4					6
1		4	3	9				5
	5	2	1		7			

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు-132 సమాధానం

3	1	5	6	7	4	2	9	8
2	9	4	3	8	1	6	7	5
6	8	7	2	9	5	1	3	4
8	7	9	1	5	6	3	4	2
1	3	6	4	2	9	5	8	7
5	4	2	7	3	8	9	6	1
4	2	1	9	6	7	8	5	3
7	6	8	5	1	3	4	2	9
9	5	3	8	4	2	7	1	6

సందేశం

దేవుడు చూస్తున్నాడు!



ఒక మనిషి జీవితంలో అతని ఉత్తమ గుణాలు, నైతిక విలువలు గొప్ప నిధి కన్నా ఎంతో విలువైనవి. ఈ ఉత్తమ గుణాలు అతనిలో కేవలం దైవభీతితో మాత్రమే సాధ్యమవుతాయి. నేను చేస్తున్న ప్రతి పనినీ అల్లాహ్ చూస్తున్నాడు. ఒకరికి మంచి చేస్తే అల్లాహ్ ప్రసన్నుడవుతాడు, ఒకరికి చెడు చేస్తే అల్లాహ్ క్రోధుడవుతాడనే విశ్వాసం అతనిని మంచి దారి వైపు నడిపిస్తుంది. అల్లాహ్ 'దివ్య ఖుర్‌ఆన్'లో ఇలా తెలియపరిచారు: సత్కార్యం అంటే 'మనిషి అల్లాహ్‌నూ, అంతిమ దినాన్నీ, దూత లనూ, అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథాన్నీ, ఆయన ప్రవక్తలనూ హృదయపూర్వకంగా విశ్వసించడం! ఇంకా అల్లాహ్‌పై ప్రేమతో తాము ఎక్కువగా ఇష్టపడే ధనాన్ని బంధువులు, అనాథలు, నిరుపేదలు, బాటసారులు, సహాయం కోసం అర్థించే వారి కోసం ఖర్చుచేయడం మంచిది. ఇంకా నమాజును స్థాపించేవారు, జకాత్ ఇచ్చేవారు, వాగ్దానం చేస్తే దానిని నిలబెట్టుకొనేవారు, సత్యానికీ, అసత్యానికీ సంఘర్షణ తలెత్తినప్పుడు ధైర్యం కోల్పోని సత్పురుషులు వాస్తవంగా సత్యసంధులు... అల్లాహ్ పట్ల భయభక్తులు కలిగిన వారు వీరే. (దివ్య ఖుర్‌ఆన్ 2:177). మీరు అమితంగా ప్రేమించే వస్తువులను అల్లాహ్ మార్గంలో ఖర్చుపెట్టనంత వరకు మీరు సత్కార్య స్థాయికి చేరుకోలేరు. మీరు ఖర్చు చేసేదంతా అల్లాహ్‌కు బాగా తెలుసు. (దివ్య ఖుర్‌ఆన్ 3:92)

ఇద్దరు వ్యక్తులు ఉన్నారు. వారిలో ఒకడు తన కట్టడాన్ని దైవభీతి, దైవప్రసన్నతలనే పునాదులపై నిర్మించాడు. రెండోవాడు తన కట్టడాన్ని నీటి ప్రవాహానికి లోతట్టు భాగం మట్టి కొట్టుకుపోయి డొల్లగా మారిన నదీతీరంపై నిర్మించాడు. ఆ తర్వాత అది కాస్త అతణ్ణి తీసుకొని, నేరుగా నరకాగ్నిలో పడిపోయింది. మరి ఆ ఇద్దరిలో ఎవరు శ్రేష్ఠులు? ఆలోచించండి! అలాంటి దుర్మార్గులకు అల్లాహ్ ఎన్నటికీ సన్మార్గం చూపడు. వారు నిర్మించిన ఈ పునాదులు లేని కట్టడం వారి హృదయాల్లో ఎల్లప్పుడూ అపనమ్మకాన్నే పెంచి పోషిస్తుంది. వారి హృదయాలు ముక్కలు ముక్కలుగా పగిలిపోతే తప్ప (ఈ అపనమ్మకపు రోగం వారిని వదిలిపెట్టదు)! అల్లాహ్ సర్వం తెలిసిన వాడు, వివేకవంతుడు (దివ్య ఖుర్‌ఆన్ 9-109-110).

● మహమ్మద్ వహీదుద్దీన్


MEGA POWERSTAR
AUDIO RELEASED
PRE RELEASE EVENT
ON 18TH MARCH 2018
AT RK BEACH, VIZAG
రంగస్థలం
SUKUMAR


Presents
A.K.Entertainments India Pvt Ltd.
కిరాక్ పార్టీ
నేడే విడుదల
RAMA BRAMMAM SUNKARA SHARAN KOPPISETTY


BLUE PLANET Entertainments
T G VISHWA PRASAD PRESENTS
people MEDIA FACTORY
AUDIO SUPERHIT
ADITYA MUSIC
MLA
KIRAN REDDY BHARATH CHOWDARY UPENDRA MADHAV
VIVEK KUCHIBHOTLA
MANI SHARMA PRASAD MURELLA TAMMIRAJU KIRAN KUMAR PRAVEEN VARMA
Enjoy Full Songs on YouTube /adityamusic


సిద్ధి విఘ్నేశ్వర క్రియేషన్స్
SathishReddy & Mouryani
నెల్లూరి పెద్దారెడ్డి
FEEL GOOD MOVIE
నేడే విడుదల
madhura audio


SRI SURYA THEJA MOVIE
COMING SOON
రాణి చాణక్యదేవి
PRODUCER: VISWESWARA RAO.G STORY- SCREEN PLAY - DIRECTION: CH.SHANKAR DORA
MUSIC: THRINAY CAMERA: ANAND EDITOR: SATHYA FIGHTS: DEVARAJ


NIRMANI FILMS
నేడే విడుదల
వాడేనా
MANILAL MACHHI & SON'S SAI SUNEEL NIMMALA
Nijam Peacock Movies 77991 72022, Ceeded Gayathri films 9985225439
Nellore Sri Lakshmi films 9573122277 Guntur Niharika films 7660950669
Vizag Janardhan films 9848281899 Krishna, East and West SDM Makers 8185976768, 8885747277


యుద్ధభూమి
1971 భారత సరిహద్దు
A.N.BALAJI MAJOR RAVI
1971 BEYOND BORDERS
ఈ నెల విడుదల


SAI KRISHNA FILMS PRESENTS
SRI VADAPALLI VENKATESHWARA CREATIONS
జాతర కాత్త ముందే
మొదలయ్యింది సామీ...
గొంతులు తెగాల్సిందే...
రక్తం పారాల్సిందే...
దండుపాళ్యం 3
A FILM BY SRINIVAS RAJU
నేడే విడుదల
PRODUCER SRINIVAS MEESALA
CO-PRODUCER SAI KRISHNA PENDYALA
VENKAT PRASAD ARJUN JANYA C.RAVICHANDRAN
BHUVANACHANDRA RAMESH.CHEMBETI HARISH PAI B.A.RAJU BHAGEERATHA


TRIDENT ARTS
NORTHSTAR ENTERTAINMENT PVT. LTD.
HIGHLY ACCLAIMED AWARD WINNING FILM
ఉగాది
శుభాకాంక్షలతో
నేడే విడుదల
LADY SUPERSTAR
Nayanthara
in
కర్తవ్యం
PRODUCERS
SHARRATH MARAR - R. RAVINDRAN
WRITTEN & DIRECTED BY
GOPI NAINAR
EXECUTIVE PRODUCER M.SRINIVASA RAO
PETER HEIN GHIBRAN RUBEN OMPRAKASH LALGUDI N ILAYARAJA GULABI SRINU
RAJESH M. MURTHY UMA DEVI RAVI RANGANATHAN RAJU RAJA KRISHNAN NAREN-MURTHY S. KALAI SELVAN PRO. SKN
SINDHU GRAFIX
PAVAN KUMAR



ప్రారంభ ధర రూ.1.33 కోట్లు

భారత మార్కెట్లోకి అప్‌డేటెడ్ మసెరాటి 'ఘిబ్లి'

న్యూఢిల్లీ : ఇటలీకి చెందిన లగ్జరీ కార్ల కంపెనీ మసెరాటి భారత మార్కెట్లో తన సెడాన్ 'ఘిబ్లి' మోడల్‌లో అప్‌డేటెడ్ వెర్షన్‌ను విడుదల చేసింది. దీని ప్రారంభ ధర 1.33 కోట్ల రూపాయలు (ఎక్స్‌షోరూమ్). ఈ మోడల్‌లో మూడు వేరియంట్లు అందుబాటులో ఉన్నాయి. వీటి ధర వరుసగా రూ.1.33 కోట్లు, రూ.1.38 కోట్లు, రూ.1.42 కోట్లుగా ఉంది. అద్భుతమైన డిజైన్, అత్యాధునిక టెక్నాలజీతో కొత్త వేరియంట్లను తెచ్చినట్టు మసెరాటి ఇండియా ఆపరేషన్స్ హెడ్ బోజాన్ జంకులోస్కి తెలిపారు. 2018 ఘిబ్లిలో 3.0 లీటర్ వి6 ఇంజన్ ఉంది. 6.3 సెకన్ల వ్యవధిలోనే 0 నుంచి 100 కిలో మీటర్ల వేగాన్ని అందుకుంటుంది. గరిష్ఠంగా గంటకు 250 కిలో మీటర్ల వేగంతో వెళుతుంది. ఎలక్ట్రిక్ పవర్ స్టీరింగ్, అడ్వాన్స్‌డ్ డ్రైవింగ్ అసిస్టెన్స్ సిస్టమ్స్, అడాప్టివ్ ఫుల్ ఎల్ఇడి హెడ్‌లైట్స్, ఇంటిగ్రేటెడ్ వెహికిల్ కంట్రోల్ సిస్టమ్ తదితర ఫీచర్లు ఈ కారులో ఉన్నట్టు కంపెనీ తెలిపింది.







హోండా నుంచి సరికొత్త

లివో, డ్రీమ్ యుగా, సిబి షైన్ ఎస్‌పి

న్యూఢిల్లీ : హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్ఎంఎస్ఐ) తన లివో, డ్రీమ్ యుగా, సిబి షైన్ ఎస్‌పి మోడళ్లలో 2018 ఎడిషన్స్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. 110 సిసి ఇంజన్ కలిగిన లివో ప్రారంభ ధర 56,230 రూపాయలుండగా.. డ్రీమ్ యుగా (110 సిసి) ధర 52,741 రూపాయలు, సిబి షైన్ ఎస్‌పి (125 సిసి) ప్రారంభ ధర 56,230 రూపాయలు (ఎక్స్‌షోరూమ్)గా ఉన్నట్టు కంపెనీ తెలిపింది. భిన్న రకాల కొనుగోలుదారుల అవసరాలను ఈ మూడు బైకులు తీర్చుతాయని, కొత్తగా బైక్‌ను కొనాలనుకునే వారి అంచనాలకు అనుగుణంగా ఈ బైక్‌లను తీర్చిదిద్దామని హెచ్ఎంఎస్ఐ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (అమ్మకాలు, మార్కెటింగ్) యద్వీందర్ సింగ్ గులేరియా తెలిపారు. తక్కువ మెయింటెనెన్స్ సీల్ చెయిన్, హోండా ఈకో టెక్నాలజీ టైర్లు ఈ బైకుల్లో ఉన్నాయని, ఫలితంగా మైలేజీ మరింతగా పెరుగుతుందని ఆయన చెప్పారు.

రూ.21 కోట్ల సమీకరణకు క్యాప్స్‌టన్ పబ్లిక్ ఇష్యూ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన సెక్యూరిటీ, ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ కంపెనీ క్యాప్స్‌టన్ ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్ వచ్చే వారంలో తొలి పబ్లిక్ ఇష్యూ (ఐపిఒ)కు రానుంది. ఈ ఇష్యూ ద్వారా కంపెనీ 21.19 కోట్ల రూపాయల నిధులు సమీకరించాలనుకుంటోంది. ఇష్యూ తర్వాత ఎన్ఎస్ఇ ఎమర్జ్‌లో షేర్లను లిస్ట్ చేయనున్నారు. ఇష్యూ ద్వారా సమీకరించే నిధులను కంపెనీ వ్యాపార విస్తరణకు, రుణాలు తీర్చేందుకు, ఇతర నిర్వహణ కార్యకలాపాలకు వినియోగించనున్నారు. ఇష్యూలో భాగంగా 23,04,000 ఈక్విటీ షేర్లను 10 రూపాయల ముఖ విలువతో ఒక్కో షేరును 92 రూపాయల ధరకు ఆఫర్ చేయాలని ప్రతిపాదించారు. ఆఫర్ ఫర్ సేల్, షేర్ల జారీ ద్వారా 26.5 శాతం వాటాను విక్రయించనున్నట్టు గురువారంనాడిక్కడ కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ విష్ణు తెలిపారు. గడచిన ఆర్థిక సంవత్సరంలో కంపెనీ 90 కోట్ల రూపాయల రాబడి, 3 కోట్ల రూపాయల లాభాన్ని ఆర్జించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2017-18)లో 117 కోట్ల రూపాయల రాబడి, 6 కోట్ల రూపాయల లాభాన్ని నమోదయ్యే అవకాశం ఉందని కంపెనీ అంచనావేస్తోంది. ప్రస్తుతం కంపెనీలో 6,500 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. క్లయింట్లు 400కు పైగా ఉంది. దక్షిణాది రాష్ట్రాల్లో తమ సర్వీసులను మరింతగా విస్తరించే యోచనలో ఉన్నట్టు కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ కె శ్రీకాంత్ తెలిపారు.

బ్యాంకు షేర్లలో అమ్మకాల ఒత్తిడి

- వెంటాడిన వాణిజ్య యుద్ధ భయాలు
- 150 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్

ముంబై : దేశీయ స్టాక్ మార్కెట్లలో వరుసగా మూడో రోజూ నష్టాలు కొనసాగాయి. లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్ (ఎల్ఒయు) మోసానికి సంబంధించిన తాజా ఆందోళనలు, వాణిజ్య యుద్ధ భయాల నేపథ్యంలో స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడుదొడుకుల మధ్య ట్రేడయ్యాయి. గురువారం బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 150 పాయింట్ల నష్టంతో 33685.54 పాయింట్ల వద్ద ముగిసింది. బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి పెరిగింది. యస్ బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఎస్‌బిఐ షేర్లలో అమ్మకాలు జోరుగా సాగాయి. పిఎన్‌బికి చెందిన బ్రాడీ హౌజ్ శాఖ చంద్రి పేపర్స్ అండ్ అల్లాయిడ్ ప్రొడక్ట్స్‌కు 9 కోట్ల రూపాయల విలువైన ఎల్ఒయులు మోసపూరితంగా జారీ చేసినట్టు సిబిఐ తాజాగా కేసు నమోదు చేసింది. ఈ నేపథ్యంలో బ్యాంక్ షేర్లలో అమ్మకాలు పెరిగాయి. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ కీలకమైన 10400 పాయింట్ల స్థాయి దిగువకు చేరింది. గురువారం నాటి ట్రేడింగ్‌లో 50.75 పాయింట్ల నష్టంతో 10360.15 పాయింట్ల వద్ద ముగిసింది. ప్రపంచ మార్కెట్లలో మిశ్రమ ట్రెండ్ నేపథ్యంలో దేశీయ మార్కెట్లు సంకుచిత శ్రేణిలో కన్సాలిడేట్ అవుతోందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. భారత ఆర్థిక వ్యవస్థ 2019 ఆర్థిక సంవత్సరంలో 7.3 శాతం వృద్ధిని నమోదు చేసుకుంటుదన్న ప్రపంచబ్యాంక్ అంచనాల నేపథ్యంలో దీర్ఘకాలిక సానుకూల సెంటిమెంట్‌కు అవకాశం ఉందని, అయితే అంతర్జాతీయ వాణిజ్యానికి సంబంధించిన ఆందోళనలు, రానున్న కాలంలో వివిధ రాష్ట్రాల్లో ఎన్నికలు మార్కెట్ల గమనంపై ప్రభావం చూపే అవకాశం ఉందని ఆయన చెప్పారు.

- బ్యాంకింగ్ షేర్లలో యస్ బ్యాంకింగ్ అత్యధికంగా 2.04 శాతం నష్టపోయింది. ఆర్ఐఎల్ 1.76 శాతం, ఐసిఐసిఐ బ్యాంక్ 1.60 శాతం, యాక్సిస్ బ్యాంక్ 1.23 శాతం, ఎస్‌బిఐ 1.13 శాతం, ఫెడరల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడాలు 1.07 శాతం వరకు నష్టపోయాయి.
- హెచ్‌యుఎల్, టాటా స్టీల్, ఐటిసి, సన్‌ఫార్మా, హెచ్‌డిఎఫ్‌సి, టిసిఎస్, ఎల్ అండ్ టి, భారతి ఎయిర్‌టెల్, టాటా మోటార్స్, ఎన్‌టిపిసి, అదానీ పోర్ట్స్, మారుతి సుజుకీ షేర్లు 1.48 శాతం వరకు నష్టాలను చవిచూశాయి.
- గీతాంజలి జెమ్స్ షేరులో డౌన్‌ట్రెండ్ కొనసాగుతోంది. ఈ షేరు 4.78 శాతం నష్టంతో 12.95 రూపాయలకు చేరింది.
- యూరియా సబ్సిడీని 2020 నాటి వరకు పెంచే ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోదం తెలిపిన నేపథ్యంలో నాగార్జునా ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ షేరు 9.82 శాతం, నేషనల్ ఫెర్టిలైజర్స్ 5.15 శాతం, రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్ 4.11 శాతం, కోరమాండల్ ఇంటర్నేషనల్ 5.37 శాతం మేర పెరిగాయి.



భారత్ డైనమిక్స్ ఐపిఒ 1.30 రెట్లు ఓవర్ సబ్‌స్క్రిప్షన్

రక్షణ రంగంలోని భారత్ డైనమిక్స్ పబ్లిక్ ఇష్యూ ముగింపు రోజైన గురువారం నాడు 1.0 రెట్లు ఓవర్‌సబ్‌స్క్రైబ్ అయింది. ఈ ఇష్యూ ద్వారా కంపెనీ 960 కోట్ల రూపాయలు సమీకరించనుంది. ఇష్యూ ద్వారా 2,24,51,953 షేర్లను ఆఫర్ చేయగా.. 2,92,42,115 షేర్లకు బిడ్స్ వచ్చాయి.

బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	31,460	---	31,320	31,330	30,460
క్రితం ముగింపు	31,510	31,450	31,370	31,380	30,540
22 క్యారెట్లు	29,130	---	28,810	29,080	29,000
క్రితం ముగింపు	29,170	29,200	28,860	29,150	29,080
వెండి (కిలో)	39,500	---	39,300	39,700	41,400
క్రితం ముగింపు	39,600	40,000	39,500	39,800	41,600

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 3.90 నెక్ (100 గుడ్లు)

హైదరాబాద్	330.00	చిత్తూరు	363.00
వరంగల్	332.00	చెన్నై	370.00
విజయవాడ	317.00	నమక్కల్	360.00
గోదావరి	317.00	బెంగళూరు	365.00
విశాఖపట్నం	325.00	ముంబై	370.00

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	70.00	విజయవాడ	71.00
కరీంనగర్	71.00	గుంటూరు	71.00
వరంగల్	70.00	ఒంగోలు	73.00
మహబూబ్‌నగర్	70.00	చిత్తూరు	71.00
కర్నూలు	70.00	నెల్లూరు	71.00
విశాఖపట్నం	74.00	అనంతపురం	72.00
గోదావరి	71.00		

ఫారెక్స్ (థామస్‌కుక్ రేట్లు) (రూపాయల్లో..)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
యుఎస్ డాలర్	59.07	68.50
పౌండ్	82.57	95.76
యూరో	73.12	84.80
ఆస్ట్రేలియా డాలర్	46.54	53.85
బహ్రెయిన్ దినార్	159.98	183.34
కువైట్ దినార్	178.88	222.68
ఒమని రియాల్	156.67	179.24
సౌదీ రియాల్	15.71	18.61
సింగపూర్ డాలర్	45.08	53.39

టెక్ వ్యూ

10300 వద్ద మద్దతు

నిఫ్టీ గురువారం క్రితం స్థాయిల వద్ద ఫ్లాట్‌గా ప్రారంభమై 10400 స్థాయిలకన్నా దిగువకు జారి నెగిటివ్ ట్రెండ్‌లోకి వెళ్లింది. చివరకు డే కనిష్ఠ స్థాయిలో ముగిసింది. నిఫ్టీ 10500 నిరోధ స్థాయి వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమైంది. బ్యాంక్ నిఫ్టీ 25000 స్థాయిల వద్ద నిరోధాన్ని ఎదుర్కొంటోంది.

శుక్రవారం స్థాయిలివే..

నిరోధం : 10430 **మద్దతు :** 10300

- నిఫ్టీ కరెక్షన్‌కు గురైతే తదుపరి ప్రధాన మద్దతు 10300. ఈ స్థాయి వద్ద విఫలమైతే షార్ట్‌టర్మ్ కరెక్షన్‌కు అవకాశం ఉంటుంది.
- దిగువన 10200, 10000 స్థాయిల వద్ద ప్రధాన మద్దతు ఉంటుంది.
- నిఫ్టీ రికవరీ అయి ఇంట్రాడే మైనర్ నిరోధ స్థాయి 10440 ఎగువన నిలదొక్కుకుంటే మరింత అప్‌ట్రెండ్‌కు అవకాశం ఉంటుంది.
- ఎగువన ప్రధాన నిరోధ స్థాయి 10500.

■ వి.సుందర్ రాజా

ఆస్ట్రో వ్యూ

మిడ్‌సెషన్ మెరుగు

తిథి : ఫాల్గుణ కృష్ణ చతుర్దశి **నక్షత్రం :** శతభిషం

ఆశ్లేష, జ్యేష్ఠ, రేవతి నక్షత్ర జాతకులు, మీన, కర్కాటక రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ : 10360.15 (-50.75)

ట్రెండ్ మార్పు వేళలు: మధ్యాహ్నం 12.23, 2.03 గంటలు

ధోరణి : గ్రహగతులను బట్టి మార్కెట్ నిస్తేజంగా ప్రారంభమై 10.30 గంటల నుంచి 12.30 గంటల వరకు మెరుగ్గా ఉండి, తదుపరి మార్కెట్ ముగిసే వరకు నిస్తేజంగా ఉండవచ్చు.

ట్రేడింగ్ వ్యూహం...

నిఫ్టీ ఫ్యూచర్స్ 10.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా ఎగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 12.15 గంటల సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 12.30 వరకు ఎటిపి కన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని మార్కెట్ ముగిసే సమయానికి క్లోజ్ చేసుకోవలసి ఉంటుంది.

నిరోధం : 10400, 10435 **మద్దతు స్థాయిలు :** 10320, 10285

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

గమనిక: ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి www.thefinancialastrologer.blogspot.in

భారత్‌లో జిఎస్‌టి..
గజిబిజి గందరగోళం: ప్రపంచబ్యాంక్

న్యూఢిల్లీ: భారత్‌లో జిఎస్‌టి అమలు అత్యంత సంక్లిష్టంగా ఉందని వరల్డ్ బ్యాంక్ నివేదిక పేర్కొంది. అంతేకాదు, ప్రపంచంలో 115 దేశాలు ఇదే తరహా పరోక్ష పన్నుల విధానాన్ని అవలంబిస్తుండగా.. అధిక మొత్తంలో జిఎస్‌టి వసూలు చేస్తున్న దేశాల్లో ఇండియా రెండో స్థానంలో ఉందని అంటోంది. దేశ వ్యాప్తంగా ఏకరీతి పరోక్ష పన్నుల విధానాన్ని అమలు చేసేందుకు రూపొందించిన జిఎస్‌టి జూలై 1 నుంచి అమలులోకి వచ్చింది. భారత్‌కు స్వాతంత్య్రం వచ్చాక పన్ను చట్టాల్లో ఇదే అతిపెద్ద సంస్కరణ. జిఎస్‌టిలో పన్ను విధింపును ఐదు శ్లాబులు (0, 5, 12, 18, 28 శాతాలు)గా విభజించారు. పైగా కొన్ని విక్రయాలపై పన్ను మినహాయింపునివ్వడంతోపాటు ఎక్స్‌పోర్టర్లతో పలు వ్యాపారాలకు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ సౌకర్యం కల్పించారు.

పారిపోతారు.. పారా హుషార్

91 మంది డిఫాల్టర్ల జాబితా.. విదేశాలకు ఉడాయించకుండా చర్యలు

న్యూఢిల్లీ : భారీ ఎత్తున బ్యాంకుల నుంచి అప్పులు తీసుకోవడం, ఎగవేయడం, విదేశాలకు పరారు కావడం.. ఈ షరామామూలు వ్యవహారానికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. బ్యాంకు రుణాలను ఉద్దేశ్య పూర్వకంగా ఎగవేసిన జాబితాలో ఉన్న 91 మందితో ఒక జాబితాను తయారు చేసి వారు దేశం విడిచి పారిపోకుండా చర్యలకు ఉపక్రమించింది. రుణాలు తీర్చగలిగే సత్తా ఉన్నప్పటికీ తీర్చకుండా ఎగవేస్తున్న సంస్థలను విల్‌ఫుల్ డిఫాల్టర్ (ఉద్దేశ్యపూర్వక ఎగవేతదారు)గా పరిగణిస్తారు. ఈ జాబితాలో దాదాపు 400 కంపెనీలున్నాయి. ఈ కంపెనీల ప్రమోటర్లు, డైరెక్టర్లతోనే ప్రభుత్వం ఇప్పుడు ప్రత్యేక జాబితా తయారు చేసింది. కంపెనీల రుణాలకు వీరు గ్యారంటీగా ఉన్నారు. నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీల పరారీ అంతకుముందు విజయ్ మాల్యా పరారీతో ప్రభుత్వం పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తోంది. ప్రభుత్వం కనుసన్నల్లోనే ఎగవేతదారులు దేశం విడిచి పారిపోతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం డిఫాల్టర్ల విషయంలో కఠిన చర్యలకు ఉపక్రమించింది.

నీరవ్ మోదీ కేసు దరిమిలా ప్రభుత్వం ఆదేశాల మేరకు 50 కోట్ల రూపాయల పైబడిన బకాయిలున్న సంస్థల ప్రమోటర్లు, డైరెక్టర్ల పాస్‌పోర్ట్ వివరాలను సేకరించాలని బ్యాంకులను ప్రభుత్వం ఆదేశించింది. దేశం విడిచి పారిపోతే సదరు వ్యక్తుల ఆస్తులను ప్రభుత్వం జప్తు చేసుకునేందుకు వీలుగా చట్టాన్ని కూడా తెచ్చారు.

దేశదేశాల్లో..

భారీ ఎత్తున బ్యాంకులను ముంచి విదేశాలకు పరారైన వాళ్లు లండన్ నుంచి సెయింట్ కీట్స్ వరకు వేరువేరు దేశాల్లో ఉన్నారు. వీళ్లను స్వదేశానికి రప్పించడానికి లీగల్ మార్గాల్లో ప్రభుత్వం ఏళ్లుగా ప్రయత్నాలు చేస్తోంది. చట్టం నుంచి తప్పించుకున్న దాదాపు 31 మంది బడాచోరులను దేశానికి రప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టుగా ప్రభుత్వం బుధవారం నాడు పార్లమెంట్‌లో స్వయంగా చెప్పింది. నేరాలకు పాల్పడినవాళ్లను దేశం విడిచి పారిపోకుండా చర్యలు తీసుకోవడం చాలా అవసరం.

పారిపోయిన తర్వాత మళ్లీ దేశానికి రప్పించాలంటే అంతర్జాతీయ చట్టాల ప్రకారం పెద్ద తతంగమే ఉంటుంది. వారు నేరం చేసినట్టుగా నిర్ద్వంద్వంగా ప్రభుత్వం రుజువు చేయాల్సి ఉంటుంది. సాక్ష్యాలను సమర్పించాల్సి ఉంటుంది.

ఆర్‌పి ఇన్ఫో డైరెక్టర్ల అరెస్ట్

బ్యాంకులను 515 కోట్ల రూపాయల మేర వంచించిన కేసులో ఆర్‌పి సిస్టమ్స్ డైరెక్టర్లను సిబిఐ అధికారులు అరెస్ట్ చేశారు. కోల్‌కతా కేంద్రంగా ఉన్న ఈ కంపెనీపై కెనరా బ్యాంక్ కేసులు నమోదు చేసింది. డైరెక్టర్లు శివాజీ పంజా, కౌస్తవ్ రాయ్‌ని అదుపులోకి తీసుకున్నట్టు సిబిఐ వెల్లడించింది.

పిఎన్‌బి బ్రాడీహౌజ్‌లో మరో కేసు

నీరవ్ మోదీ స్కామ్‌లో కేంద్ర బిందువుగా ఉన్న పిఎన్‌బి బ్రాడీహౌజ్ శాఖలో మరో ఎల్ఓయు కుంభకోణం బయటపడింది. చంద్రి పేపర్స్ అనే సంస్థకు 9 కోట్ల రూపాయల విలువైన ఎల్ఓయులను అక్రమంగా జారీ చేసినట్టుగా సిబిఐ దర్యాప్తులో వెల్లడైంది. ఈ తొమ్మిది కోట్ల రూపాయల ఎల్ఓయు స్కామ్‌లోనూ గోకుల్‌నాథ్ శెట్టి, మనోజ్ కారత్ నిందితులుగా ఉన్నారు. వీరిద్దరే నీరవ్ మోదీ 13,000 కోట్ల రూపాయల స్కామ్‌లోనూ సూత్రదారులుగా ఉన్న విషయం తెలిసిందే. ఈ కేసులో చంద్రిక పేపర్స్ అండ్ అల్లాయిడ్ ప్రొడక్ట్స్, దాని డైరెక్టర్లు ఆదిత్య రాశి వసియా, ఈశ్వర్ దాస్ అగర్వాల్ కూడా నిందితులుగా ఉన్నారు.



ఎగుమతులు ఓకే!

గతనెలలో 4.5 శాతం వృద్ధి .. వాణిజ్య లోటు తగ్గుముఖం



న్యూఢిల్లీ: భారత ఎగుమతి వాణిజ్యం వృద్ధి బాటలో పయనిస్తోంది. గత నెలకు దేశ ఎగుమతుల విలువ 4.5 శాతం పెరిగి 2,580 కోట్ల డాలర్లకు చేరుకున్నాయని కేంద్ర వాణిజ్య శాఖ కార్యదర్శి రీటా టియోటియా తెలిపారు. ఫిబ్రవరిలో భారత్‌లోకి దిగుమతైన వస్తు, సేవల విలువ కూడా 10.4 శాతం పెరిగి 3,780 కోట్లుగా నమోదైంది. దాంతో వాణిజ్య లోటు (ఎగుమతుల ఆదాయం కంటే దిగుమతుల చెల్లింపులు అధికంగా ఉండటం) 1,200 కోట్ల డాలర్లకు పరిమితమైంది. జనవరిలో 1,630 కోట్ల డాలర్లతో పోలిస్తే లోటు భారీగా తగ్గిందనే చెప్పుకోవచ్చు. పెట్రోలియం, రసాయనాలు, వెండి, ముత్యాలు, మెషీన్ టూల్స్ దిగుమతులు భారీగా పెరగడంతో జనవరిలో వాణిజ్య లోటు 56 నెలల గరిష్ఠ స్థాయిని తాకింది.

గత కొన్ని నెలలుగా దేశ ఎగుమతి వాణిజ్యం సానుకూల వృద్ధిని కనబరుస్తోందని రీటా ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గడిచిన 11 నెలల కాలానికి (ఏప్రిల్ 2017- ఫిబ్రవరి 2018) ఎగుమతులు 11 శాతం వృద్ధి చెంది 27,370 కోట్ల డాలర్లకు చేరుకోగా.. దిగుమతులు 21 శాతం పెరిగి 41,687 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి. గత నెలలో చమురు దిగుమతులు 32 శాతం పెరుగుదలను నమోదు చేసుకున్నాయి. ఇక ఎగుమతుల విషయానికొస్తే.. రసాయనాలు, ఇంజినీరింగ్, పెట్రోలియం ఉత్పత్తుల రంగాలు మెరుగైన వృద్ధిని సాధించాయి.



‘బిగ్ సి’లో సామ్‌సంగ్ ఎస్ 9, ఎస్9 ప్లస్

విడుదల చేసిన సమంత, బాలు చౌదరి

హైదరాబాద్ : సామ్‌సంగ్ ఎస్9, ఎస్9 ప్లస్ స్మార్ట్‌ఫోన్లను హైదరాబాద్.. కూకట్‌పల్లి బాలాజీ నగర్ బిగ్ సి షోరూమ్‌లో టాలీవుడ్ నటి సమంత, బిగ్ సి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ యం బాలు చౌదరి, సామ్‌సంగ్ వైస్ ప్రెసిడెంట్ ఉదయ్ భట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా బాలు చౌదరి మాట్లాడుతూ.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మార్కెట్లోకి సామ్‌సంగ్ సరికొత్త స్మార్ట్‌ఫోన్లయిన ఎస్9, ఎస్ 9 ప్లస్‌లను బిగ్ సి ద్వారానే విడుదల చేయటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ స్మార్ట్‌ఫోన్ల కొనుగోళ్లపై హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లేదా పేటీఎం మాల్ ద్వారా రూ.6,000 క్యాష్‌బ్యాక్ అందిస్తున్నట్లు చెప్పారు. అంతేకాకుండా ఇఎంఐతో ఎస్9, ఎస్9 ప్లస్‌లను కొనుగోలు చేయవచ్చని పేర్కొన్నారు. భారత మార్కెట్ కోసం ఈ స్మార్ట్‌ఫోన్లను ప్రత్యేకంగా రూపొందించినట్లు సామ్‌సంగ్ వైస్ ప్రెసిడెంట్ ఉదయ్ భట్ తెలిపారు. ఈ స్మార్ట్‌ఫోన్ల ధరలు రూ. 57,900 నుంచి రూ. 72,900 మధ్య ఉన్నాయని తెలిపారు.

రొయ్యల దాణాలో
అత్యంత విలువైన బ్రాండ్‌గా వాటర్‌బేస్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : ఆంధ్రప్రదేశ్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ది వాటర్‌బేస్ లిమిటెడ్.. రొయ్యల దాణా విభాగంలో ఆసియాలోనే అత్యంత విలువైన వ్యాపార బ్రాండ్ అవార్డును గెలుచుకుంది. సింగపూర్‌లో జరిగిన ఆసియన్ బ్రాండ్ అండ్ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ది వాటర్‌బేస్ లిమిటెడ్ సిఇఒ రమాకాంత్ వి ఆకుల ఈ అవార్డును అందుకున్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఈ అవార్డును అందుకోవటంతో కంపెనీ మరో మైలురాయిని చేరుకుందని ఈ సందర్భంగా రమాకాంత్ అన్నారు.

సన్ మొబిలిటీతో ఎపిఇడిబి ఒప్పందం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : సన్ మొబిలిటీతో ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఎపిఇడిబి) అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందంలో భాగంగా సన్ మొబిలిటీ.. ఎలక్ట్రిక్ వాహనాల (ఇవి) చార్జింగ్ సదుపాయాలతో పాటు అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయనుంది. స్మార్ట్ బ్యాటరీస్ పేరుతో సొంతంగా ఎలక్ట్రిక్ బ్యాటరీలను ఉత్పత్తి చేయటమే కాకుండా తొలుత పైలెట్ ప్రాజెక్ట్ ప్రాతిపదికన విశాఖపట్నంలో ఈ సేవలను ప్రారంభించనున్నట్లు సన్ మొబిలిటీ తెలిపింది. ఆ తర్వాత వచ్చే మూడు నుంచి ఐదేళ్ల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా ఈ సర్వీసులను అందుబాటులోకి తీసుకురానున్నట్లు కంపెనీ వెల్లడించింది.

భారత్ ఎగుమతి సబ్సిడీలపై

అమెరికా కొర్రీలు

డబ్ల్యుటిఒకు ట్రంప్ సర్కారు ఫిర్యాదు



వాషింగ్టన్ : ఎగుమతులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను అమెరికా అడ్డుకోవాలని చూస్తోంది. భారత ఎగుమతి సబ్సిడీ పథకాలను ట్రంప్ ప్రభుత్వం ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ) వద్ద సవాలు చేసింది. భారత ప్రభుత్వం కల్పిస్తున్న అర డజను సబ్సిడీ ప్రోత్సాహక పథకాల ప్రయోజనాలతో ఎగుమతిదారులు తమ ఉత్పత్తులు, సేవలను చౌకగా అమెరికా మార్కెట్లో విక్రయించగలుగుతున్నారని యుఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ (యుఎస్‌టిఆర్) రాబర్ట్ లైట్‌హైజర్ ఆరోపించారు. ఈ పరిణామం అమెరికా కార్మికులు, తయారీదారులకు హాని చేస్తోందని ఆయన అన్నారు. డబ్ల్యుటిఒతో పాటు అందుబాటులో ఉన్న అన్ని మార్గాల్లో పరస్పర సహకారం ద్వారా వాణిజ్యాన్ని ప్రోత్సహించడంలో అమెరికా హక్కులను అమలు చేసే విషయంలో భాగస్వామ్య దేశాలు కూడా జవాబుదారీగా ఉండాలని అమెరికా కోరుకుంటోందని ఆయన పేర్కొన్నారు. భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విజయ్ గోఖలే తొలిసారిగా అమెరికాలో పర్యటించనున్న నేపథ్యంలో లైట్‌హైజర్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. అమెరికా పర్యటనలో భాగంగా గోఖలే యుఎస్‌టిఆర్‌తోనూ భేటీ కానున్నారు.

ఏటా 700 కోట్ల డాలర్ల ప్రయోజనాలు

స్టీల్, ఫార్మా, రసాయనాలు, ఐటి, టెక్స్‌టైల్స్, రెడీమేడ్ దుస్తులతోపాటు పలు రంగాలకు చెందిన ఎగుమతిదారులకు భారత ప్రభుత్వం పలు సుంకాలు, పన్నులు, రుసుముల నుంచి మినహాయింపు కల్పిస్తోందని రాబర్ట్ ఆరోపించారు. ఏటా ఇండియన్ కంపెనీలు సబ్సిడీ పథకాల ద్వారా ఏటా 700 కోట్ల డాలర్ల మేర ప్రయోజనాలు పొందుతున్నాయని, దాంతో వారికి పోటీలో అనుచిత స్థాయిలో లాభం చేకూరుతోందని అంటోంది. గత ఆర్థిక సంవత్సరం (2016-17)లో అమెరికాకు భారత్ 4,221 కోట్ల డాలర్ల విలువైన వస్తు, సేవలను ఎగుమతి చేసింది. అదే సమయంలో అమెరికా నుంచి భారత్‌కు దిగుమతులు 2,230 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి.

అమెరికాతో చర్చిస్తాం: రీటా

ఎగుమతిదారులకు సబ్సిడీ ప్రయోజనాల విషయంలో అమెరికాతో చర్చించి, వాటి ఆవశ్యకతను వివరిస్తామని కేంద్ర వాణిజ్య శాఖ కార్యదర్శి రీటా టియోటియా అన్నారు. ఈ విషయంలో డబ్ల్యుటిఒలోని వివాద పరిష్కార వ్యవస్థ ద్వారా భారత్‌తో అమెరికా సంప్రదింపులు కోరుతోందన్నారు. భారత్ కూడా అమెరికాతో సమగ్రంగా సంప్రదింపులు జరుపుతామని, మన పరిస్థితిని వివరిస్తామన్నారు. భారత్‌తో వివాదం పరిష్కారం విషయంలో అమెరికా కూడా సానుకూల వైఖరితోనే ఉందని భావిస్తున్నామని రీటా పేర్కొన్నారు. భారత్ వరుసగా మూడేళ్లపాటు గరిష్ఠ పరిమితికి మించి ఎగుమతి సబ్సిడీలు కల్పిస్తూ వచ్చిందని, ఇక ప్రోత్సాహకాలిచ్చేందుకు అర్హత కోల్పోయిందంటూ అభివృద్ధి చెందిన దేశాలు పలు వేదికలపై ఈ విషయాన్ని లేవనెత్తాయి.

ఆందోళనలో ఎగుమతిదారులు

ప్రభుత్వం కల్పిస్తున్న సబ్సిడీలను అమెరికా ప్రభుత్వం డబ్ల్యుటిఒలో సవాలు చేయడంతో భారత ఎగుమతిదారుల్లో ఆందోళన మొదలైంది. కేంద్రం ఈ సబ్సిడీలను క్రమంగా ఉపసంహరించుకోవాలని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్ఐఇఒ) డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్ అభిప్రాయపడ్డారు. మన ఎగుమతిదారులకు అమెరికా అతిపెద్ద మార్కెట్ అని, దేశ ఎగుమతుల్లో యుఎస్ మార్కెట్ వాటా 14 శాతంగా ఉందన్నారు.

చైనాపై మరిన్ని చర్యలు

చైనా నుంచి దిగుమతులను అడ్డుకునేందుకు ట్రంప్ సర్కారు మరిన్ని చర్యలు చేపట్టే అవకాశం ఉంది. చౌకగా దిగుమతవుతున్న వస్తువుల కారణంగా అమెరికా వ్యాపారాలు కుదేలవుతున్నాయని శ్వేత సౌధం (వైట్ హౌజ్) పేర్కొంది. చైనాతో అమెరికా వాణిజ్య లోటు 50 వేల కోట్ల డాలర్ల స్థాయిలో ఉంది.

పిఎన్‌బి ఎల్ఓయులు మినహా
అన్నీ సక్రమమే : ఎస్‌బిఐ

న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) కుంభకోణం నేపథ్యంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు (పిఎస్‌బి) తమ లెటర్ ఆఫ్ అండర్ టేకింగ్స్ (ఎల్ఓయు)ను కూలంకషంగా పరిశీలించుకుంటున్నాయి. ఇప్పటి వరకు జరిగిన ఈ పరిశీలనలో ఒక్క పిఎన్‌బి జారీ చేసిన ఎల్ఓయులు తప్ప, మిగతా పిఎస్‌బిలు జారీ చేసిన ఎల్ఓయులన్నీ సక్రమంగానే ఉన్నట్టు తేలినట్టు ఎస్‌బిఐ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. కొంత మంది పిఎన్‌బి అధికారులు, సిబ్బందితో కుమ్మక్కవడం ద్వారా వజ్రాల వ్యాపారులు నీరవ్ మోదీ, గీతాంజలి గ్రూప్ కంపెనీల అధినేత మెహుల్ చోక్సీ నకిలీ ఎల్ఓయుల ద్వారా పిఎన్‌బిని రూ.12,968 కోట్ల మేరకు ముంచిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మిగతా పిఎస్‌బిలన్నీ తమ శాఖల ద్వారా జారీ చేసిన ఎల్ఓయుల సాధాకారితను క్షుణ్ణంగా పరిశీలించుకున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌తో బెల్‌ఫ్రిక్స్ జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో బ్లాక్‌చెయిన్ డెవలప్‌మెంట్ స్టార్టప్ బెల్‌ఫ్రిక్స్ గ్లోబల్ అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. భారత్‌లో ఫిన్‌టెక్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్‌కు ఈ ఒప్పందం దోహదపడుతుందని బెల్‌ఫ్రిక్స్ తెలిపింది. ఒప్పందంలో భాగంగా ప్రభుత్వానికి సంబంధించి రోజువారీ కార్యకలాపాలను మరింత సులభతరం చేసేందుకు బ్లాక్‌చెయిన్ ఆధారిత సొల్యూషన్లను బెల్‌ఫ్రిక్స్ అభివృద్ధి చేయనుంది. భారత మార్కెట్ కోసం బ్లాక్‌చెయిన్ సొల్యూషన్స్‌ను అభివృద్ధి చేయటంలో ఉన్న సామర్థ్యాలకు ఈ ఒప్పందం ఒక నిదర్శనమని సంస్థ ఫౌండర్, సిఇఒ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఇదే తరహా సొల్యూషన్ల అభివృద్ధి కోసం బ్యాంకింగ్ సంస్థలు, విద్యా సంస్థలతో కూడా జట్టు కట్టినట్లు చెప్పారు.

సమతుల బడ్జెట్ : ఎఫ్‌టాప్సీ

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వాణిజ్య, పారిశ్రామిక మండళ్ల సమాఖ్య (ఎఫ్‌టాప్సీ) స్వాగతించింది. ఈ బడ్జెట్ సమతుల్యంగా, ప్రజాకర్షకంగా ఉందని పేర్కొంది. బడ్జెట్‌లో రైతులు, మైనారిటీ, ఎస్‌సి, ఎస్‌టిల అభివృద్ధి, సంక్షేమానికి పెద్ద పీట వేసినట్టు ఎఫ్‌టాప్సీ అధ్యక్షుడు గౌర శ్రీనివాస్ తెలిపారు. విద్యుత్ రంగానికి చేసిన కేటాయింపులు స్వాగతించదగినవని, ఫలితంగా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు పూర్తికావడానికి అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

భూముల ధరలు తగ్గాలి..

అమెరికా స్థాయిలో ‘బెజవాడ’ ధరలు

ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు



న్యూఢిల్లీ : దేశీయ రియల్ ఎస్టేట్ మార్కెట్ క్రమంగా గాడిన పడుతోందని ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు చెప్పారు. అయితే దేశంలోని చిన్న చిన్న నగరాల్లో ఇళ్ల స్థలాల ధరలు కొండెక్కడంపై ఆందోళన వ్యక్తం చేశారు. విజయవాడ ఇళ్ల స్థలాల ధరలు అమెరికాలోని వాషింగ్టన్, న్యూయార్క్ నగరాల స్థాయిలో ఉండడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. క్రెడాయ్ వార్షిక సదస్సులో ఉపరాష్ట్రపతి ఈ విషయాలు చెప్పారు. మోసకారుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని క్రెడాయ్ సభ్యులను హెచ్చరించారు. ఎగవేతదారులు, రాత్రికి రాత్రి బిచాణా ఎత్తివేసే రియల్టీ కంపెనీలు, వ్యక్తులను దూరంగా ఉంచేందుకు క్రెడాయ్ సంస్థ తన సభ్యుల కోసం స్వీయ ప్రవర్తనా నియమావళి రూపొందించి పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దేశంలో వ్యవసాయం తర్వాత నిర్మాణ రంగం, రియల్ ఎస్టేట్ రంగాలే ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. రియల్టీ రంగం కోలుకోవడం ఆర్థిక వ్యవస్థకూ మేలు చేస్తుందన్నారు.

గొంతు నొక్కేలా ఉండకూడదు

రియల్ ఎస్టేట్ రంగంలో నియంత్రణ సంస్థ అవసరమైనా, ఆ సంస్థ నిబంధనలు పరిశ్రమ గొంతు నొక్కేలా ఉండకూడదని ఉప రాష్ట్రపతి స్పష్టం చేశారు. ‘ఈ రంగంలో నియంత్రణ సంస్థ అవసరం ఉంది. అయితే ఆ నియంత్రణ సంస్థ నిబంధనలు పరిశ్రమ గొంతు నొక్కేలా ఉండకూడదు. అలా అని నియంత్రణలు లేకపోతే ఈ రంగంలోనూ అనేక మంది విజయ్ మాల్యాలు, నీరవ్ మోదీలను చూడాల్సి వస్తుంది’ అన్నారు. రెరా చట్టంలో పేర్కొన్న నిబంధనల అమలుకు క్రెడాయ్ సభ్యులు సిద్ధంగా ఉన్నారని ఆశిస్తున్నట్టు చెప్పారు.

దేశంలో భూముల ధర ఎక్కువగా ఉండడం తోనే ఇళ్ల ధర ఎక్కువగా ఉందన్నారు. చిన్న చిన్న నగరాల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉన్నట్టు చెప్పారు. ‘విజయవాడ వంటి నగరాల్లో అయితే భూముల ధర న్యూయార్క్, వాషింగ్టన్ నగరాల స్థాయిలో ఉన్నాయి. అందుకే ఇళ్ల ధర పెరిగిపోతోంది’ అన్నారు. ఎక్కువ భూములు మధ్యవర్తుల దగ్గర ఉండడమూ ఇందుకు కారణమన్నారు. వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా రియల్టీ మార్కెట్‌లోనూ ధరలు దిద్దుబాటు కావలసిన అవసరం ఉందన్నారు.

బ్యాంకింగ్ మోసాలపై పార్లమెంట్‌లో చర్చ జరగాలి

బ్యాంకింగ్ రంగంలో చోటు చేసుకుంటున్న మోసాలపై పార్లమెంట్‌లో అర్థవంతమైన చర్చ జరగాలని ఉప రాష్ట్రపతి కోరారు. దురదృష్టవశాత్తూ పార్లమెంట్‌లో ఇప్పటి వరకు దీనిపై ఎలాంటి చర్చ జరగడం లేదన్నారు. ‘ఎంపిలు, ప్రభుత్వం, సభాధ్యక్షులూ దీనిపై చర్చ జరగాలని భావిస్తున్నారు. అయినా చర్చ మాత్రం జరగడం లేదు. అదే దురదృష్టకరం’ అన్నారు. ఎవరి హయాంలో ఈ మోసాలు జరిగాయనే దాంతో నిమిత్తం లేకుండా బ్యాంకింగ్ మోసాలపై పార్లమెంట్‌లో చర్చ జరగాలని వెంకయ్య నాయుడు కోరారు.

ఇళ్లకు ఇప్పటికీ కొరతే

దేశంలో పెరిగిపోతున్న గృహ కొరతపైనా ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. ‘ప్రస్తుతం దేశవ్యాప్తంగా 1.9 కోట్ల ఇళ్లకు కొరత ఉంది. 2030 నాటికి ఇది 3.8 కోట్లకు పెరగనుంది’ అన్నారు. అందుబాటు ధరల్లో ఇళ్లను నిర్మించడంలో ప్రైవేటు రంగమూ చురుకైన పాత్ర వహించాలని కోరారు.

ఎన్‌హెంప్‌కో కంపెనీ విస్తరణ



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : బెంగుళూరు కేంద్రంగా పని చేసే నమ్రత హెంప్ (ఎన్‌హెంప్‌కో) అనే స్టార్టప్ కంపెనీ విస్తరణకు సిద్ధమైంది. ఇందులో భాగంగా అనంతపురం జిల్లా ఆలమూరు గ్రామంలో ‘కనబిస్ సటివ’ అనే హెంప్ మొక్కల (మాదక ద్రవ్యంగా పనికిరాని ఒక రకమైన గంజాయి మొక్క) సమగ్ర యూనిట్ ఏర్పాటు చేయాలని భావిస్తోంది. కంపెనీ వ్యవస్థాపకులు, ఎండి హర్షవర్ధన్ రెడ్డి ఈ విషయం చెప్పారు. ఇందుకోసం రూ.5.5 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనున్నట్టు వెల్లడించారు. ఈ మొక్కల గింజల నుంచి తీసే నూనెతో కంపెనీ ఇప్పటికే బెంగళూరులోని యూనిట్‌లో 22 రకాల బాడీ వెల్‌నెస్ ఉత్పత్తులు తయారు చేసి ఆన్‌లైన్‌లో విక్రయిస్తోంది. ప్రస్తుతం ఇందుకు అవసరమైన గింజలను హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటోంది.

స్థానికంగా సాగు

రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ మొక్కల సాగును ప్రోత్సహించడం ద్వారా స్థానికంగానే ఈ గింజలు సమకూర్చుకోవాలని కంపెనీ భావిస్తోంది. ఇందుకోసం ముందుగా అనంతపురం జిల్లాలో ప్రయోగాత్మకంగా 15 ఎకరాల్లో హెంప్ సాగు చేపట్టేందుకు అవసరమైన అనుమతుల కోసం కంపెనీ ప్రయత్నిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అనుమతిస్తే రాష్ట్రం మొత్తానికి తమ కార్యకలాపాలు విస్తరిస్తామని హర్షవర్ధన్ చెప్పారు. ‘కొద్దిపాటి నీటి వనరులతో ఎలాంటి భూముల్లో అయినా ఈ హెంప్ మొక్కలను సాగు చేయవచ్చు. 70 నుంచి 110 రోజుల్లో పంట చేతికి వస్తుంది. ఏటా మూడు పంటల సాగుతో రైతులు ఎకరాకు కనీసం రూ.2 లక్షల వరకు ఆదాయం పొందవచ్చు’ అన్నారు. అనంత యూనిట్‌లో ఈ మొక్కల సాగుతో పాటు ప్రాసెసింగ్ యూనిట్, గిడ్డంగులు, ఆర్ అండ్ డి యూనిట్, టెస్టింగ్ సెంటర్ కూడా ఏర్పాటు చేస్తామని కంపెనీ ఎండి చెప్పారు.

రూ.5.5 కోట్లతో ‘అనంత’లో సమగ్ర యూనిట్

ఈ ఏడాది 80 కోట్ల చేప పిల్లల పంపిణీ

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): తెలంగాణ రాష్ట్ర మత్స్య శాఖ, ఇండియన్ ఫిషరీస్ అండ్ ఆక్వా కల్చర్ సొసైటీ (ఎస్ఐఎఫ్ఎ) దక్షిణాసియాలో తొలిసారిగా హైదరాబాద్‌లో ఆక్వా ఎక్స్‌పో 2018ను నిర్వహిస్తున్నాయి. తెలంగాణలో చేపల పెంపకం, రొయ్యల సాగును పెంపొందించే లక్ష్యంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. ఈ నెల 15 నుంచి 17 వ తేదీ వరకు జరగనున్న ఈ ఎక్స్‌పోను రాష్ట్ర పశు సంవర్ధక, డెయిరీ డెవలప్‌మెంట్, ఫిషరీస్ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్స్య పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా తోడ్పాటు నందిస్తోందని, ఇందులో భాగంగానే రాష్ట్రంలోని ముదిరాజ్, గంగపుత్రులకు చేపల పెంపకం, రొయ్యల సాగులో మెళకువలతోపాటు కొత్త టెక్నాలజీలను అందిపుచ్చుకునేందుకు ఎస్ఐఎఫ్ఎతో కలిసి ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దేశంలో ఈ తరహా సదస్సు నిర్వహించటం తొలిసారని, ఇందులో 11 దేశాలకు ప్రతినిధులతో పాటు ఆక్వా రంగానికి చెందిన పలు టెక్నాలజీలు ఇందులో పాల్గొంటున్నాయని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 51 కోట్ల చేప పిల్లలను పంపిణీ చేయగా 2.7 లక్షల టన్నుల చేపలు వచ్చాయని తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరం (2018-19)లో 80 కోట్ల చేప పిల్లల పంపిణీ ద్వారా 3.5 లక్షల టన్నుల చేపలు వస్తాయని అంచనా వేస్తున్నట్లు చెప్పారు.

22 నుంచి ‘స్మార్ట్ అర్బనేషన్’ సదస్సు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ మరో జాతీయ సదస్సుకు వేదికవుతోంది. ఈ నెల 22 నుంచి రెండు రోజుల పాటు ‘స్మార్ట్ అర్బనేషన్’ పేరుతో ఐదో స్మార్ట్ సిటీ సదస్సు నిర్వహిస్తున్నట్టు స్మార్ట్ సిటీస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎస్‌సిసిఐ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రతాప్ పడోడె విలేకరులతో చెప్పారు. దేశ విదేశాల నుంచి 1,500 మందికిపైగా ప్రతినిధులు హాజరవుతారు. నలభైకి పైగా స్టార్టప్ కంపెనీలు కూడా ఈ సదస్సులో స్మార్ట్ సిటీస్‌కు సంబంధించి తమ సరికొత్త ఆలోచనలను ఈ సదస్సులో ఆవిష్కరించబోతున్నాయి. స్మార్ట్ సిటీల అభివృద్ధిలో ఉన్న అవకాశాలు, ఎదురవుతున్న సవాళ్లపై 50 మందికిపైగా ప్రముఖుల ప్రసంగాలూ ఉంటాయి. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్మార్ట్ సిటీస్ ప్రాజెక్టుతో 30 శాతం వరకు ఇంధనం ఆదా అవుతుందని పడోడె చెప్పారు. ఆయా నగరాల పౌరులు సిద్ధంగా లేకపోతే ఏ నగరాన్నీ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడం సాధ్యం కాదన్నారు. మన దేశంలో కొన్ని నగరాలను స్మార్ట్ సిటీలుగా అభివృద్ధి చేయడంలో ఎదురవుతున్న ఇబ్బందులను రాంకీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ రెడ్డి వివరించారు.

● హరితహారానికి నిల్

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): హరిత హారం పథకానికి బడ్జెట్లో సర్కారు నిధులు కేటాయించలేదు. రాష్ట్రవ్యాప్తంగా 230 కోట్ల మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే 81 కోట్ల మొక్కలు నాటామని, ఈ ఏడాది 40 కోట్ల మొక్కలు నాటడానికి ఏర్పాట్లు చేశామని బడ్జెట్లో స్పష్టం చేసింది. ఈ పథకానికి ఇప్పటి వరకు రూ.1166 కోట్లు ఖర్చు చేశామని పేర్కొన్న సర్కారు.. ఈ ఏడాది కేటాయింపులను మాత్రం ప్రస్తావించలేదు.



45 నెలల్లోనే ఎన్నో మైలురాళ్లు

అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో తెలంగాణ ఆదర్శం

- అణగారిన స్థితి నుంచి అభ్యున్నతిలోకి ప్రజలు
- బడ్జెట్ ప్రసంగంలో మంత్రి ఈటల

హైదరాబాద్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం కోసం మొదలైన ప్రయాణంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల పరంగా రాష్ట్ర సర్కారు ఎన్నో మైలురాళ్లను అధిగమించిందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. కేవలం 45 నెలల స్వల్ప కాలంలోనే ఎన్నో అద్భుతాలను ఆవిష్కరించామన్నారు. చీకట్ల నుంచి వెలుగులోకి.. అపనమ్మక స్థితి నుంచి ఆత్మవిశ్వాసంతో తొణికిసలాడే స్థాయికి.. అణగారిన స్థితి నుంచి అభ్యున్నతిలోకి... వలస బతుకుల నుంచి సాగులో ప్రగతి పథం దిశగా రాష్ట్ర ప్రజలను నడిపిస్తున్నామని అన్నారు. 2018-19వ సంవత్సరం రాష్ట్ర బడ్జెట్‌ను మంత్రి ఈటల గురువారం శాసనసభలో ప్రవేశపెట్టారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ఆయన బడ్జెట్ ప్రసంగం 12:25 గంటల వరకు కొనసాగింది. వరుసగా ఐదవసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం రావడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేస్తూ తన ప్రసంగాన్ని మొదలు పెట్టారు. ఈ గురుతర బాధ్యతను అప్పగించినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బడ్జెట్ ప్రసంగాన్ని 'జై హింద్, జై తెలంగాణ' అని ముగించారు. ఈటల బడ్జెట్ ప్రసంగం ఆయన మాటల్లో క్లుప్తంగా..

పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ ప్రతికూలతలు అధిగమించి..

పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ అమలు కారణంగా ఏర్పడిన ప్రతికూల పరిణామాలను తొలిదశలోనే అధిగమించాం. జీడీపీ వృద్ధిలో జాతీయ ధోరణిని సైతం తోసిరాజని రెండంకెల వృద్ధి రేటును సాధించాం. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతపు తయారీ రంగ పరిశ్రమ పరిస్థితి ఎప్పుడూ ఏటికి ఎదురీదినట్టే ఉండేది. రాష్ట్రం ఏర్పడ్డాక, విద్యుత్తు రంగంలో సంస్కరణలు, పారిశ్రామిక రంగంలో పెట్టుబడులకు అనుకూల విధానాలను ప్రవేశపెట్టాం. ముందస్తు అంచనాల ప్రకారం 2017-18లో తయారీ రంగం వృద్ధి 7.6 శాతంగా నమోదు కావడం గమనించాలి. విద్యుత్తు, నీటి పారుదల రంగంలో సాధించిన అభివృద్ధి వల్ల రాష్ట్రంలో సాగు విస్తీర్ణం పెరిగింది. దిగుబడులూ పెరిగాయి. వ్యవసాయం దాని అనుబంధ రంగాల అభివృద్ధి 2017-18లో 6.9 శాతానికి చేరుకుంది. ప్రాజెక్టులు, చెరువుల ద్వారా సాగునీరు లభించడం, కోతల్లేని 24 గంటల కరెంటు సరఫరా, భూగర్భ జలాల సద్వినియోగంతో 2018-19లో కూడా వ్యవసాయ రంగంలో అభివృద్ధి గణనీయంగా ఉంటుందని అంచనా వేస్తున్నాం. మొత్తానికి జీఎస్‌డీపీ నిరుటితో పోల్చితే రికార్డు స్థాయిలో 14.1 శాతం వృద్ధి చెందింది. గత సంవత్సరంతో పోలిస్తే.. వృద్ధి రేటు 13.4 శాతంగా ఉంది. ఇది జాతీయ వృద్ధి రేటు 8.6 శాతంతో పోలిస్తే ఎంతో ఎక్కువ. గతంలో కరెంటు ఉంటే వార్త.. ఈ ప్రభుత్వ పాలనలో కరెంటు పోతే వార్త అని ప్రజలు ప్రశంసిస్తున్నారు. రైతులకు పెట్టుబడి సాయం అందించడంలో ప్రభుత్వం దేశానికి మార్గదర్శకంగా నిలిచింది. ఎకరాకు రూ.4 వేల చొప్పున రెండు పంటలకు అందిస్తున్నాం. 100 రోజుల్లోనే భూరికార్డుల ప్రక్షాళన పూర్తిచేశాం. ప్రభుత్వానికి, రైతులకు మధ్య అనుసంధానంగా రైతు సమన్వయ సమితి పనిచేస్తుంది. గోదావరి, కృష్ణా నదులపై 23 మేజర్, 13 మీడియం ప్రాజెక్టులను చేపట్టాం. గ్రామాల అభివృద్ధి కోసం పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేసేందు కు ఈ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెడుతున్నాం.

సీఎం పాలన.. స్వర్ణయుగం

దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయి. ప్రభుత్వం తలపెట్టిన సంక్షేమ పథకాలు కనీస జీవన భద్రతను కల్పిస్తున్నాయి. ముఖ్యమంత్రి పరిపాలన రాష్ట్రంలో సంక్షేమానికి స్వర్ణయుగంగా చెప్పవచ్చు. ఎంబీసీ కులాల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశాం. రూ.వెయ్యి కోట్లను కేటాయిస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలను నిర్వహించబోతున్నాం. కొత్తగా సూర్యాపేట, నల్లగొండలో వైద్య కళాశాలలను ఏర్పాటు చేయబోతున్నాం. ఐటీ ఎగుమతుల్లో నిరుడు జాతీయ సగటు వృద్ధి 10 శాతం ఉంటే, తెలంగాణలో 13.85 శాతం నమోదైంది. రాష్ట్రంలో 1,10,012 ఉద్యోగ ఖాళీలను గుర్తించాం. ఇందులో 83,048 ఉద్యోగాల భర్తీకి ఇప్పటికే ఉత్తర్వులను జారీ చేశాం. 27,588 ఉద్యోగాలను భర్తీ చేశాం. బంగారు తెలంగాణ నిర్మాణం ధ్యేయంగా రూపొందించిన వా ర్షిక బడ్జెట్‌ను ఆమోదించాల్సిందిగా కోరుతున్నాను.

బడ్జెట్ సమగ్ర స్వరూపం

	2017-18 (బ.అం.)	2017-18 (స.అం.)	2018-19 (బ.అం.)
రెవెన్యూ వసూళ్లు	1,13,083	1,08,148	1,30,975
మూలధన వసూళ్లు	36,237	34,837	43,507
మొత్తం వసూళ్లు	1,49,320	1,42,985	1,74,482
నిర్వహణ వ్యయం	61,608	61,660	69,695
ప్రగతి పద్దు	88,038	80,846	1,04,758
మొత్తం వ్యయం	1,49,646	1,42,506	1,74,453
రెవెన్యూ వ్యయం	1,08,511	1,06,602	1,25,455
రెవెన్యూ మిగులు	4,571	1,545	5,520
ద్రవ్య లోటు	26,096	23,491	29,077

(బ.అం.) బడ్జెట్ అంచనా; (స.అం.) సవరించిన అంచనా

(రూ. కోట్లలో)

అసెంబ్లీ స్పీకర్‌కు బడ్జెట్ తొలి కాపీ

- ఈటలను అభినందించిన సీఎం కేసీఆర్

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర వార్షిక (2018-19) బడ్జెట్‌ను గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టే ముందు ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ తొలి కాపీని అసెంబ్లీ స్పీకర్ మధుసూదనాచారికి అందించారు. బడ్జెట్ ప్రతులున్న సూట్‌కేసులతో అసెంబ్లీ ప్రాంగణానికి చేరుకున్న ఆయన.. ముందుగా స్పీకర్, అనంతరం శాసన మండలి డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, ఆ తరువాత సీఎం కేసీఆర్‌లకు వేర్వేరుగా బడ్జెట్ ప్రతులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఈటలకు ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. అసెంబ్లీలో వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టే ముందు, తర్వాత ఈటలను మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు, అధికారులు అభినందించారు. ఈటల వెంట అసెంబ్లీకి ఆయన కుటుంబ సభ్యులు కూడా వచ్చారు.

● సంక్షేమ, సమగ్రాభివృద్ధి బడ్జెట్: కేసీఆర్

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర 2018-19 వార్షిక బడ్జెట్‌ను.. ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రశంసించారు. అన్నివర్గాల సంక్షేమం, సమగ్రాభివృద్ధి మేళవింపుగా ఉందని వ్యాఖ్యానించారు. అభివృద్ధి, సంక్షేమాలను సమతుల్యం చేశారని, అన్నివర్గాలనూ పరిగణనలోకి తీసుకున్నారని తెలిపారు. రాష్ట్రానికి ఏం కావాలి? లక్ష్యాలు ఏమిటి? వనరులు ఏమిటి? వంటివి పరిగణించి బడ్జెట్ రూపొందించారని కొనియాడారు. ప్రభుత్వ పథకాలు, ప్రణాళికలు మరింత పటిష్ఠంగా అమలు జరిగే బడ్జెట్‌ను రూపొందించారని ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, సలహాదారు జీఆర్ రెడ్డిలను.. కేసీఆర్ అభినందించారు. వ్యవసాయం దాని అనుబంధ రంగాలకు భారీగా నిధులు కేటాయించారని సీఎం కేసీఆర్ సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యంగా నీటిపారుదల, పంట పెట్టుబడి సహాయ పథకం, విద్యుత్తు సబ్సిడీలకు గల భారీ కేటాయింపులతో.. వ్యవసాయ రంగం మరింత పురోగమిస్తుందని కేసీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు.



బడ్జెట్ ప్రతులతో మంత్రి కడియం, స్పీకర్ మధుసూదనాచారి

● మండలిలో బడ్జెట్ ప్రవేశపెట్టిన కడియం

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలిలో 2018-19 బడ్జెట్‌ను ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి ప్రవేశపెట్టారు. ఉదయం 11గంటలకు మండలిలోకి ప్రవేశించిన ఆయన గంటలపాటు నిర్విరామంగా బడ్జెట్ ప్రసంగం చేశారు. బడ్జెట్ ప్రతిని చదువుతున్న సమయంలో అధికార పార్టీ ఎమ్మెల్సీలు ప్రభుత్వ పథకాలకు మద్దతుగా బల్లలు చరిచారు. తెలంగాణ ప్రజల అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం సంక్షేమ పథకాలకు పెద్ద పీట వేసిందని తెలిపారు. ఈ బడ్జెట్ అన్నివర్గాల వారికి న్యాయం చేస్తుందని తెలిపారు.



మంత్రి ఈటలకు తిలకం దిద్దుతున్న ఆయన భార్య జమున

ఎన్నికల బడ్జెట్ కాదు

- సంక్షేమానికి పెద్దపీట వేసిన బడ్జెట్: ఈటల

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమం, రాష్ట్ర భవిష్యత్తు ప్రాధాన్యాలను దృష్టిలో ఉంచుకుని 2018-19 బడ్జెట్‌ను రూపొందించామని, ఇది ఎన్నికల బడ్జెట్ కానేకాదని ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. బడ్జెట్ రూపకల్పనలో రాష్ట్ర ప్రజల సంక్షేమాన్నే తొలి ప్రాధాన్యంగా ఎంచుకున్నామన్నారు. ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, సలహాదారు శివశంకర్‌తో కలిసి ఈటల విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వాలు కేవలం రూ.840కోట్లు సంక్షేమానికి ఖర్చు చేస్తే, టీఆర్ఎస్ ప్రభుత్వం రూ.5,340కోట్లను ఖర్చుచేస్తోందని వివరించారు. రాష్ట్ర జీడీపీ వృద్ధిరేటు స్థిర ధరల్లో 10.4శాతానికి చేరుకుందన్నారు. ఇది దేశ జీడీపీ రేటు 6.6శాతం కంటే ఎక్కువన్నారు. దేశ తలసరి ఆదాయం కంటే రాష్ట్ర తలసరి ఆదాయం రూ.53వేలు ఎక్కువన్నారు. 2018-19 బడ్జెట్‌లో కేటాయింపులకు అనుగుణంగా 95శాతం నిధులను ఖర్చు చేస్తామన్నారు. వ్యవసాయం, అనుబంధరంగాలకు కేటాయింపులను 26శాతం పెంచామని తెలిపారు. రైతు బీమా పథకంతోపాటు రాష్ట్రంలోని 1.3 కోట్ల కుటుంబాల్లో 75లక్షల కుటుంబాలకు రూ.5లక్షల బీమా వర్తించేలా కొత్త పథకాన్ని ప్రవేశపెట్టామని చెప్పారు. ఇన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినపుడు అప్పులు తప్పవన్నారు. ఏటా 11వేలకోట్ల వడ్డీ చెల్లిస్తున్నట్టు చెప్పారు.



వ్యవసాయానికి అధిక నిధులు కేటాయించినందుకు భువనగిరి జిల్లా హుస్నాబాద్‌లో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

పెట్టుబడికి ధీమా.. రైతుకు బీమా


- బడ్జెట్లో వ్యవసాయానికి పెద్ద పీట
- నూతన పథకాలకు 12,658 కోట్లు
- 15 వేలకోట్లు దాటిన సాగు బడ్జెట్

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్లో సాగుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇచ్చింది. సాగు ప్రారంభం కాగానే పెట్టుబడి దొరుకుతుందన్న ధీమాను, పంటకు బీమా కల్పనకు భరోసానూ ఇచ్చింది. వ్యవసాయశాఖ చరిత్రలో ఎన్నడూ లేనంతగా రూ.15061 కోట్ల మేరకు బడ్జెట్‌ను ప్రగతి పద్దు కింద ప్రతిపాదించింది. ఈ ఏడాది ప్రభుత్వం రైతుల కోసం ప్రతిష్ఠాత్మకంగా ఎకరాకు రూ.4 వేల పెట్టుబడి సాయం పథకం, రూ.5 లక్షల మేరకు రైతు బీమా పథకాన్ని చేపట్టిన సంగతి తెలిసిందే. ఖరీఫ్, రబీలకు కలిపి పంట పెట్టుబడి సాయం పథకానికి.. గతంలో సీఎం కేసీఆర్ ప్రకటించినట్లుగానే రూ.12 వేల కోట్ల మేరకు ప్రతిపాదించింది. ఇది మొత్తం రాష్ట్ర బడ్జెట్లో 6.8 శాతం మేరకు ఉంది. రైతు బీమా పథకానికి రూ.500 కోట్ల మేరకు ప్రతిపాదించింది. మరో నూతన పథకం.. రైతు వేదికల నిర్మాణానికి రూ.158 కోట్లు కేటాయించింది. వచ్చే ఏడాది ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెడుతున్న ఈ మూడు నూతన పథకాలకు రూ.12,658 కోట్ల వరకూ ప్రతిపాదించింది. అలాగే, వ్యవసాయ యాంత్రీకరణకూ ప్రభుత్వం పెద్ద పీట వేసింది. ఈ పథకానికి రూ.522 కోట్ల మేరకు ప్రతిపాదించింది. గతంతో పోలిస్తే వంద కోట్లు పెంచింది. వడ్డీలేని, పావలా వడ్డీ రుణాల పథకానికి రూ.500 కోట్ల మేరకు ప్రతిపాదించింది. సబ్సిడీ విత్తనాల పథకానికి రూ.204 కోట్లు, పంటల బీమాకు రూ.210 కోట్లు ప్రతిపాదించింది. ఎన్ఎఫ్ఎస్ఎం, ఆర్కేవీవై తదితర కేంద్ర, రాష్ట్ర భాగస్వామ్య పథకాల కింద రూ.775.67 కోట్ల మేరకు ప్రతిపాదించింది. ఉద్యోగుల వేతనాలకు నిర్వహణ పద్దు కింద రూ. 666.71 కోట్ల మేరకు ప్రభుత్వం ప్రతిపాదించింది. అలాగే.. ఉద్యానవన శాఖకు 409 కోట్ల బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రతిపాదించింది. పాలీహౌస్‌లకు రూ.125 కోట్ల మేరకు ప్రభుత్వం ప్రతిపాదించింది. సగం బడ్జెట్ ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వ పథకాల ఆధారంగా రూపొందించినవే. పశు సంవర్థకశాఖకు 257.43 కోట్లు ప్రతిపాదించింది. గొర్రెలు, మేకల పెంపకందార్ల అభివృద్ధి సమాఖ్యకే రూ.97 కోట్లు కేటాయించింది. మత్స్యశాఖకు రూ.97 కోట్ల మేరకు ప్రతిపాదించారు. మార్కెటింగ్ శాఖకు రూ.149 కోట్ల మేరకు బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రతిపాదించింది.

వ్యవసాయ వర్సిటీకి 105 కోట్లు

వ్యవసాయ పరిశోధన, విద్య కోసం జయశంకర్ వ్యవసాయ వర్సిటీకి రూ.105.50 కోట్ల మేరకు ప్రభుత్వం ప్రతిపాదించింది. కొండా లక్ష్మణ్ ఉద్యానవన వర్సిటీకి రూ.17.60 కోట్లు ప్రతిపాదించింది. వెరసి రెండు వర్సిటీలకూ కలిపి రూ.123.10 కోట్ల మేరకు ప్రతిపాదించింది.





మిషన్ 'ఇరిగేషన్'!

- ప్రాజెక్టులకు కేటాయింపులు
- బడ్జెట్‌లో మళ్లీ 25వేల కోట్లు
- సాగునీటికి సర్కారు పెద్దపీట

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సాగునీటి ప్రాజెక్టులకు సర్కారు మరోసారి పెద్దపీట వేసింది. తాజా బడ్జెట్‌లో రూ.25 వేల కోట్లను కేటాయించింది. రాష్ట్రంలో కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, సీతారామ వంటి భారీ ప్రాజెక్టులతో పాటు దేవాదుల, కల్వకుర్తి, నెట్టెంపాడు, ఏఎమ్మార్పీ ప్రాజెక్టులనూ పూర్తి చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో తాజా బడ్జెట్‌లో రూ.25 వేల కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లోనూ రూ.25 వేల కోట్లను కేటాయించినా.. సవరించిన బడ్జెట్‌లో దాన్ని రూ.20 వేల కోట్లకు కుదించారు. ఈ సారి బడ్జెట్‌లో కేటాయించిన రూ.25 వేల కోట్లలో భారీ సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.21,890 కోట్లు కేటాయించగా, చిన్న నీటిపారుదలకు రూ.2,743 కోట్లు కేటాయించారు. అలాగే ఆయకట్టు ప్రాంత అభివృద్ధికి రూ.251 కోట్లు, వరద నిర్వహణకు రూ.114 కోట్లను కేటాయించారు. మిషన్ కాకతీయ పథకానికి చిన్న నీటిపారుదల బడ్జెట్ నుంచి వ్యయం చేయనున్నారు.



కాళేశ్వరం ప్రాజెక్టులోని అండర్‌గ్రౌండ్ పంపుహౌస్

సాగునీటి బడ్జెట్‌లో దేనికెంత? (రూ. కోట్లలో)

భారీ, మధ్యతరహా	21,890.9
మైనర్ ఇరిగేషన్	2,743.6
ఆయకట్టు అభివృద్ధి	251.0
వరద నియంత్రణ, డ్రైనేజీ	114.5
మొత్తం	25,000

సాగునీటి ప్రాజెక్టులకు కేటాయింపుల వివరాలు.. (రూ.కోట్లలో)

ప్రాజెక్టు పేరు	2017-18 (సవరణ)	2018-19
కాళేశ్వరం	8,298	6,094
ప్రాణహిత	220	350
పాలమూరు	1,660	3,035
సీతారామ	380	1,225
డిండి	256	524
సాగర్ ఆధునికీకరణ	488	197
ఎల్లంపల్లి	150	300
తుపాకులగూడెం	120	500
జూరాల	25	45
దేవాదుల	1,373	1,966
ఎస్సారెస్పీ-1	190	200
ఎస్సారెస్పీ-2	118	200
ఎఫ్ఎఫ్‌సీ	890	690
కల్వకుర్తి	370	500
నెట్టెంపాడు	70	200
భీమా	118	170
కోయిల్‌సాగర్	20	120
సంగంబండ	4	9
ఆర్డీఎస్	28	144
లెండి	-	40
లోయర్ పెన్‌గంగ	200	250
నిజాంసాగర్	70	100

డిస్కంలకు కోత!

- అడిగింది రూ.5,940 కోట్లు.. ఇచ్చింది రూ.5,078 కోట్లు

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో డిస్కంలకు మొండిచేయి చూపారు! టారిఫ్ సబ్సిడీలో భారీగా కోత వేశారు! వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్తుతో పాటు స్పిన్నింగ్ మిల్లులు, ఎస్సీ పారిశ్రామికవేత్తలకు రాయితీ అంతా కలిపి డిస్కంలకు టారిఫ్ సబ్సిడీగా రూ.5,940 కోట్లు ఇవ్వాలని టీఎస్ఈఆర్‌సీ కోరగా.. 2018-19 సంవత్సరానికి రూ.5,078 కోట్లే కేటాయించారు. తాజా బడ్జెట్‌లో ఇంధన శాఖకు రూ.5,640 కోట్లు మాత్రమే ఇచ్చారు. సంప్రదాయేతర ఇంధన వనరులకు కూడా నిధులు కుదించారు. చివరికి టీఎస్ఈఆర్‌సీ నిధులకూ కోత పెట్టడం గమనార్హం. దాంతో డిస్కంలు రూ.862 కోట్ల లోటును కలిగి ఉండనున్నాయి. 2018-19లో కరెంట్ చార్జీలు పెంచబోమని ప్రభుత్వం ఇదివరకే ప్రకటించింది. చార్జీలు పెంచుకోకుండా ప్రభుత్వం సహాయం చేయకుండా డిస్కంలు ఎలా మనుగడ సాగించాలో తేలాల్సి ఉంది.

రూపాయి రాక

1. రాష్ట్ర పన్నులు, సుంకాలు	56.31 పైసలు (73,751)
2. కేంద్ర పన్నుల్లో వాటా	14.66 పైసలు (19,207)
3. పన్నేతర ఆదాయం	28.88 పైసలు (37,829)
4. వడ్డీ వసూళ్లు	0.15 పైసలు (186)

(బ్రాకెట్లలో వాస్తవ మొత్తం రూ.కోట్లలో)

రూపాయి పోక

అభివృద్ధి వ్యయం	70.89 పైసలు	(92,837)
రుణాలపై వడ్డీ చెల్లింపులు	9.00 పైసలు	(11,791)
పరిపాలన ఖర్చు	5.39 పైసలు	(7,066)
పన్ను వసూళ్ల వ్యయం	0.67 పైసలు	(872)
ఇతరత్రా వ్యయం	9.84 పైసలు	(12887)
మిగులు	4.21 పైసలు	(5,520)

వృద్ధి రేటు డబుల్

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో వృద్ధి రేటు డబులైంది. నాలుగేళ్లలోనే డబుల్ డిజిట్‌కు చేరింది. జాతీయ వృద్ధి రేటుతో పోల్చినా ఎంతో మెరుగ్గా ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో అంటే 2013-14 సంవత్సరంలో తెలంగాణ ప్రాంత వృద్ధి రేటు 5.4 శాతం మాత్రమే. ప్రత్యేక రాష్ట్రంలో ఇది ఏటికేడు పెరుగుతూ వచ్చింది. 2016-17 సంవత్సరానికే డబుల్ డిజిట్ (10.1 శాతం)కు చేరింది. ఇక, 2017-18 సంవత్సరానికి రాష్ట్ర జీడీపీ వృద్ధి రేటును తాజా బడ్జెట్లో 10.4 శాతంగా ఉంటుందని అంచనా వేశారు. జాతీయ స్థాయిలో జీడీపీ వృద్ధి రేటు 6.6 శాతం మాత్రమేనని, దానితో పోలిస్తే కొత్త రాష్ట్రం తెలంగాణ వృద్ధి రేటు ఎంతో మెరుగ్గా ఉందని పేర్కొన్నారు.


పుంజుకుంటున్న తయారీ రంగం

సమైక్య రాష్ట్రంలో తయారీ రంగ పరిస్థితి ఎప్పుడూ ఏటికి ఎదురీదినట్లుగానే ఉండేది. వృద్ధి రేటు ఏటేటా పడిపోతూ ఉండేది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత విద్యుత్తు రంగంలో సంస్కరణలు, పారిశ్రామిక అనుకూల విధానాలను అవలంబించడంతో ప్రగతి సాధ్యమైంది. నూతన పారిశ్రామిక విధానంతో 2015-16లో తయారీ రంగం 6.4% వృద్ధి రేటును సాధించింది.

హైదరాబాద్: తెలంగాణ ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకు 27 వేలకుపైగా ఉద్యోగాలను భర్తీ చేశామని ప్రభుత్వం బడ్జెట్లో ప్రస్తావించింది. కొత్త రాష్ట్రం ఏర్పడిన తర్వాత నేరుగా నియమించదగిన 1,10,012 ఖాళీలను గుర్తించినట్లు పేర్కొంది. వాటిలో 83,048 ఉద్యోగాల భర్తీకి ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశామని, 27,588 ఉద్యోగ నియామకాల భర్తీ పూర్తయిందని తెలిపింది. మిగిలిన ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపింది.

27,588
భర్తీ చేసిన కొలువులు..

సంక్షేమానికి భరోసా!



కల్యాణ లక్ష్మికి లక్ష్మీ కటాక్షం

ఈసారి ఏకంగా 1,450 కోట్లు

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకానికి ఇప్పటి వరకూ రూ.1,625 కోట్లు చేస్తే.. ఈసారి బడ్జెట్లోనే రూ.1,450 కోట్లు కేటాయించింది. ఇప్పటి వరకు కల్యాణ లక్ష్మి పథకం కింద 2,12,126 మంది; షాదీ ముబారక్ కింద 78,003 మంది ప్రయోజనం పొందారు. ఈ పథకం కింద మొత్తం 2,90,129 మంది లబ్ధిదారులకు మేలు చేకూర్చామని పేర్కొంది. తొలుత ఎస్సీ, ఎస్టీలకు వర్తింపజేసిన ఈ పథకాన్ని ఇప్పుడు బీసీలు, అగ్రవర్ణ పేదలకూ అందజేస్తున్నారు.

● మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మైనారిటీల సంక్షేమం, అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం భారీ మొత్తంలో నిధులు కేటాయించింది. సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు మొత్తం రూ.1,974.42 కోట్ల నిధులను కేటాయిస్తూ ప్రతిపాదించింది. గత ఏడాది బడ్జెట్‌లో మైనారిటీల కోసం రూ.1,114.70 కోట్లు కేటాయించగా, ఈ సారి రూ.860 కోట్ల మేర నిధులను పెంచడం విశేషం. ఎస్సీ, ఎస్టీలతో సమానంగా ముస్లిం మైనారిటీలకు పథకాలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఈ ఏడాది సుమారు రూ.90 కోట్ల మేర నిధులు వచ్చే అవకాశం ఉంది. వీటికి తోడు ప్రభుత్వం రూ.1,884 కోట్లను ఖర్చు చేయనుంది.

● ఎన్‌ఆర్‌ఐలకు 100 కోట్లు

ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి/హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ప్రవాసీ తెలంగాణవాసు(ఎన్‌ఆర్‌ఐ)ల సంక్షేమం కోసం ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించింది. గత ఏడాది సాధారణ పరిపాలనా విభాగం కింద మొక్కుబడిగా రూ.79 లక్షలు కేటాయించిన ప్రభుత్వం.. ఈ ఏడాది ఏకంగా రూ.100 కోట్లను ప్రతిపాదించింది. ఇటీవల ఎన్‌ఆర్‌ఐలతో సమావేశమైన మంత్రి కేటీఆర్.. వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. ఎన్‌ఆర్‌ఐల సంక్షేమానికి వివిధ రాష్ట్రాల్లో అనుసరిస్తున్న అత్యుత్తమ విధానాలను అధ్యయనం చేశారు. ఈ మేరకు ప్రవాసీయుల సంక్షేమం కోసం ప్రభుత్వం అత్యధికంగా నిధులు కేటాయించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌ఆర్‌ఐల బడ్జెట్ రూ.5కోట్లు కాగా, ఈ ఏడాది వంద కోట్లకు పెరగడం గమనార్హం. కాగా, నిధుల కేటాయింపుపై గల్ఫ్ దేశాల్లోని ప్రవాసీయుల్లో హర్షం వ్యక్తమవుతోంది. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని విదేశీ వ్యవహారాల శాఖ కూడా ఇంత వరకు ఇన్ని నిధులు కేటాయించలేదు. దేశంలో కేరళ ప్రభుత్వం మాత్రమే ప్రవాసీయులకు అత్యధికంగా రూ.80 కోట్లు కేటాయించి రికార్డు సృష్టించింది. ఇప్పుడు దాన్ని బద్దలు కొడుతూ తెలంగాణ ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించింది. అయితే, ఈ నిధులను పూర్తిగా ప్రవాసీయులు సంక్షేమానికి వెచ్చిస్తారా? లేదా కొంత మొత్తాన్ని హైదరాబాద్‌లో నిర్మించనున్న విదేశీ భవన్‌కు గ్రాంట్‌గా ఇస్తారా అన్నది తెలియరాలేదు. ఏదేమైనా ప్రవాసీయుల సంక్షేమానికి భారీగా నిధులు కేటాయించి, టీఆర్ఎస్ ప్రభుత్వం నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టింది.

● బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు 100 కోట్లు

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని పేద బ్రాహ్మణుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించింది. పరిషత్ ఏర్పాటు సమయంలోనే ఏటా బడ్జెట్‌లో రూ.100 కోట్లు కేటాయిస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. ఈ మేరకు ప్రస్తుత బడ్జెట్‌లోనూ నిధులు కేటాయించారు. 2017లో పరిషత్ ఏర్పాటు కాగా, 2016-17 ఆర్థిక సంవత్సరానికి రూ.10 కోట్లు, 2017-18లో రూ.25 కోట్లను ప్రభుత్వం కేటాయించింది.

దళితులకు దండిగా

- ఎస్సీ, ఎస్టీలకు బడ్జెట్లో రూ.45 వేల కోట్లు
- కేటాయింపులు భారీగా పెంచిన సర్కారు
- ఎస్సీ అభివృద్ధి నిధులు 2,077 కోట్లు పెంపు
- ఎస్టీ అభివృద్ధి నిధులు 1,528 కోట్లు అదనం

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): దళితుల సంక్షేమానికి ప్రభుత్వం బడ్జెట్లో పెద్దపీట వేసింది. ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి ఈసారి ఏకంగా రూ.45 వేల కోట్లను కేటాయించింది. ఈ రెండు వర్గాలకూ కేటాయించిన నిధులు వ్యవసాయం, సాగునీరు, విద్యుత్తు శాఖలకు కేటాయించిన మొత్తంతో సమానంగా ఉండడం విశేషం. ఎస్సీ, ఎస్టీల ప్రత్యేక అభివృద్ధి నిధుల (ఎస్డీఎఫ్)ను పెంచుతూనే.. ఎస్సీ, ఎస్టీ శాఖలకు నిధుల కేటాయింపుల్లోనూ ప్రాధాన్యం ఇచ్చింది. రాష్ట్ర బడ్జెట్‌లో ప్రగతి పద్దు గత ఏడాది రూ.88,038.80 కోట్లు కాగా తాజా బడ్జెట్‌లో రూ.1,04,757 కోట్లకు చేరింది. దీంతో సహజంగానే ఎస్డీఎఫ్ నిధుల కేటాయింపూ పెరిగింది. ప్రగతి పద్దు నుంచి ఎస్సీలకు 15.71 శాతం, ఎస్టీలకు 9.25 శాతం నిధులను కేటాయించారు. ఎస్సీల ప్రత్యేక అభివృద్ధి నిధి కింద రూ.16,453 కోట్లను, ఎస్టీల ప్రత్యేక అభివృద్ధి నిధి కింద రూ.9,693 కోట్లను కేటాయించింది. అలాగే, ఎస్సీల సంక్షేమానికి రూ.12,709 కోట్లు, ఎస్టీల సంక్షేమానికి రూ.8,063 కోట్లను ప్రతిపాదించింది. దళితులకు మూడెకరాల పథకం కింద ఈసారి రూ.1,489 కోట్లను కేటాయించింది. ఎస్సీ బడ్జెట్‌ను కూడా గత ఏడాదితో పోలిస్తే రూ.2329 కోట్లు పెంచడం విశేషం. కాగా, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధికి రూ.1,528 కోట్లు.. గిరిజన శాఖకు రూ.1,951 కోట్లను పెంచడం విశేషం.

బీసీలకు నిరాశే

ఎస్డీఎఫ్ ఊసెత్తని సర్కారు.. ఎంబీసీలకు రూ.1000 కోట్లు.. స్వల్పంగా పెరిగిన బీసీ బడ్జెట్

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్లో బీసీలకు నిరాశే మిగిలింది. రాష్ట్రంలో 52 శాతంగా ఉన్న వెనుకబడిన వర్గాలకు ఎప్పటి కేటాయింపులే! గత బడ్జెట్లో రూ.5,070 కోట్లు కేటాయించిన సర్కారు. ఈ బడ్జెట్లో రూ.5,919 కోట్లు కేటాయించింది. అంటే, నికరంగా పెంచింది రూ.850 కోట్లు. బీసీలకు కూడా ఈసారి ప్రత్యేక అభివృద్ధి నిధిని ప్రవేశపెడతారని ప్రచారం జరిగింది. ప్రభుత్వం కూడా మంత్రుల కమిటీ వేసి, బీసీల స్థితిగతులపై అధ్యయనం చేయించింది. బీసీలకు ఏం కావాలనే విషయంపై నివేదిక ఇవ్వాలని జనవరిలో ముఖ్యమంత్రి కేసీఆర్ బీసీ ప్రజాప్రతినిధులు, మంత్రులను ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు ఆర్థిక మంత్రి నేతృత్వంలోని బీసీ మంత్రుల కమిటీ నివేదిక ఇచ్చింది. బీసీ సబ్‌ప్లాన్ లేదా ఎస్డీఎఫ్ ఏర్పాటు చేయాలని సిఫారసు చేసింది. ఈసారి బడ్జెట్‌లో తమకు తప్పకుండా ప్రత్యేక నిధి లభిస్తుందని బీసీలు ఆశించారు. కానీ... ప్రభుత్వం ప్రత్యేక అభివృద్ధి నిధిని ప్రకటించలేదు. బీసీ సంక్షేమానికి సంప్రదాయ రీతిలో నిధులు కేటాయించింది. ఇక, ఎంబీసీలకు కేటాయింపులూ ఇంతే. గత ఏడాది మాదిరిగానే ఎంబీసీ కార్పొరేషన్‌కు రూ.1000 కోట్లు కేటాయించింది. అలాగే, రజకుల ఫెడరేషన్‌కు రూ.200 కోట్లు; నాయీ బ్రాహ్మణుల ఫెడరేషన్‌కు రూ.250 కోట్లను ప్రతిపాదించింది. చేనేతలకు రూ.1200 కోట్లు కేటాయించింది. మేదర ఆర్థిక సంస్థకు రూ.3 కోట్లు, విశ్వ బ్రాహ్మణుల సహకార సంస్థకు రూ.10 కోట్లు, శాలివాహన సొసైటీకి రూ.8 కోట్లు, గీత కార్మికుల సొసైటీకి రూ.10 కోట్లు, సంచార జాతుల సమాఖ్యకు రూ.10 కోట్లు, ఉప్పర సహకార సొసైటీకి రూ.10 కోట్లు, వడ్డెర సొసైటీకి రూ.5.45 కోట్లు, తెలంగాణ కృష్ణ బలిజ, పూసల సహకార సొసైటీకి రూ.5 కోట్లు, వాల్మీకి బోయ సహకార సంస్థకు రూ.2.10 కోట్లు, భట్రాజు సహకార సంస్థకు రూ.2 కోట్లు కేటాయించింది. విదేశీ విద్యా నిధికి రూ.60 కోట్లు, బీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకు రూ.2,096.29 కోట్లు కేటాయించారు. బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు రూ.50 కోట్లు కేటాయించారు. గొల్ల, కురుమ భవన్ నిర్మాణం కోసం రూ.5 కోట్లు, బసవేశ్వర భవన్ నిర్మాణానికి రూ.5 కోట్లు కేటాయించారు.

నిరాశ పర్చింది: బీసీ సంఘాలు

బడ్జెట్ కేటాయింపులు బీసీలను తీవ్ర నిరాశకు గురి చేశాయని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ పేర్కొన్నారు. దామాషా ప్రకారం 54శాతం ఉన్న బీసీలకు బడ్జెట్‌లో 3శాతం నిధులు మాత్రమే కేటాయించడం అన్యాయమని గురువారం వేర్వేరు ప్రకటనల్లో ఆవేదన వ్యక్తం చేశారు.


మహిళా శిశు సంక్షేమానికి అరకొరే


గత ఏడాదితో పోలిస్తే 60 కోట్లే పెంపు

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మహిళలు, చిన్నారుల సంక్షేమానికి కృషి చేస్తామంటున్న ప్రభుత్వం బడ్జెట్‌లో వారికి అత్తెసరు కేటాయింపులతో సరిపెట్టింది. గత ఏడాది బడ్జెట్లో రూ.1,829 కోట్లు కేటాయిస్తే.. ఈసారి రూ.60 కోట్లు మాత్రమే పెంచి రూ.1,890 కోట్లు కేటాయించింది. అరకొర వసతులతో నిర్వహిస్తున్న అంగన్వాడీ భవనాల నిర్మాణానికి నిధులను కుదించింది. అదే సమయంలో, మహిళా శక్తి కేంద్రాలు, స్వధార్, ఉజ్వల సదనాలకు పెంచింది. మహిళా శక్తి కేంద్రాలకు రూ.6 కోట్లు పెంచింది. గత ఏడాది ఉజ్వల పథకానికి రూ.73 లక్షలు ఉండగా ఈ ఏడాది రూ.2 కోట్లు కేటాయించింది. స్వధార్‌కు రెండు కోట్ల నుంచి రూ5 కోట్లకు పెంచింది. అలాగే, జువనైల్ సంక్షేమ శాఖకు గత ఏడాది రూ.11.60 కోట్లు కేటాయించగా ఈ ఏడాది కేవలం రూ.9.45 కోట్లను మాత్రమే కేటాయించారు. వయోవృద్ధులకు గత ఏడాది రూ.37.17 కోట్లు కేటాయించగా ఈ ఏడాది రూ.46 కోట్లు కేటాయించారు. ఎటు చూసినా మహిళా శిశు సంక్షేమానికి ఈ బడ్జెట్‌లో నిరాశ మిగిలిందని మహిళలు, మహిళా సంఘాలు వాపోతున్నాయి.

ఆరోగ్యలక్ష్మికి రూ.298 కోట్లు

గర్భిణీ, బాలింతలు, చిన్నారులకు పోష్టికాహారాన్ని అందించేందుకు ప్రవేశపెట్టిన ఆరోగ్యలక్ష్మి పథకానికి ప్రభుత్వం రూ.298 కోట్లు కేటాయించింది. ఇప్పటికే ఆదిలాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో పోషకాహార లోపం ఎక్కువగా ఉంది. ఈ సమస్యను అధిగమించేందుకు పథకాన్ని పకడ్బందీగా అమలు పరచాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆరోగ్యలక్ష్మి కింద కేంద్రం ప్రతి మహిళకు రూ.3 ఇస్తుండగా, రాష్ట్రం రూ.17 అందజేస్తోంది.





ఆర్థిక సంవత్సరం	అప్పు (రూ. కోట్లలో)
2-6-2014	61,710
2014-15	83,845
2015-16	93,115
2016-17	1,27,829
2017-18	1,51,133
2018-19	1,80,238

అప్పు.. మోయలేని భారం

మీ తలపై రూ.51,145 అప్పు!

- రాష్ట్ర రుణభారం 1.80లక్షల కోట్లు
- 'బహిరంగ మార్కెట్' అప్పులే ఎక్కువ
- వీటికి సర్కారు పూచీకత్తులు అదనం

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ అప్పులు పెరిగిపోతున్నాయ్! ఏటేటా రుణ భారం కొండలా పెరుగుతూనే ఉంది! తాజాగా తెలంగాణ ప్రభుత్వ అప్పు రెండు లక్షల కోట్లకు చేరువైంది! 2011 జనగణన ప్రకారం రాష్ట్ర జనాభా 3.52 కోట్లు! ఈ లెక్కన రాష్ట్రంలో ఒక్కో తలపై పడే రుణ భారం రూ.51,145. అలాగే వివిధ ప్రభుత్వ విభాగాలకు సర్కారు రూ.38,755 కోట్లు మేర పూచీకత్తుగా ఉంది. ప్రభుత్వం తీసుకునే రుణాలకు ఇవి అదనం. 2018-19 బడ్జెట్‌లో ప్రభుత్వ అప్పు రూ.1.80 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా వేసింది. 2017-18లో సవరించిన లెక్కల ప్రకారం రూ.1,51,133.21 కోట్ల అప్పు ఉంటుందని తెలిపింది. అంటే అదనంగా మరో రూ.29,105.53 కోట్ల రుణం తీసుకోవాలని నిర్ణయించింది. ఇది సవరించిన అప్పు కంటే 19.25% ఎక్కువ. కాగా బడ్జెటేతర రుణాల కింద మరిన్ని అప్పులు తీసుకున్నట్లు తెలిపింది. 2018 జనవరి 1 నాటికి సాగునీటి పారుదల రంగానికి రూ.16,413.28 కోట్లు, మిషన్ భగీరథకు రూ.7,031.89 కోట్లు, ఇతర అవసరాలకు రూ.18,094.02 కోట్ల రుణాలను తీసుకున్నట్లు వివరించింది.

ప్రజారోగ్యానికి 7375 కోట్లు

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యానికి కేసీఆర్ సర్కారు భారీగా నిధులు కేటాయించింది. ఎన్నికల ఏడాది కావడంతో గత బడ్జెట్ కంటే రూ.1,399 కోట్లు అదనంగా కేటాయింపులు చేసింది. 2017-18లో వైద్య ఆరోగ్య రంగానికి రూ.5,976 కోట్లు కేటాయించగా.. 2018-19 బడ్జెట్‌లో రూ.7,375 కోట్లు కేటాయించారు. దీనికి అదనంగా అమ్మఒడి పథకానికి ప్రత్యేకంగా రూ.561 కోట్లను కేటాయించారు. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి కేసీఆర్ సర్కారు ఏటా వైద్య రంగానికి కేటాయింపులు పెంచుతూనే ఉంది.

కేటాయింపుల్లో ముఖ్యమైనవి

పథకం	రూ.కోట్లలో
అమ్మఒడి	561
ఆరోగ్యశ్రీ	530
ఉద్యోగుల ఆరోగ్య పథకం	150
పెన్షనర్ల ఆరోగ్య పథకం	100
జర్నలిస్టులకు	50

విద్యకు అత్తెసరు

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో విద్యా రంగానికి నిరాశ తప్పలేదు. గతేడాదితో పోల్చితే అత్తెసరు పెంపుతో ప్రభుత్వం సరిపెట్టింది. కేవలం రూ.573 కోట్లే అదనంగా కేటాయించారు. 2018-19 బడ్జెట్‌లో విద్యా శాఖకు రూ.13,278 కోట్లు కేటాయించింది. ఇందులో పాఠశాల విద్యా శాఖ వాటా రూ.10,830 కోట్లు. ఉన్నత విద్యకు దక్కింది రూ.2,448 కోట్లు! నిర్వహణ పద్దు రూ.10,710 కోట్లుగా, ప్రగతి పద్దు రూ.2,567 కోట్లుగా చూపారు. నిర్వహణ పద్దు కింద ఉద్యోగుల వేతనాలు, భత్యాలు వస్తాయి. అభివృద్ధి పనుల కోసం చేసే ఖర్చంతా ప్రగతి పద్దు పరిధిలోకి వస్తుంది. 2017-18 బడ్జెట్‌లో విద్యాశాఖకు రూ.12,705 కోట్లు కేటాయించింది. ఇందులో నిర్వహణ పద్దు రూ.10,023 కోట్లు,



సౌకర్యాలు లేకుండా ఉన్న రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ స్కూలు

ప్రగతి పద్దు రూ.2682 కోట్లు! గతేడాదితో పోల్చితే ఈసారి నిర్వహణ పద్దుకు కేటాయింపులు రూ.687 కోట్లు పెరిగాయి. ప్రగతి పద్దుకు రూ.115 కోట్లు తగ్గాయి. నిధుల తగ్గింపు తగ్గడం విద్యాభివృద్ధిపై ప్రభావం చూపుతుందని అంటున్నారు.

ఊసేలేని కేజీ టు పీజీ.. ఉపాధ్యాయ సంఘాల పెదవి విరుపు

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన 'కేజీ టూ పీజీ విద్య'కు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడమే కాదు... ఎటువంటి ప్రస్తావన చేయలేదు. దీని వల్ల విద్యా రంగానికి ఎలాంటి ప్రయోజనం లేదని యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి చావరవి, పీఆర్‌టీయూ అధ్యక్షుడు సరోత్తంరెడ్డి, ఎస్టీయూ అధ్యక్షుడు భుజంగరావు, టీపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. అత్తెసరు బడ్జెట్ కేటాయింపులతో విద్యాభివృద్ధి ఏ విధంగా జరుగుతుందని కేజీ టూ పీజీ ప్రైవేటు విద్యా సంస్థల ప్రధాన కార్యదర్శి గౌరి సతీష్ ప్రశ్నించారు.

వర్సిటీలకు కోత

తెలంగాణలోని వర్సిటీలు మళ్లీ నిధుల కోసం వెంపర్లాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. తాజా బడ్జెట్‌లో వర్సిటీలకు నిరాశ తప్పలేదు. రూ.695 కోట్లు కేటాయించారు. ఇందులో నిర్వహణ పద్దు రూ.485 కోట్లు, ప్రగతి పద్దులో రూ.210 కోట్లు! గతేడాదితో పోల్చితే ఈసారి రూ.147 కోట్లు తక్కువ కేటాయించారు. గత బడ్జెట్‌లో యూనివర్సిటీలకు కేటాయించింది రూ.843 కోట్లు. ఇందులో నిర్వహణ పద్దు కింద రూ.422.12 కోట్లు, ప్రగతి పద్దు కింద రూ.420.89 కోట్లు కేటాయించారు. అంటే గతేడాదితో పోల్చితే నిర్వహణ పద్దు పెరగగా, వర్సిటీల అభివృద్ధికి అవసరమయ్యే ప్రగతి పద్దు భారీగా రూ.210.47 కోట్లు తగ్గడం గమనార్హం. బడ్జెట్‌లో ఇంటర్మీడియట్ విద్యకు కేటాయింపులు కాస్త పెరిగాయి. 2018-19 బడ్జెట్‌లో రూ.716.03 కోట్లు కేటాయించారు.


పన్నులు పిండేస్తున్నారు

హైదరాబాద్, మార్చి15(ఆంధ్రజ్యోతి):పేరేదైనా తెలంగాణలో ప్రభుత్వం ప్రజల నుంచి భారీగానే పన్నులు పిండుతోంది. ప్రభుత్వానికి సొంత పన్నుల ఆదాయం భారీగా పెరుగుతోంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రజల నుంచి ఏకంగా 73,752 కోట్లను పన్నుల రూపంలో రాబట్టుకోవాలని ప్రభుత్వం బడ్జెట్లో ప్రతిపాదించింది. కేంద్రం నుంచి పన్నుల్లో వాటా కూడా ఏటేగా భారీగానే పెరుగుతోంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఏకంగా రూ.19,207 కోట్లను కేంద్రం పన్నుల రూపంలో అందిస్తుందని అంచనా వేస్తోంది. గ్రాంట్ ఇన్ ఎయిడ్ కూడా మూడేళ్ల కిందటితో పోలిస్తే మూడురెట్లు కానుంది. ఏ విధంగా చూసినా పన్నులు దండిగా రానున్నాయి. పన్నేతర ఆదాయాలే భారీగా పడిపోయాయి. సొంత పన్నుల ఆదాయం సగటున ఏటా పది వేల కోట్లు లేదా 20% చొప్పున పెరుగుతోంది. 2015-16లో రూ.39,974 కోట్లు ఉండగా తర్వాతి సంవత్సరం రూ.48,408 కోట్లకు పెరిగింది. ఏడాదిలో రూ.8434 కోట్ల వృద్ధి అన్నమాట. ముగుస్తున్న ఆర్థిక సంవత్సరానికి సొంత పన్నుల ఆదాయం రూ.61,369 కోట్లు ఉంటుందని సవరించిన అంచనాలు చెబుతున్నాయి. తుది లెక్కల్లో ఓ రెండువేల కోట్లు తగ్గినా రూ.58-59 వేల కోట్ల సొంత పన్నుల ఆదాయం వస్తుందని భావిస్తున్నారు. కేంద్ర పన్నుల్లో వాటా మూడేళ్ల క్రితం రూ.12,350 కోట్లు ఉంటే ఇప్పుడు రూ.19,207 కోట్లకు పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. గ్రాంట్ ఇన్‌ఎయిడ్స్ కూడాపెరిగి రూ.29,041 కోట్లు వస్తాయని అంచనా వేసింది. ఇలా అన్ని రకాలుగా రూ.1,30,975.10 కోట్ల రాబడులు ఉంటాయని బడ్జెట్ అంచనా వేసింది.క్యాపిటల్ ఆదాయం కింద మరో రూ.43,507.17 కోట్లను అంచనా వేసింది. రెవెన్యూ, క్యాపిటల్ ఆదాయాల కింద అంచనా వేసిన రూ.1,74,482.28 కోట్ల నిధుల కారణంగా భారీ బడ్జెట్‌ను రూపొందించింది. రూ.1,74,453 కోట్ల పద్దును రూపొందించింది. రెవెన్యూ మిగులుగా రూ.5,520.40 కోట్లుగా ఉంటుందని ఆశించింది.

ఏటా 10 వేల కోట్ల పెరుగుదల

పన్నుల భారం ఇలా (రూ. కోట్లలో)

పన్ను	2017-18	2018-19
భూమి శిస్తు	14	4.6
రిజిస్ట్రేషన్లు	3,000	4,699
స్థిరాస్తులపై పన్నులు	137	129
మద్యంపై ఎక్సైజ్	8,999	10,600
అమ్మకం, వాణిజ్యం	46,499	25,942
వాహనాలపై పన్ను	3,000	3,950
విద్యుత్ డ్యూటీ	169	434
ఇతర పన్నులు	800	27,992
మొత్తం పన్నులు	62,618	73,751



గుడికి శోభ

హైదరాబాద్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. యాదగిరి గుట్ట దేవాలయ, పరిసర ప్రాంతాల పునర్నిర్మాణ, అభివృద్ధి పనులకు ఈ ఏడాది రూ.250 కోట్లు ప్రతిపాదించింది. వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధి సంస్థకు రూ.100 కోట్లు, భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధి సంస్థకు రూ.100 కోట్లు కేటాయించింది. ఈసారి కొత్తగా ధర్మపురి, బాసర దేవాలయ ప్రాంతాల అభివృద్ధికి చెరో రూ.50కోట్లు ప్రతిపాదించింది. కామన్ గుడ్ ఫండ్ నిధికి రూ.50 కోట్లు కేటాయించింది. అలాగే, ఆలయాల్లో పనిచేస్తున్న అర్చక, ఇతర సిబ్బందికి పీఆర్సీ-2015 వేతనాలు చెల్లించేందుకు రూ.72 కోట్లు ప్రతిపాదించింది. కాగా, వేతనాల కోసం బడ్జెట్‌లో నిధులు ప్రతిపాదించడంపై అర్చక ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు అర్చక, ఉద్యోగుల జేఏసీ కన్వీనర్ గంగు భానుమూర్తి అర్చక సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ ఎం.వరదాచారి, చిన్నం మోహన్.. కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు.



పల్లె వెలుగులు 'కాకతీయ'మే!

హైదరాబాద్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మిషన్ కాకతీయ పథకం కింద చేపట్టిన చెరువుల అభివృద్ధి వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతున్నాయని ప్రభుత్వం విడుదల చేసిన సామాజిక ఆర్థిక అవుట్ లుక్-2018 పేర్కొంది. ఈ పథకం ద్వారా పంట పొలాలకు సాగునీటి వనరు పెరగడంతో పాటు, దిగుబడి కూడా రెట్టింపయిందని స్పష్టం చేసింది. ఈ మేరకు నాబార్డ్ ఆధ్వర్యంలోని నాబ్కాన్ సంస్థ చేసిన ప్రత్యేక సర్వేను ఇందులో ప్రస్తావించారు. ఇప్పటి వరకు నాలుగు దశల్లో 37,224 చెరువుల అభివృద్ధి పనులను చేపట్టారని, ఇప్పటికే 26,302 చెరువుల అభివృద్ధిని పూర్తి చేశారని తెలిపింది. దీంతో కొత్తగా 20,08,616 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతోందని వెల్లడించింది. మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డట్టు తెలిపింది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల జీవన విధానంలో పలు మార్పులు చోటు చేసుకున్నాయని పేర్కొంది.

ఆరోగ్యంపై శ్రద్ధ బాగుంది!

- ముందే రోగాలను గుర్తిస్తున్నారు
- నివారణ చర్యలు చేపడుతున్నారు
- మాతాశిశు మరణాలు బాగా తగ్గాయి



కేసీఆర్ కిట్‌లోని వస్తువులు

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రధాన రోగ కారకాలను గుర్తించి, ఒక్కో ముఖ్య ఆరోగ్య సమస్యను పరిష్కరించడంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని సామాజిక ఆర్థిక సర్వే వెల్లడించింది. వ్యాధి నిర్దిష్ట లక్ష్య సమూహాలను గుర్తించి వారికోసం ప్రత్యేక వైద్య ప్రణాళికతో ప్రభుత్వం ముందుకెళుతోందని ప్రశంసించింది. ఆరేళ్లలోపు చిన్నారులు, గర్భిణులు పోషకాహార లోపం, రక్తహీనతతో బాధపడుతున్న విషయాన్ని ప్రస్తావించింది. వాటి పరిష్కారానికి చేపట్టిన ఆరోగ్య లక్ష్మి, కేసీఆర్ కిట్ పథకాలను మెచ్చుకుంది. వీటిద్వారా మాతా శిశు మరణాలను గణనీయంగా తగ్గించగలిగారని తెలిపింది. అంటు వ్యాధులైన టీబీ, ఎయిడ్స్‌లను నివారించేందుకు ప్రత్యేకశ్రద్ధ పెడుతున్న అంశాన్ని కూడా సర్వే ప్రస్తావించింది. బీపీ, మధుమేహం, కేన్సర్ లాంటి జీవనశైలి సంబంధ వ్యాధుల్ని ముందుగా గుర్తించి, చికిత్స అందించడం రాష్ట్రంలో ప్రారంభమైందని వెల్లడించింది. అందరికీ ఆరోగ్యం లక్ష్యాన్ని సాధించేందుకు ప్రభుత్వరంగ వైద్యాన్ని మరింత బలోపేతం చేస్తున్న విషయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించింది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత వైద్యరంగంలో గుర్తించదగినంత అభివృద్ధి జరిగిందని సామాజిక ఆర్థిక సర్వే పేర్కొంది. దాన్ని కొనసాగించాలంటే వనరుల కేటాయింపులను పెంచుకొని, రాబోయే దశాబ్ద కాలంలో వ్యూహాత్మక ప్రణాళికలను రచించుకొని సవాళ్లను ఎదుర్కోవాలని పేర్కొంది. ఆరోగ్యశ్రీ పథకం బాగా కొనసాగుతుందని, 2017-18లో ఆ పథకం కింద 1.84 లక్షల మంది లబ్ది పొందగా, 83 శాతం మంది సంతృప్తి చెందారని, 17 శాతం మంది ఫిర్యాదులు చేశారని ఆర్థిక సర్వే పేర్కొంది.

తగ్గిన మాతా శిశు మరణాలు

రాష్ట్రంలో మాతా శిశు సంరక్షణపై ప్రభుత్వం పెట్టిన ప్రత్యేక శ్రద్ధను ప్రధానంగా సామాజిక ఆర్థిక సర్వే ప్రస్తావించింది. మాతా శిశు మరణాలు, గర్భిణుల సంరక్షణ, శిశు పోషకాహార లోపాల సమస్యలను ప్రభుత్వం బాగా తగ్గించగలిగిందని పేర్కొంది. తెలంగాణలో బాలింత మరణాలు 2011-13లో ప్రతి వెయ్యికి 92 ఉండగా.... ఇప్పుడవి గణనీయంగా తగ్గాయని, శిశు మరణాలు 39 నుంచి 31కి తగ్గాయని వెల్లడించింది.

వ్యాధుల తీవ్రత పెరుగుతోంది

రాష్ట్రంలో వ్యాధుల తీవ్రత పెరుగుతోందని సామాజిక ఆర్థిక సర్వే వెల్లడించింది. రాష్ట్రంలో పది కారణాలతో మరణాలు ఎక్కువగా సంభవిస్తున్నాయని తెలిపింది. పోషకాహార లోపం(11.4 శాతం), డైటరీ రిస్క్(9.9), పొగాకు వాడకం(5), గాలి కాలుష్యం(8.6), అరక్షిత మంచి నీరు, శానిటేషన్, చేతులు కడుక్కోపోవడం(4.2), వృత్తిపరమైన అంశాలు(3.4), బీపీ(8.7), షుగర్(5.9), అత్యధిక కొవ్వు(5.1), ఒబేసిటి(4.6) వంటి కారణాలతో ఎక్కువగా మరణాలు చోటు చేసుకుంటున్నాయని వెల్లడించింది.

ఆహార ధాన్యాల సాగు తగ్గుతోంది!

- నూనె గింజల దిగుబడి కూడా
- భారీగా పెరిగిన పత్తి విస్తీర్ణం, దిగుబడి



హైదరాబాద్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): గతేడాదితో పోలిస్తే రాష్ట్రంలో ఆహార ధాన్యాల దిగుబడి తగ్గనుంది. ప్రభుత్వం గురువారం విడుదల చేసిన సామాజిక ఆర్థిక సర్వే నివేదిక ఈ మేరకు వివరాలను వెల్లడించింది. దీని ప్రకారం ప్రస్తుత వ్యవసాయ సంవత్సరంలో(2017-18) రాష్ట్రంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి 95.01 లక్షల టన్నుల మేరకు జరగనుంది. అర్థ గణాంక శాఖ జనవరిలో విడుదల చేసిన రెండో ముందస్తు అంచనా నివేదిక ప్రకారం ఈ అంచనాకు వచ్చింది. గతేడాది రాష్ట్రంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి 101.29 లక్షల టన్నుల మేరకు జరిగింది. గతేడాదితో పోలిస్తే 6.28 లక్షల టన్నుల ఉత్పత్తి తగ్గనుంది. గతేడాది ఆహార ధాన్యాల సాగు 34.39 లక్షల హెక్టార్లలో జరగ్గా ఈ ఏడాది 31.87 లక్షల హెక్టార్లకు తగ్గిపోయింది. ఆహార ధాన్యాలతో పాటు నూనె గింజల దిగుబడీ తగ్గనున్నట్లు సర్వే వెల్లడించింది. పత్తి మాత్రం సాగు విస్తీర్ణం, దిగుబడి కూడా గతేడాది కంటే పెరగనున్నట్లు అంచనా వేసింది. గతేడాది 14.09 లక్షల హెక్టార్ల మేరకు పత్తిని సాగు చేయగా.. 34.44 లక్షల బేళ్ల మేరకు ఉత్పత్తి జరిగింది. ఈ సీజన్లో 19.03 లక్షల హెక్టార్లలో పత్తి వేశారు. 43.32 లక్షల బేళ్ల ఉత్పత్తి రానుందని అంచనా వేసింది.

పూర్తయిన 'డబుల్' ఇళ్లు 5,824

- 2.72 లక్షల ఇళ్లు మంజూరు
- ఈసారి బడ్జెట్‌లో రూ. 2,643 కోట్లు

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'డబుల్ బెడ్‌రూం' ఇళ్ల పథకంలో 1,38,793 ఇళ్ల నిర్మాణం ప్రారంభం కాగా ఇప్పటివరకు 5,824 ఇళ్లు పూర్తయ్యాయి. ఈ పథకం కింద మొత్తం 2,72,763 ఇళ్లను మంజూరు చేయగా, 2,40,153 ఇళ్లకు పాలనాపరమైన అనుమతులు లభించాయి. 2018 సంవత్సరానికి సంబంధించిన సామాజిక, ఆర్థిక సర్వేలో ప్రభుత్వం ఈ వివరాలను వెల్లడించింది. ఇక డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సిమెంటును మార్కెట్ ధర(బ్యాగుకు రూ.320)కన్నా తక్కువగా బ్యాగుకు రూ. 230 కే ప్రభుత్వం కొనుగోలు చేయగలిగిందని, రానున్న మూడేళ్లపాటు ఇదే ధర అమల్లో ఉంటుందని సర్వేలో వెల్లడించారు. అలాగే స్టీల్‌కు సంబంధించి కూడా.. టన్నుకు రూ. 43,660 మేరకు ధరను సంబంధిత సంస్థలతో పలుమార్లు చర్చించిన అనంతరం ప్రభుత్వం ఖరారు చేయగలిగింది. ఈ ఏడాది ఏప్రిల్ 15 వరకు ఈ ధర అమల్లో ఉంటుంది. డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి బడ్జెట్‌లో రూ. 2,643 కోట్లు మాత్రమే కేటాయింపులు జరగడంతో ఈ ఏడాది చివరినాటికి ఎన్ని ఇళ్లను పూర్తిచేస్తారనే ప్రశ్న ఉదయిస్తోంది. నిర్మాణం పూర్తిచేసిన ఇళ్లను ఎప్పటికప్పుడు లబ్ధిదారులకు అప్పగిస్తున్న ప్రభుత్వం... మిగిలిన ఇళ్లను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలని భావిస్తోంది. అయితే తాజా బడ్జెట్‌లో కేటాయింపులు కొంత మొత్తాల్లోనే ఉండడంతో... మిగిలిన నిధుల కోసం బ్యాంకులు, ఆర్థిక సంస్థలను ఆశ్రయించనుందని సమాచారం.



గురువారం ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెంలో డబుల్ బెడ్‌రూం ఇంటిని ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సీఎం వద్ద రూ.2264 కోట్లు

- మూడింతలు పెరిగిన ఎస్డీఎఫ్

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ వద్ద ఉండే నిధి పెరిగింది. సీఎం తన విచక్షణతో ఖర్చు చేసే ప్రత్యేక అభివృద్ధి నిధి(ఎస్డీఎఫ్)ని మూడింతలు పెంచారు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో రూ.754.70 కోట్లు కేటాయించారు. సవరించిన అంచనాలతో దాన్ని రూ.728.53 కోట్లకు తగ్గించారు. తాజాగా 2018-19 బడ్జెట్‌లో ఈ నిధిని ఏకంగా రూ.2264.10 కోట్లకు పెంచారు. ముఖ్యమంత్రి జిల్లాల పర్యటనకు వెళ్లినప్పుడు హామీల అమలు కోసం ఎస్డీఎఫ్ నుంచి డబ్బులు కేటాయిస్తారు. భవనాల నిర్మాణం, రోడ్లు, ఇతర ప్రాజెక్టులు, కుటుంబాలకు ప్రత్యేక సాయంతో పాటు సీఎం ప్రత్యేక విచక్షణతో ఈ నిధిని వాడుకుంటారు. ఎస్డీఎఫ్‌ను ప్రణాళిక శాఖ పర్యవేక్షిస్తుంది. సీఎం హామీ ఇవ్వగానే ముఖ్యమంత్రి కార్యాలయ ఆదేశాలతో సంబంధిత నిధులు విడుదల చేస్తారు. రానున్నది ఎన్నికల సీజన్ కావడంతో హామీలు ఇవ్వగానే కార్యరూపం దాల్చేలా ఈ నిధిని పెంచినట్లు సమాచారం. దీంతో పాటు సీఎం ఆదేశాలతో ఖర్చుచేసే మరో నిధి క్రూషియల్ బ్యాలెన్సింగ్ ఫండ్ కింద రూ.155 కోట్లు కేటాయించారు. గతేడాది కూడా ఇంతే కేటాయించి.. తర్వాత అంచనాలను సవరించి రూ.111.95 కోట్లకు తగ్గించారు. ఇక సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ ప్రాంత అభివృద్ధి అథారిటీ(గాడా) నిధులు కూడా పెంచారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.50 కోట్లు ఇవ్వగా ఇప్పుడు రూ.65 కోట్లకు పెంచారు.

జీఎస్డీపీ 'రికార్డు'

కొత్త రాష్ట్రంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్డీపీ) పరుగులు పెట్టింది. సమైక్య పాలనలో చివరి రెండేళ్లలో (2012-13; 2013-14) సంవత్సరాల్లో తెలంగాణ ప్రాంత జీఎస్డీపీ వృద్ధి రేటు దేశ సగటు కంటే తక్కువ ఉండేది. దేశ సగటు 5.9 శాతం ఉంటే, తెలంగాణ ప్రాంత సగటు వృద్ధి రేటు కేవలం 4.2% మాత్రమే. ప్రస్తుత ధరల ప్రకారం, గత ఏడాది జీఎస్డీపీ రూ.6,41,985 కోట్లు ఉండగా, 2017-18లో రూ.7,32,657 కోట్లు ఉంటుందని ప్రభుత్వం అంచనా వేసింది. గత ఏడాదితో పోలిస్తే.. 14.1% మేర వృద్ధి చెందిందని పేర్కొంది.

అటవీ శాఖకు అధిక ప్రాధాన్యం

అటవీ శాఖకు ప్రభుత్వం రూ.350 కోట్లు కేటాయించింది. పర్యావరణ, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలకు నిర్వహణ పద్దు కింద రూ.336.12 కోట్లు, ప్రగతిపద్దు కింద రూ.13.12 కోట్లు ఇవ్వనున్నట్లు ప్రకటించింది.



నిజామాబాద్ జిల్లా వేల్పూర్ గ్రామంలో మొక్క నాటుతున్న సీఎం కేసీఆర్ (ఫైల్)

దూసుకెళ్తున్న పారిశ్రామికం

- ఎంఎస్ఎంఈల్లో లక్షల మందికి ఉపాధి
- 40 వేల కోట్ల రూపాయల ఎగుమతులు



టీహబ్

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత రెండేళ్లలో 9,554 కోట్ల పెట్టుబడులతో 12,294 సూక్ష్మ, చిన్న మధ్య తరహా(ఎంఎస్ఎంఈ) పరిశ్రమలను స్థాపించినట్లు సామాజిక ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. ఈ యూనిట్‌లతో సుమారు 1.26 లక్షల మందికి ఉపాధి లభించినట్లు సర్వే నివేదిక పేర్కొంది. అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో 3,488 పరిశ్రమలు ఏర్పడగా ఇందులో 33,961 మందికి ఉపాధి లభించింది. అలాగే కరీంనగర్‌లో 1,571 యూనిట్‌లు ఏర్పడగా దాదాపు 19,480 మంది ఉపాధి పొందుతున్నారు. హైదరాబాద్, నల్లగొండ, మేడ్చల్ మల్కాజ్‌గిరి, మెదక్ జిల్లాల్లో పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణం ఉండటంతో అధిక శాతం పరిశ్రమలు ఆయా జిల్లాల్లోనే కేంద్రీకృతమయ్యాయి. కొత్త రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి 13,671 యూనిట్‌లను స్థాపించారు. 1,45,512 మందికి ఉపాధి లభించింది. రూ.1,018 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన 9210 సూక్ష్మ స్థాయి పరిశ్రమల్లో 9,120 మందికి ఉపాధి లభించింది. రూ.5,374 కోట్లతో ఏర్పాటు చేసిన 4371 చిన్న తరహా పరిశ్రమల్లో 76,286 మందికి ఉద్యోగాలు లభించాయి. రూ.738 కోట్ల వ్యయంతో 90 మధ్య తరహా పరిశ్రమలను ఏర్పాటు చేయగా 6493 మందికి ఉపాధి లభించింది. 2015-16 ఆర్థిక సంవత్సరంలో రూ.35,444 కోట్ల విలువైన ఫార్మా, ఆర్గానిక్ కెమికల్స్, ఎలక్ట్రికల్ యంత్రాలు, పరికరాలు, స్టాన్, ప్లాస్టర్, సిమెంట్, తదితర పారిశ్రామిక ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేశారు. 2016-17లో రూ.40,322 కోట్లకు పెరిగింది. టీఎస్-ఐపాస్ విధానంలో జనవరి 2018 నెలాఖరు నాటికి రూ.1,18,041 కోట్ల పెట్టుబడులతో 6,117 పరిశ్రమల ఏర్పాటునకు ప్రభుత్వం అనుమతించింది. వీటితో 4,42,962 మందికి ఉపాధి లభిస్తుంది. 517 పరిశ్రమలు రూ.29,324 కోట్లతో ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం అనుమతించింది. ఉత్పత్తులు ప్రారంభించేందుకు 1,21,132 మంది ఉద్యోగులు, కార్మికుల అవసరం ఉంటుందని సామాజిక ఆర్థిక సర్వే పేర్కొంది.

ఏడాదిలో 34.07 కోట్ల మొక్కలు

హైదరాబాద్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): హరితహారంలో భాగంగా 2017-18లో రాష్ట్రంలో 40 కోట్ల మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొని 34.07 కోట్ల మొక్కలు నాటినట్లు సామాజిక ఆర్థిక సర్వే వెల్లడించింది. అందులో 30.81 కోట్ల మొక్కలను జియో ట్యాగింగ్ చేసినట్లు పేర్కొన్నది. జియో ట్యాగింగ్‌తో మొక్కల పెరుగుదలను ఇంటర్నెట్ సాయంతో అటవీశాఖ పర్యవేక్షిస్తుందని తెలిపింది. వరంగల్ అర్బన్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలు 100% లక్ష్యాన్ని పూర్తిచేయగా రంగారెడ్డి(42%), మహబూబ్‌నగర్(57%), వికారాబాద్(58%) లక్ష్యాన్నే పూర్తి చేశాయి. 2018-19లో మరో 40కోట్ల మొక్కలు నాటేందుకు అటవీశాఖ సన్నాహాలు చేస్తోంది. హరితహారం కార్యక్రమంలో భాగంగా ఐదేళ్లలో 230 కోట్ల మొక్కలు నాటాలన్న లక్ష్యం పెట్టుకున్న ప్రభుత్వం మూడేళ్లలో 82 కోట్ల మొక్కలు నాటింది. హరితహారం మొక్కల పంపిణీకి ప్రభుత్వం 1,116కోట్లతో 4,213 నర్సరీలను ఏర్పాటు చేసింది. మొక్కలను సంరక్షణకు అటవీ శాఖ 4,81,948 మంది 'హరిత సైనికుల'నూ నియమించింది.

పెరుగుతున్న విద్యుదుత్పాదక సామర్థ్యం

- ప్రస్తుతం 14,913 మెగావాట్లు
- మూడేళ్లలో 28వేల మెగావాట్లకు చేరిక
- సామాజిక, ఆర్థిక సర్వేలో వెల్లడి

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు పరంగా తెలంగాణ రాష్ట్ర ముఖచిత్రమే మారిపోయిందని సామాజిక ఆర్థిక, సర్వే వెల్లడించింది. రాష్ట్రం ఏర్పడిన కొత్తలో 2,700 మెగావాట్ల లోటు ఉండగా.. మూడున్నరేళ్లలో ప్రభుత్వ, అంతర్రాష్ట్ర, సంయుక్త, ప్రైవేటు, కేంద్ర రంగం కలుపుకొని రాష్ట్ర ఉత్పాతక సామర్థ్యం 14,913 మెగావాట్లకు చేరిందని పేర్కొంది.




రానున్న మూడేళ్లలో ఇది 28 వేల మెగావాట్లకు చేరనుందని పేర్కొంది. ప్రస్తుతం తెలంగాణలో డిమాండ్ 10 వేల మెగావాట్లుగా నమోదవుతోందని, ఇది రికార్డు స్థాయిలో 11వేల మెగావాట్లకు చేరే అవకాశం ఉందని పేర్కొంది. ప్రస్తుతం మరో 5,880 మెగావాట్ల సామర్థ్యంతో కూడిన మూడు ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయని తెలిపింది. 800 మెగావాట్లతో కేటీపీఎస్ ఏడో దశ, 1080 మెగావాట్లతో భద్రాద్రి, 4000 మెగావాట్లతో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ పనులు నిర్మాణంలో ఉన్నాయని పేర్కొంది. ఇక విద్యుత్తు కనెక్షన్ల సంఖ్య కూడా గణనీయంగా పెరిగినట్లు సర్వే తేల్చింది. 1,33,89,134 కనెక్షన్లు ఉండగా, 3,33,697 పెరిగి.. 1,37,22,831కు చేరాయని తెలిపింది.

రారాజు రంగారెడ్డి!

తలసరి ఆదాయంలో నంబర్‌వన్.. ఆ తర్వాతే హైదరాబాద్ జిల్లా

తెలంగాణ ఆదాయం పెరుగుతోంది.. 13.4 శాతం వృద్ధిరేటు నమోదు

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తలసరి ఆదాయం క్రమంగా పెరుగుతోంది. ముగుస్తున్న ఆర్థిక సంవత్సరంలో 1,75,534 రూపాయల తలసరి ఆదాయం వస్తుందని రాష్ట్ర ఆర్థిక సర్వేలో అంచనా వేస్తున్నారు. గడచిన ఆర్థిక సంవత్సరం(2016-17)లో రూ.1,54,734 తలసరి ఆదాయం నమోదైంది. 13.4 శాతం వృద్ధి సాధించనున్నట్లు అంచనా వేశారు. అదే సమయంలో తలసరి ఆదాయంలో జాతీయ సగటు వృద్ధి రేటు కేవలం 8.6 శాతమే. 2015-16 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ తలసరి ఆదాయం 1,36,905 రూపాయలుగా ఉంది. తెలంగాణ ఏర్పడిన తొలిఏడాది తలసరి ఆదాయం రూ.1,24,104గా నమోదైంది. మొత్తంమీద తెలంగాణ ఆవిర్భవించిన తర్వాత తలసరి ఆదాయంలో స్థిరమైన పెరుగుదల కనిపిస్తోంది. తలసరి ఆదాయంలో రంగారెడ్డి జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉంది. హైదరాబాద్ రెండో స్థానంలో నిలిచింది. నాగర్‌కర్నూలు జిల్లా అట్టడుగున ఉంది.



2016-17లో జిల్లాల తలసరి ఆదాయం (రూ.లలో)

జిల్లా పేరు	తలసరి ఆదాయం
ఆదిలాబాద్	93,588
కొమ్రంభీం-ఆసిఫాబాద్	1,03,822
మంచిర్యాల	1,04,891
నిర్మల్	98,129
నిజామాబాద్	1,04,868
జగిత్యాల	91,885
పెద్దపల్లి	1,29,723
జయశంకర్-భూపాలపల్లి	1,15,774
భద్రాద్రి-కొత్తగూడెం	1,26,084
మహబూబాబాద్	1,07,684
వరంగల్ రూరల్	1,03,914
వరంగల్ అర్బన్	91,333
కరీంనగర్	1,20,173
రాజన్న-సిరిసిల్ల	99,687
కామారెడ్డి	86,808
సంగారెడ్డి	1,64,698
మెదక్	1,10,345
సిద్దిపేట	1,28,701
జనగాం	1,00,216
యాదాద్రి-భువనగిరి	1,31,749
మేడ్చల్-మల్కాజ్‌గిరి	1,81,104
హైదరాబాద్	3,15,745
రంగారెడ్డి	3,68,747
వికారాబాద్	87,891
మహబూబ్‌నగర్	86,237
జోగులాంబ-గద్వాల	1,01,977
వనపర్తి	94,774
నాగర్‌కర్నూలు	82,694
నల్లగొండ	1,04,660
సూర్యాపేట	1,13,348
ఖమ్మం	1,08,133
రాష్ట్ర సగటు	1,54,734

బడ్జెట్‌పై స్పందనలు...

కాకి లెక్కల బడ్జెట్: లక్ష్మణ్

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్నీ కాకి లెక్కలే ఉన్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ విమర్శించారు. బడ్జెట్ మొత్తం అబద్ధాల చిట్టా అని, వాస్తవాలకు విరుద్ధంగా ఉందన్నారు. ప్రజలను మభ్యపెట్టి ఓట్లు సంపాదించే లక్ష్యంతో రూపొందించారని ఆక్షేపించారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం భారీ పథకాలను అట్టహాసంగా ప్రకటిస్తుండటంలో చూపే శ్రద్ధ అమల్లో చూపించడం లేదని బీజేపీ పక్షనేత కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. గత నాలుగేళ్లలో బడ్జెట్‌లో ప్రకటించిన హామీలను పరిశీలిస్తే చెప్పింది బారెడు.. జరిగేది జానెడు సామెత గుర్తుకు వస్తుందన్నారు.

ప్రజలను అగాధంలోకి నెట్టింది: భట్టి

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్ తెలంగాణ ప్రజల సంక్షేమం, ప్రయోజనాలకు అశనిపాతంగా ఉందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. బడ్జెట్ ప్రజలను మరింత అగాధంలోకి నెట్టేలా ఉందని తేల్చిచెప్పారు. మరోవైపు బడ్జెట్... తప్పుడు లెక్కలు, మాయమాటలతో నిండి ఉందని కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి విమర్శించారు. కావలసిన వారికి, కమీషన్లు ఇచ్చే వారి కోసం మాత్రమే ఈ బడ్జెట్‌లో కేటాయింపులు జరిపారని ఆరోపించారు. శ్రీధర్‌బాబు మాట్లాడుతూ బడ్జెట్‌లో సంక్షేమం కొరవడిందన్నారు. బడ్జెట్‌లో అంకెలకు, వాస్తవ పరిస్థితులకు పొంతన లేదని పొన్నాల లక్ష్మయ్య విమర్శించారు. టీఆర్ఎస్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ఒట్టి బోగస్ అని శాసనమండలిలో విపక్షనేత షబ్బీర్ అలీ అన్నారు.

ఖర్చులపై శ్వేతపత్రం విడుదల చేయాలి: రమణ

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల బడ్జెట్‌లో ఎన్ని నిధులు ఖర్చు చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని టీడీపీ-టీఎస్ అధ్యక్షుడు ఎల్.రమణ డిమాండ్ చేశారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలకు అనుగుణంగా రాష్ట్ర బడ్జెట్ లేదని, ఇది పొంతనలేని బడ్జెట్ అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్ రెడ్డి విమర్శించారు. బడ్జెట్‌లో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని టీడీపీ ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ కార్పొరేషన్‌కు, తొమ్మిది ఫెడరేషన్లకు ఒక్క పైసా కూడా కేటాయించలేదని విమర్శించారు.

అప్పుల ఊబిలో దించిన బడ్జెట్: తమ్మినేని

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఏటా రూ.32వేల కోట్ల రుణాన్ని జమచేస్తూ 2018 నాటికి రూ.1.51లక్షల కోట్ల రుణంతో టీఆర్ఎస్ ప్రభుత్వ బడ్జెట్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. రాష్ట్ర బడ్జెట్ పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అన్నారు.

జగన్‌తోనే పవన్

» నేను పవన్ కల్యాణ్‌తో మాట్లాడాను.. తాను తెలుగుదేశంతో లేనన్నారు

» ఎన్నికలయ్యాక మాకే మద్దతిస్తానన్నారు: వైసీపీ ఎంపీ వరప్రసాద్

న్యూఢిల్లీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జనసేన అధిపతి పవన్ కల్యాణ్ తెలుగుదేశం పార్టీపై ఇప్పుడు విరుచుకుపడ్డారు సరే! కానీ... తన మద్దతు జగన్‌కే అని ఎప్పుడో చెప్పేశారా? ఎన్నికల తర్వాత తమ పార్టీ ఎమ్మెల్యేలు జగన్‌కే అండగా ఉంటారని మాట ఇచ్చేశారా? ఈ ప్రశ్నలన్నింటికీ స్వయంగా వైసీపీ ఎంపీ వరప్రసాద్ 'అవును' అని బదులిచ్చారు. తాను టీడీపీతో ఎంత మాత్రమూ కలిసి లేనని, అవసరమైతే జగన్‌కే మద్దతిస్తానని పవన్ తనకు స్పష్టంగా చెప్పారన్నారు. గురువారం ఉదయం ఢిల్లీలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల పవన్ కల్యాణ్ తనకు ఫోన్ చేసి ఒకసారి కలుద్దామంటే వెళ్లి కలిశానని చెప్పారు. వైసీపీపై ఎందుకు విమర్శలు చేస్తున్నారని పవన్‌ను అడిగానన్నారు. 'మాది అవినీతి పార్టీ అంటున్నారు. పోలవరం సందర్శనకు మేము వెళ్తున్నామని తెలిసి, అంతకంటే ముందే మీరు అక్కడికి వెళ్లి ప్రభుత్వానికి మద్దతుగా మాట్లాడారు. దాంతో మీరు టీడీపీతో ఉన్నారని విమర్శలు వచ్చాయి' అని పవన్‌కు చెప్పానన్నారు. అందుకు పవన్ స్పందిస్తూ... 'అలాంటిదేమీ లేదు. అవసరమైతే ఎన్నికల తర్వాత జగన్‌కే మా పార్టీ ఎమ్మెల్యేల మద్దతు ఉంటుంది' అని హామీ ఇచ్చినట్లు వరప్రసాద్ చెప్పారు. ప్రజారాజ్యం పార్టీలో కలిసి పనిచేసిన చనువుతో పవన్ తనతో మాట్లాడారని తెలిపారు. ప్రత్యేక హోదా సాధన విషయంలో జనసేన, వైసీపీ పార్టీలు పరస్పర మద్దతుతో కలిసి పోరాడతాయని ప్రకటించారు. తమకు 24 శాతం ఓటు బ్యాంకు ఉందని జనసేనా ధీమాగా ఉందని, గతంలో ప్రజారాజ్యం పార్టీకి ఉన్న ఓటు బ్యాంకుతో పోల్చి ఈ అంచనాకు వచ్చారని తెలిపారు. గురువారం ఉదయం చేసిన వ్యాఖ్యలను సాయంత్రానికి వరప్రసాద్ ఖండించారు. 'పవన్ కల్యాణ్‌తో తాను సంభాషించినట్లుగా కొన్ని టీవీ చానళ్లు ప్రచారం చేశాయి. నేను ఆయనతో మాట్లాడని అంశాలను దురుద్దేశపూర్వకంగా ప్రచారం చేశారు. నా వ్యాఖ్యలను వైసీపీ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉపయోగించుకోవడాన్ని ఖండిస్తున్నాను" అని ఒక ప్రకటన విడుదల చేశారు.



పవన్‌తోనే ఉన్నాం



» ఏపీ బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్ వ్యాఖ్య

» ఆధారాల్లేకుండా లోకేశ్‌పై ఆరోపణలా?: విష్ణు

అమరావతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జనసేన అధిపతి పవన్ కల్యాణ్ ఉన్నట్టుండి టీడీపీ సర్కారుపై విరుచుకుపడటానికి కారణమేమిటి? దీని వెనుక బీజేపీ హస్తముందా? గురువారం ఏపీ అసెంబ్లీలో ఎక్కడ చూసినా ఇదే చర్చ. 'పవన్ వెనక మీ పార్టీ ఉందంటున్నారే' అని ఓ టీడీపీ ఎమ్మెల్సీ.. బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్‌తో నేరుగా అన్నారు. దీనికి ఆయన స్పందిస్తూ... 'పవన్ వెనకాల కాదు, పవన్‌తోనే బీజేపీ ఉంది' అని మాధవ్ సూటిగా చెప్పారు. ఇక పవన్ వెనుక బీజేపీ ఉందని ఏపీ మంత్రులు బహిరంగంగానే ఆరోపించారు. అసెంబ్లీ లాబీల్లో కూడా టీడీపీ, బీజేపీ ఎమ్మెల్యేల మధ్య దీనిపైనే చర్చలు జరిగాయి. కాగా ఆధారాలు లేకుండా లోకేశ్‌పై ఆరోపణలు చేయడం పవన్ కల్యాణ్‌కు తగదని ఏపీ బీజేఎల్పీ నేత విష్ణుకుమార్ రాజు వ్యాఖ్యానించారు. 'రోడ్లమీద ఎవరెవరో చేసే కామెంట్లను పవన్ చేయడం సరికాదు. నేను ఏది చెప్పినా ఆధారాలతోనే చెప్పాను. పవన్ కూడా ఆధారాలు ఉంటేనే లోకేశ్‌పై ఆరోపణలు చేయాలి' అని వ్యాఖ్యానించారు.

మోదీ.. మీకు భయపడాలా?

టీడీపీపై మహా కుట్ర

అమరావతి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి వ్యతిరేకంగా మహా కుట్ర జరుగుతోందని ఆ పార్టీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. గురువారం ఉదయం తమ పార్టీ ఎంపీలు, వ్యూహ కమిటీ సభ్యులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. 'టీడీపీని దెబ్బతీసే పథక రచనలో చాలా మంది పెద్దలు ఉన్నారు. స్థానికంగా కూడా కొందరు భాగస్వాములు అయ్యారు. ఈ కుట్రలను ప్రజలు అర్థం చేసుకొంటారు. ఇలాంటి ఎన్నో కుట్రలను టీడీపీ సమర్థంగా ఎదుర్కొని విజేతగా నిలిచింది' అన్నారు. తమపై పవన్ కల్యాణ్ చేసిన ఆరోపణలు అర్థరహితమని, గతంలో వైసీపీ అధ్యక్షుడు జగన్ చేసిన పసలేని విమర్శలే ఇప్పుడు ఆయన చేస్తున్నారని చంద్రబాబు అన్నారు. 'టీడీపీ పాలనలో రాష్ట్రం అవినీతిలో ప్రథమ స్థానంలో నిలిచిందని ఒక సంస్థ నివేదిక ఇచ్చిందని పవన్ ఆరోపించారు. కానీ అది టీడీపీకి ముందు కాంగ్రెస్ హయాంపై వచ్చిన నివేదిక. ఆ తర్వాత అదే సంస్థ టీడీపీ హయాంలో అవినీతి గణనీయంగా తగ్గిందని పేర్కొంది. కానీ, జగన్ మీడియాలో వక్రీకరణలు వచ్చాయి. పాత నివేదిక పట్టుకొని అవినీతి పెరిగిందని అనడం హాస్యాస్పదం. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎర్ర చందనం స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపాం. స్మగ్లింగ్‌ను బాగా తగ్గించాం. అలాంటిది పవన్ ఎర్ర చందనంపై అవినీతి ఆరోపణలు చేయడం ఎవరి స్ర్కిప్టో తెలుస్తోంది' అని వ్యాఖ్యానించారు. 'లోకేశ్‌ను ఎప్పుడూ కలవలేదని శేఖర్‌రెడ్డే చెప్పారు. అతని వ్యాపారాలన్నీ తమిళనాడుకు చెందినవి. తమిళనాడు ప్రభుత్వ సిఫారసుతో ఆయన్ను టీటీడీ బోర్డు సభ్యునిగా పెట్టాం. ఐటీ దాడులు జరిగిన వెంటనే ఆ పదవి నుంచి తొలగించాం. ఆ ఉదంతంతో లోకేశ్‌కు ముడి పెట్టడం కుట్ర రాజకీయాలకు పరాకాష్ఠ. తెలుగుదేశం పార్టీని దెబ్బ తీయాలని మహా కుట్ర జరుగుతోంది. ఉన్నత విద్యాభ్యాసం చేసి.. వ్యాపారాన్ని, కుటుంబాన్ని వదులుకొని ప్రజాసేవకు సిద్ధపడ్డ యువకుడిపై ఇలాంటి ఆరోపణలు చేయడం దివాళాకోరుతనం. కొందరు పెద్దలు నిన్నటిదాకా జగన్, విజయసాయితో డ్రామాలు ఆడారు. అది వికటించేసరికి ఇప్పుడు ఈ కొత్త డ్రామాకు తెరలేపారు. తమిళనాడు తరహా నాటకాలు ఇక్కడ చెల్లుబాటు కావు. ఇక్కడి ప్రజలకు రాజకీయ చైతన్యం ఎక్కువ. ఈ నాటకాల స్ర్కిప్టులు ఎక్కడి నుంచి వచ్చాయో అందరికీ తెలుసు. ఎంతకాలం ఈ నాటకాలు ఆడతారో ఆడనివ్వండి. చివరకు ప్రజలే తమ తీర్పు ఇస్తారు' అని ఆయన అన్నారు.

ఇవ్వాల్సినవి అడిగితే దాడి చేస్తారా?.. రెచ్చగొట్టి నా మీదికి పంపిస్తారా?



ఆదరణ-2 లోగోను ఆవిష్కరిస్తున్న ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రులు

(మొదటి పేజీ తరువాయి)

కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యాచరణను వివరిస్తూనే కేంద్రంపై విరుచుకుపడ్డారు. విపక్ష వైసీపీని, రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన జనసేననూ దునుమాడారు. "ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు. విభజన చట్టంలో ఉన్నవన్నీ మనకు దక్కాల్సిందే. ఇది అడిగితే... తమిళనాడులో చేసినట్లుగానే, మన రాజకీయాల్లో జోక్యం చేసుకుంటున్నారు. బీజేపీ ఏమీ చేయలేక వేరే వాళ్లను రెచ్చగొడుతోంది. డబ్బులు ఇవ్వాల్సింది మోదీ. అన్యాయం చేసింది కేంద్ర ప్రభుత్వం. మోదీని నిలదీయాల్సిన వాళ్లు నన్ను నిలదీస్తున్నారు. ఇదెక్కడి న్యాయం?" అంటూ పరోక్షంగా పవన్ వైఖరిని తప్పుపట్టారు. మోదీ ఇబ్బంది పెడితే నేను భయపడాలా? వేరే వాళ్లు రెచ్చగొడితే నేను భయపడి పిరికిపందలా ఉండాలా? అని ప్రశ్నించారు. "రాష్ట్రాల్లోని నాయకత్వాన్ని బలహీనపరచడం వీరికి అలవాటైపోయింది. కేసులు ఉన్నవారైతే వారి చెప్పు చేతల్లో ఉంటారు. నాకు భయం లేదు. నలభై సంవత్సరాల్లో ఎన్నో సంక్షోభాలు చూశా. ఎప్పుడూ భయపడలేదు. భయం నా జీవితంలోనే లేదు. ప్రజల కోసం ముందుకు సాగుతాను" అన్నారు.

ఇప్పుడు ఎందుకు ఇవ్వరు?

"ఏపీకి పార్లమెంటు సాక్షిగా అన్యాయం, అవమానం జరిగిందని దేశం అంతా గగ్గోలు పెట్టింది. పురుడుపోసి తల్లిని చంపేశారని మీరే అన్నారు. ఇప్పుడు ఆర్థిక మంత్రిగా ఉన్న జైట్లీ నాడు ప్రతిపక్ష హోదాలో మాట్లాడుతూ తాము వస్తే ప్రత్యేక హోదా పదేళ్లు ఇస్తామని చెప్పారు. ఇప్పుడేమైంది? ఎందుకివ్వట్లేదు? తల్లిని బతికించమనే అడుగుతున్నాను. ఇవన్నీ అడిగితే మాపై ఎదురు దాడి చేస్తారా?" అంటూ కేంద్రంపై చంద్రబాబు మండిపడ్డారు. "మాకు పార్లమెంటు సాక్షిగా అన్యాయం చేశారు. దాని సాక్షిగానే న్యాయం చేయాలి. లేదంటే ఏపీ ప్రజలు చూస్తూ ఊరుకోర"ని హెచ్చరించారు.

నాటకాలు నా దగ్గరా...

రాష్ట్రంలో ఉన్న కొందరితో చీకటి ఒప్పందాలు చేసుకుంటున్నారంటూ బీజేపీపై చంద్రబాబు విమర్శలు గుప్పించారు. వైసీపీని నమ్మితే భవిష్యత్తు అంధకారమవుతుందని... జీవితాలనే తాకట్టు పెడతారని తెలిపారు. "40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న నా దగ్గరే ఇలా చేస్తున్నారు. పోలవరంలో నాటకాలాడతారు. రేపు ఇంకా నాటకాలాడుతారు. ఇబ్బందులు పెడుతారు. అయినంత మాత్రాన భయపడతామా? ఆ అవసరమే లేదు. ఏం జరిగినా ప్రతీరోజూ ప్రజలకు తెలియజేస్తాను. ఈ గడ్డపై పుట్టిన ప్రతీ ఒక్కరూ ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ఎవరైనా కేసులు, వ్యక్తిగత ప్రయోజనాలకోసం లాలూచీ పడితే మనం ఉపేక్షించవద్దు. వీళ్ల ఆటలు సాగవు. సాగనివ్వను" అని తేల్చి చెప్పారు.

నన్ను బలహీనపరిస్తే ఏమొస్తుంది...

"ఈ క్లిష్ట సమయంలో మనకు చేసిన అన్యాయంపై కేంద్రాన్ని, నరేంద్రమోదీని నిలదీయాలి. హక్కులపై పోరాడాలి. కానీ జనసేన అధినేత ఏం చేస్తున్నారు? హక్కులకోసం పోరాడుతున్న నన్ను బలహీనపరచాలని చూస్తారా? దానివల్ల నీకొచ్చే లాభం ఏమిటి? రాష్ట్ర ప్రయోజనాలకు ఒరిగే మేలు ఏమిటి?" అని పవన్ కల్యాణ్‌ను చంద్రబాబు ప్రశ్నించారు. నాలుగేళ్లు ఏమీ మాట్లాడకుండా... ఎప్పుడూ కనబడని అవినీతి, ఇతర విషయాలు ఇప్పుడే కనబడుతున్నాయా అని నిలదీశారు. ఇదేం చోద్యమని ప్రశ్నించారు. హక్కుల సాధనలో ఎవ్వరికీ భయపడేది లేదని చంద్రబాబు తెలిపారు. "నిజం నిప్పులాంటిది. దానితో చెలగాటం మంచిది కాదు. మీరు ఎంత రెచ్చగొడితే మేం అంత రెచ్చిపోతాం. వెనక్కు తగ్గేది లేదని ఎన్డీయే ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నా" అని సూటిగా చెప్పారు. "రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై చర్చ జరగాలి. గ్రామాల్లోని రచ్చబండలో, బస్సుల్లో ప్రతిచోటా దీనిపై మాట్లాడుకోవాలి. ఒకరు పది మందికి, ఆ పదిమంది వంద మందికి, వందమంది వెయ్యి మందికి... ఇలా మహోద్యమంలా నడవాలి" అని పిలుపునిచ్చారు. రాష్ట్రానికి అన్యాయం చేసిన వారిని బుద్ధి చెప్పేదాకా ఇది ఆగదన్నారు. "నాకు మోదీతో గొడవేముంది? నాకు పదవులు అవసరంలేదు. విమర్శించే వారందరికీ సమాధానం చెబుతాను. కానీ... నన్ను విమర్శిస్తూ రాష్ట్రానికి అన్యాయం చేసిన వారిని బలపరుస్తున్నారు. ఇదే సమస్య. మీకు రాజకీయ ప్రయోజనాలుంటే ఎన్నికల్లో తేల్చుకోండి. రాష్ట్రప్రయోజనాలతో రాజకీయాలు చేస్తే ప్రజలు ఉపేక్షించరు. ఇప్పటికే దగా పడ్డాం. ఆ కసి ప్రజల్లో ఉంది. అది ఇంకా చల్లారలేదు" అని చంద్రబాబు తెలిపారు.

తాత, తండ్రికి చెడ్డ పేరు తీసుకురాను

అసెంబ్లీలో లోకేశ్..పవన్ వ్యాఖ్యలకు కౌంటర్



అమరావతి,మార్చి 15(ఆంధ్రజ్యోతి): తన తాత ఎన్టీఆర్, తండ్రి చంద్రబాబు అంత పేరు తెచ్చుకుంటానో లేదో కానీ వారికి చెడ్డ పేరు మాత్రం తీసుకురానని ఏపీ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. గుంటూరు సభలో ఎన్టీఆర్ మనవడి అవినీతి అంటూ పవన్ కల్యాణ్ చేసిన ఆరోపణలకు జనసేన అధినేత పేరు ప్రస్తావించకుండానే ఆయన కౌంటర్ ఇచ్చారు. ఏపీ సీఎం చంద్రబాబు ఎమ్మెల్యేగా అసెంబ్లీలోకి అడుగుపెట్టి 40 ఏళ్లయిన సందర్భంగా ప్రవేశపెట్టిన అభినందన తీర్మానంపై జరిగిన చర్చలో లోకేశ్ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. కుటుంబం కంటే రాష్ట్రాభివృద్ధి ముఖ్యమని భావించే చంద్రబాబు తనకు రోల్ మోడల్ అని చెప్పారు. హుద్‌హుద్ తుఫాను సమయంలో బ్రాహ్మణి సీమంతానికి వచ్చిన చంద్రబాబు కేవలం 5 నిమిషాలే ఉండి..కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో ఫోన్‌లో మాట్లాడుతూ వెళ్లిపోయారని గుర్తు చేసుకున్నారు. అలిపిరి దాడి సమయంలో తామెంతో ఆందోళన చెందుతుంటే..ఆయనే ఫోన్ చేసి ధైర్యం చెప్పారన్నారు. రాజకీయంగా చంద్రబాబుది 40 ఏళ్ల ప్రస్థానం అయితే, ఆయనతో తనది 30 ఏళ్ల అనుబంధమన్నారు. ప్రజాసేవ లక్ష్యంగా నిరంతరం శ్రమిస్తున్న చంద్రబాబు విజయానికి తన తల్లి భువనేశ్వరి సహకారం కీలకమైందని చెప్పారు.

పదవులకు వన్నె తెచ్చారు

ఏ పదవి చేపట్టినా దానికి చంద్రబాబు వన్నె తెచ్చారని చర్చలో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. ముందు చూపుతో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, సుపరిపాలన తెచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని ఏపీ శాసనసభ వ్యవహారాల మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. చంద్రబాబూ తానూ ఒకేసారి శాసనసభకు వచ్చామని కేఈ కృష్ణమూర్తి గుర్తు చేసుకున్నారు. చంద్రబాబు గొప్ప పాలనాదక్షుడని చినరాజప్ప ప్రశంసించారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నో అవమానాలను, సంక్షోభాలను సీఎం ఎదుర్కొన్నారని కళావెంకట్రావు పేర్కొన్నారు. మనవడితో సహా ఆస్తులు ప్రకటించిన ఘనత బాబుదేనని మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు.

హోదా ఇవ్వొద్దని నిర్దిష్టంగా చెప్పలేదు

» 14వ ఆర్థికసంఘం సిఫారసులపై కేంద్రం

న్యూఢిల్లీ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఏ రాష్ట్రానికి కూడా ప్రత్యేక హోదా ఇవ్వొద్దని 14వ ఆర్థిక సంఘం నిర్దిష్టంగా సిఫారసు చేయలేదని కేంద్ర ప్రణాళికశాఖ మంత్రి రావు ఇంద్రజిత్‌సింగ్ స్పష్టం చేశారు. కానీ పన్నుల వాటాల్లో ప్రత్యేక హోదా కలిగిన రాష్ట్రాలు, సాధారణ రాష్ట్రాల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తీసేసిందని అన్నారు. 2015-20 మధ్య రాష్ట్రాలకు కేంద్ర పన్నుల వాటాను 32 శాతం నుంచి 42 శాతానికి పెంచిందని వివరించారు. దీంతో రాష్ట్రాలకు మరిన్ని నిధులు అందుతున్నాయని, రాష్ట్రాల రెవెన్యూ లోటును భర్తీ చేసే ఉద్దేశంతో ఆర్థికసంఘం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. రాజ్యసభలో టీడీపీ ఎంపీ సీఎం రమేశ్ అడిగిన ఓ ప్రశ్నకు ఈ మేరకు ఆయన గురువారం లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

రైల్వేజోన్‌పై కేంద్రం దొంగాట

» టీడీపీ అపాయింట్‌మెంట్‌లపై పీయుష్ బుకాయింపు

న్యూఢిల్లీ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఏపీకి చెందిన అంశాలపై దాటవేత ధోరణి అవలంభిస్తున్న కేంద్రం తీరు గురువారం మరోసారి బయటపడింది. టీడీపీ ఎంపీలకు అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా వైసీపీ ఎంపీ వరప్రసాద్‌తో రైల్వేమంత్రి మాట్లాడటం విమర్శలకు దారితీయడంతో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసిన కేంద్ర రైల్వే మంత్రి పీయుష్ గోయాల్ ఖండించే ప్రయత్నం చేశారు. ప్రతి మంగళవారం సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకూ పార్లమెంట్ భవనంలోని కార్యాలయంలో ఎంపీలు తనను కలుసుకుంటారని, కానీ గత మంగళవారం పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అత్యవసర భేటీ ఏర్పాటు చేయడంతో వెళ్లిపోయానన్నారు. టీడీపీ ఎంపీలెవరూ తనను అపాయింట్‌మెంట్ కోరలేదని.. సమావేశం నుంచి వచ్చిన తర్వాత తన ఆఫీసులో ఉన్న ఎంపీలతో(వైసీపీ ఎంపీతో)పాటు మరికొందరు కలిశారని వివరణ ఇచ్చారు. రైల్వేజోన్‌పై స్పష్టత ఇచ్చేందుకు మాత్రం పీయుష్ గోయల్ నిరాకరించారు. విలేకరులు ప్రశ్నలు వేస్తుంటే అర్థాంతరంగా వెళ్లిపోయారు. కాగా ఒడిసా ప్రభుత్వానికి కానీ సీఎంకు కానీ విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుపై వ్యతిరేకత, అభ్యంతరం లేదని బిజూ జనతాదళ్ ఎంపీలు ప్రతాప్ కేసరీ దేవ్, ఎన్. భాస్కర్‌రావు పేర్కొన్నారు. 2 రోజుల క్రితం పీయుష్‌ను కలిసినపుడు విశాఖ జోన్‌ను ఏర్పాటు చేస్తే ఆ డివిజన్‌లో ఉన్న రాయగడను ప్రత్యేక డివిజన్‌గా చేయాలని అడుగుతున్నామని, దీనిపై కేంద్రమే నిర్ణయం తీసుకోవాలని కోరమని తెలిపారు. మరోవైపు కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటును సాధ్యం చేయడానికి మెకాన్ సంస్థ నివేదిక అందిన తర్వాత తుది నిర్ణయం తీసుకుంటామని కేంద్ర ఉక్కు శాఖ మంత్రి చౌదరి బీరేంద్ర సింగ్ స్పష్టం చేశారు.



శ్రీశైలంలో సుబ్రహ్మణ్యేశ్వరాలయం

» 23 ఎకరాలు కేటాయించిన ఏపీ ప్రభుత్వం

విశాఖపట్నం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో మల్లికార్జున, భ్రమరాంబికాదేవి ఆలయాలు ఈ క్షేత్రంలో విరాజిల్లుతున్నాయి. అయితే.. పార్వతీపరమేశ్వరులు ఎవరికోసమైతే ఈ ప్రాంతానికి వచ్చారో.. ఆయన ఆలయం లేకపోవడం సరికాదని ఐదేళ్ల క్రితం శివరాత్రి రోజున ఒక వృద్ధుడు చేసిన బోధతో అక్కడ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి బీజం పడింది. విశాఖకు చెందిన కాంట్రాక్టర్ భాస్కరరెడ్డితోపాటు మరికొందరు దాతలు ఆలయ ఈవో, దేవదాయ శాఖ కార్యదర్శులను పదేపదే సంప్రదించి ఎట్టకేలకు విజయం సాధించారు. దీంతో రూ.250 కోట్ల అంచనాతో పూర్తిగా కృష్ణశిలలతో అద్భుతమైన ఆలయ నిర్మాణానికి భ్రమరాంబిక ఆలయం పక్కనే 23 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది.

కేంద్రంపై అవిశ్వాసానికి సై!

» వైసీపీ ప్రతిపాదనకు టీడీపీ మద్దతు

» ఎవరు పోరాడినా అండగా ఉందాం

» ఏపీ సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం

» నేడు వైసీపీ అవిశ్వాస తీర్మానం

» లోక్‌సభ స్పీకర్ కార్యాలయంలో నోటీసు

» మద్దతివ్వాలని పార్టీలకు జగన్ లేఖ

» టీడీపీ నేత తోట నరసింహంకూ వినతి

అమరావతి/న్యూఢిల్లీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వంపై వైసీపీ ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇవ్వాలని తెలుగుదేశం పార్టీ నిర్ణయించింది. గురువారం అసెంబ్లీలో మంత్రులతో సమావేశమైన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. "రాష్ట్రానికి రావాల్సిన వాటిని సాధించేందుకు ఎవరు, ఎలాంటి పోరాటం చేసినా మద్దతు ఇద్దాం. అందులో భాగంగానే వైసీపీ అవిశ్వాస నోటీసుకూ మద్దతు పలుకుదాం" అని తీర్మానించారు. అయితే... విపక్ష వైసీపీకి మద్దతివ్వడమేమిటని కొందరు మంత్రులు ప్రశ్నించారు. "ఇక్కడ రాజకీయాలు ముఖ్యం కాదు. కేంద్రంపై ఒత్తిడి తేవడం కీలకం. ప్రతి అవకాశాన్నీ వినియోగించుకుందాం. మనం స్పష్టంగా ఉంటున్నాం. అందుకే మద్దతు ఇవ్వాలని అనుకుంటున్నాం" అని ముఖ్యమంత్రి చెప్పారు. టీడీపీయే అవిశ్వాసం నోటీసు ఇస్తే ఎలా ఉంటుందని కొందరు మంత్రులు ప్రస్తావించగా.. ఎన్డీఏ నుంచి అధికారికంగా బయటకు రాకుండా అవిశ్వాసం నోటీసు ఇవ్వడం సరికాదని, బయటకు వచ్చిన తర్వాత స్వేచ్ఛగా వ్యవహరించవచ్చని సీనియర్ మంత్రులు అన్నారు. కాగా కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టనున్నట్లు వైసీపీ గురువారం స్పీకర్ కార్యాలయంలో నోటీసు అందజేసింది. అయితే దీనిపై 16వ తేదీ వేసింది. ప్రస్తుతం లోక్‌సభలో వైసీపీకి ఐదుగురు సభ్యులే ఉన్నారు. అవిశ్వాస తీర్మానంపై చర్చ జరగాలంటే 50 మంది సభ్యులు మద్దతివ్వడం తప్పనిసరి. ఈ నేపథ్యంలో ఆయా పార్టీల మద్దతు కూడగట్టేందుకు వైసీపీ ఎంపీలు ఆ కార్యాలయాలకు వెళ్లి.. తమ అధ్యక్షుడు వైఎస్ జగన్ రాసిన లేఖలను ఆ పార్టీల లోక్‌సభాపక్ష నేతలకు అందించారు. బీఏసీ సమావేశంలో మేకపాటి రాజమోహన్‌రెడ్డి అవిశ్వాసం నోటీసును స్పీకర్ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అవిశ్వాసానికి మద్దతు కోరుతూ పలు పార్టీల నేతలకు లేఖలు ఇచ్చామన్నారు. ఎన్డీఏ పక్షాలను మద్దతు కోరకూడదని తొలుత నిర్ణయించినా.. రాష్ట్ర అవసరాల దృష్ట్యా టీడీపీ లోక్‌సభాపక్ష నేత తోట నరసింహంను కలిసి మద్దతు కోరినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం వారు కూడా మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

పవన్ ఎవరికి తనఖా పెడతారో?

» అన్నేమో కాంగ్రెస్‌కు తాకట్టుపెట్టారు : ఏపీ మంత్రులు

అమరావతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): విభజన చట్టంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని టీడీపీ, రాష్ట్ర ప్రజలందరూ గళమెత్తి కేంద్రంపై పోరాడుతుంటే.. ఆ పోరాటాన్ని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, మంత్రులు పి.నారాయణ, కిమిడి కళావెంకట్రావు, ప్రత్తిపాటి పుల్లారావు, ఆదినారాయణరెడ్డి విరుచుకుపడ్డారు. గురువారం సచివాలయం వద్ద, మంగళగిరిలో వారు వేర్వేరుగా విలేకరులతో మాట్లాడారు. 'చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ పెట్టి కాపులందరి ప్రయోజనాలను కాంగ్రెస్‌కు తాకట్టు పెట్టారు. ఇప్పుడు తమ్ముడు పార్టీ పెట్టాడు.. ఎవరికి తాకట్టుపెడతారోనని వారంతా భయపడుతున్నారు. చిరంజీవి వల్ల పాతికేళ్లు వెనక్కి వెళ్లామని కాపులంతా బాధపడుతున్నారు' అని నారాయణ అన్నారు. బీజేపీ పవన్‌ను పావుగా వాడుకుంటోందన్నారు. 'కేంద్ర పెద్దలు టీడీపీని అణగదొక్కాలని చూస్తున్నారు. ముందు జగన్‌ను ప్రోత్సహించారు. ఇప్పుడు పవన్‌ను తెచ్చారు' అని ధ్వజమెత్తారు.

రాష్ట్ర విభజన సమయంలో జరిగిన కుట్రే పునరావృతమవుతోందని టీడీపీ అనుమానిస్తోంది. టీడీపీని, ముఖ్యమంత్రి చంద్రబాబును దెబ్బతీసే లక్ష్యంతోనే విభజన, అనంతర పరిణామాలు చోటు చేసుకున్నాయని గుర్తుచేస్తున్నారు. 'నాడు జాతీయ పార్టీగా ఉన్న కాంగ్రెస్.. వైసీపీ, టీఆర్ఎస్‌తో లోపాయకారీ అవగాహనకు వచ్చి రాష్ట్రాన్ని ముక్కలు చేసింది. ఇప్పుడు కూడా అదే కుట్ర.. కాకపోతే ఆయా పాత్రల్లోకి ప్రస్తుతం ఉనికిలో ఉన్న పార్టీలు వస్తున్నాయి' అని పేర్కొంటున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఒకపక్క తమ మిత్రపక్షంగా ఉంటూనే.. వైసీపీతోనూ టచ్‌లో ఉందని వారు అంటున్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా అదే బాటలో వెళ్తున్నారని చెబుతున్నారు.

న్యూఢిల్లీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ, లోక్‌సభల్లో కేంద్ర మాజీ మంత్రులు అశోక్ గజపతిరాజు, సుజనా చౌదరి ప్రసంగాలను కాంగ్రెస్ పార్టీ అడ్డుకుంది. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వకపోవడం, విభజన హామీలను అమలు చేయనందుకు నిరసనగా వీరిద్దరూ కేబినెట్ నుంచి వైదొలగిన విషయం తెలిసిందే. తామెందుకు రాజీనామాలు చేసిందీ సభలో వ్యక్తిగత వివరణ ఇచ్చే హక్కు వారికి ఉంది. దానికి అనుగుణంగా గురువారం రాజ్యసభలో సుజనా ప్రసంగించారు. ఉదయం సభ ప్రారంభం కాగానే ఛైర్మన్ వెంకయ్యనాయుడు ఆయనకు మాట్లాడే అవకాశమిచ్చారు. సుజనా మాట్లాడుతూ.. కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు మద్దతుగా నిలిచి దేశ సేవ చేయడానికి సంపూర్ణ సహకారం అందించినందుకు ప్రధానమంత్రికి, మంత్రివర్గ సభ్యులకు

సుజనా, అశోక్ ప్రసంగాలకు కాంగ్రెస్ అడ్డుపుల్ల

ఉభయ సభల్లో అరుపులు, నిరసనలు

కృతజ్ఞతలు తెలిపారు. తనపై విశ్వాసంతో కేంద్ర మంత్రిగా అవకాశం ఇచ్చినందుకు పార్టీ అధ్యక్షుడు చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. ఏపీ విభజన బిల్లు ఆమోదం పొందిన 2014 ఫిబ్రవరిలో భయానక రోజుల గురించి గుర్తు చేస్తానంటూ.. 'రాష్ట్ర విభజన బిల్లు ఆమోదం పొందిన తీరు అందరికీ తెలుసు. హడావుడిగా అన్యాయంగా, అశాస్త్రీయంగా విభజించారు' అని వ్యాఖ్యానించగానే కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం తెలిపారు. గందరగోళం నడుమే సుజనా ప్రసంగాన్ని కొనసాగించారు. అటు ప్రత్యేక హోదా సాధనే ధ్యేయంగా టీడీపీ లోక్‌సభలో ఆందోళన కొనసాగిస్తోంది. వరుసగా తొమ్మిదోరోజూ లోక్‌సభ జరగకుండా స్తంభింపజేసింది. స్పీకర్ రాకముందే టీడీపీ ఎంపీలు ప్లకార్డులతో వెల్‌లోకి వచ్చారు. వైసీపీ ఎంపీలు కూడా స్పీకర్ పోడియం చుట్టూ చేరి నిరసన తెలిపారు. సభ గందరగోళంగా మారడంతో స్పీకర్ వాయిదా వేశారు.

ఎంత ప్యాకేజీ ముట్టింది?

» పవన్‌కల్యాణ్‌పై మోత్కుపల్లి ఆగ్రహం

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం చంద్రబాబుపై విమర్శలు చేసిన జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌పై టీడీపీ సీనియర్ నేత, పొలిట్‌బ్యూరో సభ్యుడు మోత్కుపల్లి నర్సింహులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల కోసం జీవితాన్ని త్యాగం చేసి పోరాడుతున్న చంద్రబాబును విమర్శించే హక్కు పవన్‌కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. "చంద్రబాబు పాలన బాగుందని నాలుగేళ్లుగా పొగడుతూ వచ్చిన నువ్వు.. గంటలో మాట మార్చడం వెనుక ఎవరున్నారో? ఎంత ప్యాకేజీ ముట్టిందో చెప్పాలి" అని డిమాండ్ చేశారు. గురువారం బేగంపేటలోని తన నివాసంలో మోత్కుపల్లి విలేకరులతో మాట్లాడారు. టీడీపీ పేదల పార్టీ అనే విషయం గుర్తుంచుకోవాలని హితవు పలికారు. చిరంజీవి ప్రజారాజ్యం తరపున పోటీ చేస్తే ఉమ్మడి రాష్ట్రంలో 18 ఎమ్మెల్యే సీట్లు వచ్చాయని, పవన్ పోటీ చేస్తే 8 సీట్లు కూడా రావని అన్నారు. లోకేశ్‌కు టీటీడీ మాజీ సభ్యుడు శేఖర్‌రెడ్డితో సంబంధాలున్నాయన్న ఆరోపణలకు రుజువులు చూపగలవా? అని పవన్ కల్యాణ్‌కు సవాల్ చేశారు. 'నోటికొచ్చినట్లు మాట్లాడితే ప్రజలు బట్టలూడదీస్తారు జాగ్రత్త'అని హెచ్చరించారు.



విజయవాడలో ప్రవాసాంధ్రులతో ముచ్చటిస్తున్న పవన్ కల్యాణ్

పట్టించుకోరు అనుకోవద్దు!

» మాట్లాడకుండా ఊడిగం చేయాలా?

» నిశ్శబ్ద విప్లవం తీసుకొద్దాం.. భయం వదిలేయండి

» ప్రవాసాంధ్రులకు పవన్ కల్యాణ్ పిలుపు

అమరావతి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): "రాజకీయాల్లో ఎవరికీ వ్యక్తిగత శత్రువులు ఉండరు. సత్యం మాట్లాడితేనే శత్రువులు వస్తారు. ఒకటి గమనించాలి. సత్యం మాత్రమే గెలుస్తుంది. సమకాలీన రాజకీయాలు ఎలా తయారయ్యాయి అంటే.. మాట్లాడకుండా వారికి ఊడిగం చేయాలని కోరుకుంటున్నారు. అది ఇక కుదరదు" అని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. అమెరికా, ఇంగ్లండ్, సింగపూర్, మలేసియా, యూఏఈల నుంచి వచ్చిన ప్రవాసాంధ్రులతో విజయవాడలోని ఒక హోటల్‌లో గురువారం పవన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పార్టీ ఎన్నారై విభాగం ఎప్పటికప్పుడు ప్రవాస తెలుగు ప్రజలకు తోడ్పాటుగా ఉంటుందని, అలాగే విదేశాల్లో ఉన్న తెలుగువారు కూడా రాష్ట్రానికి ఏమి చేయాలో ఆలోచించాలని పవన్ కోరారు. 'కుల ప్రాతిపదికగా రాజకీయాలు చేస్తున్నారు. అది సరికాదు. సమాజాన్ని సమగ్రంగా చూసే విధానం రావాలి. నేను తప్పు చేసినా.. జనసేన కార్యకర్త తప్పు చేసినా వెనకేసుకురావద్దు. ఖండించాలి' అని సూచించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ విదేశాల్లో ఎలా ఉంది? అక్కడి నిపుణుల సలహాలు ఏమిటో ఎన్నారైలుగా మీరు ఆలోచన చేయండి. అయితే.. రాజకీయ నాయకులు అంత సులభంగా చేయనివ్వరు. 20 ఏళ్ల క్రితం 'తమ్ముడు' సినిమా 100 రోజుల వేడుక చేస్తే అయ్యే ఖర్చుతో నల్లగొండ జిల్లాలో ఆర్వో ప్లాంట్ల ద్వారా సురక్షిత తాగు నీరు ఇద్దామని వెళ్తే అక్కడి రాజకీయ నాయకులు నీకేం పని అన్నట్లు మాట్లాడారు. గుంటూరు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం కేంద్రం నుంచి వచ్చిన నిధులన్నీ ఖర్చు చేశామన్నారు. ఏమైపోయాయి? సింగపూర్ తరహా పాలన అంటే అక్కడ తప్పు చేస్తే తన వాళ్లనైనా శిక్షిస్తారు" అని పవన్ అన్నారు. 'మనం పన్నులు కడుతున్నప్పుడు ప్రభుత్వం తన బాధ్యతలు నిర్వర్తించాలి కదా? ఈ ధోరణిలో మార్పు తీసుకొద్దాం. ముందుగా మీలోని భయాన్ని తీసేయండి. నిశ్శబ్ద విప్లవం తీసుకొద్దాం' అని సూచించారు.

అదును చూసి ఆమరణ దీక్ష చేయండి


» పవన్‌కు వామపక్షాల సూచన

అమరావతి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం ఆమరణ దీక్ష చేస్తానన్న జనసేన అధినేత పవన్‌కు... తొందర పడొద్దని వామపక్షాలు సూచించాయి. ఆమరణ దీక్షను చేపట్టేందుకు తగిన ప్రణాళిక సిద్ధం చేసుకున్నాక... ఒక కార్యాచరణను ప్రకటించడం మంచిదని హితవు పలికాయి. దీనికి.. పవన్ కూడా సానుకూలంగానే స్పందించారు. హోదాతో సహా ప్రజా సమస్యలపై ఐక్యంగా ఉద్యమిద్దామని వామపక్షాలను పవన్ కోరగా... ఆ పార్టీలు కూడా సముఖత వ్యక్తం చేశాయి. విజయవాడలోని జనసేన పార్టీ తాత్కాలిక కార్యాలయంలో గురువారం పవన్‌తో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ఆ పార్టీల నేతలు సమావేశమయ్యారు.

సా. 4.30నుంచి స్టార్‌స్పోర్ట్స్-2లో..

క్వార్టర్స్‌లో సింధు

మూడు సెట్ల పోరులో థాయ్ ప్రత్యర్థిపై గెలుపు • ప్రణయ్ కూడా ముందంజ



మెరుగుపడాలి..

క్వార్టర్‌ఫైనల్‌కు తన ఆట తీరు మెరుగుపడాల్సి ఉంటుందని మ్యాచ్ అనంతరం సింధు చెప్పింది. 'నా ఆట ఇంకా మెరుగుపడాల్సి ఉంటుంది. క్లిష్టమైన రెండో రౌండ్‌ను గట్టెక్కినందుకు సంతోషంగా ఉంది. పూర్తి విశ్రాంతి తీసుకుని శుక్రవారం మ్యాచ్‌కు బాగా సన్నద్ధమవుతా' అని తెలిపింది.

బర్మింగ్‌హామ్: భారత అగ్రశ్రేణి షట్లర్ పీవీ సింధు ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్ క్వార్టర్‌ఫైనల్లో ప్రవేశించింది. ఆమెతోపాటు మరో ఆటగాడు హెచ్ఎస్ ప్రణయ్ కూడా తుది ఎనిమిది మందిలో ప్రవేశించాడు. గురువారం జరిగిన ప్రీక్వార్టర్ ఫైనల్లోనూ ఒలింపిక్, వరల్డ్ చాంపియన్‌షిప్ రజత పతక విజేత సింధు మూడు సెట్లపాటు పోరాడాల్సి వచ్చింది. అయితే అనుభవాన్ని రంగరించిన ఆమె 21-13, 13-21, 21-18 స్కోరుతో థాయ్‌లాండ్‌కు చెందిన నిచాన్ జిందాపోల్‌ను చిత్తు చేసింది. పురుషుల రెండో రౌండ్‌లో ప్రపం చ 16వ ర్యాంక్ ప్రణయ్ 21-10, 21-19 స్కోరుతో టామి సుగియార్తో (ఇండోనేసియా)పై సునాయాసంగా గెలుపొందాడు. బుధవారం అర్ధరాత్రి జరిగిన తొలి రౌండ్‌లో ప్రణయ్ 9-21, 21-18, 21-18 స్కోరుతో ఎనిమిదో సీడ్ చౌ తీన్ చెన్ (తైపీ)పై నెగ్గాడు. సింధు క్వార్టర్‌ఫైనల్లో ఏడోసీడ్ నజోమి ఒకుహరతో తలపడనుంది. ఒకుహర రెండో రౌండ్‌లో 21-13, 21-15 స్కోరుతో ఫిత్రియాని (ఇండోనేసియా)పై సునాయాసంగా విజయం సాధించింది. సింధుపై ఒకుహర 5-4తో మెరుగైన రికార్డు కలిగి ఉండడం గమనార్హం. అత్యంత హోరాహోరీగా సాగిన వరల్డ్ చాంపియన్‌షిప్ ఫైనల్లో సింధుపై ఒకుహర నెగ్గిన సంగతి తెలిసిందే. జిందాపోల్‌తో గంటా ఏడు నిమిషాల మ్యాచ్‌లో ప్రపం చ మూడో ర్యాంకర్ సింధు తొలి గేమ్‌ను 19 నిమిషాల్లోనే కైవసం చేసుకుంది. అయితే రెండో గేమ్‌లో జిందాపోల్ అద్భుతంగా పోరాడింది. దూకుడుగా ఆడిన ఆమె 7-3 ఆధిక్యం ప్రదర్శించింది. మరోవైపు సింధు ఆట దిగజారింది. దీనిని సద్వినియోగం చేసుకున్న జిందాపోల్ 17-13తో నాలుగు పాయింట్ల ఆధిక్యంతో సింధును ఒత్తిడిలోకి నెట్టింది. అదే ఊపుతో మరో నాలుగు పాయింట్లు చేజిక్కించుకొని గేమ్‌ను సొంతం చేసుకోవడం ద్వారా మ్యాచ్‌లో ఉత్కంఠ రేపింది. రెండో గేమ్ పరాజయ ప్రభావం ఏమాత్రం దరిచేరనీయని సింధు..నిర్ణాయక గేమ్‌లో ఏకంగా 8-4తో ముందంజ వేసింది. కానీ జిందాపోల్ పుంజుకొని 9-9తో స్కోరు సమం చేసింది. అనంతరం 15-12 ఆధిక్యంలోకి దూసుకుపోయి మ్యాచ్‌ను సొంతం చేసుకొనేలా కనిపించింది. కానీ సింధు ఏ మాత్రం ఒత్తిడికి లోను కాకుండా షాట్లలో కచ్చితత్వం ప్రదర్శించింది. 17-18 నుంచి వరుసగా నాలుగు పాయింట్లు రాబట్టి మ్యాచ్‌ను ముగించడం ద్వారా క్వార్టర్‌ఫైనల్‌కు చేరింది.



శ్రీకాంత్ అవుట్

మూడోసీడ్ కిడాంబి శ్రీకాంత్‌కు ప్రీక్వార్టర్ ఫైనల్లో పరాజయం ఎదురైంది. చైనాకు చెందిన 42వ ర్యాంక్ ఆటగాడు హాంగ్ యు జియాంగ్‌తో పోటాపోటీగా జరిగిన రెండో రౌండ్‌లో శ్రీకాంత్ 11-21, 21-15, 20-22 స్కోరుతో కంగుతిన్నాడు. హాంగ్ క్వార్టర్ ఫైనల్లో భారత్‌కు చెందిన ప్రణయ్‌ను ఢీకొంటాడు.

సాత్విక్ జోడీ ఓటమి

పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ షెట్టి జోడీ 16-21, 21-16, 21-23 స్కోరుతో రెండోసీడ్ డెన్మార్క్ జోడీ బొ మథియాస్, మోగిన్‌సెన్ చేతిలో రెండో రౌండ్‌లో ఓటమితో టోర్నీ నుంచి వైదొలగింది.

వహ్వా.. జాఫర్

ట్రిపుల్ దిశగా వసీం.. విదర్భ 589/3.. ఇరానీ ట్రోఫీ



జాఫర్ (285 బ్యాటింగ్)

ఉ. 9.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్-2లో...

నాగ్‌పూర్ : నాలుగు పదుల వయస్సులోనూ తనకు సాటిలేదని విదర్భ ఆటగాడు వసీమ్ జాఫర్ నిరూపించాడు. అలుపెరగని ఈ వెటరన్ (425 బంతుల్లో 34 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 285 బ్యాటింగ్) త్రిశతకం దిశగా దూసుకుపోతున్నాడు. ఫలితంగా రెస్టాఫ్ ఇండియాతో ఇరానీ కప్ మ్యాచ్‌లో రెండోరోజు ఆట ఆఖరికి విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 3 వికెట్లకు 589 పరుగుల భారీ స్కోరు చేసింది. 113 పరుగులతో గురువారం ఆట ప్రారంభించిన వసీమ్..తన వ్యక్తిగత స్కోరుకు మరో 172 పరుగులు జోడించాడు. ఇక గణేష్ సతీష్ (120)తో కలిసి మూడో వికెట్‌కు289, అపూర్వ్ వాంఖడే (44 బ్యాటింగ్)తో కలిసి నాలుగో వికెట్‌కు అభేద్యంగా 91 రన్స్ జోడించాడు.

రికార్డుల వెల్లువ: 40 ఏళ్ల వయస్సులో ఓ ఫస్ట్‌క్లాస్ ఇన్నింగ్స్‌లో 250 పరుగులకు పైగా చేసిన మొదటి ఆసియా ఆటగాడిగా ఘనత దక్కించుకున్నాడు. ఇంకా 18వేల పరుగులు చేసిన ఆరో భారత క్రికెటర్‌గా మరో రికార్డు నెలకొల్పాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అత్యధిక పరుగులు (25,834) చేసిన ఆటగాళ్లలో గవాస్కర్ అగ్రస్థానంలో ఉన్నాడు. అలాగే ఇరానీకప్‌లో వరుసగా ఆరు అర్ధసెంచరీలు కొట్టి గుండప్ప విశ్వనాథ్ తర్వాతి స్థానంలో నిలిచాడు. అంతేకాదు..ఇరానీకప్‌లో మురళీ విజయ్ (266) పేరిట ఉన్న అత్యధిక పరుగుల రికార్డును బద్దలుగొట్టాడు.

ఎవరో భారత్ ప్రత్యర్థి..!

- **నేడు శ్రీలంక, బంగ్లాదేశ్ మ్యాచ్**
- **గెలిచిన జట్టు ఫైనల్‌కు • బంగ్లా కెప్టెన్ షకీబల్ రాక**



జీవన్ మెండిస్

కొలంబో: ముక్కోణపు టీ20 సిరీస్‌లో భారత జట్టు ఇప్పటికే తుది పోరుకు అర్హత సాధించింది. ఇక శుక్రవారం బంగ్లాదేశ్, శ్రీలంక జట్ల మధ్య జరిగే మ్యాచ్‌లో ఫైనల్ చేరేది ఎవరో తేలనుంది. ఇప్పటి వరకు రెండు జట్లు చెరో రెండు పాయింట్లతో ఉన్నాయి. ఒకవేళ వర్షం కారణంగా మ్యాచ్ రద్దయితే నెట్ రన్‌రేట్ ఆధారంగా లంకకు అదృష్టం కలిసి వస్తుంది.

ఒత్తిడిలో లంక



షకీబ్

ఆతిథ్య జట్టు శ్రీలంక వరసగా రెండు పరాజయాలతో తీవ్ర ఒత్తిడిలో ఉంది. బంగ్లాతో జరిగిన తమ చివరి మ్యాచ్‌లో 200కు పైగా పరుగులు సాధించినా ఫలితం లేకపోయింది. ఆ తర్వాత భారత్ చేతిలోనూ ఓడింది. తమ లోపాలను సరిదిద్దుకుని సమష్టి ఆటతో ఈ మ్యాచ్‌లో రాణించి పరువు కాపాడుకోవాలని లంక భావిస్తోంది.

రాత్రి 7 గంటల నుంచి డీస్పోర్ట్స్‌లో

షకీబ్ జట్టులోకి..


చావో రేవో తేల్చుకోవాల్సిన మ్యాచ్‌లో బంగ్లాదేశ్ జట్టులోకి అనూహ్యంగా సీనియర్ ఆల్‌రౌండర్, కెప్టెన్ షకీబల్ హసన్ రావడం వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచినట్టయింది. చేతివేలి గాయం కారణంగా ఈ సిరీస్‌లో ఇప్పటిదాకా షకీబల్ ఆడలేకపోయాడు. అతడి రాకతో జట్టు మంచి సమతూకం సాధించినట్టయింది. అయితే బంగ్లా తమ టాప్ ఆర్డర్ నుంచి మరింత నిలకడైన బ్యాటింగ్‌ను ఆశిస్తోంది. భారత్‌తో జరిగిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఈ విభాగం విఫలమైంది.

సీవోఏ గుప్పిట్లోకి బీసీసీఐ!

- **ఆఫీసు బేరర్ల అధికారాలకు కత్తెర**
- **సూచనలు చేసిన కమిటీ**



వినోద్ రాయ్



సీకే ఖన్నా

న్యూఢిల్లీ: బీసీసీఐని తమ గుప్పిట్లోకి తీసుకునేందుకు కమిటీ ఆఫ్ అడ్మినిస్ట్రేటర్స్ (సీవోఏ) సిద్ధమైంది. తాజాగా ప్రధాన ఆఫీసు బేరర్ల అధికారాలను కత్తిరిస్తూ ఆదేశాలు జారీ చేసింది. బోర్డు తాత్కాలిక అధ్యక్షుడు సీకే ఖన్నా, కార్యదర్శి అమితాబ్ చౌదరి, కోశాధికారి అనిరుధ్ చౌదరి అధికారాలను వినోద్ రాయ్ నేతృత్వంలోని సీవోఏ తన చేతుల్లోకి తీసుకుంది. బోర్డు కార్యకలాపాలన్నీ సీవోఏ అనుమతితోనే సాగాలని తేల్చి చెప్పింది. గతవారం సుప్రీం కోర్టుకు సమర్పించిన మధ్యంతర నివేదికలో ఆఫీసు బేరర్లను తొలగించాలని కోరింది.. ఇప్పుడు వారు ఎటువంటి ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా ఆదేశాలు జారీ చేసింది.

కార్యదర్శికి చెక్

కొత్త సూచనల ప్రకారం సీవోఏ అనుమతి లేకుండా అధికారులు ఎటువంటి పర్యటనలు, సమావేశాల కోసం వసతి సౌకర్యాలను ఏర్పాటు చేసుకునే అధికారం లేదు. అంతేకాకుండా లోధా సంస్కరణల సంబంధిత కేసుల్లో న్యాయసలహాల కోసం బోర్డు నిధులను ఉపయోగించుకోకుండా నిలిపివేసింది. రూ. 25 లక్షలకు పైబడిన చెల్లింపులు, కొత్త నియామకాల విషయంలో ఆఫీసు బేరర్ల అనుమతి అవసరం లేదని పేర్కొంది. కాగా, కొత్త సెంట్రల్ కాంట్రాక్ట్స్‌ను ఆఫీసు బేరర్లు అడ్డుకోవడంపై సీవోఏ హెడ్ వినోద్ రాయ్ కినుక వహించినట్టు తెలుస్తోంది. అంతేకాకుండా భారత ఆటగాళ్ల బీమా గడువు తేదీ కూడా త్వరలో ముగియనుండగా.. బోర్డు నుంచి తగిన స్పందన కొరవడడం కూడా రాయ్‌కు ఆగ్రహం తెప్పించిందని సమాచారం. మరోవైపు పేజ్-3 మాజీ జర్నలిస్టు, ఫిల్మ్ ప్రొడక్షన్ కంపెనీ తరపున పనిచేస్తోన్న ప్రియా గుప్తాను బోర్డు జీఎం (మార్కెటింగ్)గా ఏడాదికి రూ.1.65 కోట్ల భారీ వేతనానికి నియమిస్తూ సీవోఏ తీసుకున్న నిర్ణయాన్ని కార్యదర్శి అమితాబ్ ప్రశ్నించాడు. ఇది పూర్తిగా నియంతృత్వ పోకడ అని తీవ్రంగా దుయ్యబట్టాడు. కాంట్రాక్ట్‌ల విషయంలో తమను పరిగణనలోకి తీసుకోలేదని, అసలు భారత క్రికెట్‌కు మార్కెటింగ్ అవసరం ఉందా? అని ప్రశ్నించాడు.

ఆఫీసు బేరర్లకు సీవోఏ తాజా సూచనలు

- సీవోఏ సూచనల మేరకు ఆఫీసు బేరర్లు, సీఈవో నడుచుకోవాలి. పరిపాలనలో తమకు సహకరించాలి.
- ఆఫీసు బేరర్లకు, ఉద్యోగులు/సహాయకులు/కన్సల్టెంట్ల మధ్య జరిగే సంప్రదింపుల గురించి సీఈవో, సీవోఏకు తప్పని సరిగా సమాచారం ఉండాలి. సీవోఏకు సమాచారం లేదని భావిస్తే.. పైన పేర్కొన్న వారెవరైనా ఆ కాపీని తమ దృష్టికి తీసుకురావచ్చు.
- సీవోఏ అనుమతి లేకుండా ఆఫీసు బేరర్లు లేదా వారి అసిస్టెంట్లు ఎటువంటి పర్యటన, వసతికి సంబంధించిన ఖర్చులు చేయకూడదు. అనుమతి కోరే ముందు ప్రయాణం, ఖర్చులకు సంబంధించి వివరణాత్మక నివేదికను సమర్పించాల్సి ఉంటుంది. (అమితాబ్ చౌదరి నెలలో 25 రోజుల పాటు బోర్డు ఖర్చులతో ప్రయాణాలు చేస్తున్నాడని, విలాసవంతమైన హోటళ్లలో బస చేస్తున్నాడనే ఆరోపణల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.)
- కేసుల విషయంలో ఆఫీసు బేరర్ల న్యాయసలహా ఖర్చులను బోర్డు భరించదు.
- బోర్డు కేసులకు సంబంధించిన అఫిడవిట్లు, దరఖాస్తులు, ఇతరత్రా విషయాల్లో సంతకాలు చేసే అధికారం సీవోఏకు మాత్రమే ఉంది.
- రూ.25 లక్షలకు పైబడిన కాంట్రాక్ట్‌లు/టెండర్లకు సంబంధించిన వాటి అనుమతి కోసం సీఈవో, సీవోఏ ముందు పెట్టాలి. బోర్డు తరపున కార్యదర్శి వాటిపై సంతకాలు చేసే అధికారం ఉంది. కాగా, సీవోఏ ఆమోదం పొందిన కాంట్రాక్ట్‌పై కార్యదర్శి.. 5 రోజుల్లోపు సంతకాలు చేయకపోతే వాటిపై సీఈవో సంతకం చేసే విధంగా సీవోఏ సూచిస్తుంది.
- ఇక బోర్డు తరపున చేసే చెల్లింపులన్నీ కార్యదర్శి, సీఈవోలు కలసి ఆమోదించాలి. ఇద్దరిలో ఎవరు విభేదించినా.. 3 రోజుల తర్వాత అది సీవోఏ ఆమోదం కోసం వస్తుంది. అయితే, సాధారణ చెల్లింపులకు మాత్రం సీవోఏ అనుమతి అవసరం లేదు.
- బోర్డు రాజ్యాంగం ప్రకారం ఆఫీసు బేరర్లు ఏవైనా అధికారాలు ఉపయోగించుకోవాలన్నా.. అందుకు సీవోఏ అనుమతి ఉండాల్సిందే.
- సర్వసభ్య సమావేశాలు, సబ్ కమిటీల ఏర్పాటు, ఏవైనా మీటింగులకు సంబంధించి బోర్డు నోటీసులు విడుదల చేసే ముందు సీవోఏ అనుమతి తీసుకోవాలి. ఆయా సమావేశాల అజెండా, తీసుకున్న నిర్ణయాలను సీవోఏకు నివేదించాలి. సీవోఏ అనుమతి లేకుండా ఎటువంటి నిర్ణయాలను అమలు చేయకూడదు.

తొలి మ్యాచ్‌లో భారత్×పాక్

చాంపియన్స్ ట్రోఫీ హాకీ


న్యూఢిల్లీ: చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నీ తొలి మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో భారత్ తలపడనుంది. జూన్ 23 నుంచి జూలై 1 వరకు నెదర్లాండ్స్‌లోని బ్రిడాలో ఈ టోర్నీ జరగనుంది. ఆరు దేశాలు పాల్గొంటున్న టోర్నీ షెడ్యూల్‌ను అంతర్జాతీయ హాకీ సమాఖ్య విడుదల చేసింది. జూన్ 23న పాక్‌తో మ్యాచ్ తర్వాత 24న అర్జెంటీనాతో, 27న ఆస్ట్రేలియాతో, 28న బెల్జియంతో భారత్ ఆడనుంది.



ఇక కలసి ఉండడం కల్లే..!

పేసర్ షమి

కోల్‌కతా: తన భార్య హసీన్ జహాతో ఇక కలసి ఉండే అవకాశాలు లేవని భారత పేసర్ మహ్మద్ షమి అన్నాడు. వివాహేతర సంబంధాలతోపాటు షమీ మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడ్డాడని అతడి భార్య హసీన్ ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. అయితే నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవడానికి తగిన ఆధారాలు తన వద్ద ఉన్నాయని షమి తెలిపాడు. తన సోదరుడితో శారీరక సంబంధం పెట్టుకోవాలని ఆమెను నేను ఒత్తిడి చేసినట్టుగా చెప్పినవన్నీ అబద్ధాలన్నాడు. 'కూతురి భవిష్యత్‌ను కాపాడుకోవడానికి అన్ని రకాల ప్రయత్నాలు చేశాను. కానీ కోర్టుకు వెళ్లడానికే ఆమె సిద్ధమైంద'ని షమి ఆవేదన వ్యక్తం చేశాడు. ఇక కలసి ఉండే అవకాశాలు లేవన్నాడు. ఫిక్సింగ్ ఆరోపణలపై విచారణకు సహకరిస్తానన్నాడు. కాగా, ఆమె తన మొదటి వివాహం గురించి తన వద్ద దాచిందని వివరించాడు. హసీన్.. తన ఇద్దరు పిల్లలను సోదరి కూతుళ్లని చెప్పిందన్నాడు. వివాహం చేసుకున్న తర్వాత తనకు వాస్తవం తెలిసిందని చెప్పాడు.



బోల్టన్ (84)

చేజారిన సిరీస్

రెండో వన్డేలోనూ మిథాలీ సేన ఓటమి

వడోదర : దక్షిణాఫ్రికాపై అదరగొట్టిన మిథాలీ సేన.. స్వదేశంలో ఆస్ట్రేలియాపై చేతులెత్తేసింది. గురువారం జరిగిన రెండో వన్డేలోనూ 60 పరుగులతో ఓటమిపాలై మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను చేజార్చుకుంది. టాస్ కోల్పోయి తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్ జట్టులో బోల్టన్ (84), ఎలిస్ పెర్రీ (70 నాటౌట్), బెత్ మూనీ (56) హాఫ్ సెంచరీలతో సత్తా చాటడంతో నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లకు 287 పరుగులు చేసింది. పేసర్ శిఖా పాండే (3/61) మూడు, లెగ్ స్పిన్నర్ పూనమ్ యాదవ్ (2/52) రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం భారత్ 49.2 ఓవర్లలో 227 పరుగులకే ఆలౌటైంది. ఓపెనర్లు స్మృతి మంధానా (67), పూనమ్ రౌత్ (27), వస్త్రాకర్ (30) మినహా అంతా విఫలమయ్యారు. స్పిన్నర్లు జొనాసెన్ (3/51), వెల్లింగ్టన్ (2/20), పేసర్ పెర్రీ (2/41) భారత్‌ను కట్టడి చేశారు. కెప్టెన్ మిథాలీ రాజ్ (15), దీప్తిశర్మ (45 బంతుల్లో 26) విఫలమయ్యారు. అయితే పూజ (33 బంతుల్లో 30) ఒకింత పట్టుదల ప్రదర్శించడంతో భారత్ స్కోరు 200 దాటింది. మూడో వన్డే ఆదివారం ఇక్కడే జరగనుంది.

భారత్‌కు 100లోపు ర్యాంక్

న్యూఢిల్లీ : ఫిఫా ర్యాంకింగ్స్‌లో భారత జట్టు వందలోపు స్థానాల్లో చోటు సంపాదించుకుంది. తాజా ర్యాంకింగ్స్‌లో భారత జట్టు లిబియాతో సంయుక్తంగా 99వ ర్యాంక్‌లో నిలిచింది. ఇటీవలి కాలంలో భారత జట్టు ఎలాంటి అంతర్జాతీయ మ్యాచ్‌ను ఆడకపోయినప్పటికీ మూడు స్థానాలు మెరుగుపరచుకుని 99వ ర్యాంక్‌కు చేరుకుంది. గత ఏడాది మూడుసార్లు వందలోపు ర్యాంకింగ్ సాధించిన భారత జట్టు 1996లో ఫిబ్రవరిలో అత్యున్నతంగా 94వ ర్యాంక్‌కు చేరుకుంది. ఆసియా దేశాల్లో భారత్ ప్రస్తుతం 13వ స్థానంలో ఉంది. ఆసియా దేశాలైన ఖతార్, ఒమన్, జోర్డాన్, బహ్రెయిన్, నార్త్ కొరియా దేశాలకంటే మెరుగైన ర్యాంకింగ్‌లో ఉంది. ఓవరాల్‌గా ఇరాన్ 33వ ర్యాంక్‌లో, జపాన్ 55 ర్యాంకుల్లో ఉన్నాయి. ఫిఫా ర్యాంకింగ్స్‌లో జర్మనీ అగ్రస్థానంలో నిలవగా, బ్రెజిల్, పోర్చుగల్, అర్జెంటీనా, బెల్జియం, పోలెండ్, స్పెయిన్, స్విట్జర్లాండ్, ఫ్రాన్స్, చిలీ తరువాతి స్థానాల్లో ఉన్నాయి. ఏఎఫ్‌సీ ఆసియా కప్ క్వాలిఫయింగ్ టోర్నీకి అర్హత సాధించిన భారత జట్టు తమ తొలి మ్యాచ్‌లో కిర్గిజ్ రిపబ్లిక్‌తో తలపడుతుంది.



ఎర్ర కండువాతో వేలాది మందిని కాపాడారు!

న్యూఢిల్లీ, మార్చి 15: న్యూఢిల్లీలో ఘోర రైలు ప్రమాదం తప్పింది. ఇద్దరు ట్రాక్‌మెన్ల అప్రమతత్తతో వేలాదిమంది ప్రాణాలను రక్షించారు. గురువారం ఉదయం ఇద్దరు ట్రాక్‌మెన్లు ప్రియస్వామి(60), రామ్‌నివాస్(55) తిలక్ బ్రిడ్జి-యమున బ్రిడ్జి మధ్య ట్రాక్ పరిశీలించేందుకు వచ్చారు. అక్కడ ట్రాక్ తొలగిపోయి కనిపించింది. అదే సమయంలో శివగంగ ఎక్స్‌ప్రెస్ అటువైపు వేగంగా దూసుకొస్తోంది. స్టేషన్ మాస్టర్‌కు సమాచారం అందించడానికి వారివద్ద ఫోన్ లేదు. క్షణం ఆలస్యం చేయకుండా భుజంపై ఉన్న ఎర్రకండువాతో ప్రియస్వామి రైలుకు ఎదురుగా పరుగెత్తాడు. రామ్‌నివాస్ కూడా తన కండువా ఊపాడు. దీంతో లోకోపైలట్ అప్రమత్తమై బ్రేకులు వేయడంతో పెను ప్రమాదం తప్పింది. వీరిద్దరి సమయస్ఫూర్తిని కొనియాడిన ఉత్తర రైల్వే డిప్యూటీ రైల్వే మేనేజర్ ఆర్‌ఎన్‌సింగ్.. వారికి రివార్డు అందజేయనున్నట్లు తెలిపారు.

నీట్‌లో తప్పుల సవరణకు 17వరకు అవకాశం

న్యూఢిల్లీ, మార్చి 15: నీట్ దరఖాస్తుల్లో పొరపాట్లను సరిదిద్దుకునేందుకు సీబీఎస్ఈ అవకాశం కల్పించింది. గురువారం ఉదయం నుంచే ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది. ఈ అవకాశాన్ని వినియోగించుకునేందుకు విద్యార్థులు నీట్ వెబ్‌సైట్ www.cbseneet.nic.inను సంప్రదించాలని సూచించింది. పుట్టిన తేదీ, జెండర్, రాష్ట్ర కోడ్, కేటగిరీ, మాధ్యమం, పరీక్షాకేంద్రం కోడ్, అర్హత వంటి అంశాలలో తప్పులుంటే.. శనివారం రాత్రి 11.50లోపు మార్పులు చేసుకోవచ్చు.

గ్రాట్యుటీ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

న్యూఢిల్లీ, మార్చి 15: తీవ్ర గందరగోళ పరిస్థితుల మధ్యే గ్రాట్యుటీ చట్ట సవరణ బిల్లుకు గురువారం లోక్‌సభ ఆమోదం తెలిపింది. సభ ప్రారంభం కాగానే ప్రతిపక్షాలు నిరసన చేపట్టడంతో ఎలాంటి చర్చ లేకుండానే బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదిస్తున్నట్లు స్పీకర్ సుమిత్రా మహాజన్ ప్రకటించారు. ఈ బిల్లు రాజ్యసభలోనూ ఆమోదం పొందితే పన్ను రహిత గ్రాట్యుటీ పరిమితి రూ.20లక్షలకు పెరగనుంది. కాగా, ప్రత్యేక సహాయ చట్ట సవరణ బిల్లుకూ లోక్‌సభ ఆమోదం తెలిపింది.

కారులో నోబెల్ గ్రహీత భార్య మృతదేహం

నిస్సహాయ స్థితిలో భర్త.. ఆలస్యంగా వెలుగులోకి ఘటన



ఇల్లినాయిస్ (అమెరికా), మార్చి 15 : అది మార్చి 13, తెల్లవారుజాము. రోడ్డు మీద 82 ఏళ్ల వృద్ధుడు నిస్సహాయంగా తిరుగుతున్నాడు. ఆయన్ను చూసిన కొందరు పోలీసులకు సమాచారం అందించారు. స్పందించిన ఓగ్లె కౌంటి షెరిఫ్ అధికారులు ఆ వృద్ధుడు ఉన్న ప్రాంతానికి చేరుకొని.. ఆయన్ను దగ్గర్లోని ఆసుపత్రికి తరలించారు. అప్పటికీ అధికారులు ఆ వృద్ధుడు రసాయనశాస్త్రంలో నోబెల్ బహుమతిని అందుకున్న జపాన్ శాస్త్రవేత్త ఐచి నిగిషి అని గుర్తించలేకపోయారు. ఐచి నిగిషి, ఆయన భార్య సుమిరె ఈనెల 12 నుంచి కనిపించడంలేదని ఐచి కుటుంబ సభ్యులు ఇండియానా పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వారి కోసం గాలించగా రాక్‌ఫోర్డ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి 8 మైళ్ల దూరంలోని ఓ డంపింగ్ యార్డు వద్ద గుంతలో ఐచి దంపతుల కారు కనబడింది. ఆ కారులో ఐచి భార్య సుమిరె విగతజీవిగా కనిపించారు. ఆమె మరణానికి కారణాలు తెలియనప్పటికీ సాధారణమనే భావిస్తున్నామని పోలీసులు చెప్పారు. 2010లో రసాయనశాస్త్రంలో ఐచి నిగిషి నోబెల్ బహుమతిని అందుకున్నారు.

దినకరన్ పార్టీ 'అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం'

చెన్నై, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తమిళనాట మరో కొత్త పార్టీ ఆవిర్భావమైంది. అన్నాడీఎంకే అసమ్మతివర్గం నాయకుడు, ఆర్కేనగర్ శాసనసభ్యుడు టీటీవీ దినకరన్ గురువారం 'అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం' పేరిట కొత్త పార్టీని ప్రారంభించారు. మదురై సమీపంలోని మేలూరు ఎస్పీఆర్ గ్రౌండ్స్‌లో గురువారం వేలాదిమంది కార్యకర్తల సమక్షంలో అట్టహాసంగా ఏర్పాటు చేసిన ఆవిర్భావోత్సవ సభలో పార్టీ కొత్త పతాకాన్ని ఆవిష్కరించారు. పతాకంలో నలుపు, తెలుపు, ఎరుపు రంగుల నడుమ మాజీ ముఖ్యమంత్రి జయ చిత్రపటం ఉంది. పార్టీ కొత్త పతాకాన్ని సభలో ఆవిష్కరించిన అనంతరం దినకరన్ ప్రసంగిస్తూ.. అన్నాడీఎంకే పార్టీని ద్రోహుల చేతుల్లో నుంచి కాపాడటమే తన ప్రధాన లక్ష్యమన్నారు. కొత్త పార్టీ తాత్కాలిక ఏర్పాటు మాత్రమేనని తెలిపారు.

నగరాలలో పెరిగిన వేగ పరిమితులు

న్యూఢిల్లీ, మార్చి 15: పట్టణాలు, నగరాలలో వాహనాల వేగ పరిమితిని పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ప్రయాణికుల కార్లు ఇక నుంచి గంటకు 70 కిలోమీటర్ల వేగం దాకా ప్రయాణించవచ్చు. సరుకు రవాణా చేసే వాహనాలు గంటకు 60 కిలోమీటర్ల దాకా ప్రయాణించవచ్చు. ద్విచక్రవాహనదారులు గంటకు 50 కిలోమీటర్లు మించరాదు. పెంచిన ఈ వేగ పరిమితులలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాల విచక్షణ మేరకు మార్పులు చేసుకోవచ్చు.


బాధ్యత మరచిన ఎలక్ట్రానిక్ మీడియా

జే షా కేసులో సుప్రీం కోర్టు చురకలు



న్యూఢిల్లీ, మార్చి 15: జర్నలిస్టులు- ముఖ్యంగా ఎలక్ట్రానిక్ మీడియాలోనూ, వెబ్‌సైట్లలోనూ పనిచేసే పాత్రికేయులు మరింత బాధ్యతాయుతంగా మెలగాలని సుప్రీంకోర్టు హితవు పలికింది. బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా కుమారుడు జే షా - 'ది వైర్' అనే వెబ్‌సైట్ పై వేసిన పరువునష్టం కేసు విచారణ సందర్భంలో అత్యున్నత న్యాయస్థానం కొన్ని వ్యాఖ్యలు చేసింది. మోదీ ప్రధాని అయ్యాక - జే షా నడుపుతున్న టెంపుల్ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే పవన విద్యుత్ ఉత్పత్తి సంస్థ ఆదాయం దాదాపు 16వేల రెట్లు పెరిగిందని.. అంతకుముందు ఏడాది కేవలం రూ. 50వేల ఆదాయం ఉంటే 2016-17లో ఏకంగా రూ.80.5 కోట్లకు చేరిందని, ఇదెలా సాధ్యమన్నది సుస్పష్టమని సీనియర్ జర్నలిస్టు రోహిణి సింగ్ వైర్‌లో రాసిన ఓ వ్యాసం తీవ్ర దుమారం రేపింది. దీనిపై జే షా రూ.100 కోట్లకు పరువునష్టం దావా వేశారు. వైర్ వ్యాసం ఓ కల్పిత గాథ అని, అందులో నిజం లేదని షా తరపు న్యాయవాది నీరజ్ కిషన్ కౌల్ వాదించారు. ఇది బాధ్యతారహిత జర్నలిజం అని తీవ్రంగా నిరసించారు. రోహిణి, వైర్ ఎడిటర్ల తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్.. సమాచారం సేకరించకుండా, ప్రశ్నలు వేయకుండా జర్నలిజం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. దీనిపై చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా కల్పించుకుని 'అంటే.. ఏది తోస్తే అది రాసేయడమేనా జర్నలిజం అంటే? రాసే దానికి ఓ ప్రాతిపదిక ఉండక్కరలేదా? ఒక్కోసారి వారు (ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు)చేసేది కోర్టు ధిక్కారం కిందకి కూడా వస్తుంది. ఇదా జర్నలిజం?' అని ప్రశ్నించారు. తలా తోకా లేకుండా ఊహించి రాయడం జర్నలిస్టుల సంస్కృతి కారాదని ఆయన పేర్కొన్నారు. "ఎలక్ట్రానిక్ మీడియా అనేది బాధ్యతాయుతంగా ఉండాలి. కొందరు వ్యక్తులు ఓ ఉన్నతాసనంపై కూర్చొని ధర్మోపన్యాసాలిస్తూ ఉపదేశాలు చేస్తున్నారు. తమను తాము గొప్పగా ఊహించుకుంటున్నారు. ఇది సరికాదు. వారు ఇంకాస్త బాధ్యతాయుతంగా ఉండాలి." అని జస్టిస్ మిశ్రా వ్యాఖ్యానించారు. వెబ్‌సైట్లో ప్రచురితం అయ్యింది కదా.. అని భావించి ఇష్టానుసారం రాయడం, కల్పితాలు అద్దడం జర్నలిజం కాదన్నారాయన. "ఇది మీడియాను నియంత్రించడం కాదు.. నేనే ఎన్నోమార్లు ఈ నియంత్రణలను అడ్డుకున్నాను. తమకు వెబ్‌సైట్లున్నాయి గనక ప్రచురించడం, దాన్ని ఎలక్ట్రానిక్ మీడియాలో చూపడం సరికాదు" అని వివరించారు. కేసు తదుపరి విచారణను ఏప్రిల్ 12కి వాయిదా వేశారు.

పాక్‌లో ఆనందం.. మనకు అసంతృప్తి



న్యూఢిల్లీ, మార్చి15: క్యాలండర్ మారుతున్నకొద్దీ భారతీయుల్లో ఆనందం ఆవిరవుతోంది. సంతోషం మాయమవుతోంది. ఐక్యరాజ్య సమితి విడుదల చేసిన 'ప్రపంచ సంతోషకర దేశాల జాబితా'లో భారత్ 133వ స్థానంలో నిలిచింది. గత ఏడాదితో పోలిస్తే 2018లో ఈసారి 11 స్థానాలు దిగజారింది. ఐక్యరాజ్య సమితి 'వాల్డ్ హ్యాపీనెస్ రిపోర్టు'లో భారత్ కంటే పాకిస్తాన్ సంతోషంగా ఉండటం

'వాల్డ్ హ్యాపీనెస్ రిపోర్ట్'లో దిగజారిన భారత్

మనకంటే మెరుగైన స్థానంలో పాకిస్థాన్

గమనార్హం! నిత్యం ఉగ్రవాద దాడులతో రక్తమోడే పాకిస్తాన్.. గత ఏడా ది కూడా జాబితాలో భారత్ కంటే మెరుగ్గానే ఉంది. 2018లో మరో 5 స్థానాలు ఎగబాకి 75వ స్థానంలో నిలిచింది. బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్,శ్రీలంకలు 'హ్యాపీనెస్ ర్యాంకింగ్స్'లో భారత్ కంటే మెరుగైన స్థానాల్లో ఉన్నాయి. చైనా కూడా భారత్ కంటే సంతోషంగానే ఉంది.

ఐక్యరాజ్యసమితికి చెందిన 'సస్టైనబుల్ డెవలప్‌మెంట్ సొల్యూషన్స్ నెట్‌వర్క్' 156 దేశాల్లో నిర్వహించిన అధ్యయనం ప్రకారం.. ఫిన్లాండ్ ప్రపంచంలోనే అత్యంత సంతోషంగా ఉన్న దేశంగా నిలిచింది. జాబితాలో అమెరికా, యూకేలు 18, 19స్థానాల్లో ఉన్నాయి. మొదటి నాలుగు స్థానాల్లో ఫిన్లాండ్, నార్వే, డెన్మార్క్, ఐస్‌లాండ్ నిలిచాయి. ఆదాయం, స్వేచ్ఛ, నమ్మకం, ఔదార్యం, జీవన సాఫల్యత, అవినీతి వ్యతిరేకచట్టాలు, సామాజిక సహకారం అంశాల ఆధారంగా ఫిన్లాండ్ ప్రజలు అందరి కంటే హ్యాపీగా ఉన్నారని 'జాయ్ రిపోర్టు' తేల్చింది.

-సెంట్రల్ డెస్క్

పరీక్షలో సాయం చేస్తానని అత్యాచారం

పదో తరగతి విద్యార్థినిపై ప్రిన్సిపాల్ అఘాయిత్యం

చండీగఢ్, మార్చి 15: విద్యా బుద్ధులు నేర్పాలిన గురువే పశువు కంటే హీనంగా ప్రవర్తించాడు. పరీక్ష రాసేందుకు రమ్మని పదో తరగతి విద్యార్థిని(16)పై అత్యాచారానికి పాల్పడ్డాడో ప్రిన్సిపాల్. ఈ అమానవీయ ఘటన హరియాణాలోని సోనిపట్ జిల్లా గోహానాలో చోటుచేసుకుంది. బాధితురాలి తండ్రి తెలిపిన వివరాల ప్రకారం.. 'ప్రిన్సిపాల్‌తో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం నా కూతురి ఫిజికల్ ఎడ్యుకేషన్ పరీక్ష వేరే విద్యార్థిని రాస్తుందని, అంతవరకు నా కూతుర్ని అతడి(ప్రిన్సిపాల్) బంధువుల ఇంట్లో ఉంచాలని సూచించాడు. పరీక్ష పూర్తయ్యాక వచ్చి తీసుకెళ్లాలని చెప్పడంతో సరేనని వెళ్లిపోయా'నని పోలీసులకు తెలిపాడు. కానీ, తిరిగి వచ్చే సరికి తన కూతురు రోదిస్తూ ప్రిన్సిపాల్ అత్యాచారం చేసిన విషయాన్ని చెప్పడంతో నిర్ఘాంతపోయానని వాపోయాడు. ప్రస్తుతం ప్రిన్సిపాల్, ఇద్దరు మహిళలు పరారీలో ఉన్నారు.

సులభంగా సీబీఎస్ఈ అకౌంటెన్సీ పరీక్ష

మారిన ప్రశ్నల ధోరణి.. తికమకపెట్టిన కాలిక్యులేషన్స్

సీబీఎస్ఈ 12వ తరగతి కామర్స్ విద్యార్థులకు ప్రధాన సబ్జెక్టు అకౌంటెన్సీ పరీక్ష గురువారం ముగిసింది. ఈసారి ప్రశ్నపత్రంలో చాలా మార్పులు ఉన్నా.. మొత్తమ్మీద సులభంగానే ఉన్నట్లు విద్యార్థులు పేర్కొన్నారు. కొన్ని ప్రశ్నల నిడివి ఎక్కువగా ఉందని, అక్కడక్కడా తికమకపెట్టే విధంగా ప్రశ్నలు అడిగారని అభిప్రాయపడ్డారు. ప్రశ్నల స్వభావం కూడా గతంతో పోలిస్తే.. కొంత భిన్నంగా ఉంది. సాధారణంగా నాలుగు మార్కుల విభాగంలో అడిగే ప్రశ్నలను ఈసారి ఎనిమిది మార్కులకు ఇచ్చారు. పార్ట్‌నర్‌షిప్ ఫండమెంటల్స్‌కు సంబంధించిన ప్రశ్నలను మొదటిసారిగా 8 మార్కులకు అడిగారు. ఉపాధ్యాయులు మాత్రం మారిన ప్రశ్నల ధోరణి సగటు విద్యార్థులకు కొంచెం కష్టంగా అనిపించవచ్చని వ్యాఖ్యానించారు. కాలిక్యులేషన్స్ విద్యార్థులను తికమకపెట్టే విధంగా ఉన్నాయన్నారు. సీబీఎస్ఈ విడుదల చేసిన నమూనా ప్రశ్నపత్రాలను అభ్యాసం చేసినవారికి పేపర్ సులభంగానే అనిపించింది. కాలిక్యులేషన్స్‌లో చిన్నపాటి తప్పులు చేసినా.. స్టెప్ మార్కింగ్ కారణంగా కొన్ని మార్కులు తెచ్చుకోవచ్చు.

- దిక్సూచి డెస్క్


సీబీఎస్ఈ అకౌంటెన్సీ ప్రశ్నపత్రం లీక్!

సోషల్ మీడియాలో పేపర్ కాపీలు.. ఖండించిన బోర్డు

న్యూఢిల్లీ, మార్చి 15: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) పన్నెండో తరగతి అకౌంటెన్సీ పరీక్ష ప్రశ్నపత్రం లీకైందంటూ ఢిల్లీలో ప్రచారం సాగింది. గురువారం జరిగిన అకౌంటెన్సీ పరీక్ష రెండో సెట్ ప్రశ్నపత్రం నమూనాలు సోషల్ మీడియా, వాట్సాప్‌లో చక్కర్లు కొట్టాయి. కష్టపడి చదువుకునే విద్యార్థులకు ఇలాంటి ఘటనల వల్ల నష్టం వాటిల్లుతుందంటూ ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా ట్విటర్ ద్వారా సీబీఎస్ఈ తీరుపై మండిపడ్డారు. లీకేజీ వ్యవహారాన్ని సీబీఎస్ఈ ఖండించింది. సోషల్ మీడియా ప్రచారంలో వాస్తవం లేదని, దీనిపై విచారణకు ఆదేశించామని ఒక ప్రకటనలో తెలిపింది.

గుండెపోటుతోనే లాల్‌బహదూర్ శాస్త్రి మృతి

» భారత ప్రభుత్వం వెల్లడి



ముంబై, మార్చి 15 : గుండెపోటుతోనే భారత మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి చనిపోయారని భారత ప్రభుత్వం వెల్లడించింది. ఇప్పటి వరకు బయటకు రాని శాస్త్రి మరణ రిపోర్టును రిపబ్లిక్ టీవీ సంపాదించింది. గుండెకు రక్త సరఫరా ఆగిపోవడంవల్లే ఆయన మరణించారని పేర్కొన్నారు. 1966 జనవరి 11న తాష్కెంట్‌లో శాస్త్రి మృతి చెందారు.

దేశపు తొలి క్లోనింగ్ అస్సామీ గేదెదూడ జననం



హిసార్, మార్చి 15 : దేశపు మొట్టమొదటి క్లోనింగ్ అస్సామీ గేదెదూడను శాస్త్రవేత్తలు సృష్టించినట్లు గేదెల పరిశోధన కేంద్ర సంస్థ (సీఐఆర్‌బీ) తెలిపింది. 'క్లోన్ దూడను సృష్టించడానికి ప్రత్యేక పద్ధతులు పాటించాం. 2017 డిసెంబరు 22న సాధారణ ప్రసవం ద్వారా ఈ దూడ పుట్టింది' అని క్లోనింగ్ బృందానికి నేతృత్వం వహించిన పీఎస్ యాదవ్ తెలిపారు. హైటెక్ సచ్ డెయిరీఫాంలోని క్లోనింగ్ లేబొరేటరీకి 100 కిలోమీటర్ల దూరంలోని ఒక పొలంలో ఈ దూడ జన్మించిందని, దీనికి సచ్ గౌరవ్ అని పేరుపెట్టామని ఆయన చెప్పారు. ప్రత్యేకమైన గేదె జాతులను సంరక్షించే బాధ్యతను భారత వ్యవసాయ పరిశోధక మండలి (ఐసీఏఆర్), సీఐఆర్‌బీ పంచుకుంటున్నాయి. దేశంలోని ఈశాన్య ప్రాంతాల్లో మాత్రమే అస్సామీ గేదెలు కనబడుతాయని, వ్యవసాయానికి వాటిని ఉపయోగిస్తారని ఐసీఏఆర్, సీఐఆర్‌బీ డైరెక్టర్ ఇంద్రజిత్ సింగ్ తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Balanagar (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.